భారతి

సచిత్ర మాసపత్రిక

సంపాదకుడు

కా. నాగేశ్వరరావు

సంపుటము ౬. భాగము ౧.

ఆంధ్రపత్రికాముద్రాలయము – మద్రాసు

౧౯౨౯

భారతి—షష్ఠసంపుటము—భా. ౧.

వ్యాసకర్తల అకారాదిసూచిక

భారతి—షష్ఠసంపుటము—భా. ౧.

వ్యాసముల అకారాది సూచి

క

శ

విషయ సూచిక

చిత్రములు

త్రివర్ణ చిత్రములు:—చెరువుకు; మాలివి.

సాధారణ చిత్రములు:—భారతీయ ప్రేమగీతచిత్రములు* ౪; శిల్ప ప్రకృతిచిత్రములు ములు ౩; ఉమర్ ఖయ్యామ్ చిత్రము ౧; మైసూరు సబ్బుపరిశ్రమ చిత్రములు ౮; జాతీయ మహాసభ చిత్రములు ౨౧; ఆకస్మిక ఛాయాచిత్రములు, ఇతర చిత్రములును.


---

* ఇది Lawrence Hope గారి The Garden of Kama అను గ్రంథమునందు Indian Love Lyrics అను పేరనున్నది. ఈనాల్గుచిత్రములు, మూడు శిల్పప్రకృతి చిత్రములు, ఉమరుఖయాామ్ చిత్రమును, టైమ్సు ఆఫ్ ఇండియా ౧౯౨౮, ౧౯౨౯, సంవత్సరముల సంవత్సరాదిసంచికలనున్న చిత్రములనుండి తీసికొనబడినవి.



"చెరువుకు"

[చిత్రకారుడు: శ్రీ ఏ. సోమేశ్వరరావుగారు]



చెన్నపట్టణము, ఫిబ్రవరి ౧౯౨౯

సంపుటము ౬ | విభవ సంవత్సరము మాఘమాసము | సంఖ్య ౨

సామివేణువు

విశ్వనాథ సత్యనారాయణగారు

ఓయి! సామి! నీసామి వేణూరు మధురి
   తా రవము లిందు వినవచ్చెనయ్య! వాని
వెంట నీ కన్ను బొమవంక విచలితాధ
ర ప్రకంపమ్ము నా కేకర ప్రసారి
తాడుమును యథాదృష్టములట్లు తోచె.

ఈతడవ—మున్ను తెలిసెనులే—గృహమ్ము
కదలఁజాలను—నీ మోసగానితనము.

సామి! నీ సామివేణునిస్వాన మరటి
బోదెలం బోని నా తొడల్ పొదివికొంచు
కలమవెన్నులబోని జంఘలను కదిపి
తీసికొని పోవునా యేని తీసికొంచు
ఁబోవనీ! నేనుమాత్రము బుద్ధిపూర్వ
కముగ మాయింటిపట్టున కదలిరాను.

ఆంధ్రభాషయందలి సంస్కృతవృత్తములు

తేకుమళ్ల రాజగోపాలరావు గారు

మొదటి ఛందస్సు (ఉక్త)*

వృత్తసంఖ్య 2†

వృత్తసంఖ్య—

1. శ్రీవృత్తము—పాదమున కొక్కొకగురువు.

రెండవ ఛందస్సు (అత్యుక్త)

వృత్తసంఖ్య (4)

ఈ ఛందమునుండి ప్రాస మారంభమగును.

1. స్త్రీవృత్తము—పాదమునకు రెండేసిగురువులు. కవిజనాశ్రయమున నిది మధ్యమవృత్తము.

మూఁడవ ఛందస్సు (మధ్య)

వృత్తసంఖ్య (8)

1. నారీవృత్తము—పాదమునకు మూఁడేసిగురువులు కన్నడమున నిది వామాంగము.
2. కేస—పాదమున కొక్కయగణము (వృ) § కన్నడమున నిది రతాంతము.
3. మృగి—పాదమున కొక్కొకరగణము కన్నడమున నిది పావనవృత్తము.
4. వినయము—పాదమున కొక్కొకసగణము కన్నడమున నిది ప్రవరము. (కవిజనా.)

నాలుగవ ఛందస్సు (ప్రతిష్ఠ)

వృత్తసంఖ్య (16)

1. కన్య—పాదమునకు నాలుగేసి గురువులు.
2. క్రీడ—యగ. కన్నడమున నిది వామాంగము.(వృ)
3. సమృద్ధి—రగ. కన్నడమున నిది దేవరమ్యము. (వృ)
4. సుమతి—సగ. కన్నడమున నిది మృగనేత్ర. (వృ)
6. సుకాంతి—జగ. కవిజనాశ్రయమున నిదివిలాసిని. కన్నడమున నిది జనోదయ.

ప్రయోగము—ధ—నా—ర్జు—నా

ధనప్రియా
ధనాధిపా
ధనంజయా— సీతారామాంజనేయ.

ఆ 3—22.

7. బింబ—భగురువు. వృత్తరత్నాకరమున నిది సుముఖి; కన్నడమున సౌందరము.

అయిదవ ఛందము (సుప్రతిష్ఠ)

వృత్తసంఖ్య (32)

3. ప్రీతి—రగగ. కన్నడమున నిది నందకవృత్తము.
4. ప్రగుణ—సగగ. కన్నడమున నిది సన్మృగనేత్రము. (కవిజనా.)
6. సతి—జగగ. కన్నడమున నిది అనంగము. (వృ)
7. పంక్తి—భగణము 2 గురువులు. కావ్యాలంకార చూడామణి యందును, కవిజనాశ్రయమున నిది సుందరీవృత్తము. కన్నడమున నిది కాంచనమాల.
13. నంద—తలగ. వృత్తరత్నాకరమున నిది మంద వృత్తము. కన్నడమున నిది తిలకము.
15. అంబుజము—భలగ. కన్నడమున నిది ప్రేమ. (కవిజనా.)

---

* ఇది ఛందోనామమును దెలుపును.

† ఇది యాఛందమునఁబుట్టిన వృత్తములసంఖ్యను దెలుపును.

§ ఏఛందోగ్రంథమున దీనిలక్షణము లున్నవో తెలుపును.

ఆఱవఛందస్సు (గాయత్రి)

వృత్తసంఖ్య (64)

కావ్యాలంకారచూడామణియం దిటనుంచి విస్మందోధికార మారంభమగుచున్నది.

1. సావిత్రి—మ మ.
3. మాలిని—రమ. (వృ.)
10. విచిత్ర—య య.
13. తనుమధ్యా—తయ.
15. చంద్రవదన—భయ. కన్నడమున నిది శశికాంతము.
16. శశివదన—నయ. కావ్యాలంకార చూడామణి యందును, కవిజనాశ్రయమునను నిది సురలత. అప్పకవి సురలత యను నింకొక వృత్తము క్రింద మరల శశివదన లక్షణమునే చెప్పియున్నాడు. కన్నడమున నిది యుదాత్తము.
17. నదీవృత్తము—మర. (వృ.)
25. ముకుళము—మస. (వృ.) కన్నడమున కమలము, ముకుళము, ముకురము.
28. వసుధ—స స. వృత్తరత్నాకరమున నిది రమణీ వృత్తము.
కన్నడమున కుముదము, వినతము, ముకురము.
29. వసుమతి—తస.

ఏడవ ఛందము (ఉష్ణిక్కు)*

వృత్తసంఖ్య 128

20. హంసమాల—సరగ. కన్నడమున నిది సరళము, 6 యతి.
26. మదలేఖ—మసగ. (వృ.) 4 యతి.
30. కుమారలలితము—జసగ. 6 యతి.
31. సురుచిరము—భసగ. (కవిజనాశ్రయము) అప్పకవీయమున నిది సరసిజము.
43. విభూతి—రజగ.

ప్రయో: మోక్షలక్ష్మీక్షణా
మోక్షధర్మరక్షణా
మోక్షసౌఖ్యదాయకా
మోక్షరాజ్యనాయకా—యతి లేదు.

సీతారామాం. ఆ. 8-24.

56. మధుమతి—నభగ. (వృ.)
64. మదనవిలసితము—ననగ. (అప్పకవి) కన్నడమున నిది సులభము.

ఎనిమిదవ ఛందస్సు (అనుష్టుప్పు)

వృత్తసంఖ్య 256

1. విద్యున్మాల—మమగగ.

ప్రయో: ధర్మారాధ్యా—ధర్మాన్వేష్టా
ధర్మాధర్మా—త్మా ధర్మజ్ఞా
ధర్మాధారా—ధర్మాకారా
ధర్మాధర్మా—త్యంతాభావా.
యతి 5-వ యక్షరము.

సీతారా. ఆ. 6-21.

6. వితానము—జమగగ. (అప్పకవీయము)
38. విమానము—జతగగ. (అప్పకవీయము)
43. సింహరేఖ—రజగగ.
55. చిత్రపద—భభగగ.
57. హంసరుతము—మనగగ.
85. నారాచము—తరలగ. (అప్పకవీయము) వృత్తరత్నాకరమున నిది నారాచిక.
86. ప్రమాణి—జరలగ. వృత్తరత్నాకరమున నిది ప్రమాణిక.
87. నాగరము—భరలగ. వృత్తవృత్నాకరమున నిది నాగరకము.
103. మాణవకము—భతలగ. కన్నడమునను, వృత్తరత్నాకరమునను గూడ నిది మాణవకమే.
107. సమాని—రజలగ. వృత్తరత్నాకరముననిదిసమానిక.

ఇవి గాక వృత్తరత్నాకరమున వితాన మను పై యాఅవవృత్తము పేర జతగగ (ప్రస్తారమున 38-వ వృత్త

* వృత్తరత్నాకరమున నిది ఉష్ణి.

ము) అనులక్షణ మొకటియు రసలల (208) అను లక్షణ మొకటియుఁ గానవచ్చుచున్నవి.

తొమ్మిదవ ఛందస్సు (బృహతి)

వృత్తసంఖ్య (512)

128. భుజగశిశుభృతము—ననయ. కవిజనాశ్రయమునను అప్పకవీయమునను దీని కిదియే లక్షణము. కాని వృత్తరత్నాకరమున దీనికి—ననమ-లు. కావ్యాలంకార చూడామణిలో—ననయ-లు కల యిది భుజగశిశురుతము.

183. ఉత్సుకము—భభర. (కవిజనా.)

187. భద్రకము—రనర. కన్నడమున నిది హలాయుధ [ము.

251. హలముఖి—రనస. (వృ.)

పదియవ ఛందము (పఙ్క్తి)

(1024)

ఈఛందమునుండియే యతి యారంభము. విద్యున్మాల యొక్కటిమాత్రము ఆంధ్రమున నెనిమిదవ ఛందమునందే యతితో నొప్పుచున్నది. వృత్తరత్నాకరమున నేడవఛందమునఁగూడ సంస్కృతపక్కిని యతి చూపఁబడినది.

క. ఇట నిం దివలవిశ్రమ
ఘటనలు కల్పింపవలయుఁ గబ్బంబుల నె
చ్చట నిలుపంగాఁ దగు న
చ్చటఁ దగఁ బరికించి నిలుప శాస్త్రప్రౌఢిన్.
—కావ్యాలంకార చూడామణి—౭-౯౮.

క. పదలక పంక్తిచ్ఛందము
మొదలుగ నిట, మీఁదిఛంద*ముల, కందముగా
నుదయించువృత్తసమితికి
విదితంబుగ వడులు వలయు* విధు రవి నయనా
—అనంతునిఛందము, ఆ. ౨—౨౫.

క. వెలయ నిటఁ బట్టి (=పదియవ ఛందము)వళ్లిడ
వలయును విశ్రమము నిలుప * వలయును గబ్బం
బులఁ గావున నే నెయ్యెడ
విలిపితి నయ్యెడల దెలిసి * నిలుపుఁడు వానిన్.
—కవిజనాశ్రయము, వృత్తాధికారము, ౩౯.

121. ఫణవము—మవయిగ—యతి 6వ యక్షరము. (అప్పకవి.)

ప్రయో: తీరెక్ మా—నుల * ది—గులివ్వే—శం
జేరెక్ మామం * జిరసౌఖ్యంబుల్
దీరెక్ లోకుల * దివగండంబుల్
మీరెక్ నీబలి*మి యమేయం బై.
—ఉత్తరరామాయణము, ఆ. ౬—౧౮౬.

ఒకానొక ముద్రితభారతప్రతియందు దీనిని బ్రణవమనుట లేఖకప్రమాద మేమో! ఏతత్పద్యము:

ప (ప్ర?) ణవము:—నీయుల్లం బొక*నియతింగార్యం
బాయత్తంబుగ * ననుసంధింపం
జేయం జాలవు * చెడుతెర్వుం బోఁ
బాయం ద్రోవవు * బలిమిం బుత్త్రీ.
—భార. స్త్రీ. ఆ. ౧-౧౮౫.

అనంతుని ఛందమునమాత్ర మిది ప్రణవము.

వృత్తరత్నాకరమునను, గవిజనాశ్రయమునను గూడ నిది పణవమే.

171. మయూరసారి—రజరగ—యతి 7.

వృత్తరత్నాకరమున నిది మయూరసారిణి; అప్పకవీయమున దీనికి మయూరభాషిణి యని పాఠాం.

187. రసాలి—రనరగ—యతి 7. (అప్పకవి)

199. రుగ్మవతి—భమసగ—యతి 6.

వృత్తరత్నాకరమున నిది రుక్మవతి; అప్పకవీయమున దీనికి చంపకమాలి యని పాఠాంతరము. కన్నడమున నిది మందానిలము. ఆంధ్రకామకళానిధియం దిది చౌపది. ఆప్రయోగము:—

చౌ ప ది

భోసలవంశాం*భోనిధిచంద్రా
భాసురతేజో౽*పాస్తదినేంద్రా

శ్రీసముదాత్తా * శేషవిశేషా
వాసవభోగా * వర్ణితవేషా.

—కామకళానిధి, ఆ. ౧.

207. పంచకమలావృత్తము—భయసగ. యతి 7.

—(కవిజనా.)

219. మణిరంగము—రససగ. యతి 6.

220. మేధవిత—సససగ. (వృ.)

241. మత్తావృత్తము—మభసగ. యతి 6.

అప్పకవీయమున దీనికి హంసశ్రేణి యని పా.

మణిరంగ మను పేరఁ గూడ నం దిదియే వృత్తము చెప్పఁబడినది. వృత్తరత్నాకరమున నిది జ్ఞేయవృత్తము. కన్నడమున పూజ్యము, నవ్యము నని దీనికి పేళ్లు. అనంతుని ఛందమున యతి 8.

296. కౌముది—నతతగ. యతి 6. (అప్పకవీయము)

344 మనోరమ—నరజగ. యతి7. (అప్పకవీయము)

343. శుద్ధవిరాటి—మసజగ. యతి 6. కవిజనాశ్రయమున నిది శుద్ధవరాటి. కావ్యాలంకారచూడామణియం దిది శుద్ధవరాటి.

ప్రయో: ఉల్లంబ-ప్రియ*మొం-దఁ గ్రొత్త-సం
ధిల్లన్ నెవ్వగ * దీనవక్త్రయై
యొల్లఁబోవుచు * నున్నె నవ్విభుం
డల్లం గౌఁగిట * నాన్నపాలకున్.

—భార. స్త్రీ. ౧-౧౨౪.

351. భోగివిలసితము—భససగ. యతి 7(అప్పకవీయము)

అప్పకవీయమున దీనికి విలసితమని పాఠాంతరము.

359. నందిని—భతజగ. యతి 6. (అప్పకవి)

429 పంక్తి—భభభగ. యతి 7. (అప్పకవి)

కన్నడమున నిది చిత్రపదము.

496. త్వరితగతి—నజనగ. (వృ.)

పదునోకొండవ ఛందస్సు (త్రిష్టుప్పు)

2048

256. వృరత—ననసగగ. 9 యతి. (అప్పకవి)

286. శిఖరడి విరుతము—జసతగగ. యతి 7.

వృత్తరత్నాకరమునను; అప్పకవీయమునను దీనికి ఉపస్థితము, స్త్రీ యని పాఠాంతరములు. వృత్తరత్నాకరమునను, అప్పవీయమునను గూడ నొక స్త్రీవృత్తము రెండవ ఛందస్సులోనిది. వృత్తరత్నాకరమున మఱియొక స్త్రీ వృత్తమునకు భతనగగ, అప్పకవీయమున మఱియొక యుపస్థితమునకు తజజగగ—యతి 8; వృత్తసంఖ్య 365. కావున దీనికి శిఖండివిరుత మనియే నామకరణమును స్థిరీకరించుటయుక్తము.

288. వృత్తము—నసతగగ. యతి 7. (అప్పకవి)

289. శాలిని—మతతగగ. యతి 5.

అనంతుడును, భీమనయు, అప్పకవియు దీని కేడింట యతి చెప్పుచున్నారు. కన్నడమున 8 యతి. కామకళానిధియందు దీనికి 5ట యతి సరిగా విరుగుచున్నది. ఏతత్ప్రయోగము:—

జేతృత్వాత్తా * శేష దేవేంద్రభోగా
ఖ్యాతిస్థాయ * ద్గర్వదుర్వారవీరా
* * * * * *
జాతశ్రేయా * జైత్రయాత్రాపటాహా.

—కామకళానిధి. 3.

293. మందారదామము—తతతగగ. యతి7.(కవిజనా.)

కన్నడమున నిది లయగ్రాహి.

357. ఇంద్రవజ్రము—తతజగగ. యతి 8.

ప్రయో: చింతాపరత్వంబునఁ*జెందు దుఃఖా
క్రాంతత్వ మూర్వీశ్వర * కానఁ గీడుం
జింతింపఁ డార్యాత్ముఁ డ*చింతనుండై
యంతఃపరీతాపము * నార్పఁ జాలున్.

—తిక్కన, స్త్రీ. ౧-౨౯.

దీనికి ఆఱవయక్షరమునను విఱుపు గలదు. కాని తిక్కన 8 ని యతిస్థానము చేయుట చూడఁగా కవితావాహిని యాకాలమున నట్టిరాగవరుసనే ప్రవహించుచుండె నని సూచించుచున్నది. నేఁటికాలమున పద్యగతి మాఱి,

చింతాపరత్వం-బునఁ జెందుదుఃఖా

యనురీతిగతి యొక్కవసాధారణ మైనది. ఇట్లే నేఁటి

కాలమున నిట్టిప్రాచీనపద్యములలోఁ జెక్కెంట గతి భేదమును మనము కనిపెట్టి జనసముదాయముయొక్క శబ్దోచ్చారణాగతుల (?) నెట్టిమార్పులు కలిగినవో తెలియ వలసియున్నది.

358. ఉపేంద్రవజ్రము—జతజగగ. యతి 8.

మరుత్తనూజుం బోరి*మార్పఁ జూచుం
బరిస్ఫురత్కోపని*బద్ధుఁడై యు
ద్ధరావిభుం డంచిది * తల్గనే సం
స్మరించి యాకోపు న*సుర్చి యుండన్.

—స్త్రీ. ౧-౧౩౬.

పైవలెనే యిందును

మరుత్తనూజుం * బోరి మార్ప

నన్నను నాటింట విఱుపు గలదు.

365. ఉపస్థితము—తజజగగ. యతి 8. (అ.)

వృత్తరత్నాకరమున జసతగగలు దీనికి లక్షణము. అప్పకవి యీఛందములోని 286-వ వృత్తమగు శిఖండి విరుతమునకును నిదే పేరిడుచున్నాఁడు.

366. ఉపజాతివృత్తము—జజజగగ. 8 యతి. ఇది ఇంద్రోపేంద్రవజ్రముయొక్క యుపజాతి.

ప్రమాణము*

మునీంద్ర నిర్భాగ్యత * ముట్టి చావుం
గా నేర దయ్యేం గడు * గట్టిచిత్తం
బనూనమూర్ఛం దెగ*టాటియుం దా
రా నేర్చె నిమ్మేనికిఁ * గ్రమ్మఱంగన్.

—స్త్రీ. ౧-౬౪

ఆఱవయక్షరమునను దీనికి విఱుపు గలదు గాని తిక్కన యెనిమిదవయక్షరమునే గ్రహించినాఁడు.

ఉపజాతికి అనంతుఁడు

సమపదము లింద్రవజ్రవి
షమపదము లుపేంద్రవజ్రఁ జను నుపజాతిన్
సమవిషమాంఘ్రులు తద్వ్య
త్యయము నైనను నదియ పేరు కమలదళాక్షా.

296. ఏకరూపము—మభజగగ. యతి 8.

వృత్తరత్నాకరమున దీనికి మసజగగలు.

439. దోదకము—భభభగగ. యతి 7.

కన్నడమున నిది దోధకము. వృత్తరత్నాకరమునను దోధకమే. కావ్యాలంకారచూడామణిని కవిజనాశ్రయమునను నిది తోధకము. భారత ముద్రితప్రతులం దిది దోదక మయినది.

మానుషదుఃఖము * మాన్యవివేకా
మానసదుఃఖస*మాజము నెల్లం
దాత ఘటించుచు * దైన్యము దెచ్చుం
గాన భవం బిది * గాల్పనె తండ్రీ.

—స్త్రీ. ౧-౬౨.

443 స్వాగతము—రనభగగ. యతి 7.

ప్రయోగము :

రాజ రాజగుణ * రాజిత రాజ
తేజ రాజకుల * దీప విశిష్టాం
భోజమిత్ర నృప * పూజితపాదాం
భోజ భూవినుత * పుణ్యపరేణ్యా.

—నన్నయ—ఆది. ౭-౨౧౮.

వేగవంతుఁ డను * వీరుఁడు సాంబున్
వేగవంతుఁ డయి * వీఁకను దాఁకెన్
వేగ బాణపద * వీతతులన్ ది
గ్భాగముల్ విశిఖ * పంజరముల్ గాన్.

—ఆర. ౧-౧౫౫.

487. మౌక్తికమాల—భతనగగ—యతి. 7.

కన్నడమున నిది సాంద్రము.

683. శ్యేని—రజరవ. యతి 7.

వృత్తరత్నాకరమున నిది నైతికావృత్తము; కన్నడమున నిది సైనికము.

699 రథోద్ధతము—రనరవ. యతి 7,

నన్నయ ప్రయోగము.

హారహీర ధవ * ళాంశునిర్మలో
దారకీర్తి రణ * దర్ప సద్గుణా

* ఈ యింద్రవజ్రాఖ్య ముపేంద్రవజ్ర-శ్రీయంబు గాఁగా నుపజాతి యయ్యెన్. —కావ్యా. ౬.

వైరివీర రస * వైద్య మన్మథా
కార ధీర పర * గండ భైరవా.
—సభా. ౨-౩౨౭.

704. భద్రకము—నసరలగ. యతి 7.
దీనికి చంద్రికావృత్తమని కావ్యాలంకారచూడామణియును, కవిజనాశ్రయమును; సుభద్రికయని వృత్తరత్నాకరము; చంద్రిక యని కన్నడము.

817. వాతోర్మి—మభతలగ. యతి 7.
వృత్తరత్నాకరమునం దీనికి మభతగగ.

377. కాంతివృత్తము—తజజవ. యతి 8
కవిజనాశ్రయమున నిది గీతాలంబనము లేక కాంతావృత్తము; అప్పకవి కవితాంతము లేక గీతాలంబనము నను పేళ్లతో తజజలగ యని లక్షణ మిచ్చుచున్నాఁడు. అన్నింటను యతి 8 యే.

880. సుముఖము— నజజలగ. యతి 6.
కవిజనాశ్రయమునను, వృత్తరత్నాకరమునను నిది సుముఖీవృత్తము.

896. పృథ్వీవృత్తము—ననజలగ. యతి 8.
వృత్తరత్నాకరమున దీనికి ననసగగ. కొన్నింట ననజగగ యనియు లక్షణము చూపట్టెడును.

1009. భ్రమరవిలసితము—మభనలగ. యతి 6.
కన్నడమున దీనికి యతి 5.

పండ్రెండవ ఛందము (జగతి)

4096

241. జలధరమాల—మభసమ. యతి 8 అనంతుని ఛందమున యతి 9.

576, ప్రహేయము—ననమయయ-యతి 9.
కన్నడమున నిది ఘటము.

577. విశ్వదేవి—మమయయ. యతి 8.
వృత్తరత్నాకరమున నిది వైశ్వదేవి.

586. భుజంగప్రయాతము—4 యగణములు. యతి 8.
తిక్కన ప్రయోగము.

వినీతుండ వై ధర్మ * వేదిత్వబుద్ధిఁ
దన ర్పొందు నీ విట్లు * దైన్యాతిరేకం
బునం బొంది శోకాగ్నిఁ * బొక్కంగఁ గుంతీ
తనూజాగ్రజుం డాత్మఁ * దాఁ గుంద పన్నే.
—స్త్రీ ౧-౫౫.

781. మణిమాల—తయతయ. యతి 7 ట కానవచ్చుచున్నది.

832. పుటము—ననతయ. యతి 8.
వృత్తరత్నాకరమునదీనికి-ననమయ-లు లక్షణము.

880. తోధకము—నజజయ. యతి 8. అనంతుని ఛందమున తామరస మని, తోవక మని ముద్రితప్రతులలోఁ గానవచ్చుచున్నది. వృత్తరత్నాకరమున నిది తామరసము; కన్నడమున లలితపదము; కావ్యాలంకార చూడామణిని తోదకము.

తిక్కన ప్రయోగము.

తమతను తప్పులఁ * దా రెరియంగా
విమలమతీ యిట * నీరికి నై శో
కమున వహింపఁగఁ * గాదు మనంబుల్
సముచిత మి త్తతి * శాంతము సుమ్మీ!
—స్త్రీ. ౧-౫౧.

944. ననమాలిని—నజభయ. (వృ.)
నిలుకడ గల యతి కానరాదు.

976. కుసుమవిచిత్ర—నయనయ. యతి 7.

1071. స్రగ్విణి—4 రగణములు యతి 7.
ఎఱ్ఱాప్రగ్గడ ప్రయోగము—

సర్వలోకాశ్రయా * సౌమ్యభావోదయా
నిర్వికారాకృతీ * నిత్యసత్యోన్నతీ
గర్వితోద్యద్భుజా * కల్పకల్పోల్లసత్
సర్వసర్వంసహా * చక్రపక్రాయుధా.
—అర. ౪-౮౩౭.

1216. ప్రముదితవదన—ననరర.
వృత్తరత్నాకరమున నిందలి జన్యవృత్తములలో నొకచోట నిది ప్రభ; వేఱొకచోట ప్రముదితవదన. ఆంధ్రమున నేకలక్షణ మయ్యును నడకగతుల ననుసరించి వృత్తరత్నాకరమునఁ జూపఁబడిన మొదటిగతి యగు ప్రభను వీడి, యేడవగతి యగు ప్రముదితవదన స్వీకరింపఁబడినట్లు తోఁచెడిని.

1381. ఇంద్రవంశము—తతజర. యతి 8.

1382. వంశస్థము—జతజర. యతి 6.
అనంతుని ఛందమున యతి 8.

1392. మాలతి—నజజర. (వృ.)
8 ని యతి కానవచ్చుచున్నది.

1397. లలిత—తభజర. (వృ.)
7-న యతి కానవచ్చుచున్నది.

1400. ప్రియంవద—నభజర. యతి 8.
కన్నడమున నిది నిరుపమము, లేక మత్తకోకిల.

1464. ద్రుతవిలంబితము—నభభర. యతి 7.

నన్నయప్రయోగము—

త్రిభువనాంకుశ * దీప్తినిధీ సము
న్నతభువనాశ్రయ * ధర్మధురంధరా
శుభయశఃపరి * శోభితపూర్వది
క్పతిభువిలాస కృ*పారసబంధురా.
—ఆది. ౪-౨౭౪.

తిక్కనప్రయోగము—

చనఁగ నాతఁడు * సాత్యకి వాయునం
దనుఁడు గాండివి * తమ్ములు సూరెలం
జనిరి ద్రౌపది * సంభృతశోక యై
చని యోఁ జుట్టపుఁ * జానలు సుట్టిరాఁ.
—స్త్రీ. ౧-౧౧౯.

1472. ఉజ్జ్వల—ననభర. యతి 7.

1756. తోటకము—4 సగణములు. యతి 9.

నన్నయప్రయోగము—

నిరవద్య నరేశ్వర * నిత్యనిరం
తరధర్మమతీ గుణ*ధామ జగ
త్పరిపూజితకీర్తివి*భాసి విభా
కర తేజ నృపోత్తమ * కాంతినిధీ.

ఏడింటను విరుపుకలదని నామత్రము —ఆది. ౧-౧౬౩.

1772. ప్రమితాక్షర—సజసస. యతి 9.

1886. జలోద్ధతగతి—జసజస. యతి 7. అనంతుని ఛం
దమున యతి 8.
కన్నడమున నిది జలోద్ధతరతము.

1979. చంద్రవర్త్మ—రనభస. యతి 7.

2041. మేఘవిలసితము—సనసస. యతి 6. (అ.)

పదుమూఁడవ ఛందము (అతిజగతి)

8192

1153. చంచరీకావళి—యమరరగ. యతి 7.

1344. చంద్రిక—ననతరగ. 7, 8 యతులు (వృ)

1392 ప్రభాతమిశ్రము—నజజరగ. యతి 8.
కన్నడమునను నిది ప్రభాతమిశ్రమే. కవిజనా
శ్రయమున నిది ప్రభాతము. కావ్యాలంకార
చూడామణియందును ప్రభాతమే.

1401. ప్రహర్షిణి—మనజరగ. యతి 8.

1633. మత్తమయూరము—మతయసగ. యతి 8.
కన్నడమునను నిది మత్తమయూరమే.

1772. సుమంగలి—సజససగ. యతి 8.

2368. క్షమ—ననతతగ. యతి 8.

2780. ప్రీతి—ససజగ. యతి 7.

2790. మత్తహంసిని—జతసజగ యతి 7. (అప్పకవి)

2796. మంజుభాషిణి—సజసజగ యతి 9.

తిక్కనప్రయోగము—

ధన మంతయుం బోలియ * దారుణంబుగాఁ
దనయవ్రజంబు దెగ * దైన్య మారఁగాఁ
దనబంధు లందఱు మృ*తింబుఁ బొంద నె
వ్వరి నైన శోక మను * వహ్ని గాల్పదే.
—స్త్రీ. ౧-౬౩

2806. రుచిర—జభసజగ. యతి 9.
కన్నడమునను నిది రుచిరయే.

3543. జలదవృత్తము—భరనభగ. యతి 10.
వృత్తరత్నాకరమున నిది జలధరవృత్తము. ఆంధ్ర
చ్ఛందము లన్నింటను నిది జలదమే.

తిక్కనప్రయోగము—

నీపలుకుల్ల నిక్కము య*నింద్యగుణా
యా పురుషార్థహాని సుతు*లీల్గుటకుం
దాపముఁ బొంది తాల్మిఁ దిగ*ద్రావి మహా
కోపుఁడ నైనఁ బాటిలెఁ ద*గుం గినియన్.
—స్త్రీ. ౧-౧౪౮.

[సశేషము.]

౧

ఊఁగవే చెలి! తూఁగుటూయెల, యూఁగవే సరితూఁగవే
రాగవేగ తరంగితామృత సాగరోదరవీచితో.
పూర్ణజీవనభాగ్య వైభవమునను బొంగుచుఁ బొరలు శ్రీ
రార్ణవేశ్వరు గర్భవీచి నుదీర్ణయౌ సిరి కుద్దియై.
మధురమోహన పూర్ణమూర్తిని బుధులు తమ హృదయముల పె
న్నిధిగ నినుఁ గనుచుండఁగా సత్పథవిహారము సలుపుచున్;
కళలు దేరెడి నీదు మొగమును గఱవుదీఱఁగఁగాంచు పు
ణ్యుల తపంబె తపంబుగాఁ దత్ఫలమె కడు సత్ఫలముగా.

౨

చెట్లకొమ్మల సందులన్ మిఱుమిట్లు గొలుపుచు మెఱసి చీఁ
కట్ల ముంచుచు నంతలో మెఱుపట్లు మఱుఁగున డాఁగుచున్;
అడుగుఁదమ్ముల లత్తుకల సంధ్యారుణాంశువులే కనం
బడఁగ, లక్ష్మణునకు మహీసుత పాదపల్లవముల్ బలెన్;
ప్రమద! నీనగుమోము చందురు పండువెన్నెల తేటలన్
సుమధురామృత దీర్ఘికా బహు విమలరసముల క్రమమునం,
దమక మారఁగ దప్పిదీఱఁగఁ ద్రావి సరసుల దృక్చకో
రములు త్రుళ్ళక పల్లటిల్లక స్తిమితభావము నొందఁగా;
నడుమఁ జక్కని తెల్లచుక్కల నల్లచీరబెడం గనం
బడు తమంబున మోహితాత్ముల వెడఁగుచూపులు తడఁబడన్.
తరుణి! నీ ముఖదర్శనమె సౌందర్యలహరీమజ్జనం
బరసి చూడఁగ సరసకవులకుఁ బరమమగు పురుషార్థమున్;
అందమునఁ బుట్టితివి నీ వానందమునఁ బెరిఁగితివి నీ
పొందుగని యఖిలమును నొకటె యందమయి యానందమౌ.

౩

ఊఁగవే చలి తూఁగుటూయెల ఊఁగవే సరితూఁగవే
రాగవేగ తరంగితామృత సాగరోదరవీచితో.
గోరఁటాకునఁ గెంపులగు నీచారునఖముల పెంపులం
దారకాళికిఁ జూపనోయనఁ బారసాఁచి పదంబులన్;
బాలచంద్రుని మేలమాడెడి ఫాలతలమున ముంగురుల్
లీలమై, వ్యజనానిలంబునఁబోలె, నట్టువమాడఁగన్;
ఎదను బొదలెడి కోర్కెపెల్లిద ముదుటుగుబ్బలమీఁది ప
య్యెదనె గాదిఁకఁ బ్రిదులఁ జేయఁగ నెల్ల బంధచయంబులన్;
పూవువిల్తుని వైజయంతికవోలెఁ ద్రిభువనవిజయమున్
భావకాళి మనోరథంబుల పంటవై ప్రకటించుచున్.


౪

అమృతపాన మొనర్చియుఁ భవదాననేందు మయూఖ నా
శములచే ననిమేషభావ మలభ్యమై సుఖపారవ
శ్యమునఁ గన్నులు మోడ్చుచుండఁగ నక్కజంబుగ విబుధు లో
రమణి! యూఁగవె యూఁగులాడని రాగరసభరితాత్మవై.
యోగసూత్రమె యగుఁజుమీ యనురాగసూత్రము చెలియరో,
యూఁగవే యది యూఁతగాఁగొని, యొకటిగా భువి దివియునున్.

భారతీయ ప్రేమగీత చిత్రములు



చిత్రము ౧



చిత్రము ౨

తిక్కన విరాటపర్వము

ఎ. వి. రత్నముగారు

సారస్వత విమర్శవిలసనము నభిలషించి యేన ల్పజ్ఞత గావించిన యీవిమర్శనము విద్వాంసుల యాదరణీయ సముచితగుణోపేత విమర్శమై ప్రకాశించుటకు దగకున్నను, భారతి సాదరానుగ్రహ మూలంబున బాలకలోకావలోకనము ముందట బెట్టి సాహసించి నందులకు క్షంతవ్యుడను.

ఆంధ్రకావ్యముల యధునాతన విమర్శములందు పూర్వుల కబ్బినటువంటి యపూర్వధోరణి చాలగలదు. అది మిగుల ప్రశంసనీయమును, స్పృహణీయమును-గాని, ఆంధ్రులు మొదటినుండియు అనుకరణధీప్రభావులనుటకు నిదర్శనముగ, ఎల్లరు నొకేశ్రుతిని గలిపి యొకేరాగమున ముక్తకంఠముగ వినిపించుచుండుట చూడ ఆంధ్ర సారస్వత భాగ్యభోగ్యములను గురించి చింతింపనయ్యెడిని.

శ్రీమదాంధ్రమహాభారతము ఆంధ్రంబుననిరుపమాన కావ్యకళాసంపత్తిని నద్వితీయముగ రాజిల్లుసంగతి విద్వద్విదితము. ఆంధ్రవాఙ్మయప్రపంచమున భారతము, నవనవోన్మేష సువర్ణమనోహర కాంతిద్యుతియైన ఉషాకన్యవలె సర్వదా విరాజమానము. ఇట్లకృత్రిమకావ్యకళాశోభను బ్రకాశించు నాంధ్రభారతమున తిక్కనార్యవిరచితము కడుహృదయంగమముగ నుంటంజేసి పెమ్మటికవులు తిక్కన వాగ్వైభవకవనచాతురీమహిమంబును నెంతయు గొనియాడిరి. వారు కావ్యశిల్పదృష్టిని తిక్కన భారత భాగమును బరిశీలించినగాని మూలమునందలి చరిత్రగుణోన్నతు లాంధ్రంబున చక్కగ గొనిరాబడినవా యనెడు విమర్శక దృష్టితో గాదు. కేతన, ఎఱ్ఱన మున్నగు కవివర్యులు తిక్కనయ నితర సుబోధరచనావైదగ్ధ్యవైపుణ్యమునకు ముగ్ధులై చేసిన ప్రశంసయేగాని, మూలముకంటె నిది తీర్చి దిద్దబడి, యతిమనోహరముగ జేయబడినదనికాదు. అందుచే వారి సంస్తుతులు విమర్శనాతీతములు. ఇంతయేల? తిక్కన నన్నపార్యులైనను "తాము నేర్చినవిధంబున" మహాభారతమును, రచింపబూని విన్నవించుకొనిరిగాని, "వివిధవేదతత్త్వవేది, అఖిలమునీంద్రాద్యుడు, వచశ్శ్రీయుతుడు, భవ్యకవితావేశుండు" నగు సాత్యవతేయుని కృతికి మెఱుగులు పెట్టి, సంస్కరించి దానికంటె 'వేయిరెట్లధికమనోహరముగ' జేయ నుద్యమింపలేదు. అట్టిది యెంతటి ప్రతిభాశాలురకైనను తరముగాదు. ఎందుచేనన మొదట నది భాషాంతరీకరణమునకు సాధ్యముకానిపని,- 'మహాకావ్యముల పట్ల ఇక పనిపట్టి మూలముకంటె "రసవత్తరముగా" జేయసమకట్టుటయన, మూలమునకు విరుద్ధముగా బ్రవర్తించి దాని కపచారము చేయుటయ. అట్టిభ్రమను కవిత్రయమువారుగాని, మఱియెవరునుగాని పడలేదు. ఈనాడు మనము పడుతున్నాముగాని. "మహాకవిత్వదీక్షావిధిని, ఆంధ్రావలి మోదముంబొరయునట్లుగ" ఆంధ్రహృదయమున కనురూపముగ, ఆంధ్ర జాతీయతత్త్వమున కనుగుణముగ తిక్కన తెనుగుచేసెను. ఇదే తిక్కన భారతములోగల విశేషము; మూలములో లేని స్వారస్యము. అంతేకాని తిక్కనప్రణీతంబైనది మూలకృతికంటె రసవత్తరమై మహత్తరముగనున్నదంటే, అది లోతునకుబోయి చూచి చెప్పిన యథార్థసంగతి కాదు. మూలఖనియందలి అసలు రతనము లెవ్వియో చిల్లరరాళ్లెవ్వియో పరీక్షించే రత్నపరీక్షకులు వచ్చిననే గాని యేది యెంతవిలువగలిగియుంటుందో తెలియనేరదు. అట్టి పరీక్ష లేనంతదనుక మిన్నంట వినిపించే ఈయాంధ్రీకరణ ప్రశంసాప్రతిధ్వాన పరంపర లాంధ్రభారత ప్రశస్తినే స్వాహాకారములతో ఆంధ్రావని మోదమునంద వినిపించుచుండును.

పరీక్షిస్తే ఫలించేసంగతి యేమంటే, రామాయణ మహాభారతములు మన దేశభాషలందు పరివర్తితములైనవి మూలకథావస్తువును సంకుచించియో, విపులీకరించియో కొనిపోవునవియే కాని, మూలములందలి చరిత్రపోషణ

మును కథావిషయిక సందర్భములను, మఱియు నందు ప్రతిబింబితములైన యక్కాలపు టాచారవ్యవహారధర్మముల నిజస్థితిని గ్రహించి వ్రాయబడినవి కావు. ఇట్లు బంగాళీ, హిందీ, మరాఠీ, ద్రావిడ, కర్ణాట, కాంధ్ర భారతరామాయణములను విచారించి చూచినచో నవి వారివారిజాతీయభావములను, దేశీయాచారములను దృక్పథంబున నుంచికొని జనరంజకముగ వ్రాయబడినవి గాని, మాతృకలందలి చరిత్రపోషణము భావ సౌందర్యసంపత్తిని కనుగొని కాదు. ఇవి భక్తజనంబునకును, జనసామాన్యమునకును మిగుల మనోరంజకముగ నుండును గాని, విమర్శకులకు చారిత్రకదృష్టితో బరిశీలించువారలకు మాతృకలంత సురుచిరములు గానోపవు.

ప్రపంచమున జగజ్జేగీయమానముగ నప్రతిమాన మహాకవిత్వ తేజముతో వెలుగునట్టి మహాకవులను చేతి వ్రేళ్లమీద లెక్కింపవచ్చును. అట్టి లోకోత్తరకవిత్వ సంపద్విశేషోన్నతిని మహాకవిశ్రేణికి జెందిన వ్యాస వాల్మీకిద్రష్టల కృతులేడ? వాని భాషాంతరీకరణము లేడ? కాని, నేటిమనవారి విమర్శనములు,—ఆంధ్రమహాభారతము ముఖ్యముగ తిక్కనవిరచితమైనభాగము మాతృకనతిశయించు స్వారస్యముల చెన్నొందుచున్నదని, ప్రకటించుట చూడ నద్భుతమవును. భాషాంతరీకరణము రూపాంతరీకరణమనియు, అనువాదము అసలులోని భావసౌందర్యసంపత్తిని తేజాలదనియు చదివియున్నట్టియు, గ్రహించినట్టియు మనయాంగ్లవిద్యాసంపన్నులుగూడ, తిక్కన తనమహాభారతకథను మాతృకకు లేని నలుగులు మెరుగులు పెట్టి మూలముకంటె నెంతో మనోహరముగ రచియించినాడని వినతిపత్రముల నర్పించుచుండుట చాల వింతగానుండును.

ఇట్టి విమర్శలకు కిరీటముగనున్నది, ఇటీవల "భారతి"లో, లోగడ ఆశ్వయుజమాసమునుండి యొకటి వెలువడియున్నది. తద్వ్యాసకర్తలు మూలముతో తిక్కనవిరాటపర్వమును పోల్చిచూచుచు, తిక్కనకవితాక్షీరసముద్రమును ద్రచ్చి యందుండి వెల్వడుభావరత్నములను రసామృతమును నందిచ్చియున్నారు. అట్లు వెలువరింపగల్గుటకు వారుపక్రమమున జెప్పికొన్నట్లు వారినమ్మకయే కారణము. అయితే యింతకు మొదటనే కల్గుకొన్ని యాపత్తుల కుపపత్తుల నెట్లు చూపించెదరో? తిక్కన యింతరసోదంచితముగ వ్రాయుగల్గుటకు వారికొకదక్కనిమూలాధార ముండియుంటుందంటే విమర్శకులు లేదని యెట్లు రుజువుచేయగలరు? వీరిదగ్గరనున్న సంస్కృతమహాభారతమే నాయేమిటి, తిక్కన యెదుట పెట్టుకొని మెరుగులు పెట్టి యాంధ్రీకరించినది? తమకడనున్న మూలములో లేని స్వారస్యములు, సందర్భోచిత కథాసంవిధానములు తిక్కనయందు గన్పట్టినంతమాత్రన, అది కేవలము తిక్కనయనన్యసామాన్య కల్పనాసామర్థ్యమునకు సాక్ష్యమని యెట్లు చెప్పనగును? అసలు సంస్కృతమహాభారతముయొక్క యేరెండుప్రతులును నొండొంటితో సమగ్రముగ నన్నివిషయములలోను, సౌరభ్యస్వారస్యములలోను పొత్తులేక యున్నవనేసంగతి నేటి విద్వల్లోకమునకు దెలియనది కాదుగదా! అట్టితఱి తిక్కన యేప్రతి ననుసరించి యాంధ్రీకరించెనో తెలియనపుడు మూలముతో సరిపోల్చి చూడడమనేది మూలమున కొకయపచారము సేయుటకాదా? పోనిండు దానికేమి?.

అందునను, నిందునను,నన్నిటను గల కథావిషయ మొకటియే కావున విమర్శనమున కంతతగవులేదు. అందుచే విమర్శకులు వెలువరించిన భావరత్నములు, రసామృతము మూలముతో నెట్లు తులతూగుచున్నవో, మనము కూడ నించుక విచారింతము. ఆంధ్రీకరణమున (i) మూలమునందుఁ దిక్కన వదలిన రసవత్తరములగుపట్లు, (ii) మూలమునను తెలుఁగునను సారస్యమునందుఁ దులఁదూఁగుపట్టులు, (iii) రసమును పెంచుటకును, ఔచిత్యమును బోషించుటకును తిక్కన మూలమునుండిమార్చినపట్టులు. ఇవ్విధంబుగఁ బైమూఁడు శీర్షికలక్రిందను విషయవిభజనముచేసి తారతమ్యఫక్కిని రెండింటను గల వ్యత్యయ స్వరూపములను విమర్శకులు విపరించియున్నారు. మొదటిదాని విషయమున విమర్శకులు "మాతృకయందటనట నేలకో, తిక్కన తెనిగింపక వదలివేసెనని" చెప్పి మూడవదాని విషయమున గారణము లారయగడంగిరి.

మొదటిదానికి గల కారణమే, "ఆ యేలకో" అనేదే మూడవదానిపట్లను చెల్లదా? మొదటి వ్యత్యయమునకు గారణ మారయ లేనపుడు, మూడవదానికి గారణము, లారయుట సమంజసముగా నున్నదా? ఆయాచోట్లను మూలమునుండి వదలివేయుటకును మార్పులు చేయుటకును గల హేతువేమి, అధికారమేమి తిక్కనార్యునకు? కారణమేమున్నది? వారిచిత్తము. "నానేర్చినభంగిఁ జెప్పెదరణీయుఁడనయ్యెద భక్తకోటికిక్"అని మొదటనే క్షమాపణ చెప్పికొనెనుగా? పోనిండు. ఇదికవిబ్రహ్మ వినయోక్తి యనుకొని, "ఊర్జితకథోపేతంబు నానారసాభ్యుదయోల్లాసి విరాటపర్వము" తెనుగు చేయబడినది. ఔచిత్య నిర్వహణమునను రసపోషణమునను మూలమును మించి మిన్నందియున్నదని విమర్శకులు చూపు మెరుంగుల తెరంగారయుదము.

భాషాంతరీకరణ మెంతనేర్పరితనముగను సునిశితముగను జేసినను నది రూపాంతరీకరణమే యనుటకు, "మూలమునను, దెలుగునను సారస్యమున దులదూఁగు పట్టుల"లోనే మన మీవ్యత్యాసమును కొద్దిగనో గొప్పగనో చూడగలము. ఎట్లన,—"పతంత్యరూపేషు యథా సక్షూంషి న కదాచన," అరూపవస్తువులందు నేత్రము లెప్పుడు నెట్లు పడవో యనుదానికి "నరు లారులు దృశ్యములపైఁ బరఁగింపఁగఁ జూడ్కు లెట్లుపడుఁ దప్పక" యను తిక్కనార్యునిమారానువాదము మూలముతో భావమునందుఁ దులదూగుచున్నదేమో విచారింపుడు. మరొకటి. "యస్సభాయాం స పాంచాలీం క్లిశ్యమానా దురాత్మభిః। దృష్ట్వా నసి తస్యాద్య ఫల మాప్నుహి" అనుదానికి "...అట్లు ద్రుపదపుత్త్రికిఁ బఱుపంగ గాంచి నగిన ఫలముఁ గందుగాక." యని కాంచుటయే కాక నగుట తెలుగునఁగల విశేషమని విమర్శకు లొక విశేషమును గనుగొనిరి. కాని, యాదృష్టిలోనే నగుట కూడాగలదు. 'సర్వేంద్రియాణాం నయనం ప్రధాన' మగుట కనుదృష్టిచేతనే మనోగతములను నావిష్కృతముచేయవచ్చును. వ్యంగ్యార్థమును వాచ్యముగ జేయుటయు నొకకవిత్వవిశేషమనెడిచో నిదియు నొకవిశేషముగనే యెంచవచ్చును. తర్వాత. "బృహన్నళా యస్య యంతా కథం న సజయే ద్యుధి?" యనుచోట రథచోదకప్రస్తావము వాచ్యముగామియె మూలానువాదముల రెంటను గల లోకోత్తరవిశేషమని. యంతా=సారథి యని రూఢ్యర్థము. చోదకత్వము వానిపని కాదా? అది వేరే ప్రస్తావించాలా? సారథికాదు, కడకు రథికుడే యవుతాడనే సంగతి గుట్టుచేయబడినదని యనేటట్లయితే యదిసందర్భశుద్ధి నేకుఱుటయగు. 'యస్యయంతా' యనుదానికి"బృహన్నల యచ్చటనుండగా" అని విమర్శకు లర్థముచేసిరి. ఈయర్థనిష్పత్తి యెట్లో తెలియదు. ఓపిక పట్టిచూచేటట్లయితే ఇట్టే మూలముతో తులతూగుపట్లు మనవిరాటపర్వమున చాల గాననగును. అభిమానమును పురస్కరించుకొని, మనవి మనము పొగడుకొనుటకు కృతనిశ్చయుల మయ్యెడిచో మనవి మించినవి లేవు మనకు.

ఇఁక మూఁడవది: మార్చి మెఱుగులు పెట్టబడినవి; పాఠకోత్తములు సావధానముగ, గాఢముగఁ బరిశోధింప వలసిన విషయములు:—

(౧) మూలమున బృహన్నల నృత్యగీతాదికుశలత పరీక్షించుటయెగాక స్త్రీలచే నతని నిజస్థితిని పరీక్షింప బడినట్లున్నది. ఆంధ్రమునఁ బరీక్షాప్రస్తావమే వాచ్యముగాక "నైపుణంబున నుచితంబుమై నరసి పొచ్చెము లేమి" యని చెప్పుటచే మూలమందలి యశ్లీలతను తిక్కన నిపుణముగ తొలగించెనని విమర్శకులు ప్రస్తుతించిరి. అయితే వీరికి మూలము దొరికినదిగావున దాని యశ్లీలతను గనుగొనగలిగిరి. అటుగాక ఒక్కతిక్కనయే దిక్కయ్యెడిచో,"నిపుణముగ నుచితంబుమై నరసి"అంటే, అదియెట్లు? అనే ప్రశ్నకలుగదా? ఆనిపుణమైన యుపాయమేదో తెలిసికోవలెననెడి కుతూహలము మనంబున జనింపదా? నిపుణమనగానే మనస్సులో కుతూహలము రేపుచున్నది. అప్పుడేమిదిక్కు!—దిగ్భ్రమమే కాఁబోలు! ఊహాగమ్యమనినచో, ఊహ లనంతములు. తిక్కన యీ సందర్భమున మూలమునకు మెరుగువెట్టనెంచియున్నచో, ఔచిత్యమును పాటించి యీపరీక్షాసంగతియే యణుమాత్రమయినను సూచింపకను విడిచివేయ వలసియున్నది. కాని యీయశ్లీలతను తిక్కన గూఢముగ

వ్యంగ్యముగా కథలోనికి జారవిడిచెను, గాని కథనుండి కాదు. ఇక్కడ సంగతిసందర్భములను, ఉపపత్తిని గ్రహించి వ్రాసినది కాదు. ఎట్లంటే: బృహన్నలను బరీక్షింపవలసినది వానివిద్యా ప్రావీణ్యముగాని, నపుంసకత్వము, పుంస్త్వము గాదు. ఇది కేవల మనుచితము, అక్రమము. అట్టి పరీక్షణము విరటునియం దెట్టిమర్యాదను యోగ్యతను బ్రకాశింపజేయును? ఇది విచారింపవలయును. తనకొమార్తెకు చదువుచెప్పించుట కింతవఱకు నపుంసకునికొఱకే యెదురుచూచుచున్నాడా? నపుంసకుడు దొరికిననే కాని విద్య చెప్పించదలచుకొనలేదా? ఈపరీక్షణోద్దేశ్య మేమిటి? ఇది యెందులకు? నపుంసకుడు కానివానియొద్ద కొమార్తె నప్పగించుట భావ్యము కాదని శంకించేటట్లయితే—యీబాధంతా యెందుకు? మొదలామెకు విద్యగఱపించుటయే మాన్పించి యామెను సూర్యంపశ్యనుగా చేస్తే బాగుంటుందిగా? లేదా విద్య నేర్చుకొనేటప్పుడుముత్తయిదువులనుకూడా నుంచవచ్చును గదా. ఈపరీక్షణమువలన నేమిప్రయోజనమో దురూహ్యము. అది గాక, "రాజా, నారూపముతో నీకేమి? దానిందలంచిన గడుశోక ముప్పతిల్లును. తలిదండ్రులు లేని నన్ను నీబిడ్డవలె నాదరింపుము." అని యనుకంప జనించునట్లు బృహన్నల వచించినమీదటగూడ నెంతటి కృపణునకైనను నింకను నతనిని పరీక్షింపవలెననెడితలంపు గల్గునా? అట్టిది దుఃఖములోనున్నవారి నగౌరవపరచుటయు. అది రాజైన విరటునిశీలమునకు దగినట్లున్నదా?

(౨) మూలమున సైరంధ్రి, నిదరించుచుండువలలుని కౌఁగిలించుకొని నిద్రలేపినట్లుంటే. "యేతత్కార్యము పాంచాలి పాణిస్పర్శనముననే నెఱవేఱినది తెనుగున" అని ప్రశంసించుట. అయితే, మూలమునందలి కౌఁగిలియొక్క ప్రేమాతిశయస్వారస్యము పాణిస్పర్శచే ద్యోతకమగునా? ఉల్లంబున నుప్పొంగుచుండ ప్రేమ, తల్లులు పసిబిడ్డలను, ప్రియురాండ్రు మనోవల్లభులను నిట్లు "స్పర్శల"చే లేపరు. అదిగాక, ఎవనిని, తనహృదయ పరిభవదవానలమును, చల్లార్చుఘనునిగా, మొదటినుండియు నపేక్షించియున్నదో యాజ్ఞసేని, యట్టిభీముని, అత్తటి కీచకదుష్కృత ప్రతీకారమునకు 'ఇప్పట్టున నీవుదక్క నాకు వేఱొండు శరణ్యము లేదనెడి' భావ ముల్లమునఁ బెల్లుగొన, గోప దుఃఖపూరితమై హృదయము గుందుచుండ, ఆనిర్భరహృదయముతోబోయి యొంటరిగ బరుండి నిద్రించుచున్న భీముని జేరి, ద్రోవది కరస్పర్శమాత్రమున మేల్కొల్పుతుందంటే స్త్రీహృదయమును గ్రహింపకపోవుటయే. మఱియు వృకోదరసార్థకనాముని, మస్తుగమెక్కి కుంభకర్ణునివలె నిద్రపోయెడువానిని కరస్పర్శచే మేల్కొల్ప నగుననుట, మెస్మరిజంకూడా సాధ్యముకాదు. ఇంతకంటె ఆదర్శప్రేమను జూపుచు, పాంచాలీప్రేమ మహిమంబుచే భీముడు మైమఱచి నిద్రపోవుచున్నను ఆమె మైగాలి సోకినంతమాత్రనే మేల్కొనెడివాడని చెప్పితే చాలాబాగుండేది. తిక్కనమార్చిచేసినది యటు నైసర్గికముగాదు, ఇటాదర్శముగాదు.

(3) ఎవని "మహోగ్రకోపరేఖావిభవంబు వైరులకుఁ గాలముచేరుచ" యని వర్ణితమో ఆభీమసేనుఁడు, ఆడువానివేసముఁ దాల్చుటకును, కాముప్రేరితకీచకప్రలాపములకు వలపుఁగత్తెవలెనే మాఱుమాటాడుటకు నెట్లు సమ్మతించెను?... ఇందులకు సమాధానము మూలమున మృగ్యము. ఆంధ్రమున నేతన్నిమిత్తమే అనగా "ఆసాబసునిం దెగఁజూచి నీకుంజూపి నీచిత్తంబు నడపెద." ఇందులకును, తన "మృదురీతి నుచితనిగూఢభంగులగు భాషణములను తనప్రియ వినిపించుటకు" గాను—అద్భుతసంవిధానము గల్పింపఁ బడినది." అని విమర్శకులు తిక్కన కల్పనాచాతుర్యంబును నెంతయు గొనియాడిరి. యిటువంటిసందర్భములలో "సమాధానములు" వెదకనక్కఱ లేకయే యవంతట నవియే మన కగపడుచుండు నించుకాలోచిస్తే. ఈసందర్భమున కథయంతయు మూలమునందు యథాసంభవముగ, నైసర్గికముగ నడిచినది. తిక్కనయందు వ్యర్థమైన కథాచమత్కారమేగాని స్వభావానుసరణ మెంతమాత్రమును గన్పట్టదు కీచకునివలె వచ్చేవారివార్తలీనాడును మనచెవుల నప్పుడప్పుడు పడుచునేయుండును. ఇట్టిహత్యలయుదంతము, కథావిధానము మనచెవుల నెట్లుపడుచుండునో యట్లే సంస్కృతభారతమునందును అక్షరరూపమున జరిగినది జరిగినట్లుగ చిత్రింపబడియున్నది.

ఇఁక దిక్కనార్యునిది కేవలము తిక్కకొన్న ఊహాప్రపంచము. సందర్భశుద్ధి, పరిస్థితులయౌచిత్యము నెంతమాత్రము గమనింపలేదు. మానవస్వభావానుసరణ మతిమానుషమయినది. విమర్శకులు తెలుగున కనుగొన్న సమాధానమునకు మూలమొసంగుపూర్వ సమాధానము: భీము డాడువేసమున మోసము నేసి యవ్విధంబుగ రహస్యముగఁ గాకున్న మ రెట్లు కీచకు నంత మొందింపగలుగును? సర్వసేనాధిపతియైన కీచకుని వలలు డె ట్లెప్పుడెక్కడ నొంటరిగ పట్టేది? సైరంధ్రివలె, సైరంధ్రియని భ్రమించునట్లు, ఆచీకటిలో నర్తనాగారములోపలనో, బయటనో, ఆడువేసముననున్న మనుష్యవిగ్రహమొక్కటి, అచ్చోట గన్పట్టుచుంటే నేకాని కీచకుడు లోన బ్రవేశించుట కలుగదు. లోపల ప్రవేశించిననేకాని వానిని భీము డంత మొందింప వీలుగలుగదు. అంతేకాని సైరంధ్రిని సంతోషపెట్టి యామెచిత్తమును గొనుటకై కాదు, భీము డాడువేసము వేసికొని పోయినది. విమర్శకు లిది యించుకైనను నాలోచించినట్లు కన్పట్టదు. ఇఁక దిక్కన మార్చినదాని యౌచిత్యమును జూతము: సైరంధ్రి వెంటను మరొక ఆడుదికూడా (తిక్కన మార్చి చేసినట్లు) నర్తనాగారము ప్రవేశించేటట్లయితే, కీచకు డిది గాంచకుండా ఎక్కడనున్నాడు? చీకటికాదాయని యందురేమో, కాములకు చీకటిలోకూడ కళ్లు చాలాబాగా కనపడతాయి. కీచకుడు ముందుగవచ్చి నర్తనాగారము గుమ్మమువద్దనే వేచియుంటాడు. ఇంకా కీచకుడు నర్తనశాలవద్దకు రాలేదందురా (తిక్కనభారతములో కన్పట్టునట్లు) ఇది యసంభవమును, మానవహృదయమును బరిశీలింపమిని. "మాయరవియేల గ్రుంకఁడో కో" యని తహతహపడుచున్నాడే, ఎప్పుడు, యెప్పుడు చీకటిపడునాయని, యట్టివాడేల జాగుచేయును? చీకటిపడినతోడనే వచ్చి నర్తనశాలగుమ్మము వద్ద, సైరంధ్రిని చేయిపట్టుకొని లోనికి గొంపోవుటకుగాను, కనిపెట్టుకొని యుండుంగాని, ఆంధ్రభారతము లోనున్నట్లు ముందు భీముని, సైరంధ్రిప్రవేశము, పిదప కీచకుని ప్రవేశమెట్లుకలుగుతుంది? చీకటి పడకముందే యచ్చటవచ్చి కూర్చొనేవారెవరు? సైరంధ్రా, కీచకుడా? ఆలోచింపుడు. "దురభివేశంబైన యాలోను నిశ్చింతుండై సతికేలు పట్టికొని చొచ్చెన్ భీముఁ డత్యుగ్రతన్." అని తిక్కన వారిని ప్రవేశపెట్టెను. కీచకుడు లోపలగాని, ప్రక్కలనుగాని, బయటగాని, లేడనేతలంపుతో భీముడు ప్రవేశించినాడా? ఒకవేళ కీచకుడు లోపలనే యుంటేనో? ఉండడనేదియెట్లు? ఉంటేనేమి?—అప్పుడే కాళ్లు చేతులు విరిచి కట్టి పడవేస్తాడు భీముడంటే—"విరాటనందనపర్యంకమున కనతిదూరమునఁ బాంచాలి మోసరిలనునిచ్చి, మృదురీతి నుచితనిగూఢభంగులగు భాషణములను తనప్రియువినిపించుట" ఎట్లు సంభవిస్తుంది? ఈసందర్భమేమి అతకలేదు. అది పోనిండు. ఈసందర్భమున కీచకుని పాత్రపోషణము కూడా యేమి సహజముగ లేదు. ఇప్పటివాని మానసిక పరిణామమును, భావమును తిక్కన చూపింపలేదు. సైరంధ్రిని గలియుట కంతియాతురముతో వచ్చినవాడు, ఇప్పుడును మొదటితీరుననే యామెముందట ఆత్మస్తుతి ప్రగల్భాలు వినిపించుతా డేమిటి? అంత మదనార్తినొంది, యెండి మండి యెంతోవలపుతో వచ్చినవాడు, వచ్చినవలపుకత్తెను వెంటనే కౌగిలించుకొని, ముచ్చెపములాడుచు, ముద్దులుగొనునా, లేక దూరముగ నిలబడి "సైరంధ్రిభుజముపై చేయిసారించి" యాత్మోత్కర్ష గావించునా? ఇట్లుచేయుట కీచకుని నీచస్వభావము చూపించుట కంటే, అంత పరితాపము నొందినవాడు చివర కిట్లు తేలిపోయినాడేమి? ఆమొదటి తీవ్రత, ఆవిరహవేదనము ఇంతలోనే నీరసించినదాయని మొదటి నుండియు వాడుపడిన సంతాపమును గనుగొన్నవారి కనిపించుతుంది. ఆవిరహవేదనమున కిది యనుగుణముగ నున్నదా, ఇక్కడ కీచకుని నడత? తర్వాత, కృత్రిమ సైరంధ్రిపలుకులను నొక పావుగంటసేపు వినుచుండినను, కంఠధ్వనియైనను సైరంధ్రిది కానిదిగా గ్రహింపనేరడేమి? అంత రాగబధిరుడయ్యెనా! ఇక భీమునిపట్ల: తనయిల్లుకానిచోట కీచకుని చంపుటకు పోయేటప్పుడు భీముడు ద్రౌపదిని వెంటబెట్టుకొనిపోవునా? అట్లు చేయుట ద్రౌపది క్షేమము మదినెంచియా? లేక పిచ్చి చేతనా! ఆమెచిత్తమును బడయవలెనంటే కీచకుడుచచ్చిన తర్వాత నామెను దీసికొనివెళ్లి వాని మృతశరీరమును జూ

పింపఁగూడదా? తన సరాగప్రియోక్తులు ప్రియకువినిపించుటమాట దేవుడెఱుఁగును; తాను మంచమెక్కి కూర్చొని తనప్రియను చీకటిలో మూలఁగూర్చోపెట్టితే యేతేలయినా, పామయినా పట్టుకొని కఱచితే తనప్రియపని యేమిగాను? అదేమి—చీకటికొట్టుగాని యంతఃపురముకాదుగదా. పోనిండు; భీముని సంభాషణములను వినుటకుగాను దైవముమీద భారమువేసి యెట్లో ప్రాణములు బిగపెట్టుకొని యామూల నొదిగియున్న దనుకొందము. సరే, కీచకుడు భీము సందిటను బడి పెనగులాడుచు తన్నుకొనుచున్నపుడు, ద్రౌపది లేచివచ్చి, తన్ను కీచకుడు తన్నిన తన్ను నకైనను ప్రతీకారముగ, వాని బుర్రమీద కర్రదీసికొని చచ్చేటట్లు కసిదీఱ ఒకపెట్టు పెట్టదేమి? అట్లా కొయ్యబొమ్మవలె గోడమూల నొదిగి ప్రాణములు బిగపెట్టుకొని కూర్చుంటుందేమిటి? అట్లా కసిదీర్చుకొనుట ఆడవాళ్ళకు మర్యాద కాదనుకొన్నదా? ఆపోరాటములో భీము డెవడో కీచకు డెవడో గుర్తించుట కష్టమనుకొన్నదా? ఏమనుకొంటున్నది యేమి కన్పట్టదే! ఆపోట్లాటను వింటూ భయపడి కొయ్యయిపోయిందా? అంత ద్రౌపది యిపు డిట్లా అయిపోయిందేమి! ఏమి ద్రౌపదండి! ఇది యాంధ్రుల ద్రౌపదికాని, ఆర్యుల ద్రౌపది కాదు. తిక్కన ద్రౌపది; వ్యాసుని ద్రౌపదికాదు. ఇదే కాఁబోలు తిక్కన విరాటపర్వమునం దాంధ్రహృదయము చక్కగ ప్రతిష్ఠింపబడినదంటే! తిక్కనచేతంబడి ధర్మజునిశీలముగూడా యీవిధముగానే తఱిగిపోయినది. మూలములో తనయాశ్రితులగుణములను గుర్తెఱింగినవాడై విరటుడు వారినిగూడ యుద్ధమునకు దరలించినట్లుంటే ఆంధ్రమున ధర్మజుడు తానొక ఋషివద్ద రణవిద్య నభ్యసించినట్లును, తనవారుగూడ రణవిద్యాకుశలురనియు చెప్పికొని తమ్మగూడ యుద్ధమునకు గొంపొమ్మనియర్థించును. ఇట్లు తనంతట తాను ముందుగబోయి విరటునితో జెప్పికొనవలసినంత యవసర మేమి కలిగినదో తెలియరాదు. తమబాహుబలపరాక్రమమును జూపుట కిది యేనా యింక లేదా తరుణము? ఇది ధర్మజుని గంభీరగుణమునకు దగినట్లులేదు. సంస్కృతభారతములో నున్నట్లు, విరటుడు తనబలము చాలదని కనుగొన్నవాడు తన యాశ్రితుల సాహాయ్యమును గొనుట గౌరవహీనమగునా? కాఁబట్టి విచారిస్తే యిదియుఁ దదితరములవలె మూలమునందే యెంతయు నైసర్గికముగ గూర్పబడినది. ఇది తిక్కనిది—యాంధ్రహృదయమునకు దగినట్లున్నది.

మూలమున బృహన్నలకు "శుక్లవసనము, తెనుగున రణోచితముగ రక్తాంబరము." అని విమర్శకులు మెచ్చుకొన్నా రీమార్పు. అయితే, రణోచితమంటే యేమిటో? బహుశా పంచపాండవులకు పంచరంగుల దుస్తులుండేవేమో! ఎఱ్ఱబట్ట, నల్ల బట్ట అపసవ్యంగా చచ్చేవాళ్లకు కట్టబెడతారు — అంటె ఉరితీయబడేవాళ్లకు. అదిగాక పూర్వకాలమున వీరులకు యుద్ధమంటే ప్రియాసమాగమమువంటిదే. తమ్ము ప్రియురాండ్రు 'ముస్తాబు' చేయ చక్కనివేషముతో యుద్ధాలకు బోయెడివారు. యుద్ధమునం దెంతయెక్కువగ శరీరము తూట్లు పడేటట్లు దెబ్బలుతింటే, అంత ప్రేమాతిశయముతో ప్రియురాండ్రు కౌగిలియిచ్చి కొంపోయి యుపచారములు చేసేవారు యోధులగు తమవల్లభులకు. ఇదిపూర్వకాలపు జర్మనుల, గ్రీకుల చరిత్ర చదివితే కన్పట్టుతుంది. మఱియు తెల్లబట్టమీద నయితే ఎఱ్ఱనిరక్తధారలు స్ఫుటముగ గన్పట్టి మరింత వీరావేశ మెత్తిస్తుంది. కావున నెల్లవిధముల యుద్ధానికి వెళ్ళేటప్పుడు, యుద్ధరంగముమీద, శుక్లవసన ధారణమే బాగా శోభిస్తుంది. ఇట్లే తిక్కనమార్పులును విమర్శకులు చూపించినవి పరీక్షించితే ఫలించును. గ్రంథవిస్తరభీతిని వానినన్నిటిని విడిచిపెట్టి యిక నొకటిరెండింటినిమాత్రమే ముఖ్యమయినవానిని విచారించి విరమింతును.

విమర్శకులు తిక్కనవర్ణితకీచక విరహోన్మాదావస్థను ప్రశంసించుచు, "పొడసూపినట్లయిన వడిఁబట్టి, సమకట్టి పరికించి కానకబమ్మరించు .....వెనకి రిత్తబయల్గని విహ్వలించు." అనేపద్యము మేఘసందేశమందలి "మామాకాశప్రణిహితభుజ" మిత్యాది శ్లోకమును షేక్సుపియరు నాటకముల రోమియో, ఆంటొనీ మున్నగు వియోగార్తుల ఆత్మగతములను పఠితల తలఁపునకుఁ దేవచ్చునని వ్రాసుచ్చిరి. భావమయితే 'అలాగే కావచ్చు

నేమోగాని, సందర్భముమాత్ర మేమియు బాగాలేదు. సందర్భశుద్ధిని, ఔచిత్యమును విశేషించి మన స్తత్వమును పరికించి రచించుటలో షేక్స్పియరునకు సాటి షేక్స్పియరే; అందునను పరిస్థితులందు మానవహృదయముయొక్క లోతునకు బోయి యందలి గుట్టుమట్టును బయల్వెట్టి తనవాగ్దర్పణమున బ్రతిఫలింపజేయుటలో విశ్వజగత్తునం దద్వితీయుడుగఁగూడా కనబడును. ఇందు కాళిదాసుని ప్రతిభకూడా అంతటిదే. అట్టిలోకోత్తరకవి సింహములతో మనభద్రేభంబులను జతపెట్టుచుండుట యేమిభవ్యమో తెలియదు. మన తెలుగులోకూడా అంతటివాండ్లు లేకపోలేదని సంతోషించడానికా? మేఘసందేశమునందును, రోమియో, జూలియటులందును ప్రేమానందలహరిని నోలలాడుచు సరిగంగస్నానాలు చేస్తూఉండే ప్రియులకు పిడుగుపడినట్లు వియోగము కలిగినది. ఆదెబ్బతో విరహోన్మాద మెత్తినది. విక్రమోర్వశీయమునందు నిట్లే యీ యున్మాదావస్థ యతి సిద్ధహస్తతతో జిత్రింపబడినది. ఇక్కడ, కీచకున కట్టి సందర్భ మేమిగలదు? తన వలపుకత్తెతో నొక్క నిమేషమాత్రమైనను చేయిచేయి పట్టుకొని కలసియుండుట గలిగినదా? పోనీ, తనయింటికి సైరంధ్రి వస్తానని చెప్పినట్లయిన మోహావేశవివశుడై కొంచెము గాలి కదలినను, నీడ ఆడినను, ఈవిధమయిన భ్రాంతికి, ఉన్మాదమునకు—ఒకవేళ కీచకుడు లోనుగా వచ్చునని యనుకోవచ్చును. అట్లులేదే. ఎప్పుడు ప్రొద్దు గ్రుంకునా యెప్పుడు మస్తమయిపోవునా యని యాతురపడుతూఉంటే, మధ్య నీయున్మాద మెటనుండి వచ్చును? అదిగాక ఆశగొల్పినపుడు దానిని చేపట్టుటకు మన స్సుత్కంఠతతో త్వరపడుచుండుగాని వెర్రిమొర్రి ఉన్మాదమునకు బలియగునా? కాబట్టి యిది యలంకారశాస్త్రమును తిక్కన మనస్సున పెట్టుకొని తెచ్చిపెట్టిన యున్మాదాలంకారమేగాని స్వభావసిద్ధమయినది గాదు.

"అన్నియు నొకయెత్తు, కీచకపాత్రనిర్వహణ మొక్కటి యొక్కయెత్తు...... మూలమునందుఁ గీచకుడు దౌష్ట్యావతారము. కామోద్రేకమునఁ గేవలమృగప్రాయుఁడు. తిక్కన కీచకుఁ డుత్తమనాగరకుఁడు, సరసుఁడు." అని యివ్విధంబుగ విమర్శకులు తిక్కనకీచకపాత్రమును గొప్పగా ప్రశంసించారు. లోతుగా పరీక్షిస్తేయిదికూడా వెనుకటి వానిలాగుననే ఫలించుతుంది. హృదయస్థితిని, మనఃప్రవృత్తి ననుసరించి నెలకొల్పబడినది కీచకునిపాత్ర, మూలమునందు. తిక్కనయందు లేదది. తిక్కన కీచకునియందు కృత్రిమవిలాసములు చాలా ఉన్నవి. అవి తెచ్చిపెట్టుకొన్నట్లున్నవిగాని, స్వభావజన్యములుగ గన్పట్టవు; సరసములైన నాగరికవిలాసములే కావచ్చును. నాగరకత, పైన కప్పిపుచ్చుచున్నను రెండింటను కామోద్రేకజనితమృగప్రాయత్వము సమానముగానే ప్రతిఫలించుచున్నది తుదకు.

"ఇట్లుదోసములదయ్యము (Monster of Vice)ను, శోచ్యపాత్రము (Tragic Character)గ మార్చిన తిక్కన మానవప్రకృతిపాండితిని, "హేమవిద్యం"బోని దాని నెంతని కొనియాడనగును." అని విమర్శకులు తమ హేమవిద్యనుగూడా గనబరచినారు. కాని యీ హేమవిద్యచే వీరివిమర్శనమునందుగాని, తిక్కనయందుగాని కీచకుడు శోచ్యపాత్రమయినాడా, ఆలోచిస్తే? (Tragic Character) నకుండే (Tragic element) కీచకునియందు తిక్కన ఏమిచూపించెను? విమర్శకు లేమి కనుగొన్నారు? కీచకునిముఖమున నేవో నాలుగు వలపుతెవులు తెలుపు సరసశృంగారపద్యాలు "అనంగవిభ్రమముల కనురూపంబు" లైనవి పెట్టి, మదన సంతాపము ననుభవింపజేసినంతమాత్రముననే "శోచ్యపాత్ర"మవునా? లేదా, కీచకునికథ విషాదాంతముగ ముగిసినంతమాత్రముననే శోచ్యపాత్రముల బంతిలోనికి ఉత్క్రమింప బడునా? అట్లయితే మనప్రబంధకవులలో, మోహవిలాపములందు తిక్కన కీచకుని దిగతుడిచేటటువంటి పాత్రములు చాలా బాగాకలవు. అవికూడా "శోచ్యపాత్ర" శ్రేణిలోనికి జేర్పవలసినదే యిక? శోచ్యపాత్రమున కుండే లక్షణా లేమిపట్టినవి కీచకపాత్రమునకు? అవి విమర్శకులు కనుగొని వెలువరించినచో బాగుండేది.

ఉత్తరకుమారి, బృహన్నలను ఉత్తరసారథ్యమునకై యొడంబడజేయుచు "మాయన్న నన్ను పంపి నీకు చెప్పి నిన్ను తోడ్కొని రమ్మనగా నాకు నీయందుగల ప్రణయముచే అట్లేయని చెప్పి యిటవచ్చితిని. నామా

టను చేయవేని ప్రాణంబులు విడుచుదానను." అనియంటుంది. అందుకు తెనుగున "నీపాల నాకుఁ జనవు కలుగుటంజేసి నిన్ను దెత్తునని పూనివచ్చితిని. ...... అట్లాడంబడక తక్కుట నాసలని వాత్సల్యంబు గొఅంత పఱచుట." అని మూలము లోనిదీ-ప్రాణంబులువిడుచు దాన-ననేది ప్రణయోత్కర్షను, చిరస్నేహమునుస్ఫురించేటట్లు "ఛలోక్తి"గ నన్నమాట. అందులో సౌకుమార్యము లోపించిందంటే, అంతకంటె గుణవత్తరమయిన సహజమాధుర్యము, గాంభీర్యము మూలములోకన్నట్టు చున్నది. బృహన్నలతోగల యొక్క సంవత్సరముపాటి శుశ్రూష, స్నేహము తెనుగులో నింకను "చనవు" గానే యున్నది; అంతకు మించిపోలేదు. అందుకుపగినట్టుగానే ఉత్తర వాగ్ధోరణిగూడనించుక ప్రౌఢముగానేయున్నది. గ్రాంధంబున మూలమునందలి ఉత్తరవాగ్విలాస వైఖరి తెనుగునందువలె ఆడంబరము, ప్రౌఢముగాక ముద్దు వచ్చుచు హృదయమును గొనునంత చక్కగ నున్నది.

తిక్కనార్యుని చేతబడిన ద్రౌపది, సుధేష్ణ, ఉత్తర—ఆ యిద్దరు ముగ్గురు కాంతలైనను – కేవల మిటీవలి నేటిహైందవస్త్రీలవలె, చేయబడిరిగాని, వీర యుగమునకు జెందిన వేదవ్యాసుని ధీరకాంతలవలె గన్పట్టరు. అట్లే పురుషపాత్రముల చరిత్రయు బోషింపబడినది. ఈవిషయమున-, అనగా సందర్భోచితపరిజ్ఞానమున, పాత్రపోషణమున, చరిత్రపరిశీలనమున తిక్కనార్యునికంటె నన్నపార్యుడే మూలమునకు మిక్కిలి దగ్గఱగ నున్నాడని చెప్పనగును. నన్నపార్యునందు ఆంధ్ర హృదయము లేకపోవచ్చునుగాక. కాని పాత్రపోషణమునందు ప్రాచీన,ఆర్యచరిత్ర సంపత్తిని విడిచియుండలేదు.

కాఁబట్టి మూలమునకు మెరుగులు, తళుకులు పెట్టి యనువాదము నధికమనోహరముగా రచియించినారంటే అది చాలా పర్యాలోచించి, వెనుకముందుచూచి విచారించి, చాలా అట్టేపెట్టుకొని చెప్పఁగలసినమాట.

దేశారాధక ప్రబోధకము

మంగిపూడి వేంకటశర్మగారు

స్వాతంత్ర్యం బోక యింత గ్లాదు స్వదేశంబందె యింకేల మా
చాతుర్యంబులు శౌర్యధైర్యము లుపజ్ఞల్ ప్రజ్ఞ లంచున్ సదా
చేతోబ్జంబున గంది కుందె కృశివై జీవచ్ఛవంబై వృథా
వీతోత్సాహుడవై చరింతువె గతవ్రీడుండవై భారతా!

దీనత్వంబు వహింపబోకుము పరాధీనుండ నైనాడ నే
నేనిర్మాణము చేయ దక్షుడనుగా నేకార్యమున్ బూనినన్
గానీ విఘ్నములే తటస్థములగున్ గార్యంబులేదంచు శో
కానన్ ముగ్గి నిరాశ నొందక కృషిన్ గావింపుమా భారతా!

కాలం బెప్పుడు నొక్కరీతి నడవంగాబోదు బ్రహ్మాదులున్
గాలంబున్ గడవంగబోరు సుఖముల్ కష్టంబులున్ గల్గినన్

మేలేయంచు స్వధర్మ నిర్వహణ మోర్మిన్ నేర్మి గావింపగా
బోలున్ గార్యఫలంబు చింతవిడుటొప్పున్ ధీరతన్ భారతా!

కాలాతీతుడు కాలరూపుడు జగత్కల్యాణసంధాత తా
నేలాచేసిన హర్షమే యనుచు కర్తృత్వం బుపేక్షించి యీ
కాలంబున్ మది లెక్కచేయక కృషిన్ గావించుచున్ మించి యు
ద్వేలాభీల విపత్తుబాసి ఫలసిద్ధిన్ గాంచుమో భారతా!

శ్రీమంతుండగువాడె దేనినయినన్ జేయన్ సమర్థుండు నే
నేమో వ్యర్థుడ నేమిచేతు నని నీ కేమీ విచారింప నా
హా, మాయం బడి భ్రాంతిలో మునిగి ముగ్ధాత్ముండవై నా వయో
ధీమంతుం డొనరింపరాని పని కద్దే చూడుమో భారతా!

ధీమంతుండె సమస్త కార్యముల సాధింపన్ సమర్థుండు గా
కే మూఢాత్ముడొ ద్రవ్యవంతుడగునే నింతింతగా మెక్కగా
కేమీ చేయగలేడు బుద్ధిపరు డూహించున్ బహూపాయముల్
సామర్థ్యంబుల తారతమ్య మిది లెస్సన్ జూడుమో భారతా!

ధీమంతుండు తలంచెనేని కొదవే తేలేడె ద్రవ్యంబులన్
గ్రామాలన్ సవరింపలేడె ఘననిర్మాణక్రియాదక్షుడై
సామగ్రిన్ సృజియింపలేడె బహుసంస్థల్ నిల్పి కల్పింపడే
భూమ ప్రక్రియలన్ స్వరాజ్యపదవీపూర్ణాదులన్ భారతా!

స్వాతంత్ర్యంబనుచున్ స్వరాజ్య మనుచున్ స్వచ్ఛంద వృత్తంచునున్
జాతీయంబగు విద్యయంచును స్వదేశారాధనంబంచు వి
స్ఫీతప్రీతి స్వభాషయంచును స్వదేశీయంచు బోధించుచున్
జాతిన్ మేల్కొలుపంగ నిర్ధనికుడున్ జాలున్ గదా భారతా!

ఈ దేశంబు సమస్తమున్ మనది మం దేరాజ్య మిం దేరికిన్
లే దేహక్కును నెంతమాత్రమును లే లెండింక నిద్రింపకం
డో దేశాత్మజులార, దీక్షగొని రండోయంచు మేల్కొల్పగా
నీ దారిద్ర్యము లడ్డువచ్చునె మదిన్ వీక్షింపుమో భారతా!

ఏ దేశంబునకైన స్వేచ్ఛగొని తే నిచ్చించి కష్టించుచో
పేదల్‌మాత్రమె ముందు వచ్చిరి సుమీ వేయింటి కే యొక్కఁడో
శ్రీదుం డున్న విరాగి, త్యాగియనుచుఁ జెల్వొంది వచ్చెఁ సుమీ
యీ దారిద్ర్యముజూచి భీతిలక లెమ్మా ధీరతఁ భారతా!

ఇసిసీ, ముప్పదిమూడుకోట్ల జనమేమీ, మానుషం బేది, బా
నిసలై యన్యుల గొల్చుటేమి యెటనేనిఁ కద్దె యీవింత మీ
యుసురుల్ దేనికి మానమేమిటికి లెండో స్వేచ్ఛ నార్జింపుడో
అసహాయోద్యమ దీక్ష గొండో యని నీవై చాటు మో భారతా!

లేదా వంతయు దేశభక్తి మదిలో లేదాత్మవిశ్వాసమున్
లే దింతేని స్వరాజ్య కాంక్షయు స్వతంత్రేచ్ఛాదులుఁ లే వికన్
ఖాదీయన్న మరేదియన్న నభిమానం బెగతిఁ గల్గు లే
లే దీక్షఁ గొని బోధజేసి ప్రజలఁ లేపంగదే భారతా!

ఔదాసీన్యము మానవోయి, క్షమయే యర్థంబు సాయంబో నీ
యౌదార్యంబె గభీరతాగుణమె నీ కామేటి మిత్రంబు నీ
శ్రీ దీక్షారతియే త్రిలోకవిజయాశీర్వాద మా సంశయ
చ్ఛేదాంతర్యుడవై చరించి సుఫలశ్రీ గాంచు మో భారతా!

అలతుల్‌గా రసహాయ శూరులుగదా యార్యప్రజల్ సుంతయే
నలసుల్‌గారు స్వరాజ్యధూర్వహణ నిత్యానందులే కాని నీ
వెలమిఁ దక్కి కృశింప ధర్మమగునే యేకాకి నెట్లుంచు నీ
కసహాయోద్యమమే శరణ్యముగదా యడ్డేమికఁ భారతా!

ఏ రాజ్యంబు ప్రతిష్ఠ చేసిన నొకండేగాదె ధీరాత్ముడై
ప్రారంభించు నొకండె యెంత ఘనకార్యంబైన నద్దానికై
చేరఁ వత్తురు లక్ష లీశ్వరుని యాశీర్వాదముఁ గాంచుచో
నారంభంబు శుభార్థమైన గడుదోడౌ నీశు డో భారతా!

ఒకడేగాదె యనన్యదుర్లభ మహోద్యోగంబునఁ మించి కొం
చక యింద్రాదుల గెల్చి ముజ్జగము మెచ్చంగా సుధాభాండము
త్సుకతఁ జేకొనివచ్చి దాయ లరుదంచుఁ దెల్లబో నిచ్చి త
ల్లికి దాస్యంబును మాన్పడే గరుడు డట్లే క్రాలు మో భారతా!

కాళిదాస సందేశం

అక్కిరాజు నిత్యానన్దశాస్త్రి గారు (ఔమాకాంతుడు)

"కాళిదాసీయానధర్మ విశిష్టకామం" వాఙ్మయసూత్రం

గురువుల కృపావిశేషంవల్ల పై పంక్తికి వ్యాఖ్యా ప్రాయంగా ఈక్రింది అంశాలు వివరిస్తాను.

శ్లో. బలం బలవతాం చాహం కామరాగవివర్జితం;
ధర్మావిరుద్ధో భూతేషు కామోస్మి భరతర్షభ.

[ప. అగుదునేను బలోపేతులైనవారి
కామరాగ వివర్జితమైనబలము
భూతములయందు ధర్మావిరుద్ధమైన
కామమువుదును భరతపుంగవుడనేను]

ఇది ఉపనిషత్సారమైన గీతయందలివాక్యం ధర్మబద్ధమైన కామం దైవసంబంధి అనేఅంశాన్ని వ్యక్తం చేస్తూ ఉదాత్తదాంపత్యాన్ని ప్రతిపాదించి ప్రవృత్తి ధర్మం ప్రతిష్ఠితంచేసిన వాల్మీకి వాస్తవంగా ద్రష్ట. కాళిదాసు వాల్మీకియొక్క ఆరాధకుడు. వాల్మీకి మనస్తత్వానికి హృదయాన్ని సమర్పించిన అనుగామి. కాలాధికారాన్ని నిర్జించినగౌరవంతో జ్యోతిర్మయరూపుడై కవితాలోకాన్ని అలంకరించిన ఆత్మబలోన్నతుడు. రసశ్రేష్ఠమై లోకప్రవృత్తికి హేతుభూతమైన శృంగారాన్నీ, లోకసంస్థితికి హేతుభూతమైనవీరాన్నీ సర్వోత్కర్షంతో వర్తింపజేసిన కృతకృత్యుడు. జగత్పావనులయిన పార్వతీ పరమేశ్వరులవంటి నాయకులను స్వీయ సర్గంలో నెలకొల్పిన నిర్మలచిత్తుడు. సర్వతోముఖమైన వికాసాన్ని కవితకు ప్రసాదించిన మహిమాన్వితుడు. ఉపమానవిభుత్వ సంపన్నుడు పరిమితపదప్రయోగంతో సంశ్లిష్ట భావసముదాయాన్ని అద్భుతంగా చిత్రించే చిత్రకళాప్రదర్శకుడు. చిత్తాలను రహస్యంగా హరించే శక్తిసంపన్నుడు. అనురూపమైన తపఃక్లేశాన్ని అనుభవిస్తున్న కుమారసంభవపార్వతి కవియొక్క యీశక్తినే ప్రదర్శిస్తున్నది. మంత్రబలంతో వశం చేసుకున్నట్లు శ్రోతలసానుభూతిని కాళిదాసుయొక్క సర్గవిశేషం ఆకర్షిస్తున్నది. చికీర్షితమైన యీజిజ్ఞాసకు కాళిదాసుని కుమారసంభవసర్గం ఉచితవిషయం గనుక దాన్ని స్వీకరిస్తాను. శ్రోతృచిత్తవశీకరణాన్ని కవి ఎట్లా ఒనగూర్చిందీ పరిశీలనచేసి తెలుపుతాను.

సర్గవిశేషానికి పూనుకొన్న కవి కాళిదాసు పార్వతి జన్మవృత్తాంతంతో ప్రారంభించాడు. సతి జగద్గురుడి సహధర్మిణి. పితృకృతమైన అవమానాన్ని సహించలేక శరీరాన్ని త్యజించి నిష్కారణుడయిన దక్షుడిపుత్రీత్వాన్ని పాపుకొని ఉదాత్తుడయిన హిమవంతుడిపత్నిని జన్మంకోసం ఆశ్రయించిందని కవి ప్రప్రథమంలోనే శ్రోతలఅభిమానానికి పార్వతియందు ప్రవేశం కలిగించాడు. పార్వతీవర్ణనంలో వాపితమైన శ్రోత్రభిమానానికి కవి దోహదమిస్తున్నాడు. లోకంలో కోమలవస్తుసంచయంలో వున్న సౌందర్యమంతా యేకస్థమై పార్వతీ శరీరంగా ఉదయించిందన్నాడు. హిమవంతుడికి బహుసంతానంవున్నా పార్వతిని విశిష్టానురాగంతో పెంచాడన్నాడు. ఆదరప్రేరితమైన నారదాదేశంలో పార్వతికి శివలాభరూపమైన ఉన్నతస్థానప్రాప్త్యాశను కల్పించి అభిమానభాజనమైవున్న ఆమెయొక్క ఔన్నత్యాశయాన్ని శ్రోతృదృష్టిలో నిలిపినాడు. అవతంసమైవున్న చంద్రకళ తనచల్లనికిరణాలతో పరిశ్రమను నివారిస్తూ అభిలషితదార్ఢ్యాన్ని శరీరానికి సమకూరుస్తుండగా అహరహం సుకేశి హైమవతి చంద్రశేఖరుణ్ణి ఉపచరించిందన్నాడు. ఈతీరుగా కవి కఠినశుశ్రూషాక్లేశాన్ని తదేకనిష్ఠతో సంతోషంగా భరిస్తున్న ప్రతిలేని శరీరమృదుత్వాన్ని ప్రదర్శించి పార్వతీమనోరథం ప్రేక్షకులకు ఆరాధ్యంచేశాడు. తరువాత పార్వతికి ఆశాభంగం కలిగించి రుద్రసంరంభానికి భయపడి నిమీలితనేత్రాలతో కనికరించదగిన స్థితిలోవున్న ఆమెను తండ్రియింటికి తీసికొనిపోయినాడని తెలుపుతూ ఆమెవాంఛను ఆమోదిం

చిన శ్రోతృచిత్తాలకు అనుతాపం కలిగిస్తున్నాడు. అనంతరం అంటే ఉగ్రమైన తపోనియమాలకు పార్వతి తనశరీరాన్ని సాధనాన్ని చేయదలచిన సందర్భంలో తల్లిమనస్సు తపించిందనీ, ఉద్దిష్టమహాఫలదృష్టితో తండ్రి చిత్తాన్ని వశంచేసుకొని అనుజ్ఞాదానం చేశాడనీ, పూర్వోక్తమైన శ్రోత్రనుతాపాన్ని సాంద్రతాతిశయంతో కరుణంగా మారుస్తున్నాడు. రాబోవు దారుణతపఃప్రవృత్తిన్ని దృష్టాన్ని చేసి మనస్సును కరిగించడానికి కవి పార్వతిశరీరస్థితికీ మునివృత్తికీ వున్న తారతమ్యాన్ని అద్భుతనైపుణ్యంతో ప్రకటిస్తున్నాడు. ఇవి తల్లి మాటలు:—

శ్లో. మనీషితాః సన్తి గృహేషు దేవతా
స్తపః క్వవత్సే క్వచ తావకం వపుః;
పదం సహేత భ్రమరస్య పేలవం
శిరీషపుష్పం నపునః పతత్రిణః.

(వ. వత్సా, ఇండ్లయందు దిష్టదేవత లున్నారు. నీతనువెక్కడ, తపస్సెక్కడ? మృదులమైనశిరీషపుష్పం తుమ్మెదపాదాన్ని సహింపగలుగుతుంది. కాని పక్షిపాదాన్ని సహింపలేదు.)

"అమ్మా, మనయిండ్లయందు ఇష్టదేవతలున్నారు. వారిఆరాధనం నీకు తగివున్నది. ఉగ్రమైనతపోనియమాలను ఈనీశరీరం ఎట్లాసహిస్తుంది? శిరీషపుష్పం తుమ్మెదపాదాన్ని సహించగలదుగాని పక్షిపదస్థితిని యెట్లాభరిస్తుంది?" అని తల్లి పార్వతిని కౌగలించుకొని అంటున్నది. శిరీషపుష్పతుల్యమైన పార్వతిశరీరమృదుత్వమూ, కాఠిన్యానికిస్థానమై తీక్ష్ణనఖయుక్తమైన పక్షిపాదానికి సదృశమైన తపస్కా(?)ర్కశత్వమూ ప్రత్యక్షమైనవి. వాటితారతమ్యం విస్ఫుటరూపంతో గోచరించింది. ఇక తపశ్చరణం ప్రారంభమయింది. పార్వతి గృహాన్ని వదలింది. భూషణాలను విసర్జించింది. సౌఖ్యాలను పరిత్యజించింది. తాపసులవల్కలాలను, జపమాలను స్వీకరించింది. కుశదానాదితాపసవృత్తిలో ప్రవేశించింది. లోకసామాన్యమైన తపోనియమాలను అతిక్రమించింది. ఆహారాన్ని వదలింది. తనంతటరాలిన పండుటాకులనైనా గ్రహించదు. చంద్రకిరణాలను వర్షోదకాన్ని మాత్రమే జీవనసాధనం చేసుకున్నది. అతిదారుణమైన తపోవృత్తితో అత్యంతకృశత్వాన్ని పొందింది. ఇక భావకహృదయాన్ని నీరు చేసేపార్వతిని కవి ప్రేక్షకదృష్టికి సమర్పిస్తున్నాడు.

శ్లో. శిలాశయాం తా మనికేతవాసినీం
నిరన్తరా స్వన్తరవాతవృష్టిషు;
వ్యాలోకయ న్నున్మిషితై స్తడిన్మయై
ర్మహాతప స్సాక్ష్యఇవ స్థితాః క్షపాః.

(వ. మధ్యమధ్య వాయుసంయుతిగల నిరంతరవృష్టులందు అనావృతప్రదేశంలో శిలాతలాన శయనించి వున్న ఆమెను మహాతపస్సాక్షులుగా వున్న రాత్రులు విద్యున్మయాలైన అవలోకనాలతో చూచినవా అన్నట్లు వుండెను.)

ఈశ్లోకంలో నిరాహారతవల్లా తపస్కార్కశత్వం వల్లా కృశించిపోయి, అస్థిగతప్రాణంతో దీక్షాపరతంత్రురాలైన పార్వతి ఏకాకిని నిశీథమందు అనావృతప్రదేశంలో నిరంతరమైన వాతవృష్టిలో కఠినశిలాతలమందు శయనించి వున్నది. విద్యున్నేత్రాలతో రాత్రులామెను చూస్తున్నవి. అక్కడ మరియెవ్వరుగలరు? అది మహారణ్యమధ్యమైన వివృతప్రదేశం. గాఢాంధకారబంధురమైన కాళరాత్రి; తటిల్లతలు క్షణికోపకృతితో భయంకరమైన నిశాస్వరూపాన్ని తెలుపుతున్నవేళ. వృక్షాలుసయితం సంక్షోభిస్తున్నసమయం. కాని పార్వతి నిశ్చలమైన ఈశ్వరధ్యానానికి హృదయాన్ని సమర్పించి శయనించివున్నది. ఆమె కక్కడ నికేతనం యేమీ లేదు. భద్రప్రదమైన పితృగృహాన్ని వదలివచ్చింది. సహచరీబృందం లేదు. అనవరతశుశ్రూషాతత్పరులైన దాసీజనాన్ని పితృగృహానికి ఒప్పగించింది. ఈశ్వరునితో సంభాషించవలసిన అవసరంకోసం కవి సఖీసాహచర్యాన్ని కనబరచినా ప్రస్తుతస్థితిలో ఆసఖులు సాధారణజీవుల ఆర్తత్వంతో తలలను దాచుకొనివున్నారు. పుష్పాస్తృతిమృదుతల్పాలు లేవు. మనఃపూర్వకంగా సర్వసౌఖ్యాలను పరిత్యాగం చేసి బయలుదేరింది. అత్యంతంగా కృశించిపోయివున్న ఆమెశరీరం

కర్కశపాషాణతలాన్ని ఆశ్రయించి క్లేశాన్ని సర్వాన్ని సహిస్తున్నది. మనస్సును అధిష్ఠించివున్న ఈశ్వరుణ్ణే ఆమె విలోకిస్తున్నది. తపస్సాఫల్యకాంక్షకే ఆమెచిత్తం సమర్పితమైవున్నది. మనోరథసిద్ధికే ఆమె యెదురుచూస్తున్నది. అరూపహార్యుడైన ఈశ్వరుడిసాహచర్యాన్నే ఆమె భావిస్తున్నది హృదయాలను కరుణాప్రపూరితాలను చేస్తున్నది. ఈతీరున భావకచిత్త వశీకరణశక్తిని పార్వతికి కవి ఒనగూర్చాడు.

ఇక కవి సౌకుమార్యాతిశయంతో తనతూలికను ప్రయోగించి సంసక్తభావాలను మనోహరంగా ప్రదర్శించే చిత్రకళాకౌశల్యాన్ని ఉపమానవిభుత్వాన్ని తెలియజేస్తాను. ఇందుకు శ్రీ. యమ్. కృష్ణమాచార్యుల వారి కృతిలో ఆగ్రహప్రదర్శనంవల్ల పార్వతికి ఈశ్వర హృదయాన్ని హరించడానికి అవకాశం కలిగిందని ప్రకటించడానికి సమాగమకాంక్షతో చిరకాలం భావంలో ధ్యానిస్తున్నప్రియుణ్ణి అతర్కితంగా క్షణంలో సందర్శించడంవల్ల ఏర్పడ్డ పార్వతి చిత్తవృత్తిని ప్రదర్శించడానికీ దత్తాలై వున్న ఉదాహరణాలను సారస్యాకర్షణంవల్ల స్వీకరించి ప్రస్తుత సందర్భానుగుణంగా పొందుపరుస్తున్నాను.

శ్లో. ఇతి ద్విజాతౌ ప్రతికూలవాదిని
ప్రవేపమానాధరలక్ష్యకోపయా,
వికుఞ్చితభ్రూలత మాహితే తయా
విలోచనే తిర్యగుపాన్తలోహితే.

(వ. ఇట్లాద్విజుడు ప్రతికూలవాది అయినప్పుడు చంచలాధరోష్ఠంవల్ల తెలుసుకొనదగిన కోపంగలపార్వతి భ్రూలతలు ఆభుగ్నంగా, కొనలయందు యెఱ్ఱబారినన్నేత్రాలను అడ్డంగాతిప్పింది.)

ఈశ్లోకం పార్వతిచిత్తరువును ప్రదర్శిస్తున్నది. ఈచిత్తరువులో గోచరిస్తున్నపార్వతి బ్రహ్మచారి అపభాషణానికి ఆగ్రహాన్ని ప్రకటిస్తున్నది. పార్వతిభావాలు ధరించిన బాహ్యరూపం నిర్మలమైనది. కోమల సౌందర్యానికి ఆశ్రయమైనగౌరిలో మనోవృత్తి స్ఫుటాకారంతో గోచరిస్తున్నది. ఈచిత్తరువులోవున్న జీవమంతా బ్రహ్మచారి మాటలయందు అనిష్టాన్ని తెలుపుతున్న పార్వతిదృష్టిలో వున్నది. అధరసంచలనం, నేత్రదీప్తి, భ్రూకౌటిల్యం, అన్యోన్యసహకారులై వర్తిస్తున్నవి. ఈచూపులో పార్వతి హృదయమంతా అనావృతరూపంలో గోచరిస్తున్నది. ఆమె యెవరియందు అనిర్వచనీయమైన మనోహరత్వాన్ని సందర్శించిందో, యెవరికి ప్రేమను సర్వాన్నీ నిశ్చలత్వంతో సమర్పించిందో, యేపూజ్యుణ్ణి పరవశత్వంతో భావిస్తున్నదో, ఆప్రియతముణ్ణి, ఆలోకైకగురుణ్ణి, అమితభాషి, ఒకబ్రహ్మచారి అపహసిస్తున్నాడు. ఆమెహృదయం దానికి ప్రతివచనం ఇవ్వగోరింది; అధరకంపనాదులతో తిర్యగ్వీక్షణం ప్రతివచిస్తున్నది; తన్మూలంగా పార్వతి బ్రహ్మచారిమాటలయందు తనకుగల అప్రియత్వాన్ని తెలుపుతున్నది. తానొనరించిన వరనిర్ణయం అప్రశస్తమైందనడంవల్ల, క్రోధంవహించిన ఆత్మగౌరవాన్ని తెలుపుతున్నది. తన హృదయారాధనకు ఆస్పదుడని తెలిసినా నిర్లక్ష్యంతో బ్రహ్మచారి అపృష్టంగా తనసమక్షంలో అగౌరవప్రసంగం జరిపినందుకు ఆగ్రహాన్ని తెలుపుతున్నది. బ్రహ్మచారియొక్క ఉపదేశంమీద తిరస్కృతిని తెలుపుతున్నది. ఇన్నిటిని తెలుపుతున్న, అనుభావాన్ని ప్రతిపాదించినవిధానం, వాస్తవంగా కాళిదాసీయమైన విద్యావిశేషం.

ఇక ఉపమానవిభుత్వం ఉదాహృతమవుతున్నది:

శ్లో. తం వీక్ష్య వేపథుమతీ సరసాఙ్గయష్టి
ర్నిక్షేపణాయ పద ముద్ధృత ముద్వహన్తీ
మార్గాచలవ్యతికరాకులితేవ సిన్ధుః
శైలాధిరాజతనయా నయయౌ న తస్థౌ.

(వ. ఆయనను చూచి కంపాన్నిపొంది స్విన్నగాత్రియై స్థలాంతరవిన్యాసంకోసం యెత్తినపాదాన్ని ఉద్వహిస్తున్న గౌరి మార్గమందు పర్వతావరోధంవల్ల సమ్భ్రమిస్తున్ననదివలె స్థితికలదీ కాలేదు, గమనంకలదీ కాలేదు.)

ఇది ఔపమ్యసారస్య సమగ్రతకు నిదర్శనం. అతర్కితంగా ఉపస్థితుడైన ఈశ్వరుణ్ణి సందర్శించినపార్వతి యొక్క అవస్థావిశేషం బ్రహ్మచారి శివదూషణాభి

నివేశానికి పార్వతికి ఆగ్రహం కలిగింది. నిందాశ్రవణవిముక్తికి స్థలాంతరాన్ని ప్రాపించదలచింది. పాదాన్ని కదలించింది; కాని ఆఉత్తరక్షణంలో బ్రహ్మచారి అదృశ్యుడై ఈశ్వరుడు ప్రత్యక్షమైనాడు. జటామధ్యగతమైన చంద్రకళకాంతితో మందహాసాంకితమైన ముఖంతో ప్రసారితాలైన బాహువులతో పరమేశ్వరుడు సముఖంలో నిలిచాడు. క్షణకాలంలోనే అవిచారితమైన మార్పు తటస్థంచింది. పార్వతి యెత్తినపాదంతో ఆవిధంగానే నిలిచిపోయింది. ఆమెశరీరం కంపిస్తున్నది. స్వేదం ఆమెను ఆవరించింది. అప్పుడు పార్వతి పర్వతంవల్ల మార్గావరోధం కలదై ఆకులపడుతున్న నదివలె వున్నదని కవి తెలుపుతున్నాడు. దుస్సహమైన మునివృత్తిని అవలంబించి శరీరాన్ని తపించజేస్తూ యెవరిసమాగమాన్ని కాంక్షిస్తున్నదో ఆమహాదేవుడి సందర్శనం లభించింది. అందువల్ల ముప్పిరిగొనే భావాలు ఉదయించినవి. శ్లోకంలో కవి చిత్రించినపార్వతియందు ఈభావాలన్నీ సంస్థితాలై కనబడుతున్నవి. ఈభావప్రబలత్వాన్ని క్రియానివృత్తిరూపంగానూ క్రియాప్రవృత్తిరూపంగానూ కవి ప్రకటిస్తున్నాడు. ఆగ్రహప్రేరణవల్ల స్థలాంతరగమనానికి పార్వతిపాదం ఉద్ధృతమైంది. కాని మహాదేవసందర్శనంవల్ల ఆగ్రహం మారిపోయింది. ఉద్ధృతమైన పార్వతిపాదం విధాయకకృత్యాన్ని మరచింది. అస్వాభావికమైన నిరాధారతను విస్మరించింది. పూర్వవ్యాపారం ఈవిధంగా నిలచిపోయింది. ఇక అనంతరవ్యాపారం ప్రచారంలోకి వచ్చింది. ఇది ఆవిష్టభావాల ప్రవృత్తి. ఇందువల్లనే స్వేదయుతమైగాత్రం కంపిస్తున్నది. ఈవిధంగావున్న పార్వతిని కవి అచలావరోధంవల్ల నిలచిపోయిన నదితో ఉపమిస్తున్నాడు. మనస్సుతో దర్శించవలసినవై ప్రస్తుత పార్వతిస్థితిని పరికల్పించిన కారణాలను ప్రత్యక్షగోచరమైన నదీసంస్తంభన సంచలనకారణాలతో ప్రకాశపరుస్తున్నాడు. సమానధర్మాలకు సమగ్రత్వం కలిగించి నిలిపినాడు. ఈశ్వరసందర్శనంవల్ల పార్వతియందు సంకల్పితక్రియానివృత్తి అంటే ప్రస్థాననివారణం కలిగింది. పర్వతస్థితివల్ల నదియందు సంకల్పితక్రియానివృత్తి అంటే, ప్రవాహనివారణం కలిగింది. శివసందర్శనంవల్ల ఆవేశించిన భావాలమూలంగా పార్వతియందు క్రియాప్రవృత్తి బయలుదేరింది. పర్వతస్థితివల్ల కలిగిన ప్రతిక్రియమూలంగా నదియందు క్రియాప్రవృత్తి బయలుదేరింది. రెండుచోట్లా క్రియాప్రవృత్తి క్రియానివృత్తులు కారణ యుక్తాలై వున్నవి. ఆవిష్టభావాల ప్రబలత్వాన్ని అత్యధికమైన పరిమాణగురుత్వంతో పర్వతం తెలియచేస్తున్నది. సౌకుమార్యంగల నదీపార్వతులయెదుట గాంభీర్యంగల పర్వతపరమేశ్వరులు సముచితంగా వున్నారు. పార్వతియందూ నదియందూ సహజమైన కంపం వర్తిస్తున్నది. ఈమాటలు కవియొక్క ఉపమానవిభుత్వాన్ని ప్రదర్శిస్తున్నవి.

కవి సందేశము

ఈతీరున కవితాకౌశల్యానికి సంస్థానాలైన కృతులను వెలయించగలిగి లోకోత్తరమైన పార్వతీపరమేశ్వరుల దాంపత్యమహిమను భావించిన ఈఉన్నతభావకుడు ఒకసందేశాన్ని కవితాసర్గగర్భితంచేశాడు. ఇది వాల్మీకిప్రేమతత్వప్రతిరూపం. ఇది ధర్మవిశిష్టకామం.

వాల్మీకి ధర్మమూలమైన ప్రేమను భావించాడనీ, కాళిదాసు వాల్మీకిహృదయంలోపుట్టి వాల్మీకిభావసీమయందు పెరిగినవాడైనా భారతతత్వమ్మీద అధికారాన్ని పొంది వాల్మీకి ప్రేమతత్వానికి పరిణామాన్ని కలిగించిన వ్యాసుడిమీద ఒకవిధమైన ప్రతిక్రియను నడిపి వాల్మీకిభావనకు ఛాయారూపమైన ధర్మవిశిష్టకామాన్ని నెలకొల్పాడనీ, ఒకవిశుద్ధగుణంతో ప్రేమను నిర్ణయించాడనీ విద్యాశేఖరులు "ప్రేమపరిణామంలో" తెలిపివున్నారు. వ్యాసుడియందు ప్రేమను నిర్ణయించింది కామమనీ, కామమంటే మన్మథతాపమేకాక ఇచ్ఛఅనీ వ్యాసుడి ద్రౌపది, శకుంతల, దమయంతి, సావిత్రి, దేవయాని, సుభద్ర, రురుడు, శంతనుడు, సంవరుణుడు, ప్రేమనిర్ణయంలో ఈఇచ్ఛనే కనబరుస్తున్నారనీ, ప్రేమపరిణామం విశదంచేస్తున్నది. వ్యాసప్రేమసర్గానికి బీజప్రాయమైన గంధర్వప్రేమతత్వాన్ని వివరిస్తున్నది.

విద్యాశేఖరుల ప్రేమపరిణామం తెలుపుతున్న ఈకవియొక్క ధర్మవిశిష్టకామం అత్యుత్తమసర్గమైన

కుమారసంభవకావ్యంలో ప్రస్ఫుటరూపంతో గోచరిస్తున్నది. అన్యకావ్య సందర్భాలల్లోగూడా కవి ఈవి శుద్ధగుణాభిమానాన్ని యథార్థ్యంగా ప్రకటిస్తున్నాడు. కాని దీనిసర్వరూపాన్ని కుమార సంభవాంతర్గతాన్ని చేశాడు. ఇక ధర్మవిశిష్టకామమంటే ధర్మాయత్తమైన ఒకపవిత్రేచ్ఛ; రూపవిత్తాదుల వ్యామోహాన్ని పరిగణించని ఒకఉదాత్తాభినివేశం. ఈకామానికే కవి ప్రేమ నిర్ణయ యాజమాన్యాన్ని సమర్పించాడు. ఇది ఆరాధ్యమైన ధర్మమని నిర్వచిస్తున్నాడు ప్రాకృతమైన కామానికి ప్రేమభావం అతీతం కావడంలోనే ఉత్తమదాంపత్యం సిద్ధిస్తుం దంటున్నాడు; ఇంద్రియలోలత్వజనకమైన కామంతో ప్రేమను నిర్ణయించడంలో వివేకాంధత్వదోషం వున్నదని తెలుపుతున్నాడు. కాంతాపరాయణత్వాన్నే పరమార్థంగా యెంచే ఇంద్రియలోలత్వాన్ని ధర్మవిశిష్టకామం మూలంగా సంఘటితమయ్యే దాంపత్యానికి అధీనంచేస్తున్నాడు.

ఈవిషయాలను బోధించడానికి కవి ప్రథమంలో ఇంద్రియప్రేరణను పరికల్పించి తన్మూలమైన ప్రేమనిర్ణయంలోవున్న అనర్థాలను వివరించి దాన్ని నిరసిస్తున్నాడు. అనంతరం కామాన్ని ధర్మవిశిష్టత్వంతో ఆవిర్భవించచేసి దాంపత్యానుష్ఠానాన్ని సమకూర్చి కామానికి జీవితావకాశసంతోషం కలిగిందని తెలుపుతున్నాడు. తదనంతరం సంఘటితమైన దాంపత్యంయొక్క మహిమను వర్ణించి ఇంద్రియమూలమైన కామం లోకప్రవృత్తికి హేతువవుతున్నదనీ ధర్మసాధనమవుతున్నదనీ తెలుపుతున్నాడు.

కామప్రేరణం

శ్లో॥ హరస్తు కించి త్పరిలుప్తధైర్య
శ్చంద్రోదయారంభ ఇవాంబురాశిః;
ఉమాముఖే బింబఫలాధరోష్ఠే
వ్యాపారయామాస విలోచనాని.

(వ. చన్ద్రో(?)దయారమ్భమందు సముద్రుడివలె ఈశ్వరుడుగూడా ధీరత్వం కొంచెంతగ్గినవాడై దొండపండు వంటి అధరోష్ఠంగల పార్వతీముఖమందు నేత్రాలను ప్రవర్తింపజేశాడు.

శ్లో॥ వివృణ్వతీ శైలసుతాఽపి భావం
అఙ్గైః స్ఫురద్బాలకదమ్బకల్పైః;
సాచీకృతా చారుతరేణ తస్థౌ
ముఖేన పర్యస్తవిలోచనేన.

(వ. వికసించివున్న కోమలకదమ్బానికి సాటివచ్చే అవయవాలతో శృంగారభావాన్ని ప్రకటిస్తూ పార్వతిగూడా సాచిక్రియచేత సుందరమై వ్రీడావివర్తితనేత్రాలుగల ముఖంతో వుండెను.)

ఇంద్రియప్రేరణమూలమైన ప్రేమనిర్ణయయత్నాన్ని కవి నాయకుల ప్రథమసన్నివేశంలో అంటే ముక్తసంగుడై తపశ్చరణంకోసం హిమనగసానువు నాశ్రయించిన ఈశ్వరుణ్ణి పార్వతి సేవిస్తున్న సందర్భంలో ప్రదర్శిస్తున్నాడు. ఇందుకు మనోహరమైన ఉపాధులు కవికల్పించాడు. ఉత్తరాయణమయింది. మధుమాసం ప్రవేశించింది. మలయవాయువులు బయలుదేరినవి. వృక్షాలు పుష్పపల్లవసంశోభితములైనవి. వివిధాలైన సుమాలూ వెలసినవి. వనం చిత్రవర్ణమయమయింది. పుష్పాదులు రాలుతున్నవి. కోకిల కషాయకంఠంతో పాడుతున్నది. జింకలు మదోద్రేకంతో పరుగెత్తుతున్నవి. అప్పుడు అంటే ప్రకృతి వసంతాలంకృతయై మనోజ్ఞరూపాన్ని ధరించివున్న ఆసమయంలో మిథునాలన్నీ స్నేహోత్కర్షా నిబద్ధాలై పోయినవి. మగతుమ్మెద తన ప్రియురాలి ననుసరించి పుష్పపాత్రంలో జతన తేనె తాగుతున్నది. స్పర్శసుఖంతో నిండిపోయి కండ్లుమూస్తున్న ప్రియురాలిని కృష్ణసారం కొమ్ముతో మెల్లగా గోకుతున్నది. పద్మసౌరభంతో కూడిన వక్త్ర(?)గతజలాన్ని కరేణువు అనురాగంతో ప్రియుడికి ఇస్తున్నది. స్వభుక్తశేషమైన తామరతూడును ఇచ్చి చక్రవాకం చక్రవాకిని ఆదరిస్తున్నది. పుష్పమద్యాన్ని త్రాగి చలిస్తున్న నేత్రాలతో గానంచేసే ప్రియురాలిముఖాన్ని కింపురుషుడు ముద్దుపెట్టుకుంటున్నాడు. వృక్షాలుగూడా పుష్పస్తబకాలనే స్తనాలతో రక్తపల్లవాలనే అధరాలతో

మనస్సును హరిస్తున్న లతావధువులను శాఖాబాహువులతో ఆలింగనం చేస్తున్నవి.

కవి ఈవిధంగా మనస్సుకు ఆనందపారవశ్యం కలిగించే రమణీయమైన ఒక ప్రదర్శనాన్ని సజీవంగా ప్రత్యక్షం చేస్తున్నాడు. కరుణాకరుడు, రసావిష్టుడు వాల్మీకి ప్రతిలేని చిత్తసంస్కార విశేషంతో క్రౌంచదంపతుల శృంగారానుభవంలో సందర్శించగలిగిన నిర్మలమాధుర్యాన్ని కవి అధికతరమనోజ్ఞత్వంతో సర్వవిధద్వంద్వాల శృంగారభావప్రకటనతో శ్రోతలకు అనుభూతం చేస్తున్నాడు. చతుర్విధప్రాణులందూ యేకరీతిగా మహానందప్రదమైన మిథునాల ఆత్మైక్యప్రవృత్తిని ప్రకటిస్తున్నాడు. తిర్యక్కులశృంగారంలో గూడా భావమార్దవాతిశయంతో అమృతమయమైన ప్రేమస్వరూపాన్ని కనబరుస్తున్నాడు. లోకప్రవృత్తికి హేతుభూతమై పావనమైన శృంగారవిషయంలో తనకుగల అభిమానాన్ని విశదీకరిస్తున్నాడు.

ఈకోమలవస్తుసామగ్రితో కవి ఒకరంగస్థలాన్ని సిద్ధంచేశాడు. ఇవి అంటే ఈమధుసంపద ఈసాధుజంతువుల శృంగారలీలలూ ఉద్దీపనోపకరణాలు. రమణీయమైన ఈరంగస్థలంలో కవి నాయికను ప్రవేశపెడుతున్నాడు. నాయికాప్రసాధన విషయంలో కవి సౌకుమార్యాన్ని కనబరుస్తున్నాడు. కవి కనబరచేవిధానం కన్నులకు మిరుమిట్లుగొలిపే కృత్రిమాలంకరణం గాదు. భావసంతుష్టిని కలిగించే ప్రసాధనచాతుర్యం. ప్రకృతిసిద్ధమైన అలంకరణం. పార్వతి లోకైకసుందరి. ఆవసంతవికాసానికి మనఉల్లాసం కలదౌతుంది. సహజమైన చిత్తవృత్తితో స్వీయసౌందర్యాన్ని కుసుమవిశేషాలతో అర్చించింది; అశోక కర్ణికార సింధువారపుష్పాలతో అలంకృతఅయింది. బాలార్కరక్తిమగల చీరమీద కటిస్థానంనుండీ జారిపోతున్న పొగడదండ మొలనూలును చేతితో పైకి తీస్తున్నది. సామీప్యంలో సంచరించడానికి యత్నించే తుమ్మెదను లీలాకమలంతో తోలుతున్నది. చిగుళ్లతో నిండి పూలగుత్తులబరువుతో వంగి, సంచారం చేస్తున్న లతవలె కనబడుతున్నది. ఈశ్వరాశ్రమాన్ని సమీపించింది. యోగాన్ని చాలించి ప్రసన్నుడైవున్న ఈశ్వరుణ్ణి ప్రాపించింది. చిగురుటాకులతో కలసివున్న పుష్పోచ్చయాన్ని శివపాదాలవద్ద సమర్పించింది. అలకన్యస్తమైన కర్ణికారమూ, కరస్థితమైన కోమలపల్లవమూ జారిపడుతూవుండగా వంగి వృషభధ్వజుడికి నమస్కరిస్తుంది. ఈవిధంగా మనస్సంహ్లాదజనకమైన విలాసవ్యాపారానికి కవి కోమలాలంకరణాన్ని సాధనంచేస్తున్నాడు. తరువాత పార్వతి గంగాపద్మబీజాలను యేరి యెండబెట్టి చేసినజపమాలను యెర్రనికాంతిగల తనచేతితో ఈశ్వరుడికి సమర్పిస్తుంది. ఆయనశుశ్రూషయందు తనకుగలశ్రద్ధను తెలుపుతుంది. ఈశ్వరుడా తావళాన్ని ప్రతిగ్రహించడానికి ఉద్యుక్తుడౌతాడు. పార్వతివైపు దృష్టిని ప్రసారిస్తాడు. ఇంద్రియప్రేరితుడౌతాడు. మనోవికారాన్ని పొందుతాడు. తన ఆన్నికండ్లతో యెర్రనిపెదవిగల పార్వతిముఖాన్ని సాభిలాషంగా చూడడం ప్రారంభిస్తాడు. పార్వతిగూడా పులకలెత్తిన అవయవాలతో, చలిస్తున్నకండ్లతో ముఖాన్ని అడ్డంగా త్రిప్పి నిలుచుంటుంది. ఈశ్వరుడి జితేంద్రియత్వానికి పరిశోధనసమయం తటస్థిస్తుంది. ఈతీరున నాయకుల ప్రేమసర్వంచోదనానికి సంసిద్ధపడివున్న ఇంద్రియప్రేరణాన్ని కవి వివృతరూపంతో గోచరింపజేస్తున్నాడు; మనస్సంవేద్యమైన ఈభావంయొక్క స్వరూపాన్ని కవి తాకౌశల్యంతో ప్రదర్శిస్తున్నాడు.

శ్లో. సదక్షిణాపాఙ్గనివిష్టముష్టిం
న తాం సమాకుఞ్చితసవ్యపాదం;
దదర్శ చక్రీకృతచారుచాపం
ప్రహర్తుమభ్యుద్యత మాత్మయోనిమ్.

(వ. దక్షిణాపాంగమం గుంచిన ముష్టిగలవాణ్ణి వంచబడిన భుజంగలవాణ్ణి సంకుచితమైన కుడికాలుగలవాణ్ణి వర్తులాకారంగా జేసిన సౌమ్యచాపంగలవాణ్ణి ప్రహరణానికి ఉద్యుక్తుడైవున్నవాణ్ణి మారుణ్ణి ఆయనచూశాడు.)

[సశేషము.]

శైలి

(శ్రీ రామ స్తవము)

కవితిలకః కాంచనపల్లి కనకమ్మగారు
(విద్వాన్)

పరమార్థంబది జీవకోటి కొసఁగన్ వాగ్దేవియై, ప్రీతియై
హరియై, శంకరుఁడై, గణేశ్వరుఁడునై, యాదిత్యుఁడై, యంబయై
పరుఁడై, దేశికుఁడై, పరాత్పరుఁడునై, ప్రత్యేకరూపంబులన్
ధరియింపంగల నీదుశక్తి దలఁతున్ ధర్మార్థకామంబులన్
బరివర్జించిన భక్తపాళికిఁగదా ప్రాప్తించు ద్వద్యోగ మో
కరుణాసాగర, రామచంద్రనృపతీ, కైవల్యదాత్రాకృతీ.

వరముల్ వేడక వాంఛలేక మదిలో వైరాగ్యముంబూని స
త్వరమే నాత్మగతుండవైన నినుఁ గొల్వంగల్గె నాభాగ్యమే
ధర భాగ్యంబని యెంతు నీ పదములన్ ధ్యానింతు మోదింతు నా
పరమార్థం బిఁక వేరఁ గోరుమనె తాత్పర్యాభియోగంబునన్
గరుణాసాగర రామచంద్రనృపతీ కైవల్య దాత్రాకృతీ.

హరియే యీజగ, మిద్దియే హరి, యటంచాత్మావలోకంబునన్
హరిపూజావిధినున్న భక్తులకు బ్రహ్మానంద సంధాయకుం
డురుదీక్షాపరుఁ డార్తరక్షణమునన్ యోగీశ్వరేశుండవో
కరుణాసాగర రామచంద్రనృపతీ కైవల్యదాత్రాకృతీ.

నరనారాయణ రూపమొంది ప్రజలన్ నానావినోదంబులన్
గురుశక్తిం దగ రక్షణంబొసఁగు నీగోప్తృత్వ మేపాటిదో
పురుషార్థంబు నెఱుంగనట్టి పశులన్ బ్రోవంగ నేఁగాంతులే
కరుణాసాగర రామచంద్రనృపతీ కైవల్యదాత్రాకృతీ.

జరయున్ మృత్యువు వెంబడింపఁగ మదిన్ శంకాలవంబున్ గటా
చొరనీఁడెంతయు మెచ్చు నీభవముఁ జూచు న్నాకమ ట్లీభవిన్
గరమర్థించుచు స్వప్రయోజకత సౌఖ్యంబంచు మోదించుగా

నరుడెందున్ దనయజ్ఞతన్ గణనకున్ రానీఁడు నీమాయచేఁ
గరుణాసాగర రామచంద్రనృపతీ కైవల్యదాత్రాకృతీ.

పారినానాత్వము నీదు నైజమయి పెంపుంగాంచుచో జీవులన్
స్థిరభావంబును దాల్పకున్న భవవార్ధిన్ ముంచి బాధించి, ము
క్తిరమాదూరులఁ జేయనెంచెదవు సందేహంబులం బెంచెదో
కరుణాసాగర రామంద్రనృపతీ కైవల్యదాత్రాకృతీ.

ఒరులన్ నమ్ముట యాధిహేతువని యార్యుల్ వల్కన్ నాలించి బ్ర
హ్మరతిన్ సౌఖ్యము కల్గునం చనెడు నాత్మారాములంగాంచి నీ
చరతిన్ గాలము పుచ్చుచుండెదరు విశ్వాసంబు లేకుంట మా
నరు దౌర్మార్గ్యము వారిఁ బ్రోవఁ దగదా నారాయణా దీనులన్
గరుణాసాగర రామచంద్రనృపతీ కైవల్యదాత్రాకృతీ.

పరముం బావనజీవనంబు సుమముల్, ప్రజ్ఞానమున్ భక్తియున్
సురసాలంబును గల్పవల్లియునగున్, యోగంబు నీరంబెయౌ
నరయన్ బీజముసు మ్ముమాపతి యతండౌ, చార్యుఁడే కాపు సం
సరణాబ్ధిన్ లభియించు సత్ఫలము నీసాయుజ్యమన్ దాని కం
దురు సర్వంబును నీ ప్రభావముగ నెంతున్ వేకటాక్షింపవే
కరుణాసాగర రామచంద్రనృపతీ కైవల్యదాత్రాకృతీ.

శరణంటిన్, దమచిత్తమంటి, గృతికిన్ జాలన్ హరీ యంటి, నీ
చరణంబే గతియంటి, రిక్త నిఁక నాసర్వస్వ మీవంటి, నన్
బరిశోధింపకుమంటి, మంటిని సదానందంబున న్నీకృపన్
గరుణాసాగర రామచంద్రనృపతీ కైవల్య దాత్రాకృతీ.

యుగములు—మన్వంతరములు

కవికొండల వేంకటసత్యనారాయణమూర్తిగారు

"యుగములు-మన్వంతరములు" అనుశీర్షిక క్రింద నొకవ్యాసమును వ్రాసెదనని నేను మా చదువరులకు వాగ్దానము చేసియుంటిని. కొంచెమాలస్య మైనందులకు పాఠకులు మన్నించెదరుగాక.

ప్రస్తుతము పురాణములలోఁ గనఁబడుచున్న యుగ-మన్వంతర, పరిమాణము లిట్లున్నవి.

	దేవమానము
కృతయుగప్రమాణము	4000 సం.
త్రేతాయుగ ప్రమాణము	3000 సం.
ద్వాపరయుగ ప్రమాణము	2000 సం.
కలియుగ ప్రమాణము	1000 సం.
కృతయుగసంధి	800
త్రేతాయుగసంధి	600
ద్వాపరయుగసంధి	400
కలియుగసంధి	200
	12000

దేవమానము ననుసరించి యీ 12000 సంవత్సరములును కలిసి యొక మహాయుగమగుచున్నది. ఇది మనుష్యమానము ననుసరించి $12000 \times 360 = 4320000$ సంవత్సరములగుచున్నది. ఇట్టివి 71 మహాయుగములైన నొక్క మన్వంతరమగును. యుగములకును మన్వంతరములకును పురాణములలో నుదహరింపఁబడిన సంబంధమిది. ఇఁక దీనియందుఁ గల సందర్భాసందర్భములను విచారింతము.

పురాణముల ననుసరించి వైవస్వతమన్వంతరమున 28 వ మహాయుగ మిప్పుడు ప్రవర్తిల్లుచున్నది. దీనినిబట్టి వైవస్వతమన్వంతర ప్రారంభమునుండి 28 వ ద్వాపరయుగాంతము వఱకునైన మానవసంవత్సరములసంఖ్య—

43,20,000	సం.లు మహాయుగప్రమాణము
27	మహాయుగములకు
11,66,40,000	సంవత్సరములు
14,40,000	ఇరువదియెనిమిదవకృతయుగము
28,8,000	కృతసంధి
10,80,000	త్రేతాయుగము
2,16,000	త్రేతసంధి
7,20,000	ద్వాపరయుగము
1,44,000	ద్వాపరసంధి
12,05,28,000	సంవత్సరములు

పన్నెండుకోట్ల అయిదులక్షల యిరువది యెనిమిదివేల సంవత్సరములు. ఈ సంవత్సరములలో పురాణముల ననుసరించి వైవస్వతమనువు మొదలు ధర్మరాజువఱకును తేలిన తరములసంఖ్య* 47 అనఁగా నలువదియేడు తరములలో పన్నెండుకోట్ల అయిదులక్షల యిరువది యెనిమిదివేల సంవత్సరములు గడచెను. దీనినిబట్టి సగటున నొక్కొక్క తరమునకు.

*భారతి 5 సంపుటము, 6 సంచిక, 850 పుట చూడుడు.

12,05,28,000 ÷ 47=27,77,191 $\frac{23}{47}$ సం. ఇరువదియేడులక్షల డెబ్బదియేడువేల నూట తొంబదియొక్క సంవత్సరములు! ఏతరము నందుగాని యేరాజుగాని యిన్నిసంవత్సరములు జీవించెనని పురాణములు చెప్పసాహసింపలేదు.

కావున నీసంఖ్య పౌరాణికులు పొరబడి వ్రాసినసంఖ్యగాఁ గనఁబడుచున్నది. ఏలయన యుగప్రమాణము హిమాలయపర్వతములకు దక్షిణమునంగల భారతవర్షమునకు మాత్రమే చెల్లునుగాని, హిమాలయమున కుత్తరమునంగల కింపురుషవర్షాది దేవభూములకు ఈ ప్రమాణము చెల్లదని స్పష్టముగా పురాణములలోఁ జెప్పఁబడియుండఁగా, కృత, త్రేత ద్వాపర, కలియుగప్రమాణసంఖ్యలకు 4000 + 3000 + 2000 + 1000 సంవత్సరములు దేవమానములనియును దానిని మానవ సంవత్సరములలోనికి మార్చుకొనుటకు 360 తో గుణింపుమనియు చెప్పుట పొరపాటై యుండవలెను. ఏలయన దేవలోకము (హిమాలయ పర్వతోత్తరప్రదేశము) లలో నీ 'యుగ మానమే'లేనప్పుడు ఇది దేవమానమని చెప్పుట సమంజసముగాలేదు. కావున నీ 4000, 3000, 2000, 1000, సంవత్సరములసంఖ్య మనుష్య మానమనియే మన మంగీకరింపవలెను. లోకమాన్య బాలగంగాధరతిలకుకూడ "Arctic home in the Vedas" అను పుస్తకమున నీయభిప్రాయమునే వెల్లడించెను. ఇట్లయిన సగటున మనుష్యునియొక్క జీవితపరిమాణ మెంతవఱకు తేలునో చూతము.

వైవస్వతునకు మూడవపురుషుఁడగు పురూరవుని కాలమున కృతయుగము పోయి త్రేతాయుగము ప్రవేశించినట్లు పురాణములు చెప్పుచున్నవి. అనఁగా త్రేతాయుగ సంవత్సరములు 3000, ద్వాపరయుగ సంవత్సరములు 2000 నడుమసంధి 400 సంవత్సరములును వెరసి 5400 సంవత్సరములును పురూరవుఁడు మొదలు ధర్మజువఱకునుగల 45 తరములకును పంచిపెట్టిన (5400 ÷ 45=120) ఒక్కొక్కమనుజుని జీవితకాలము సగటున నూట యిరువదిసంవత్సరములు తేలినది. ఇది యే మనుజునియొక్క సరియైన ఆయుఃపరిమాణము. ధర్మరాజాదులును నింతకాలమే జీవించినట్లు తెలియుచున్నది.

ఈ లెక్కనే ప్రమాణముగాఁ జేసికొని చూచిన ద్వాపరయుగాంతము మొదలు కలియుగాంతము వఱకునుగల 1200 సంవత్సరములును నింతకుముందే యెంతో కాలముక్రిందట పూర్తియై యిప్పుడు కృతయుగము మూడవపాదము నడుచుచున్నదని చెప్పవలెను. ఈకృతయుగప్రారంభమున నుండిన గణితశాస్త్రజ్ఞులు ఏకారణముచేతనో తాము కృతపురుషులుగా నుండుటకు సంశయించి వెనుకటి మానము దేవమానమని భావించి దానిని 360 చేత హెచ్చించి యింకనుమఱికొన్ని లక్షలసంవత్సరములు కలియు

గమే ప్రవర్తిల్లునట్లు నిశ్చయించిరి. ప్రాయశః ఇందుకుఁగల కారణము కృతయుగ మనఁగా నేవేవియో మహద్విశేషము లుండునని వా రూహించి, యవి యన్నియు లేకపోవుటచేత నింకను కృతయుగము రాలేదని వారభిప్రాయ పడియుందురు. కాని నిజముగానిది కృతయుగ తృతీయపాదమని చెప్పవలసియున్నది.

మన్వంతరములు

'యుగముల' ప్రమాణములు భారతవర్షమున కుత్తరమునంగల దేవభూములలో లేనట్లే 'మన్వంతరము'ల సంజ్ఞ హిమాలయమున కుత్తరమునంగల దేవభూములలోనేగాని భారతవర్షమున లేనట్లు గోచరించుచున్నది. ఏలయన స్వాయంభ్వా (?) ది మనువులెవ్వరును భారత వర్షవాసులు కారు. వీరెల్లరును రమ్యకవర్ష నివాసులని భాగవతాది గ్రంథములవలన తెలియుచున్నది. రమ్యకవర్ష పరిపాలకులకు 'మనువుల'నిపేరు. రమ్యకవర్ష మనఁగా మధ్య సైబీరియా దేశము. సురలకు కొంతకాలము రమ్యక వర్షాధీశ్వరుఁ డధిపతియని తోఁచుచున్నది. అక్కడివారికి రమ్యక వర్షాధీశ్వరుఁడగు మనువే శకపురుషునివలెఁ గాననగుచున్నాఁడు. పరిపాలకుల రాజ్యప్రారంభసంవత్సరములే, పూర్వము, వ్రాతలయందుఁ జేర్చుచుండిరి. ఇట్టి వ్రాతలు భారతవర్షమునను గలవు. ఇందుకుఁ గొన్ని శాసననిదర్శనములనుజూపుచున్నాను.

"స్వస్తిశ్రీ శకవర్షంబులు ౧౧౮౭ అగు నేటి శ్రీమదనంతవర్మ శ్రీవీరబాణదేవ ప్రవర్ధమాన విజయ రాజ్యసంవత్సరంబులు ౭ అగునేటి శ్రాహికన్యా శుక్లత్రయోదశియు గురువారమునాండు."

"స్వస్తిశ్రీ శకవర్షంబులు ౧౨౦౩ అగు నేటి శ్రీమదనంతవర్మ వీర శ్రీనరసింహరాజ్ఞతు దేవరల ప్రవర్ధమాన విజయరాజ్య సంవత్సరంబులు ౭ అగు......"


"స్వస్తి శ్రీ శకవర్షంబులు ౧౨౪౧ అగు నేటి శ్రీదేవాదిదేవ శ్రీగన్నాథదేవరల విజయరాజ్య సంవత్సరములు ౧౩......"

ఈ మొదలగు శాసనములఁబట్టి శకవర్షములతోఁబాటు అప్పటి దేశాధిపతి రాజ్యమునకు వచ్చినసంవత్సరములను కూడ పేర్కొను నాచారముకలదని స్పష్టపడుచున్నది.

మన్వంతరమనఁగా నొకమనువుపరిపాలించిన కాలమని యర్థము. ఒక్కొక్కమనువు 71 మహాయుగము పరిపాలించెనని చెప్పుట ప్రకృతి విరుద్ధము. మఱియు నీమనువుల వంశవృక్షము కూడ చదువరుల సౌకర్యార్థ మిటఁ బొందుపఱచెదను. (చూ. ౧౭౦ పుట)

పై వంశవృక్షమున 1, 3, 4, 5, 6, 7, 8 మనువులు కాననగుచున్నారు. వహూథిని పౌత్రుఁడగు స్వారోచి(?)యను రెండవమను వీ వంశవృక్షమున గోచరింపలేదు. ఈతఁడు స్వాయంభువునకును స్వాయంభువు పౌత్రుఁడగు నుత్తమునకును నడుమ పరిపాలించెను. వంశవృక్షమునుబట్టి చూచిన నీనడుమ పరిపాలింప

(వంశవృక్షము-మనువంశము)



వలసినవాఁడు ప్రియంవదుఁడు. కాని యీతఁ డేకారణము చేతనో రాజ్యమును పరిపాలింపక నీతనిస్థానమున స్వారోచి పరిపాలించెను.

పైమనువులందఱును వరుసగా 6 వరము లలోనివారు. అందుచే వీరెల్లరును నొకరితరు వాత నొకరు పరిపాలించిరనుట కెట్టి సంది యము నుండదు.

ఈ మనువులయొక్క రాజ్యాంగవిధాన ములను నడిపించుటకు దేవతలు, ఋషులు, రాజులు, అనుపేర కొన్నిసంఘములును, ప్రతి సంఘమున కొక్కొక్క అధ్యక్షుఁడును నున్న ట్లు కనబడుచున్నది. మనువు మాఱిపోవఁ గనే ప్రాతసంఘములును, సంఘాధ్యక్షులును మాఱి క్రొత్తమనువున కనుకూలమగు క్రొత్త సంఘములును క్రొత్తసంఘాధ్యక్షులును వచ్చు చుండిరి. ఏలయన స్వాయంభువునాఁటి దేవ తలు, ఇంద్రుఁడు, ఋషులు, రాజులు వేఱుగను స్వారోచి, ఉత్తముఁడు మున్నగు మనువుల నాఁటి దేవతలు, ఇంద్రుఁడు, ఋషులు, రాజులు వేఱువేఱుగను నున్నట్లు పురాణములు చెప్పు చున్నవి. ఈ పరిపాలనముయొక్క వివరము లన్నియు నేను ముందుముందు ప్రచురింపబోవు "భూతములు-అసురులు-సురలు" అనువ్యాస ములలో విపులముగా వ్రాసెదను.

వీరుత్తరధ్రువమునకు సమీపముననివసిం చువా రగుటచే మన దివారాత్రములకంటె వారి దివారాత్రములు దీర్ఘములుగానుండును. వారియాయువును మనయాయువుకంటె దీర్ఘ ముగానుండును

యుగములకును, మన్వంతరములకును నెట్లు మైత్రి కుదిరెను ?

ఈ భారతవర్షములోని యుగములకును రమ్యకవర్షములోని మన్వంతరములకును నెట్లు

మైత్రి కుదిరెనో యింక యోజింపవలసియున్నది. వైవస్వతమనువునకు మూడవ పురుషుఁడగు పురూరవుఁడును నాతనియనుచరులును మొదటపాంచాల దేశమునఁ బ్రవేశించిరి. వీరు భారతేతర వర్షవాసులగుటచే వారి దేశములో ప్రవర్తిల్లుచుండిన మన్వంతరములును భారత దేశమున ప్రవర్తిల్లుచుండిన యుగములునుకూడ వీరు వాడుచుండిరి.

ఇట్టివాడుక లిప్పుడును మన దేశమున వ్రాతలలో కలవు. ఎట్లన-'1928 సం. జూలై 15 తేదీయగు విభవనామసంవత్సర జ్యేష్ఠబహుళ ౧౩ ఆదివారమున'—అనియును— "Dated Moon Ramadan 16 th, Hegira 1172, which is the 14 th of May 1759' అనియును, పాశ్చాత్యపాలకుల శకములను మనశకములతోఁగూడ కలిపివాడుచున్నాము. అట్లే యార్యులును మొట్టమొదట యిక్కడ ప్రవేశించినప్పుడు భారతవర్షములోని యుగములతోఁబాటు ఉత్తర దేశములోని మన్వంతరములను కలిపి వాడుచుండిరి. వైవస్వతమన్వంతరములోనే ఆర్యులు ప్రప్రథమమున మన దేశమున ప్రవేశించియుండవలెను. ఏలయన భారతఖండవాసులు వాడిన మన్వంతరములలో వైవస్వతమన్వంతరమే మొదటిది. వారిక్కడకు వచ్చినపిమ్మట మఱి యేడు మన్వంతరముల వఱకును ఉత్తర వర్షనివాసులగు ఆర్యుల పరిపాలనమునకును భారతవర్షమునకు వలస వచ్చిన ఆర్యుల పరిపాలనమునకును సంబంధముండి పిమ్మట భారతవర్షమున కేతెంచిన యార్యులు భారతవర్షముననే స్వతంత్రరాజ్యము నేర్పాటు చేసికొని మనువులతో తమకుఁగల రాజకీయసంబంధములను త్రెంపుకొని యుండవచ్చును. అందుచేతనే వైవస్వతునకు పిమ్మట మఱియేడుగురు మనువులుమాత్రమే మనపురాణములలోఁ గాననగుచున్నారు. అంతేకాని ఒక్కొక్క-మనువు కోట్లకొలఁది సంవత్సరములు పరిపాలించినచో ప్రస్తుత మనువని చెప్పఁబడు వైవస్వతమను విప్పు డెక్కడనున్నాఁడు? అతని మన్వంతరము (పరిపాలనము)లో నుండవలసిన 1 ఆదిత్యులు, 2 వసువులు, 3 రుద్రులు, 4 సాధ్యులు, 5 విశ్వులు, 6 మరుత్తులు, 7 భృగువులు, 8 అంగిరసులు, అని పిలువఁబడు దేవతల యెనిమిది గణములును నేమయ్యెను? అతనికాలమున సప్తఋషులుగా నుండవలసిన 1 అత్రి, 2 వసిష్ఠుఁడు, 3 కాశ్యపుఁడు, 4 గౌతముఁడు, 5 భరద్వాజుఁడు, 6 విశ్వామిత్రుఁడు, 7 జమదగ్ని యేమైరి? అతనికాలమున రాజులుగా నుండవలసిన ఇక్ష్వాకుమున్నగువా రేమైరి?-వైవస్వతునకు పిమ్మట రాజ్యమునకు రాఁబోవు నాతని సోదరుఁడగు సావర్ణి యిప్పు డెక్కడనున్నాఁడు? అతనికాలమున దేవతలుగను, ఋషులుగను, రాజులుగను నుండవలసి వారందఱును నిప్పు డెక్కడ నివసించియున్నారు? సావర్ణికి పిమ్మట రాజ్యమునకు రాఁబోవు మనువులును నాయాకాలముల నుండవలసిన దేవతలు, ఇంద్రులు,

ఋషులు, రాజులు నిప్పు డెక్కడ నివసించి యున్నారు ?-

వీరందఱును నిదివఱకే పుట్టినట్లు పురాణములు చెప్పుచున్నవిగదా? ఇదివఱకేపుట్టి యింకను జీవించియున్నచో వారిప్పుడేందుకు కానరారు? ఈమొదలగు ప్రశ్నములకు సమాధానము కానరాదు.

అందుచే దీనినంతటిని నించుక విమర్శనాపూర్వకముగా తిలకించిన నీమనువుల పరిపాలన మెల్ల నిదివరకే ముగిసెననియు, ప్రస్తుతము ప్రవర్తిల్లుచున్న కాలము వైవస్వత మన్వంతరముగాని కలియుగముగాని కాదనియును, ఉత్తర దేశములలోని మన్వంతరములకును భారత వర్షములోని యుగములకును నెంతమాత్రము సంబంధము లేదనియును, ప్రస్తుతకాలము కృత యుగములోని మూడవపాదమనియును చెప్ప వలసియున్నది.

అనార్కాళి

పురిపండా అప్పలస్వామి గారు

నిస్తుల మనోహరమ్ము దానిమ్మపూవు
ప్రమదవనభూషణమ్ముగాఁ బ్రస్ఫుటించె
ప్రతికుసుమకోమలినిఁ జేరు ప్రణయజీవి
భ్రమరుఁ డద్దాని మనసార వలచికొనియె.

ఒండొరులు నూతనానురాగోదయమున
లోకమే విస్మరించి ప్రలోభపూర్ణ
ముగ్ధ హృదయాల గోర్కు లుప్పొంగిపోవ
నతులితానందమునఁ దేలి యాడునపుడు.

ఎంత దారుణమొక్కొ మహేంద్రుచేతి
యశనిపాతంబు! కాలాంబుదాళినుండి
విస్ఫులింగాల వెదచల్లి భీషణోగ్ర
నిస్వనాలతోఁ బడియె దానిమ్మమీఁద.

ఆ సుధాపూర్ణ మృదుల శోణాధరాంచ
లముల నూతనదరహాస లలిత రేఖ
కరఁగిపోలేదు; యౌవన తరుణశోభ
వాడిపోలేదు; ప్రణయభావప్రపూరి

తాంతరంగ మధుర వాంఛ లడఁగలేదు:

అంతలోననె, అకట! దురంతమృత్యు
దంష్ట్రిలను జిక్కి సుమబాల తనువు వీడి
కఠిన మృత్తికా గర్భానఁ గలసిపోయె.

ఆపుకోలేని నిబిడమహార్తి నెడఁద
వ్రయ్యలైపోవ, నున్మత్తభయదశోక
మూర్తియై, విశ్వమే వగఁబొగుల, పనవి
పనవి రోదించె హతభాగ్యబంభరుండు.

అట వసంతయామినుల శోకాతిరేక
దైన్యగీతాళి నిర్మలార్ద్రస్వనాన
నిప్పటికిఁగూడ చిరవిరహైకజీవు
లకు నినాదించు, నొడలు పుల్కరములొంద.

దమయంతీ సంవరణము*

శ్రీ శేషాద్రిరమణకవులు

ప్రథమాంకము

[ఇంద్రుఁడు యముఁడు, వరుణుఁడు. అగ్ని ప్రవేశింతురు, అందఱును విమానముల నేలపై నాపి యందుందురు.]

వరుణుఁడు

వానకారు మొయిలు మ్రోతవలె నేదియో ధ్వని వినవచ్చుచున్నది. అదిగో ధ్వని ననుసరించి యొకరథ మిటులె వచ్చుచున్నది. అందొక వీరకుమారుఁ డున్నాఁడు.

అగ్ని

ఈతఁడెవఁడో రాజకుమారునివలె నున్నాఁడు. మానవలోకమునఁ గూడ నింత సుందరపురుషు లుందురు కాఁబోలును.

నలుఁడు

(ప్రవేశించి ఆశ్చర్యముతోఁ జూచి రథముదిగి) ఎవరోఇచట విమానములపై నాసీనులైయున్నారు. వీరివైఖరిజూడ వేల్పులవలె నున్నారు. సందర్శించి నమస్కరించెదఁగాక (ఎదురేగి) మహానుభావులారా? మీయందఱకుఁ బ్రణామములు.

దేవతలు

(ఒకరి మొగ మొకరు చూచుకొందురు.)

ఇంద్రుఁడు

ఓయీ! నీ వెవఁడవు. నలుఁడవా? నీయందు వీరసేనుని పోలికలు చూపట్టుచున్నవి. అతఁడు మాకుఁ జిరపరిచితుఁడు గాన నీవును మిత్రగణములోనివాఁడవు.

నలుఁడు

(తలపంకించి) సర్వజ్ఞులగు మీ రెఱుంగని దేమున్నది.

ఇంద్రుఁడు

నలనృపాలా? చిరకాలమునుండి నీచరిత్రము మేము వినుచున్నారము. నీవిపు డెచటి కేగుచున్నాఁడవో తెలుపఁగలవా? ఇతఁడు యముడు. ఈయన అగ్ని వరుణుఁ డీతండు. నే నింద్రుఁడ. నిన్నొక యంశమున యాచింప వచ్చితిమి.

నలుఁడు

(సంతోషముతో) వేల్పులు యాచకులుగ నాదరికి వచ్చుట సుకృతాతిశయము. యాచకునకుఁ బ్రాణమేని యొసంగుట నా వ్రతము. ఇంద్రునియంతవాఁడు యాచకుఁడుగా వచ్చెఁగదా? ఏమి యొసంగనగును. (ఆలోచించి) కలదుగదా! ప్రాణాధికయగు దమయంతి. కోరినచో నాయమనేని యొసంగెద. (?)

* శ్రీహర్షుని నైషధములోని 5,6,7,8,9 సర్గములను ననుసరించి వ్రాయఁబడిన రెండంకముల రూపకము. దాదాపుగా నిది భావానుకరణము. శే. ర.

వరుణుఁడు

నరపాలకుమారా? బదులు చెప్పవేమి?

నలుఁడు

అడుగక మున్నె మీకామితము దీర్చుటకు వెర వారయుచున్నాఁడను. అడిగించుకొని యాచకుని దైన్యమును గాంచి యిచ్చువాఁడు దాత కాఁడుగదా!

యముఁడు

ఆహా! నలునిగుణము లెంత ప్రశంసాపాత్రములు.

నలుఁడు

వేల్పులారా? అమృతస్వరూపులగు మిమ్ముఁ జూడ నాకానంద మతిశయించుచున్నది. మీ యాగమనంబున మధ్యమలోకంబు తరించినది. మీకోర్కె తెలుపుఁడు. ప్రాణంబైనను బ్రాణాధికంబైనను సమర్పించెదను.

వరుణుఁడు

ఇతఁడు త్రోవలోనికి వచ్చుచున్నాఁడు. ఇఁక నింద్రుఁ డీతని లోఁగొనుట కెంతయో సేఁపు బట్టదు.

ఇంద్రుఁడు

నిషధరాజా? ఇంక దాఁపనేల? దమయంతిని వరింపఁదలంచి మేము నలువురము వచ్చినారము. స్వయంవరము సాటఁబడినదిగదా, నీవు దూతకృత్యము నిర్వహించి మాలో నొకనికి దమయంతిని సమకూర్పవలయును. ఇదియె మాప్రార్థనము.

అగ్ని

రాజా? భూలోకంబున రాజు లెందఱులేరు? వారలనందఱను యాచించితిమా? గుణశాలి వగు నీకు సాధింపరానికార్య ముండదని యీ దైన్యమునకు సహించితిమి.

నలుఁడు

(విచారముతో నాలోచించి) వేల్పులారా? జీవులహృదయము గ్రహింపశక్తిగల మీరే యిటులఁ గోరిన నీకఁ జెప్పవలసిన దేమున్నది. నేనును నందులకె పోవుచున్నాఁడ. ఎట్లు దూతకృత్యంబు నిర్వర్తింపఁ గలుగుదును. వలఁపువేఁడిచే నుడికిపోవు నేను మీ రహస్యము కాపాడఁగలనా? అంతిపురి కెటు లేగుదును. చిరకాలమునుండి వినుకలిచే నాపై వలపుగొన్న ఆసుందరి కెటుల మీగుణప్రశంస వినిపింతును. తలకుమాలిన భారము నంటఁగట్టి నన్ను నవ్వుల పాలుసేయకుఁడు.

ఇంద్రుఁడు

భూపాలా? ఆడితప్పనగునా? క్షణభంగుర మగు సంసారసౌఖ్యము లాసించి కీర్తియు ధర్మంబు దిగఁద్రాఁగెదవా? అచేతనములగు చింతామణి కల్పకాదులె యర్థులఁ గోర్కె మన్నించుచుండ వేల్పులమగు మా కోర్కె నీవు దీర్పఁజాలవా?

అగ్ని

రాజా? ఇదియ మాకు బురుషార్థముసుమా.

యముఁడు

నలచక్రవర్తీ! మాప్రార్థనము మన్నింపుము.

వరుణుఁడు

పరోపకార జన్యమగు కీర్తిని గైకొనుట కిదియ తరుణము.

నలుఁడు

అశక్తి ప్రమాదంబులు గలుగునేమొ యని వెఱచుచున్నాఁడ! దివిజులారా! దూతకృత్య మున కియ్యకొంటిని. ఇఁక నా కాజ్ఞ దయ చేయఁ బ్రార్థించెద.

ఇంద్రుఁడు

అంతిపురి ప్రవేశించుటకు నీకుఁ దిరస్కరిణి యను మంత్రరాజ ముపదేశించెదము. దీని సహాయమునఁ బరులకుఁ గానరాకుండ నిచ్చ కొలంది సంచరింపవచ్చును. (ఉపదేశించి) రాజా? కార్యసిద్ధి యగునుగాత. పోయిరమ్ము.

నలుఁడు

(రథము నెక్కి) సెలవు పుచ్చుకొనుచున్నాఁడను.

[నిష్క్రమించును]

ద్వితీయాంకము

[విదర్భానగరమున చెంత రథము నాపి నలుఁడు రథము దిగి పాదచారిగాఁ గనిపించును]

(కొంచెము నడిచి) తిరస్కరిణీమంత్రబలంబున నేను అదృశ్యమైతిని. పరుల వంచించి నే నంతిపురి ప్రవేశింపవలయును. వంచనము పాపముగదా? పాపము. ద్వారపాలకులు విచ్చుకత్తులతోఁ గాచియున్నారు. వీరు నిక్కముగా వంచింపఁబడిరి. ఇంక నంతిపురికిఁ బోయెద. (లోనికిఁబోయి) ఇటఁ బరిచారికాంగనలు స్వేచ్ఛావిహారము లొనరించుచున్నారు. ఎటులో తప్పించుకొని అంతర్గృహంబున కేఁగెద.

మరాళిక

ఏమి యీవింత! అద్దములో నొక దివ్యపురుషుని ప్రతిబింబము గోచరించుచున్నది. ఇసుక నేలపై పాదపద్మముల గుర్తులు కనిపించుచున్నవి. కల్పసుమముల తావులు గుబాళించుచున్నవి. ఎవఁడో మాయావియగు పురుషుఁడంతిపురి చేరినటు లున్నది.

నలుఁడు

నేను పరులకుఁ గనిపింపకుంటినేగాని పరులు నన్ను గుర్తింప నవకాశములు లేకపోలేదు. అదిగో! ఆయువతి వేసిన బంతి నాకు దగిలి వెనుకకు మఱలినది. కారణ మెఱుంగక యామె నివ్వెఱపోయినది. ఈపావురమును బట్టుకొన నలువురు జవ్వను లురికి వచ్చుచున్నారు. నడుమ చిక్కు వడుదునుగాఁబోలు. (తొలఁగి) ఇఁక నిట నున్నచోఁ బట్టువడకపోను. కార్య భంగమగును. (కొంచెము నడిచి) ఇదిగో? ఇచట దమయంతి యాసీనురాలై యున్నది. చెంతఁజేరి వినోదింతుగాక.

గీ. చిఱునగవు వెన్నెలలఁగాయఁ జిగురుమోవి
యించుకించుక కదల నీచంచలాక్షి
చెప్పుచున్నది యేదియో చెలులతోడ
లేమ దరిజేరి నేను నాలింతుఁగాక,

దమయంతి

నిషధరాజకుమారా? నిజముగా నీపై నామనము లగ్నమైయున్నది. మన యిరువురిహృదయ

ములు అంచతొయ్యాలి కలిపినది. ఇదిగో? ఈ కుసుమ మాలిక యలంకరించికొనుము. (కనులు మూసికొని మాలికనులంకరించును.)

మరాళిక

రాజపుత్రీ? నలుఁ డేచట నున్నాఁడని సుమ దామ మలంకరింతువు. నీవు కేవల భ్రాంతివశ మున పదరుచున్నావు. నిబ్బరించి మనసు కుదురుపఱచికొనుము.

(మాలిక నలుని కంఠమునఁ బడును.)

దమయంతి

(కనులువిచ్చి) ఏమి యీవింత! అలరుదండ యే మైనది.

మరాళిక

నలునికంఠమున వైచితివిగదా!

దమయంతి

చెలీ? నేను భ్రాంతి పడితినంటివిగదే? భ్రాం తిచే నలుని జూచితినని కుసుమమాల నెంతో జారవిడిచి యుందును.

మరాళిక

ఎందో కాదు నలుని కంఠమునందే.

నలుఁడు

మరాళిక నన్ను గుర్తించెనాయేమి (ఆలో చించి) మంత్రబలమున నదృశ్యముగానున్న నన్నెటుల గుర్తింపఁగలదు.

గీ. వలపువ్రేగున వాడిన వనిత మేను
చూడఁ జూడఁగ నొకవింత సొంపుగూర్చె
కఱఁగినకొలందిగా నూత్నకాంతితోడఁ
గ్రాలు పదియాఱువన్నె బంగారమట్లు.

దమయంతి.

రాజపుత్రా ? గాఢ వేదనా తప్తమగు నామే నుకౌఁగిలించికొమ్ము. నేను నీదాననేగదా ?

(నలదమయంతులు కౌఁగిలించికొందురు)

మరాళిక

రాజపుత్రీ? నలుఁడిచట నేడీ? వలపుచే సర్వము నీకునలస్వరూపముగాఁ గన్పించుచున్నది. తేఁపు నలుఁడు స్వయంవరమునకుఁ దప్పక రాగలఁడు.

నలుఁడు

ఆనందాతిశయమును భరింపఁజాలకున్నాఁడ.

దమయంతి

మరాళీ? నేను నలుని కౌఁగిలించినదికల్లవనా? ఆతఁడు నన్నును గౌఁగిలించెనుగదే?అంతయు భ్రాంతియేనా? కట్టా ఎంతదురదృష్టవంతురా లను. స్వప్నసౌఖ్యము నేని సంపూర్ణముగాఁ బడయఁజాలకపోతిని.

పరిచారిక

(ప్రవేశించి) అమ్మా యెవరో నలువురు చెలు వలు మిమ్ముదర్శింపవచ్చి ద్వారముననున్నారు. వేల్పుగరితలవలెనున్నారు. సెలవైనఁ బిలిచి కొనివత్తుము.

దమయంతి

మంచిది కొనిరమ్ము.

[నలువురు దేవదూతికలు వత్తురు. మరాళిక యెదురేగి కొనివచ్చి పీఠములను జూపించును]

నలుఁడు

ఇచట దమయంతి నాపైఁగల ప్రేమచే నిజరూ పాను కరణంబులగు చిత్తరువుల నెలకొల్పినది.

ఇందుఁగూర్చుండి జరుగఁబోవు ప్రసంగము నాలించెదఁగాక. (కూర్చుండును).

ఇంద్రదూతి

అమ్మా! దమయంతీ! నే నింద్రునిదూతికను. వీరలు మువ్వురు వరుసగా యమవరుణాగ్నుల దూతికలు. నీకు సమస్తలోకాధీశ్వరుండును బృందారకసందోహమాళి సందానిత మందారమరంద బిందు సందీప్తచరణారవిందుఁడు నగు పురందరుఁడు పారిజాతప్రసూనంబులను నాచేనుపాయనముగాఁ బంపినాఁడు(అనిఇచ్చును).

దమయంతి

భక్తి పూర్వకముగఁ బరిగ్రహించుచున్నాను.

ఇంద్రదూతి

ప్రేమపూర్వకముగఁ బరిగ్రహింపవలయును. దమయంతీ? దేవేంద్రుఁడు నీకొకలేఖ కాంచనకేతకీదళముపై వ్రాయఁబోయి వేల్పులవ్రాత మనుష్యాంగనలు గ్రహింపఁ జాలరని మానినాఁడు. ఇంద్రునిసందేశము నేన యెఱింగింతును.

దమయంతి

అస్వతంత్రురాలనగు నాతో దేవేంద్రుఁడు జరుపవలసిన రాయభారము లేముండును.

ఇంద్రదూతి

అదియె విన్నవించుచున్నాను. ఇంద్రుఁడు నిన్నువరింప నెంచినాఁడు. సమస్తలోకపూజ్యుడగు నింద్రునికి రాణివి కాఁజాలిన నీయదృష్టము నెంతని కొనియాడఁగలను.

సీ. వేలుపుచెలులచే విహితోపచారంబు
　　ప్రమదంబునిండారఁ బడయవచ్చు
నందనోద్యాన సంతానాదితరువుల
　　నీడలఁ బ్రియమార నిలువవచ్చు
మూఁడుసంజలయందు మునికన్యకలొసంగు
　　నుపహారవస్తువు లొందవచ్చు
అమరేంద్రురాణివాసమునందు గణ్యవై
　　భువనైకవిఖ్యాతి బొందవచ్చు
తే. నిఖిలసురలోకసామ్రాజ్య నిరుపమాన
　భారధారేయుఁడగు శచీప్రాణవిభుఁడు
　తనకుఁదానుగ నినుఁగోర దలఁచినాఁడు
　కన్యకారత్నమా యెంతధన్యవమ్మ.

౧ వ చెలికత్తె

దమయంతీ? ఇదియ యుత్తమకార్యము

౨ వ చెలికత్తె

ఇంక నాలోచింపక యంగీకారము తెలుపుము.

3 వ చెలికత్తె

ఇందులకుఁదగిన ప్రత్యుత్తరంబంగీకారమేగదా!

దమయంతి

ఇంద్రదూతీ? పాకశాసనుని గొప్పతనము వేదములే ప్రశంసింపఁజాలకున్నవన మనమెంతవారము. సర్వహృదయవేదియగు నింద్రుఁడు నాచిత్తవృత్తి నెఱుంగనివాఁడుకాఁడు. ఇంద్రుని సందేశము శిరసావహించెద. నన్ను ఇంతకుమున్నె నలునకర్పించుకొంటిని. ఇంకనేను జేయవలసిన దేమున్నది.

ఇంద్రదూది

నలునిమీఁదివలపుచే నింద్రునిగొప్పతనము గ్రహింపఁజాలకున్నావు. ఇంకనేని తగవూహిం

పుము. మానవలోకమున నుండుటకంటె దేవలోకమున కేగుట యోగ్యముగదా?

దమయంతి

దూతీ? నీవెన్ని చెప్పినను నాకు మానవలోకముపై మమతతగ్గదు. ఈలోకముననున్న వారికి స్వర్గము లభించుమార్గములు కలవు. స్వర్గవాసులకెన్నఁటికేని యధోగతితప్పదు. దేవలోకమున సౌఖ్యమునకేగాని ధర్మమునకుఁ దావు లేదు. మానవలోకమున నీరెంటికిని దావుగలదు. స్వర్గము ప్రాణాంతమున సౌఖ్యకరము. మనుష్యలోకము యావజ్జీవితసౌఖ్యకరము.

తే. నిషధరాజకుమారుపై నిలిచియున్న
మనసుపురుహూతుపైకెట్లు మరలనేర్చు
ఇంద్రియసుఖంబులనుగోరు నింతికేల
ప్రాణమెడలిననాఁటి నిర్వాణవాంఛ!

వరుణదూతి

సతీ? మామనవులుగూడ యించుక నాలింపవలయును.

దమయంతి

చెలులారా! మీతలంపులు నేనుమున్నె యెఱుంగుదును. ఇంద్రదూతికిఁ జెప్పినదేమీకును బ్రత్యుత్తరంబు. సర్వము విధివిహితము:. నియతిబద్ధము. జీవులెవరి ప్రియమును వా రభిలషింతురు. అందు నిందేంబులేదు. నాపై నింద్రుడు కోపించెనేని నలునితోఁగలసి సప్తతంతువొనరించి హవిర్భాగములచేఁ దృప్తినొందింపగలను. ఇఁక నీప్రసంగము ముగింపుఁడు.

యమదూతి

యముఁడందఱివంటివాఁడుకాఁడు. ఆలోకోత్తరునిగుణము లాకర్ణింతువేని నలుని గలనైనఁ దలంతువా? నాప్రసంగమునకు మాత్రము కొంచమవకాశమిమ్మా దమయంతీ?

దమయంతి

వేల్పుచెలువలారా? ప్రాణేశ్వరునిదక్క నితరులఁగూర్చిన ప్రశంసాదికము నాలించుట కులసతీధర్మమునకు విరుద్ధము. ధర్మశాస్త్రములిటులె చెప్పుచున్నవి. ఇఁక మీరు మహాపాడెదరేని యింద్రునిపాదములపై నానఁబెట్టుచున్నాను.

దూతికలు

అమ్మా? మేమిఁక సెలవుపుచ్చుకొందుము

దమయంతి

మంచిది పోయిరండు.

(దూతికలు నలువురు నిష్క్రమింతురు).

(నలుఁడు)

[ముందునకువచ్చి] దమయంతీ? నీచిత్తశుద్ధి ప్రశంసాపాత్రము. మానవలోకము నీశుద్ధాంతఃకరణముచేఁ బవిత్రమైనది. వినుకలిచేతనే ప్రేమించి ఇంద్రాదులసందేశమును గూడఁ దిరస్కరించిన నీనిశ్చలభావము నిఁకఁ బరిశోధింపవలసినభారము నాతలపైనున్నది. ఎంతకు సాహసింపనున్నాఁడ;

తే. ఒరసినకొలంది బంగారుమెఱుఁగుదాల్చు (?)
సానబట్టినకొలఁది వజ్రము రహించు
తఱచినకొలంది యాభీమతనయచిత్త
నిశ్చలత్వంబు స్పష్టమౌ నిక్కువముగ.

దమయంతి

మరాళికా? లోకమంతయు నాకు నలమయముగానున్నది. చెలిమికత్తెల చిత్రకౌశల్యము చేనైషధుని రూపరేఖావిలాసముల నెఱింగిన దాది నాముందాదివ్యమూర్తినటించుచున్నది. నేను నిజముగా నలునిజూచినను ఇపుడు భ్రాంతియో సత్యమొ గ్రహింపఁజాలను. చూచితివా నాచిత్తవృత్తి.

మరాళిక

అమ్మా? అనురాగప్రథమావస్థ లిటులెయుండును.

నలుఁడు

తిరస్కరణి నుపసంహరించి దమయంతికిఁ గనిపింపఁదగిన తరుణమిదియె. అదిగో భీమరాజుపుత్రియేదియొ నన్నుఁగూర్చియె భాషించుచున్నది. ఇపుడె సమీపింతుఁగాక.

దమయంతి

మరాళీ; అంచచెప్పినది మొదలుకొని నాహృదయము నలునిపై లగ్నమైయున్నది. చెలికత్తెలు వ్రాసిన చిత్రపటములను జూచుటాదిగ నాపురుషసత్తముని దివ్యమూర్తియె కనుల ముందు నటించుచున్నది. నిజముగా నలుఁడే వచ్చినను నేనిపుడు నిర్ణయింపఁజాలనేమో?

మరాళి

ఎవరోనూతనపురుషుఁడిటులవచ్చుచున్నాఁడు.

దమయంతి

(నిదానించిచూచి) ఎవరైయుందురు. ఇపుడాచర్చతగదు. అతిథిపూజ గావించుటయే ధర్మము. కులశీలాదికముల నావల నెఱుంగవచ్చును. చెలులారా? ఈ మహనీయున కతిథిపూజ గావించుఁడు.

నలుఁడు

(సపర్యలు పరిగ్రహించి) దమయంతి యడకువ యెంతయుఁ బ్రశంసాపాత్రము. ఈయమసౌశీల్యమున కీగృహస్థ ధర్మనిర్వాహణము వన్నెబెట్టుచున్నది. ఈయమతో నేనేమనిభాషింపవలయును.

దమయంతి

తొందరపనులులేవేని యీరత్నసింహాసనమున నాసీనుఁడవుగమ్ము. రాజకుమారా? నీవెచటనుండి వచ్చుచుంటివి? నీయాగమనహేతువు నడుగవచ్చునా?

మరాళి

రాజపుత్రీ? నీవు కొంచమాగినచో సర్వము నీయనయే నివేదింపఁగలఁడు. కొంచెమాగరాదటమ్మా.

దమయంతి

చెలీ! అతిథిపూజా సమాదరణాదికము లెఱుంగవు. గృహాగతులఁ బూజించి కామితముల సమకూర్చుట మనకు విధియని పెద్దలుచెప్ప లేదా?

తే. కలితనవరత్నఖచితశృంగారసింహ
పీఠమియ్యది దీనిపై విశ్రమింపు
మవసరంబయినీకుఁ గార్యాంతరములు
గలుగుచో విన్నవింపఁగాఁ గలనునేను.

నలుఁడు

పీఠముపై నాసీనుఁడై కన్యకామణీ? పరదేశము నుండి వచ్చుచున్నాఁడను. పనివడివచ్చి ప్రయత్నముదాఁచవచ్చునా? నీతోనొకవిషయము ముచ్చటింపవచ్చినాఁడ.

దమయంతి

ఇతనిముఖమునందుబలెఁ బల్కులందును సౌకుమార్యగాంభీర్యము లతిశయించుచున్నవి. నాహృదయమేలకో యీ యువకునియందు లగ్నమై మరలకున్నది. (ప్రకాశముగా)

ఉ. పేరెదినీకు, సాహసము పెంపున నిచ్చటికేగుదేరఁగా,
గారణమేమి? యంతిపురకావలికాండ్రమొరింగినమ్మ
లక్, జేరఁగ నెట్లువచ్చితో విచిత్రము? నీవుపురూరవుం
డవో, మారుఁడవో నలుండవో సమగ్రముగా నెఱుఁ
గంగఁజెప్పుమా.

నలుఁడు

(తనలో) ఇపుడే యీమెకు నావృత్తాంతము చెప్పుదునా? అంతరంగమెఱుంగకమున్న నా చరిత్రమెఱింగించిన నెట్లు పరిణమించునో? కర్తవ్యముతోఁచకున్నది. (ఆలించి) (?)

తే. అరుణపల్లవమధ్యంబునందునుండి
మంచుచినుకులు తోఁచినమాడ్కి—చెలువ
పెదవి కదలించి నిర్మలగదనకాంతి
ప్రజ్వరిల్లఁగ నేదియో పల్కుచుండె

(ప్రకాశముగా) సతీ? నేను దిక్పాలుర యాస్థానముననుండి నీవద్దకు నతిథిగా నరుదెంచితిని. నాకార్యము నొనరించుటయ నాకాతిథ్యము. పరులెవరులేరుగదా? నేను తలదాల్చినకార్యభరము నివేదింపవచ్చునా?

దమయంతి

(తనలో) ఏమిది? దిక్పాలురు నాకడకనుపవలసిన సందేశములేముండును? ఆలింపకతప్పదు గదా. (ప్రకాశముగా) రాజకుమారా? సెలవిమ్ము.

నలుఁడు

చెలువా? నీలావణ్యవిలాసాతిశయము లాలించి వేల్పులందఱు నిన్నుఁ గైకొన కాంక్షించుచున్నారు. అందు ముఖ్యముగా నింద్రుఁడు, యముఁడు, వరుణుఁడు, అగ్ని నన్ను నీవద్దకు దూతగాఁ బంపినారు. తొలుత ఇంద్రునిగూర్చి విన్నవింతును.


శా. ఇంతీ? సర్వజగద్విభుండయ్యుఁ, దే
వేంద్రుంకు నీపైఁగృపా
స్వాంతుండైనను బంపినాఁడు సుమి, నా
సందేశ మాలించి నీ
యంతశ్శుద్ధివచింపవమ్మ! దివిజా
ధ్యక్షుండు తానై నినుక్
బంతంబొప్ప వరింపఁగా దలఁచె నీ
భాగ్యంబు సామాన్యమే.

తే. వరుణుఁడగ్నియు యముఁడు నీపై విరాళి
గొని వరింపఁగఁ దలఁచి రోవనజనేత్ర
వీరిలోపల నెవ్వనిఁ గోరుకొనెదొ
తెలియఁజెప్పుమి నీనేర్పు తేటపడఁగ.


దమయంతి

(అనాదరముగానాలించి) నేనడిగినప్రశ్నయొకటి, నీవుచెప్పు ప్రత్యుత్తరము వేఱొకటిగా నున్నది. నీపేరును గులమునుగోర నింతవఱకేదియో ప్రసంగించితివి? దిక్పతులు గొప్పవారుకానిమ్ము కాకపోనిమ్ము. నాకు నీచరితమె

శిల్ప, ప్రకృతి చిత్రములు



౧. ఎలిఫెంటా గుహల ద్వారపాలకులు



౨. చాంపానేర్ నగరద్వారము
'కలగూరగంప' చూచునది.

విన నుత్సాహమగుచున్నది. తొలుత నాపలుకునకుఁ బ్రత్యుత్తర మీయవలసిన భారము నీపయింగలదు.

తే. ఏకులంబున జనియించి తెద్ది నీదు
నామమో యెఱిగింపు మో నరవరేణ్య
అప్రమత్తుఁడవగుచు దిశాధినాధ
వృత్త మెఱిగించియుందు వీ వింతదనుక.

నలుఁడు

నేనెవఁడనో తెలిపినఁగాని యీయమతనయభిప్రాయమును జెప్పనటు లున్నది. నాపేరుచెప్పెదనేని కార్యభంగమగును. అనృతము పాపహేతువు. (ప్రకాశముగా) రాజపుత్రీ? హీనకులజుఁడు తనకులము పెంపుఁ జెప్పకొనును గాని ప్రసిద్ధవంశజుఁ డెన్నఁటికిఁ జెప్పకొనఁడు. ప్రత్యక్షవ్యవహారమునకు నీవునేను పదంబు లుండఁ బేరుతో నేమిపని? అదికాక తనపేరుతా జెప్పికొనఁ దగ దందురు. అడిగితివిగాన కొంత వఱకు నావృత్తాంత మెఱింగించెద.

తే. రమణి? నీవలె నేనును రాజవంశ
మందనుండను, స్వకులాభిమానవేని
భావమున నెలకొల్పి దిక్పాలకార్య
కరణమున కభిముఖి వీవు గాఁగదమ్మ.

దమయంతి

రాజకుమారా? మమ్ము నీవు వంచించుచున్నావు. ఇఁక నిన్ను మేము వంచించినను దోసము లేదు. పేరుచెప్పుట నీకెటుల ననాచారమొ అంతిపురిలోనుండిన కన్యలమగు మేము నీతో నేకతమ భాషించుటయు నట్టిద.

క. పరపురుషులతో నంతః
పురములో (?) మాటలాడఁబోలునె; ధర్మా
చరణంబు నిర్వహించుచుఁ
జరియించెద వింతసాహసము తగునొక్కో.

నలుఁడు

(తనలో) ఈయమమాటలనేర్పు అచ్చెరువు కలిగించుచున్నది. ఏమని ప్రత్యుత్తర మొసంగి యీ యమ యభిమతము గ్రహింపనగునో తెలియకున్నది. ఇటులభాషింతుఁగాక. (ప్రకాశముగా) రాజపుత్రీ నావిజ్ఞాపనము చిత్తగింపుము.

చ. వరుణుఁడు నింద్రుఁడున్ యముఁడు
వహ్ని భవద్విరహానలంబుచే
తొరగుచునేమొ ప్రాణములు;
తొయ్యలి నాకయి వేల్పులందు నొ
క్కరుని వరింపుమమ్మ
ఫలకారణమానని నాదురాకకై
సురలు తపించుచుండెదరు
చూపుల దైన్యము కందళింపఁగన్.

దమయంతి

రాజకుమారా? నీకుఁ బ్రత్యుత్తరమీయ నా మన మియ్యకొనకున్నది. చిఱునవ్వుతో నూరకొందునా? గర్వవతి యనుకొనెదవు. కాదు పొమ్మందునేని నిన్నుఁ దూలనాడినటుల గును. పలుకకున్నఁ దిరస్కరించినటు లగును. కాన నే ప్రత్యుత్తరమిచ్చుచున్నదాన:

చ. త్రికరణ శుద్ధిగా నిజము
దెల్పెద నాహృదయాంబుజ ధర్మదీ
పకు నలు నాశ్రయించెఁ జెర
వారి ప్రశంసలఁ దెచ్చెదేల ? చా

లీఁక; నలు నే వరించు టెటు
లేని ఘటిల్లక పోయెనేని చా
వె కడకు నిశ్చయింబు విని
పింపకు మన్యగుణప్రసంగముల్.

నలుఁడు

(తనలో) ఈయమనాపయి దృఢానురాగమై యున్నది. సంతోషాతిశయమునఁ గార్యభంగము జరుగునేమో. ఇపుడు నేను ప్రమత్తుఁడ గారాదు. నన్నిమె యెఱింగి నేనిప్రయత్నమంతయు విఫలమగును (ప్రకాశముగా) సిరిరా మోకాలొడ్డినటుల వేల్పులు తమంత వలచిరాఁ దిరస్కరించుచున్నావు. పిమ్మట పశ్చాత్తాపపడెదవు.

గీ. కలిగెఁబో, సర్వగీర్వాణ కాంతమకుట
మణిగణ విరాజమాన కోమల పదాంబు
జాతులగు దిక్పతులనెల్ల సాహసించి
యొల్లనని వాకొనెడి మానవోత్పలాక్షి.

దమయంతి

నేను వేల్పులను వరింపనని నొక్కి చెప్పుచున్నను మరల నాహృదయము నొప్పించుచున్నాఁడవు. నాహృదయము నలున కింతకుమునె సమర్పించితిని. దీనికి వ్యతిరేకము జరుగఁజాలదు.

నలుఁడు

(నవ్వి) జరుగఁజాలదుగా. వేలుపులమహిమ నెఱుంగనిదానవు గావున నేది భాషించుచున్నావు. ఎన్నివిధములఁ జూచినను నీవు వేల్పుల పాలబడక తప్పదు. ఇటు వినుము.

సీ. ఉద్బంధమునఁ బ్రాణ ముజ్జగించెదవేని
యింద్రుండు నిను వరియింపఁగలఁడు
వహ్నికుండంబునఁ బడి చావనెంతువా
యగ్నిహోత్రుండు పెండ్లాడఁగలఁడు
జలములోఁబడి యసురులను వీడదవేని(?)
వరుణు కామితము సాఫల్యమౌను
ఆత్మహత్యకును లోనై మృతినొందిన
శమనుని పూర్వపుణ్యము ఫలించు
గీ. వలదు వలదంచుఁ దొలుతొల్త పలికి పిదపఁ
బెండ్లియాడుట మిక్కిలి పేలతనము
కష్టసుఖములయోచించి కర్జమెంచి
యెవ్వఁ డభిమతుఁడో నిశ్చయించుకొమ్మ.

దమయంతి

(విచారముతోఁ దనలో) అక్కటా! ఎంత దురదృష్టవంతురాలను. హృదయ మొకనికి, తనువొకనికి నగునుకాఁబోలు. కానిమ్ము (ప్రకాశముగా) ఓరాజకుమారా? యముని దూతవుగాన నన్ను బాధించుచున్నావు. నీ కోపికయున్న నలుని ప్రశంసింపుము. లేదా మానుకొమ్ము. పరప్రశంసలతో నాకుఁ బని లేదు.

తే. అంచ తెలపిన రూపునీయందుఁదోఁచు
చున్నయది నీవు నలుఁడవై యుందువొక్క
దిగధినాయక పరిణయాదికమునింకఁ
గట్టిపెట్టుము; తెలుపుమీ కార్యవిధము.

నలుఁడు

(తనలో) ఇంకను నీయమ చిత్తశుద్ధి పరిశీలింతు గాక. ఇది దూత్యమునకుఁగూడ నుపకరించును గదా. (ప్రకాశముగా) దమయంతీ, నీవు బేలవై క్రిందుమీఁద యోజింపఁజాలకుంటివని నాకు విచారమగుచున్నది. వేల్పుల వరింపనని పట్టుపెట్టెదవేగాని వారు వరించిననెటులఁ దప్పించు

కొందువు. కల్పవృక్షము చింతామణి కామధేనువు మున్నగువానిని వేల్పులు గోరెదరేని నీవు వారిపాలఁబడకతప్పదు. హృదయపూర్వకముగ దిక్పతులలో నొకని వరించుటయె సర్వవిధముల శ్రేయము.

దమయంతి

అయ్యో? వలచినవానిఁ బెండ్లాడుటకేని నోఁచనినాజన్మమెందులకు. ఓ నలమహారాజా? త్రికరణశుద్ధిగా నిన్నువలచిన దమయంతిని దిక్పతులబారినుండి తొలఁగింపఁజాలవా? ఎంత యన్యాయము. వేల్పులారా? మీరైన నన్ను గనికరింపరా? (వెక్కి వెక్కి యేడ్చును.)

నలుఁడు

ఎంత సాహసమునకుఁ బాల్పడితిని. ఈయమ చింత నెటులఁ బాపనేర్తును. పరాధీనుఁడనగుటచేఁ గార్యసాధనమునఁ బ్రమత్తుఁడనై యింతకు సాహసించితిని. ఎటు లీయేడ్పు మానఁగలదు. నిరపరాధయగు నీయమ కన్నీరు ఎంతటి విప్లవమునకేని కారణము కాకపోదు. (ప్రకాశముగా) దమయంతీ! విచారింపకుము. శుద్ధాంతమునఁ జేరుట దోసంబె. నాచరిత్రము మఱుఁగుపఱచితిని. ఇది సాహసంబె. అనుగ్రహింపుము. విచారపరవశమగు నీ ముఖము నొకనిముసమేని చూడఁజాలను. నన్నుఁ గరుణింపుము.

క. చింతింపఁబోకుమా ? దమ
　యంతీ కనులెత్తిచూడుమా ? నలభూ
　కాంతుఁడనునేను నీచర
　ణాంతికమును జేరినాఁడ నరయుమి నన్నున్.

దమయంతి

(నలుని తేరిపాఱఁజూచి) అయ్యో! ఎంతసాహసము జరిగినది. నిజమెఱుంగక యెంత పొరపడితిని.

(సిగ్గుతో ద్వారముచాటున కేఁగును.)

మరాళిక

అమ్మా ? ఇంతలోనే చాటున కేగవలయునా! ఇంతవఱకును జరిపిన తర్జనభర్జనములేమిటి? ఇంతలో నీ సిగ్గేమిటి ?

నలుఁడు

ఎంతప్రమాదము జరిగినది. ఈయమవిచారముజూచి మనసుచెడి నాపేరుచెప్పితిని. వేల్పుల కార్యము పూర్తిగాభంగమైనది. కామరూపులగు దిక్పాలకులు నాసాహసమునకేమందురో గదా? విరహోన్మాదియగు నావంటి వివేకహీనునకుఁ బరోపకారసుకృతమెట్లులభింపఁగలదు.

తే. చేసితి ప్రయత్నమును గార్యసిద్ధికొఱకు
　సర్వవిధముల నరసితి శక్తికొలఁది
　కడకుఁ గార్యాంతమునఁ బొరపడుటచేసి
　నిష్ఫలంబయ్యె నేమందునిర్జరులకు.

అశరీరవాణి

నలదమయంతులారా? మీ హృదయములు అన్యోన్య ప్రేమాభిరామములు గాన నచిరకాలమునఁ బరిణయము జరుగఁగలదు. నలభూపాలా? దూత్యంబుననీవు ధర్మంబు నిర్వహించితివని వేల్పు లానందపరవశులైరి. దమయంతీ? నీశీలము చిత్తవృత్తి ప్రశంసాపాత్రము.

సమాప్తి

నిరశ్రురోదనము

ఆంధ్రవిశారద తాపీ ధర్మారావుగారు, బి. ఏ.,

రాలవిడేల యశ్రులు పరంపరలై, చినచిన్న సోనలై,
కాలువ చాలులై, చలదగాధతరంగిణులై, విభీషణో
ద్వేల విలోల వీచికల వీఁకఁ బాఱెడు నేఱులై, జగ
జ్జాలము ముంచవేల? యవశంబుగఁ జేయవిడేల లోకమున్?

మిడిమిడి దుఃఖ మెందఱో యమేయముగాఁ గొని యేడ్చుచుండ, నీ
యొడలు గుటుంబముం గులము నూరును దేశము-నింతయేల-యీ
పుడమి సమస్తముఁ వెతల ముంపఁగఁజాలిన నాదు ఖేద మె
వ్వడువునఁ దెల్పనౌ నకట! బాష్పజలంబులు మాయమైనచోన్.

అటమట నంతరంగ వివృతాక్షికిఁ గన్పడుచుండి, పెక్కుసం
కటముల కొక్కచుక్క యనఁగాఁ గరమూఱి, హృదంతరంబునన్
గుటిలత నిండు నశ్రువులు కొందలను న్స్ఫుటపాకవహ్నికిన్
బుటపుట పొంగి పైకుబికి పొర్లవిడేల విలోకనంబులన్?

అనుదిన నూతనక్రమ విహారనిరూఢిఁ జరించుచుండి, భూ
జనులకు లేమిఁగూర్చు నది సాజము లేమికి, దేననైననుం
ధన నిలయాదివస్తుసముదాయమునందునఁ; గాని, శాంతికై
కొనుటకు నేడ్వ బాష్పములకుం గొఱగల్గుట యేమి లేమియో!

హితులు నెలంత బంధుగులు నెవ్వరు నొవ్వననొంపకున్న, నే
కతముననైననేమి, సిరి గాసిల, ముప్పదిమూఁడుకోట్ల నే
కతమున నుండువేళ, మదిఁగల్గు భరంబును దేల్చివైవ ను
ద్ధతిఁగొని పారు నశ్రుఝరమైనను గల్గ దిదేమి లేమియో!

లేమికిఁ బెంపులేదను మలీమసవాక్యములెల్ల దబ్బరల్
గా, మహనీయవైభవ విలాస మదాతిశయంబు లేమికిం
దామరతంపరై కలదనన్ జగమంతయుఁ జాటఁజూతు; న
న్నోముదువీవు, నీఋణము నోపిన యంతకుఁ దీర్పకుందునే?

ఘోరదురంత చింత సమకూర్పఁగ నూటెడు బాష్పజాలముల్
ధారలఁ గాఱవేమి ? పరితప్తవిలోకనసీమ నాటెనో
దారుణదావవహ్ని సవిధంబయి క్రాఁగు నెడంద క్రమందెనో,
నీరసరూపమై చనెనొ నిస్వసనా నిలఘాత ధూతమై !

భిదురసమానఘాత పటువేదన లెన్నిటినేనిఁ గాంచియుఁ
బ్రిదులని నాయెడంద యినుమే యనుకొంటిని తొల్లి; యిప్పు డం
గదశిఖితప్తమై యదియె గాత్రము నీరసముంబొనర్చెఁ గా,
కెది యెరియించు? నశ్రుకణమేనియు లేపటు బాడబాభమై.

చిత్తవికల్పవేదనకు సిద్ధరసాయనధార, లాత్మవి
చ్ఛిత్తిమహార్తి కంజన విశేషము, లాధిమహోగ్రబాధ పో
నొత్తెడు తైలలేపము, లనూనమనః పరితాప మార్పఁగాఁ
జిత్తడిజల్లు లశ్రులు నశించినఁ జేయునదేమి నేనికన్.

అపరిమితానుకంప నను నారయు వారలఁజేరఁ బోయెనో,
వ్యపగతనైజధైర్య విభవంబున లేమికి నోర్వలేమి డి
ల్లపడు సతీసుతాదిజనులం గనఁబోయెనొ, యశ్రుపూరముల్ !
కృపణుఁడనైతిఁబో ! ప్రకృతికిన్ తుదినయ్యవిగూడ లేమిచేన్.

ఏడువ నర్థహైన్యమున, కేడువ నుద్యమభంగభంగి, కే
నేడువ నాలుబిడ్డలు భరించెడిలేమికి, నేడ్వఁ "గైతకున్
గాఁడితఁ" డన్నదూఱునకుఁ; గంటికి మంటికి నేకధారగా
నేడువఁ జాల నందులకె యేడ్చెదఁ; దోడ్పడరారె యశ్రువుల్.

కాలవిలాసవక్రగతి కల్పిత దుఃఖశతంబు బిందు లీ
లాలఘిమాప్తి నూఱుచుఁ గొలందికిమీఱఁ గడంగుచుండు కీ
లాలముకంటె పేరలుఁగులున్ బ్రవహిల్లక పిక్కటిల్లినం
బ్రేలిపెటీలనన్ హృదయ భిత్తిక లొక్కట ముక్కలౌఁగదే !

ఏవిధి నెట్టి వంత ఘటియిల్లఁగఁ జేసిన నిన్ను దిట్టబో
నోవిధి, యొక్కసారి నయనోష్ణజలంబుల భాగ్యమిమ్ము; చాల్ !
త్రావుదుఁ బూసికొందు దిశలంబడఁ జిమ్ముదు భూమిఁ జల్లుదు
న్నావెతలెల్ల చెల్లెనని నమ్ముదు నందుల నీఁదులాడుదున్.

ననునొకపెద్దసేసి, భువనవ్యసనాళికి నెల్ల రాజుగా
నొనరుప నింతశోక మహిమోన్నతిఁ గూర్చితిఁగాదె; యింక రా
జునుబ్రకటింప నశ్రుజలశోభన పట్టమహాభిషేకముం
బొనరుపవేల? హాలవిధి, మూర్తము మించిన పున్నెమబ్బునే!

ఘోరవిషాద మెస్డఃన క్రూరవిధిన్ ఘటియిల్లెనేని, హృ
ద్ద్వారము సర్వముం దొలఁగి స్వస్థత కల్గఁగ వేఁడివేఁడి క
న్నీరు కపోలపాళి పయినింబడి పొర్లుచుఁ బాఱునట్లుగా
పారము ముట్ట నేడ్వఁగలవార లదెంత తపంబొనర్చిరో!.

వెలికిలఁబండి,దృష్టి గృహాంభిత్తిక నొక్కట నిల్పి, యెట్టిసం
చలనములేక దుస్సహవిషాదములం గణియించుచుండఁగన్
గొలుకులజాఱి కర్ణములకుం డిగునీరు తలాపి నింకఁగా
వలవల మెల్ల నేడ్వఁ గలవార లదెంతతపం బొనర్చిరో!.

హా! యని యాత్మదుఃఖముల నావలఁ ద్రోయఁగఁ జాలువారు, "ను
స్సూ" యని శోకభార మెటనో పడనూఁదెడువారు, రాగముల్
దీయుచు ఖేదమెల్ల పదిదిక్కులఁ గల్పెడువారు, బాష్పముల్
పాయక చక్క నేడ్వఁగలవారు నదెంతతపం బొనర్చిరో!.

కనుఁగవ నశ్రుగోళములు గ్రక్కునఁ జిప్పిలువేళ తెప్పలం
గననగుబాగుఁ, జెక్కులుడిగంగఁ గవోష్ణతరంగమిచ్చు స్ప
ర్శనసుఖ, మక్కునందుబడి చల్లఁగఁ దాపము నార్చుసొంపునుఁ
బనుపడునట్టు లేడ్వఁగలవార లదెంతతపం బొనర్చిరో!.

పటుతరవేదనానల వివర్ధిత దాహసుతప్తబిందు వొ
క్కటియయినం జగంబులను గల్గినవస్తుల దేనిమీఁదనేన్
దటుకునఁబడ్డ, నద్దిశతథా కణమ్మురై దరికొంచు సర్వమున్
జటిలతఁ గాల్చునంచునొకొ! నల్వ, యొసంగవునాకు నశ్రువుల్!. [కకట
వ్యసనసామ్రాజ్యచక్ర ధూర్వహణదక్షు, పటుతమాభేద్య హృదయభాస్వరున
తగదు తగదంచు మానె విధాతనాకు, స్వల్పమగునార్తి కర్హమౌ నశ్రుకణము.

నవనాగరిక గ్రామజీవనము

పాలపర్తి ఆంజనేయులు గారు

౧

మాది గుడివాడతాలూకా ఏవూరు. వాళ్లు ఎప్పుడో య్యాభైయేండ్ల క్రిందట పొలాలు గొడ్డు గోదా లోకుల పాల్జేసి కరిణీకాలు కాలపన్ని పాటిమీద బూర్లె మూకుడు బోర్లపడ్డాని బస్తీకెక్కారు. అప్పటివాళ్లకు కలెక్టరు ఆఫీసన్నా తాలూకా ఆఫీసన్నా మాతాపితృస్థానాల్లో ఉండేవి. చెయ్యెత్తి దండంపెట్టేవారు. కాని మావాళ్లు యింకా కొంతమంది మా గ్రామంలోనే ఉన్నారు. వాళ్లను చూద్దామని వెళ్లాను. వెళ్లిందాక బులపాటుగా ఉందిగాని వెళ్లిన తర్వాత నీళ్లలోనుండి బయటపడ్డ చేపలాగ ఏంతోచక కొట్టుకున్నానంటే నమ్మండి. ఆవూళ్లో క్లబ్బు లేదు. బల్లలు కుర్చీలుమాట చెప్పేదేమిటి! న్యూస్‌పేపర్లు అసలే లేవు. మాట్లాడేవాళ్లు లేరు. వాళ్లను మనము పల్లెటూళ్ల గబ్బిలాయలంటే వాళ్లు నన్నూ నా వెఱ్ఱిముఖాన్నిచూచి బస్తీగబ్బిలాయి అనుకొన్నారేమో అనిపించింది. ఇది బస్తీజీవిత రహస్యము.

ఒకనాడు సాయంత్రం ఏంతోచక హేండుస్టిక్కు పుచ్చుకొని కాలవగట్టున షికారుబయలుదేరాను. తుమ్మెలులో ప్రొద్దుకుంకుతూన్నది. ఆకాశాన వ్యాపించిన కెంజాయ ఆకుల సందులోనుంచి చూస్తూంటె ఆవెనక ఏవైన పూరికొంపలుముట్టుకొని భగభగామండిపోతున్నాయేమో అనిపించింది. కళ్లకనిపించే దృశ్యంపంటల్లాగున్నా ఒంటికి మాత్రం చల్లనిపిల్లవాయువులు తాకుతూంటె అన్యాయత్తమైన చిత్తంతో నడుస్తున్నా. ఆపరధ్యానంలోనే ఒకసారి తలయెత్తిచూస్తె కొంచెందూరంలో ఒకముసలాయన గట్టుమీద కూర్చొని ఉన్నాడు. ముఖం కొంచెం ముడతలు పడ్డది. తల, మీసాలు పూర్తిగా నెరిసి సబ్బుపూసినట్టున్నది. వయస్సు అరవైదాటి డెభైయ్యోపడిలో పడ్డట్టున్నది. ముఖానికి చెయ్యి అడ్డంపెట్టుకొని నావైపు పరకాయించి చూస్తున్నాడు. నేనూ ఆయన్నిసమీపించా. అల్లాగే తలయెత్తి

“ఏవూరుమీది” అన్నాడు.

“మాది బందరూ”

“మీ ఇంటి పేరేం?”

“మా ఇంటిపేరు ఏవూరివారు”


“రామయ్యగారి కొమాళ్లా”

“అవును”

“ఇల్లా ఎక్కడికి వెళ్లుతున్నారూ?”

“షికారువెళ్లుతున్నాను”

“కాసేపుకూర్చోండి” అన్నాడు ముసలాయన.



“పోనీ పెద్దవాడు కూర్చోమన్నాడు గదా అని నేనూ కూర్చున్నా.”

పోనీ పెద్దవాడు కూర్చోమన్నాడు గదా అని నేనూ కూర్చున్నా. ఆయన ధరించినవి నీరకావిపట్టిన ముతకకద్దరుధోవతులు అయినా, మాటసవ్వడిబట్టి చూస్తే కూపస్థమండూకంలాంటి సంసారి కాదనిపించింది. నేనూ క్రిందనుండి మీద్దాక పుట్టమట్టిరంగు కద్దరుకట్టుకున్నా. ఆయన తేరిపారచూచి “మీరు నాన్‌కోపరేషన్ వాళ్లా” అన్నాడు.

"అవునూ. మీరు అట్లాగే కనిపిస్తున్నారే"

"మాదేంవుంది పల్లెటూళ్ల వాళ్లం. మాముసలావిడ వడికిననూలు ఉంటే నేయించికట్టుకొన్నాగాని మాకేం బస్తీ షోకులున్నాయా"

"పెద్దవాళ్లు మీమాట ఏలా ఉన్నా; బస్తీలో ఉండే షాపులు, కాఫీహోటల్సు, కాలేజీలు, కోర్టులు అన్నీ మీరు లేకపోతే ఊడ పీక్కొని పోవల్సిందే" అన్నాను నేను. "అవును బాబు, అవును. అదంతా నాకనుభవము అయినదే. ఏదో మాటవరుసన అట్లా అన్నాను గాని యీగాంధిమహాత్ముడే యేపదేండ్లకిందటనో వచ్చినట్లయితే నాగతి యిల్లా ఉండేదికాదు" అని మిక్కిలి దీనంగా విచారంగా అన్నాడు. నాకు ఆశ్చర్యమూ వేసింది, జాలీకలిగింది. ఇంతవఱకూ ఆయన యెవరో నాకు తెలియదు. అందుచేత

"మీ పేరేమి?" అన్నాను.

"నాపేరు వెంకట్రామయ్య"

"ఓహో! మీరా! నేను గుర్తుపట్టలేకపోయినా అప్పుడప్పుడు మిమ్మిలను చూచి ఉంటాను. మానాయన గారు ఉండగా మీరు యెప్పుడైన మాయింటికి వచ్చేవారు. కాని నేను అప్పుడు చిన్నవాణ్ణి. మీ రూపే మారిపోయింది."

"మీనాయన గారు నేను చిన్నప్పుడు ఆడుకుండే వాళ్లం. కొంచెం యించుమించుగా ఒకటే యీడువాళ్లం. మీనాయనగారు పోయి చాలా కాలమైందనుకుంటాను."

"ఆ అయింది పది పన్నెండేళ్లు. మీ పేరు ప్రఖ్యాతివింటు ఉండేవాణ్ణేగాని. ఇటీవల ఎప్పుడూ చూడలే. చూచినా ఫలానా అని యెఱుగను. మీ పెద్దవాయి ఇంగ్లండేమో వెళ్లాడని.................."

"చిన్నకుఱ్ఱవాడితోపాటే వీడూ అనుకున్నాము దణ్ణంపెట్టాము. అప్పుడు నేను చాల యిబ్బందుల్లో ఉన్నాను. సొమ్ముపంపడానికి లేకపోయింది. పైగా వాడు అక్కడ దేన్నో చేసుకొన్నాడట. దాన్ని వదిలించుకోడానికి సాధ్యంకాలేదు. అది యిక్కడికిరానన్నది. ఏపదివేలో యిస్తేగాని విడాకులు పుట్టవు ఇప్పుడు నాదగ్గర యెక్కడ ఉన్నాయి?"

"ఏమోలేండి, దైవఘటన యేలా వుంటో ఆలాగు జరుగుతుంది. అదంతాతెలుచుకొని విచారపడి మనము చేసేదిమాత్రం యేమి వుంది."

"అదంతా మరిచేపోయినాము. అదంతా ఒక చిత్రకథ. ఏదో కృష్ణా,రామా,అనుకొంటూ ఉన్నాము. ఇదే బాగుంది. సౌఖ్యానికి, ఐశ్వర్యానికి మితం యేమి వుంది. లేని పోని పోకిళ్లుపోతే నామోస్తరుగానే బోర్లపడ్తారు. మావాళ్లకు ఇప్పట్లో తెలివివచ్చేటట్లు కనుపించదు."

"ఏదైనా కొంత అనుభవం అయితేగాని ఎవరికైనా తెల్సిరాదు. చూసి నేర్చుకోవడం సాధారణముగా తటస్థించదు."

"చదువులూ ఉద్యోగాలకోసం ఊళ్లేగటం యిక్కడ పొలాలుబీళ్లు పడడం. ఇదేగా పరియవసానం."

"మీకు అనుభవం వుంది గనుక అల్లా అన్నారు. మేమే ఆమాట అంటే బ్రాహ్మలు ఉద్యోగాలు తమకే ఉండాల్ని అట్లా అంటున్నారంటారు. మాబ్రాహ్మలు కూడా బి. ఏ. పట్టాలు, పంచాంగం కట్టలు పట్టుకొని యిళ్లిళ్లు, ఊరూరు తిరుగుతున్నారు. పూటకూలికి,రైలు ఖర్చుకు ఏంలేక పెళ్లాం మెళ్లోపుస్తెకూడా తాకట్టు పెట్టున్నారు. ఇంత అనుభవం అయినా డిగ్రీలగోల వదల్లా"

"అందఱు అందలం ఎక్కాలంటె మోసేదెవరండి. మీవాళ్లమాట ఆలా ఉంచండి. మావాళ్లో?

"చదువుకుంటే తప్పేమి ఉందిలేండి."

"అదికాదు మావాడు ఒకసారి బస్తీకి ఎక్కిన తర్వాత మళ్లీ పొలం మొఖం చూస్తాడా? నిజంగా నా పాపం నేను చేతులార చేసుకుందే. నాపిల్లకాయలు పొలానికివెళ్లితే నామూషి అనుకున్నా. పొమ్మనేవాణ్ణే కాదు. వాళ్లను వ్యవసాయంలోనే దింపినట్లయితే నాకీ పరపంచ ఉండాల్సినగతి పట్టేదికాదు. కాని నాపూర్వ

స్థితికంటె యిదే బాగుంది. నేను నావ్యవహారాల్లో తిరిగేటప్పుడు తిన్నచోట పడుకోటంలేదు. పడుకున్న చోట తినటంలేదు. ఎప్పుడు ఒకటేయావ. ఇహంపరం మంచి చెడ్డ విచారణ లేనేలేదు. ఎవరికున్న చారెడు చెక్కా వాళ్లుదున్నుకొని జీవనంచేయడంకంటెయీరోజులులో మంచి పని మరొకటి లేదని నా అనుభవంవల్ల నాకు తెల్సివచ్చింది. అందుకు నాజీవితమే సాక్షి. ఇప్పుడు చాలా చీకటిపడ్డదీ. ఇక లేద్దాము" అని ఆయన లేచాడు.

"ఇప్పుడు నాయకుల దృష్టికూడా సిద్ధాంతరూపములో గ్రామాలమీదికే మళ్లింది. కాని క్రియలోకి వచ్చేటప్పటికి చాల కాలము పట్టుంది". అంటూ నేనూ లేచి ఇద్దరము మాట్లాడుకుంటూ యింటికి వచ్చాము.

నాకు ఆయనతో పరిచయం కలగడం ఆవూళ్లో పెన్నిధి దొరికినట్టున్నది. రోజూ ఆయనదగ్గరకు వెళ్లేవాడిని. ఆయన జీవితచరిత్రంతా నాతో చెప్పాడు. అదంతా వినదగ్గది తెల్సుకోదగ్గదిగా ఉంది. కీడులో మేలుంది; మేలులో కీడుంది.

౨

మాగ్రామంలో దాదాపుగా రైతాంగమంతా కమ్మవారె. వెంకట్రామయ్యకు తండ్రిచని పోయేప్పటికి పెండ్లిపేరంటం అంతాచేసి ఇరవై యెకరాల పొలం యిచ్చిపోయినాడు. ఆయన బ్రతికి ఉన్నరోజులలో గొప్ప ఆస్తిపరుడుకాకపోయినా గ్రామపెద్దలలో ఒకడుగా ఉండి పేరు ప్రతిష్ఠసంపాదించుకొన్నాడు. వెంకట్రామయ్యకష్టపడి పనిచేసెవాడూ, తెలివి తేటలు కలవాడూ గనుక ఆస్తిని అభివృద్ధిచేశాడు. అతనిభార్య కూడా పొదుపరియైన యిల్లాలే. వెంకట్రామయ్యకి మొదటినుండి పెద్ద ఆస్తిసంపాదించాల్ని పదిమందిలో పేరుగడించాల్ని బాగా ఉండేది. ఆస్తి డబ్బు ఉంటేగాని రాణించదనుకున్నాడు. పండిన గింజలు నిలవబోసి మంచి ధరవస్తేగాని అమ్మేవాడుకాడు. నెమ్మది నెమ్మదిగా కొంచెం డబ్బుచేరిందాక నాలుగ జతలయెడ్లు. బండ్లు, పాలేళ్లు అట్టహాసం అంతా పెంచాడు. పొరుగూరి బ్రాహ్మలవి ఉద్యోగస్తులవి పొలాలుకవులుకి పుచ్చుకొన్నాడు. వ్యవసాయం బాగా జోరుగాసాగించాడు. వూళ్లోమాలాళ్లకి పాతికపరక పెట్టుబడిపెట్టి వాళ్లను లోబరుచుకున్నాడు. ముంజేత ఊడ్పు ఊడ్చి బాగా పండిస్తున్నాడు. గ్రామంలో బాగా పలుకుబడి యేర్పడ్డది.

3

గ్రామంలో అతని కారువాళ్లలో పెద్ద పిన్న వచ్చినా మాట్లాడగల శక్తిగలవాడు, కావలసిన సప్లయిలు వగైరాలు చేయగలవాడు అతను ఒక్కడే కనుపిస్తున్నాడు. తాసిల్దారువచ్చినా, డిప్టి కలెక్టరువచ్చినా ముందు వెంకట్రామయ్యకు కబురుపంపించ వల్సిందే. ఈ ప్రకారంగా గ్రామంలోనే కాకుండా ఉద్యోగస్తులలోకూడా పలుకుబడి సంపాదించాడు.

పలుకుబడి తోబాటు పరపతికూడా హెచ్చింది. అందుచేత ఊళ్లో యెవరిపొలం అమ్మవచ్చినా అతను కొనవలసిందే. అతను కొనదలచుకొన్నాడూ అంటే ఆవూళ్లో యింకొకడు ధరపెట్టడు. ఏధరకైన అతనికి అమ్మవలసిందేగాని తప్పించుకొని పోవడానికి వీలులేదు.

క్రమక్రమంగా అంగబలం, అర్థబలం, అధికారబలం అన్ని యేర్పడ్డాయి. ఏమిచేసినా సాగివస్తున్నది. దానితో ఆశ దురాశ అయింది. ఆవూళ్లో ఒకపేద బ్రాహ్మడు ఉన్నాడు. ఆయనకు అయిదెకరాలచేను ఉంది. ఎవరో మాలవాళ్లు ఆచేనుచేస్తున్నారు. ఆచేనుకు ప్రత్యేకముబోదెలేదుగాని అనుశ్రుతంగా ప్రక్కచేనుపైనుండి నీళ్లుపెట్టుకొని సాగుచేస్తుండేవాళ్లు. అప్రక్కచేను కోమట్లది. అది వెంకట్రామయ్య కవులుకి పుచ్చుకొన్నాడు. నాటినుండి బ్రాహ్మలచేను సాగుకావడం గండంగానే ఉంది. వెంకట్రామయ్య చేనుమీదనుండి నీళ్లుపెట్టుకోనివ్వడం మానివేశాడు. ఎప్పుడో ఊడ్పులన్నీ అయిపోయి ములకవస్తే వాళ్లచేలోకి వదిలేవాడు. అప్పుడు లేతఊడ్పు ఊడ్చినా పండేదేకాదు. మాలవాళ్లుసాగుచేయడం వదిలేశారు ఎవళ్లూసాగుచేసేవాళ్లె కనుపించలె. వెంకట్రామయ్యనే ఆ బ్రాహ్మలుకూడా

బ్రతిమాలుకున్నారు. ఒక సంవత్సరం పాలికి పుచ్చుకున్నాడు. పొలంతాను పుచ్చుకున్నా లేత ఊడ్పే ఊడ్చాడు. పంటకోత కోసి గింజలు రాలకొట్టాడు. బటాబటేలుగ రెండుపుట్లు అయినా అన్నాడు. తన సగం తాను తీసికొన్నాడు. తాలుబెడ్డ అంతకలిపి బ్రాహ్మలకు కొల్చాడు. ఆధాన్యం అమ్మితే వాళ్లకు శిస్తు డబ్బులు తేల్లా. అంతటితో వాళ్లు పొలం బేరంపెట్టారు. 'వవుడేసిబీడుపడ్డ భూమి యెవరు కొంటా' రన్నారు ఊళ్లోవాళ్లు. అందఱూ "ఏదో వెంకట్రామయ్యగారినే బ్రతిమాలుకోండీ. ఏదో ధరచేసి పుచ్చుకొంటాడు" అన్నారు. "బోదెలేని పొలంనేనేంచేసుకో"నన్నాడు. వెంకట్రామయ్య. చివరకు బ్రతిమాలంగా అయిదువందల రూపాయలకు పుచ్చుకొన్నాడు అయిదెకరాలూ. నాటి నుండి అయిదెకరాలు అయిదుపుట్లు పండుతున్నాయి.

౪

పైనచెప్పిన విధంగాకుండా మరొకవిధంగాకూడా పొలాలు సంపాదించడం మొదలుపెట్టాడు. వెంకట్రామయ్య పొలంప్రక్కనే ఒక ఉద్యోగస్థుడి భూమి ఉంది. ఆయనకు బెజవాడతాలూకా కచ్చేరిలో గుమాస్తాపని. చేను ఎవరో రయితులు సాగుచేస్తున్నారు. వెంకట్రామయ్య ప్రతియేడు గట్టువిరిచి అతరాపు గుమాస్తాచేలోకి వేస్తున్నాడు. పొలంచేసే రయితులు అప్పుడప్పుడు మారడం వెంకట్రామయ్యకు యింక యెక్కువ వీలైంది. ఒక సంవత్సరం పొలంకట్టుబడికి యివ్వడానికి గ్రామంలోనికి గుమాస్తా సీతారామయ్యవెళ్లితే రైతులు "మీపొలం తగ్గిపోయింది. మామూలుకట్టుబడి ఇవ్వము" అన్నారు. కరణాన్ని బ్రతిమాలుకొని పొలంకొలిపించుకొన్నాడు. దాదాపు డెభ్భైసెంట్లదాకా తరుగు కనిపించింది. ఎట్లా తగ్గిందని కరణాన్ని అడిగితే ఏంచెప్పాడు కాదు అతనుకూడా. తాలూకా గుమాస్తాయేమో జరిగిన సంగతి గ్రహించాడు. తన పొలం అతరాపు పొలాలు కొలిపించవలసిందని తహసీల్దారుకు అర్జీపెట్టుకొన్నాడు. ఎన్నాళ్లకు ఎండార్సుమెంటే లేదు. స్వయంగా గుడివాడ వెళ్లి తోటిగుమాస్తాలను అడిగాడు. "ఈతాలూకా ఆఫీసులో నీకు ఎండార్సుమెంటు పుట్టనేపుట్టదు. మాకు వెంకట్రామయ్య చౌదరీగారే తహసిల్దారు మమ్మన్ని చంపక నీవువెళ్లవయ్యా" అన్నారు గుమాస్తాలు. చివరకుకోర్టులో వ్యాజ్యంవేశాడు. రెండుమూడేళ్లు వాయిదాల్లో మచ్చమాళింది. తీరావిచారణకు వచ్చేటప్పటికి సాక్షులు ఎవరుకనిపించలేదు. కరణం చెప్పనన్నాడు. ఇదివరలో సాగుచేసిన రైతులు చెప్పనన్నారు. వెంకట్రామయ్యకు ఊరంతా సాక్షులే. కరణాన్నికూడా తన తరఫున సాక్ష్యం చెప్పమన్నాడు వెంకట్రామయ్య. కాని కరణం ఒప్పుకోలే. తనపొలం మొదటినుండి అంతే ఉన్నదని, 20 సంవత్సరాలనుంచి అగట్లు అలాగే ఉన్నాయని వెంకట్రామయ్యసాక్ష్యంచెప్పించాడు. కోర్టువారు కేసు కొట్టేశారు.

పొలంపోతే పోయిందనుకుంటె అసలు శీతారామయ్య ఉద్యోగానికే మోసంవచ్చింది. తనంత వాడిపై వ్యాజ్యంవేశాడని ఇతన్ని వెంకట్రామయ్య ఒకకంటితో కనిపెట్టే ఉన్నాడు. ఇల్లా ఉండగా బెజవాడకు నరసింహశాస్త్రిగారు డిస్ట్రిక్టకలెక్టరుగ వచ్చారు. ఈయన వెంకట్రామయ్యకు చాలా పరిచయం. ఈసమయం చూచి ఎవరిచేతనో గుమాస్తా సీతారామయ్య తీరువ దరఖాస్తుల్లో లంచంపుచ్చుకొన్నాడని అర్జీపెట్టించాడు. అదిక్రమంగా డిస్ట్రిక్టకలెక్టరు దగ్గిరికి డిస్పోజలుకు రావడంతెలుసుకొని ఆయన్ని చూట్టానికి వెళ్లినట్టు వెళ్లాడు.

డి. క.—ఏం, చౌదరీగారు దయచేయండి. ఎప్పుడొచ్చారు? అంత కుశలమా? మొన్న మీరు పంపిన నెయ్యి చాల బాగున్నదండి. ఎక్కడున్నా మీ సప్లయిలు మాకు తప్పవు.

చౌదరి—కోర్టుపని ఉండి వచ్చి మిమ్ములను చూచిపోదామని యిల్లా వచ్చాను. మా రైతుల ప్రాణాలన్నీ మీ చేతుల్లో ఉంటాయి గదండీ.

డి. క.—ఏమిటయ్యా, నీవుకూడ అట్లా మాట్లాడుతావు. ఈజిల్లా రైతాంగంలో నీకంటె ఎక్కువ పలుకుబడిగల రైతు ఎవరయ్యా? నీకు పరిచయం గాని ఉద్యోగస్తు డెవ డున్నాడు.

చౌదరి—సరే! మంచిమాటే చెప్పారు. ఉద్యోగస్థులతో ఎట్లాగైనా పడవచ్చు. ఏదో మంచి చెడ్డ చెప్పుకోవచ్చు. గుమాస్తాలతో బొత్తిగ పడలేకుండా ఉన్నామండి.

డి. క.—అవునయ్యా! అవె కంప్లెంట్లు వస్తున్నాయి. మా తాలూకా ఆఫీసులో గుమాస్తా సీతారామయ్య అనే అతను నీటితీరువ దరఖాస్తుల్లో రైతులను యేడిపించుక తింటున్నాడట. తహసిల్దారు విచారణ చేసి రిపోర్టు పంపాడు. ఏంచేయనా, అని ఆలోచిస్తున్నా. ఉద్యోగం తీసేస్తే యేడుస్తారు. చేసెపనులు యీలా ఉంటాయి.

చౌదరీ—ఆయనమాటె చెప్పారు బాబో,చాలా అసాధ్యుడు. నన్నే నానాతిప్పలు పెట్టాడు. నామీద అన్యాయంగా వ్యాజ్యంవేసి బోలెడుడబ్బు ఖర్చు పెట్టించాడు. ఇటువంటి గుమాస్తాల చేతుల్లో మేము బ్రతుకగలమా. ఇంక మీబోటివారుండబట్టి యీలా ఉంది గాని.

డి. క.—నిన్నే అల్లాచేసినవాడు చిన్న రైతులను వదిలిపెట్టాడా! ఆరునెలలు సస్పెండు చేస్తాను.

చౌదరి—ఇంక మీరు కనికరంగానే చూచారు. మీరు మా గుడివాడ డివిజనుకు రావాలండి.

డి. క.—కానీ వస్తాంలే.

చౌదరీ—రావాలనె మాకోరిక. ఇక సెలవు పుచ్చుకుంటాను.

డి. క.—మంచిది.

"గుమాస్తాగాడి మచ్చమాసింది. ఇక కరణంగాడు ఒకడున్నాడు. వీడు మనతో కలసకుండా ఉన్నాడు. వీడికికూడ బుద్ధిచెప్పాలి. దానికి ఒకటేమార్గం ఉంది. అది చేసి తీరాల్సిందె" అని ఏమేమో ఆలోచిస్తూ రైలు కుపచ్చాడు.

ఆ సాయంత్రం గుడివాడచేరాడు. మఱునాడుదయము తహసిల్దారు తమ గ్రామం మకాంఅనివిన్నాడు. తత్క్షణం యింటికి బయలుదేరివచ్చాడు. ఆ రాత్రి మాలవాళ్ల చేత పోరంబోకలోని తుమ్మచెట్టు కొట్టించాడు. ఆదుంగలుతెప్పించి కరణంగారి గడ్డివామిదొడ్లో పడేయించే యేర్పాటుచేశాడు.

మఱునాడు ఉదయాన్నే తహశీల్దారు గారు వచ్చారు. పొలాలుతనిఖీకివెళ్లి పోరంబోకలోతుమ్మచెట్టు కొట్టి ఉండడం చూచాడు. "ఎవరయ్యా ఇది కొట్టింది" అని కరణాన్ని అడిగాడు.

"అయ్యా తెలియదండి. నేనూ ఇప్పుడె చూస్తున్నాను" అన్నాడు కరణం.

వెంకట్రామయ్య కొత్తగ మేడకట్టించాడు. అది రోడ్డుకూ కాలవకూ కూడలిలో ఉంది. సాధారణంగా యే ఉద్యోగస్థుడు వచ్చినా ఆమేడలోనే మకాం. సప్లయి అంతా వెంకట్రామయ్యదే. తహసీల్దారు నాయుడుగా రగుటచేత వెంకట్రామయ్యగారి యింట్లోనే భోంచేశారు. భోజనానంతరము కులాసాగా తాంబూలము వేసుకొనె సమయంలో "తుమ్మచెట్టు దుంగలు కరణంగారి వామిదొడ్లో ఉన్నాయని ఎవరో పిల్లలంటున్నా" రని నెమ్మదిగా వెంకట్రామయ్య అంటించాడు. తహసిల్దారుగారికి వెంటనే పట్టరాని కోపం వచ్చింది. వెంటనే బంట్రోతుని పిలిచి ఆ తుమ్మ మొద్దులు పట్టించుకొని కరణాన్ని వెంటతీసుకొని రమ్మన్నాడు.

తుమ్మమొద్దులూ, కరణంగారూ హాజరయినారు.

తహ—ఏమయ్యా, గవర్నమెంటు నౌకరువై యుండి ఇటువంటి దొంగపనులుచేసి పైగా నిర్భయంగా అబద్ధాలు ఆడ్తావ్. మాడు నిన్ను డిస్‌మిస్ చేస్తాను. నీకేం బుద్ధిలేదూ.

కరణంగారు చేతులు నలుపుకుంటూ "అధికార్లు నేచెప్పేదికూడా చిత్తగించాలి. నే నేపాపపుణ్యాం ఎఱుగను. ఎవరో నాకు ద్రోహంచేయాల్ని అల్లాచేశారు. మీరు ఆగ్రహిస్తె మేము బ్రతకజాలం"అన్నాడు. "నిన్ను చూస్తె యీవూళ్లోవాళ్లకు గిట్టదా! ఎందుకుచేస్తారుద్రోహం. నీవు చెప్పేమాటలు నమ్మటానికి వీల్లేకుండా

ఉన్నాయి. నిన్న నాలుగు నెలలు సస్పెండుచేశాను." కరణం ఎంతమొత్తుకున్నా లాభంలేకపోయింది. ఈప్ర



"నిన్న నాలుగునెలలు సస్పెండుచేశాను."

కారంగా వెంకట్రామయ్యచేసే ద్రోహాలు అంతులేకుండా ఉన్నాయి.

౫

అధికార్ల ప్రాపకము దొరికిన తర్వాత పదోదాల కేంతక్కువా. ఇపుడు వెంకట్రామయ్య చౌదరీగారు తాలూకాబోర్డు ప్రెసిడెంటు జిల్లాబోర్డుమెంబరు. అన్ని వ్యవహారాల్లో ఆయనపేరు మోగిపోతున్నది. స్వసంఘం లోకూడా ఆయన నాయకుడుగానే ఉన్నాడు. పది మంది పెద్దమనుష్యులు వస్తూపోతుంటారని ఇప్పుడు మేడ కూడా కట్టించాడుగదా!

వెంకట్రామయ్యచౌదరీగారికి ఒకకూతురు ఇద్దరు కొడుకులూ. పెద్దవాడు స్కూలుఫైనలుదాకా చదివి మానేశాడు. రెండోకుఱ్ఱాడు నాల్గోఫారము చదువుతున్నాడు. కొమార్తెకు పదివేలు కట్నంయిచ్చి గుంటూరుజిల్లానుండి పెద్దసంబంధంతెచ్చి వివాహం ఇరవై వేలు ఖర్చుచేసి చేశాడు.

వెంకట్రామయ్య చౌదరీగారికి యిప్పుడు సుమారు యాభై ఏండ్లు ఉంటాయి. ఇద్దరు కొడుకులూ, కాపరం చేసే కూతురూ, పెద్దమేడా, వంద ఎకరాలమాగాణీ సిరిసంపదతో తులతూగుచున్నాడు. 'ఆయనకేం పట్టిందల్లా బంగారమవుతున్నది. దశవెళ్లబోస్తున్నాడు" అని వూళ్లో అమ్మలక్కలు చెప్పుకుంటున్నారు.

వెంకట్రామయ్యగారి యిల్లు ఒకసత్రమే. కాలవలకు రోడ్లకు కూడలిగా ఉందేమో ఎపుడువచ్చే ఉద్యోగస్తులు. పొయ్యే ఉద్యోగస్తులు, ఎపుడు టీకాఫీ పాలు కాగుతూ ఉండడమే. ఉద్యోగస్తులకు మేడమీద మకాం. క్రింద వెంకట్రామయ్యగారి స్వంత ఆఫీసూ. అక్కడ రోజూ బేరాలుసారాలు, ఇచ్చుకోడం పుచ్చుకోడం టంకసాల మోగుతుంటుంది.

౬

చౌదరీగారి పెద్దకొడుకు స్కూలు ఫైనలుపాసవు వచ్చేటప్పటికే స్కూలు పాఠాలు, పరీక్షలు, మార్కులు, రావడం పోవడం యిదంతా నాన్సెన్సు అనిపించింది. అంతటితో ఇంగ్లీషు ఇంప్రూవ్ చేసి ఫారిన్ యూనివర్సిటీలకు వెళ్లుదామని రేనాల్డ్సు నావెల్సు కొనుక్కొని యింటికి వెళ్లిపోయినాడు.

చదువు అబ్బినా అబ్బకపోయినా బస్తీపోకులు మాత్రము పూర్తిగ అబ్బినాయి. ఇతను మేడమీద ఒక గదిలో ఉంటాడు. ఆగదిలో ఒకవైపున పందిరి దోమతెరతో సహా ఒకకాంపుకాటు ఉన్నది. ఒక వైపున రోజ్ ఉడ్ టేబిల్, దానికి సెంటర్న రివాల్వింగు లుకింగు గ్లాసు. దానికి రెండువైపుల బుక్ షెల్ ఫ్సు ఉన్నాయి. ఆషెల్ ఫ్సుమీద రేనాల్డు నావెల్సు, ఆంధ్రప్రచారణీవారి అపరాధపరిశోధకనవలలుగలవు. ఇంక టాయిలెట్ సామానులుహేజలైన్ స్నో సెంట్సుకొన్నిగలవు. సిజరు సిగరెట్ల పెట్టెలు ఒకడజను విడిగా ఉన్నాయి. ఛెయర్సుకూడా కొన్ని ఉన్నాయి. అతనిపేరు కేశవాంయ్ చౌదరీ మనిషి కొంచెము పొడుగుగ చామనచాయగా నాజూకుగా ఉం

టాడు. బంగాళాక్రాపు. సుమారు ఇరవై సంవత్సరాల వయస్సు.

ఊళ్లో పిల్లలికి యితను ఆదర్శపురుషుడు. చదువుకు గుడివాడదాకా వెళ్లివచ్చిన పిల్లలు యిద్దరు ముగ్గురు యితనిచుట్టూ చేరుకుంటూరు నలుగురుచేరి కాఫీలుతాగడం, చీట్లపేకలాడడం సిగరెట్లు పీల్చడంతో దినచర్య పూర్తి అవుతుంది. వెంకట్రామయ్యగారు సాధారణంగా ఊళ్లో ఉండడం తటస్థించదు. వ్యవహారాలమీద బందరో, బెజవాడో గుడివాడో పోతుంటాడు. ఇంటివద్దబోలెడు వ్యవహారం ఉన్నా మనకేశవరాయ్ చౌదరీ అదేమి అంటించుకోడు. ఇల్లు మొఖంమొత్తితే ఏబందరో బెజవాడో వెళ్లుతాడు. ఇదేం యిల్లాచేస్తున్నావు అనే వాళ్లులేరు. ఈయన ఆధునికనవనాగరికగ్రామ సీమ యువకుడూ.

౩

వెంకట్రామయ్యగారి రెండవ కొడుకు బందర్లో 5 వ ఫారము చదువుతున్నాడు. మెడ్రాస్ హోటల్లో భోజనంచేస్తున్నాడు. అప్పటికి కమ్మహాస్టల్ మొదలయినవిలేవు. ఎవరయినా తడిసిగాని గుడిసె కట్టరు. ఆకారణంచేత పిల్లవాడు స్వయంరాజా స్వయం మంత్రిలాగ సంచరిస్తూ నాటకాలూ, కాఫీహోటల్సూ, సిగరేట్లు షోకుల్లోపడ్డాడు. దీనితో క్రమక్రమంగా ఆరోగ్యం చెడ్డది. 'బ్రతికివుంటె అన్నంలేకపోతుందా చదువులేకపోతేమానె' అని తండ్రి చదువుమాన్పించాడు. బందరులోనే కొంతకాలం మందు యిప్పించాడు. లాభకారికాలేదు. ఇంటికి తీసికొనివెళ్లి నాటువైద్యులను పిలిపించి మందులు యిప్పించాడు. చికిత్సచేసిన కొలది రోగం పెరుగుదల్లోనే ఉందికాని తగ్గుదలచూపలే. తర్వాత ఒళ్లు నీరుచూపి ఒకనెలరోజులు అవస్థపడి పాపము! ఇపిల్లవాడు గతించాడు.

౪

పుత్రవియోగము దుఃఖకారణమైనను ఆకస్మికముగా తటస్థించినదికాదు గనుక వెంకట్రామయ్య నాలుపనిధోరణిలోనే ఉన్నాడు. అసమయములో గుడివాడలో ఒకరైసుమిల్లు కట్టిస్తున్నాడు. ఈహడావుడిలో దుఃఖము మరిచిపోయినాడు. ఆత్మపరిశోధన కలగనేలేదు. ఈమిల్లు పూర్తి అయ్యేటప్పటికి యెంతలేదన్నా యాభైవేలు అయ్యింది. మిల్లు ఓపెన్‌చేసిన రోజున సమారాధనలు సంతర్పణాలు జోరుగా జరిగాయి. ఆసందర్భములో ఉద్యోగస్థులకు జరిగిన టీపార్టీ వైభవము చెన్నపట్నం బాంక్వెటు హాలునుమించి పోయిందన్నమాట. జిల్లాలో మూలమూలలవున్న ఉద్యోగస్తులూ దొరలూదొరసానులూ అంతాదగారు. స్పెన్సరు అండుకోవారుకూడా హాజరైనారు. నల్లదొరలకు మెడ్రాసుకుప్ప సప్లయి. ఆరోజున నాటకాలు, యింకా రసికులకుమేళాలు మొదలయినవన్నీ యేర్పాటుకాబడినాయి. అనుకున్నవి అనుకున్నట్టుగా అన్ని జరిగిపోయినాయి. అందఱు వెంకట్రామయ్యగారిని స్తోత్రపాఠంచేశారు.

తదనుకూలంగానే ధాన్యం బేరంకూడా బాగా సాగింది. చౌదరీగారి మిల్లుకువెళ్లితే సొమ్ము వెంటనే చేతిలోపడుతుందనేవాడుక కలిగింది. స్వగ్రామంలోనే కాక గుడివాడ బెజవాడలోకూడా కమిషన్‌కొట్టుపెట్టి ఖాయిదావర్తకం సాగించాడు.

౫

ఈవిధంగా అవిచ్ఛిన్నంగా అద్వితీయంగా బండి నడిచిపోతూంటే వెనక్కు తిరిగిచూచుకోవడంగాని, ముందు సంగతి విచారించుకోవలసిన అవసరంగాని యేంవుంది? ఆయన్నిపొగడేవాళ్లేగాని ఆక్షేపించేవాళ్లు ఒక్కరూ లేరు. అందరు సెబాష్ అంటె సెబాష్. వెంకట్రామయ్యచౌదరీగారి మాటచెలామణీ అయినట్లు కరెన్సీనోట్లు కూడ చెలామణికావడంలే. శరవేగంగా ఉడాయించే గుఱ్ఱం ఆగమన్నా ఆగుతుందా? పొదలు, కంచెలు అడ్డం వచ్చినా ఎగిరిదూకి వెళ్లిపోతుందిగాని. గౌరవమునకా లోటులేదూ. కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు కుర్చీలు యిస్తున్నారూ. పలుకుబడా తక్కువలేదూ. ధనం ప్రవాహంవలె ప్రవహిస్తున్నదీ. అడిగితే లేదనేవాడు

లేదూ. మరల అడిగేవాడులేడూ. ఇక ఆయనకేం లోటున్నది?

ఒకనాడు రైసుమిల్లు ఆఫీసులో ఉండగా టెలిగ్రాంవచ్చింది. వాళ్లకువర్తకరీత్యా టెలిగ్రాములు రోజూవస్తూంటాయి గనుక మనవెంకట్రామయ్య ఆయన గాభరాపడలేదు. దాన్నివిప్పిచూస్తే యిలా ఉంది.

బొంబాయి.

"నేను రేపు కోహినూరు స్టీమర్లో ఇంగ్లాండువెళ్లుచున్నాను. అచ్చట చేరగానే తెలియజేస్తాను. సొమ్ముపంపవలెను. ఉత్తరమువల్ల అన్ని సంగతులు తెలియగలవు......రాయ్."

కొంచెం సేపు వెంకట్రామయ్యనిర్విణ్ణుడై పోయినాడు.



"కొంచెంసేపు వెంకట్రామయ్య నిర్విణ్ణుడైపోయినాడు."

మరల తెలివితెచ్చుకొని శాంతంగఆలోచించాడు. ఇది ఒకందుకు మంచిదే ననుకొన్నాడు. వెంకట్రామయ్య చౌదరీగారి కొడుకు ఇంగ్లాండు వెళ్లాడన్నా గొప్పబర్జాగా ఉంటుం దనుకున్నాడు. తనగొప్పకు గౌరవానికి వన్నెతెస్తుందని వెంకట్రామయ్య సరిపెట్టుకొని సంతోషించాడుకాని తల్లిమాత్రం ఉన్నఒక్క కొడుకూ కళ్లయెదుట లేకుండా పోయినాడని కంటికి నేలకు ఏకధారగా యేడ్చింది పాపము!

౧౦

కాలచక్రపరిభ్రమణంలో సుఖదుఃఖాలు, కలిమిలేములు, శీతోష్ణాలు కావడికుండల్లాగ ఒకటివెంట ఒకటి వస్తుంటాయి. ఓడలు బండ్లు బండ్లు ఓడలవుతుంటాయి. గుఱ్ఱమెక్కేవాడే పడతాడు. కాలాన్ని అదృష్టాన్ని శాసించాల్ని ఎంతకోరిక ఉన్నా మనము శాసించలేంగదా. చావు కబురు చల్లగా చెబుతున్నారంటారేమో నిజమే. ఏంచెయ్యం. వ్యాజ్యాలు సాజ్యాలు, అప్పులు సొప్పులు వెంకట్రామయ్యను ఒక్కసారి చుట్టేశినాయి. బందరు సబ్కోర్టులో వెంకట్రామయ్య చౌదరీగారిమీద ఒకవారసత్వపుదావా దాఖలు అయింది. ఒక విడో తాలూకు 20 ఎకరాలభూమి ఆమెకు తెలిసినంతవరకు వారసులు యెవరులేక పోవడంచేత ఆమెను ముప్పతిప్పలుపెట్టి క్రయం వ్రాయించుకున్నాడు. పదేండ్లు అయింది. ఆమె యీమధ్య చచ్చిపోంగానె వారసులూ వంశవృక్షాలూ బయలుదేరినాయి. దావా దాఖలు అయింది.

వెంకట్రామయ్య తన తెలివి పలుకుబడి, డబ్బు అంతా ఉపయోగించాడు దావా తనపక్షంకావడానికి. పెద్దచేతులె పెట్టాడు ప్లీడర్లగా. సాక్షులు దస్తావేజులు సమకూర్చాడు. విశ్వామిత్రసృష్టి చేయగలిగినంతవఱకు చేశాడు, తడిమన్ను పొడిమన్ను అయ్యేటట్టు కోర్టుచుట్టూ ప్లీడర్లచుట్టూ తిరిగాడు. వ్యాజ్యపర్యవసానం యెట్లా ఉన్నా యీవెధవముండ వ్యాజ్యంతో అతనికికూడా వైధవ్యంపట్టేటట్టుగాఉంది.

ఈదావా ప్రారంభం అయిన రెండేళ్లనుండి చేరసారాలు ఉడిగాయి. పైరుపంటలు సన్నగిల్లినాయి. అతను చూస్తూ ఉన్నప్పుడే ఎక్కడేం జరుగుతున్నదో తెలియకుండా ఉండేది. బోలెడు కామాటంపెరిగిపోయింది. ఏదో మేకపోతు గభీరంగా యీడ్చుకొస్తుంటె

ఆభండారంకాస్తా బయటపడ్డది. నౌకర్లు గుమాస్తాలు ఇష్టమువచ్చినట్లు సంచరించటం మొదలుపెట్టారు. దీపం ఉండగానె చక్కబెట్టుకోడంవాళ్లకుమాత్రం తెలియదూ!

ఇదివఱకు యజమానికొఱకు ఇతర్లను ద్రోహం చేసేవాళ్లు ఇప్పుడాయన పాతం ఆయనకే ఒప్పచెప్పటం మొదలు పెట్టారు.

కష్టాలన్నీ కట్టకట్టుకొనివచ్చాయి. ధాన్యం ధర తగ్గిపోయింది. బ్యాంకు వాయిదా అయిపోయింది. వాళ్లు సొమ్మకులగాలగీయడం మొదలుపెట్టారు బస్తాకు పావలా మొదలు అర్ధరూపాయిదాక నష్టము కనబడుతున్నది. కోస్తాబేరము అసలే లేదు. ధర పెరిగే సూచనలే లేవు. ధాన్యం అమ్మకతప్పిందికాదు. నిలవబోసిన లక్షబస్తామీద మొత్తం ముప్పైవేలన్నా నష్టం వచ్చింది. బ్యాంకు ముప్పు ఎట్లాగో వదిలించుకున్నా మార్వాడీల బాధతప్పిందికాదు. వాళ్లు ఎట్లాపసిపట్టారో పట్టారు. బెజవాడనుంచి అంత వచ్చివాలారు. ఇది ఈలా ఉండగా కోర్టులో దానావాదులపక్షమయి పొలం అప్పగించటమేగాకుండా పది సంవత్సరముల ఫలసాయంక్రిందా ఖర్చులక్రిందాపది హేను వేలు డిక్రీ అయింది. వాళ్లు ఫాక్టరీకి జప్తువారంటు పట్టుకొచ్చారు. వెంకట్రామయ్యకు ఏంచేయటానికి తోచలే. ఇంతలో ఒక ఋణస్థుడు కోర్టులో వెంకట్రామయ్యచౌదరీగారిని ఇన్‌సాల్వెంటుగా డిక్లేరుచేయమని పిటీషన్ పెట్టాడు.

వెంకట్రామయ్య నిలువున కుంగిపోయినాడు. నట్టేట్లోపుట్టి మునిగినట్లయింది. కొంప నాలుగు వైపుల ఒక్కసారి ముట్టుకున్నది. దావానలం చుట్టేసింది. ప్రాణం తెప్పరించుకొంటానికి అవకాశము చిక్కలేదు. దారి మధ్య పాము కఱచినట్లు, మొదలు నరికినచెట్టులాగు పడిపోయినాడు మనిషి. ప్రాణత్యాగం చేసుకుంటాడేమో అని భయమేసింది. తలుపు తెరచి నలుగురు మొఖంచూడ లేకపోయినాడు.

కోర్టువారి హుకుంప్రకారము యావదాస్తి అప్పజెప్పినాడు. ఇది సాహుకారు దివాలాకాదు. అంత స్థిరాస్తిగాని చరాస్తిలేదు దాచుకుంటానికి.

దురాశ దుఃఖంచేటు పరపీడనం ప్రాణసంకటం. వెంకట్రామయ్యకుయిదియొక గొడ్డలిప్రేటు. నిన్న మొన్నటిదాక మహదైశ్వర్యముతో తులదూగుచున్న మనిషి నేడు కాసు గవ్వలకు టికాణాలేక కట్టుపస్త్రాలతో కదిలిపోవలసివచ్చింది కాని ఆ ఐశ్వర్యము ఆవశకేవలము పొంగు. కాల్పనికము. కృత్రిమం. ఇది ఒక స్వప్నంలాగ వెంకట్రామయ్యకు కనిపించినా చేసిన దుష్కర్మలన్నీ కాలసర్పములాగ కనిపించకపోలే. తనకు వచ్చిన విపత్తుకు ఎవరిని నిందించటానికి అవకాశము కనిపించలే. అతని చరిత్ర అతనికి స్ఫురణకువచ్చింది. స్వీయచరిత్ర తరిచి చూచుకొన్న కొలది మనస్సుకు విశ్రామస్థానము కనిపించలేదు. అనంత పాపాఘాతంలోనికి దిగిపోతున్నాడు. జడ్జిమెంటుడే (విచారణదినము) వచ్చింది. అచ్చట అతనే జడ్జి, అతనె ఫిర్యాది, అతనే ముద్దాయి, అతనే సాక్షి. మరెవ్వరు లేరు సర్వము అతనే. ప్రళయకాల ఝంఝామారుతమువలె మహోగ్రమగు తుపాను ఒకటి అతని మానసకుహరమునవీచుచున్నది. దుష్కర్మములన్ని చిన్నవి పెద్దవి ఒకటె తర్వాత ఒకటిసాక్ష్యమిస్తున్నాయి. "బీదబ్రాహ్మణునిపొలమునకు నీరు ఎక్కకుండాచేసి అమ్మించింది ఎవరు? నేనే. పొలాలుగదుముకొని తప్పుడు సాక్ష్యాలు పలికించింది ఎవరు? నేనే. ఉద్యోగాలు తీసేంచింది ఎవరు? నేనే. అనాథస్త్రీ ఆస్తి అక్రమంగా అమ్మించింది ఎవరు? నేనే. అధికారుల ప్రాపకము సంపాదించుటకు లంచములు పెట్టింది ఎవరు? నేనే." అని అతనిమస్తిష్కమునుండి వెడలు ప్రశ్నపరంపరకు తండోపతండములుగ "నేనే, నేనే" అని సాక్ష్యమిచ్చుటకు హృదయకవాటము తెరచుకొని బహిర్గతమగుచున్న పాపసందోహముచే అతనిగుండె బ్రద్దలై పోతున్నది. ఈ ఆలోచనలతో అతని శిరము పెటపెటలాడి వ్రక్కలై పోతున్నది. చేతులతో నదిమినను వస్త్రముతో బిగించినను నిలుచునట్లు లేదు. నిశితపాపతూణీరములు అతనిహృదయకుహరమున గ్రుచ్చుకొనుచున్నాయి. పాపదావాగ్నిలో దగ్ధమై పోతున్నాడు. ఈమహావిపత్సముద్రమున నీదులాడునప్పుడు పాపచింతలు దుష్కర్మములు తప్ప వేరొండు వెంట వచ్చుటలేదు. వద్దన్నను, దూరముగ దరిమివేసినను అవి

అతనివెంటనంటి వాని హృదయతాపమును వేమడుంగులు రెచ్చగొట్టుచున్నవి. దారపుత్రాదులు, బంధుమిత్రులు నిస్సహాయులైనారు. అతను ధనము కోరుటలేదు. భూములు కోరుటలేదు. ఇండ్లు వాకిళ్లు వాంఛించుటలేదు. మనశ్శాంతి కావాలె. అదిమానసికవ్యథ. ఆత్మపరితాపము. చేత్తోతీసివేసేదా! మాటల్తో ఓదార్చేదా!

పుటము పెట్టనిది బంగారు నిజస్వరూపం ఎట్లు విశదముగాదో అటులనే కలుషపూరిత మానవుడు పశ్చాత్తాపాగ్నిచే పరితప్తముకానిది ఆత్మనిజస్వరూపము గాంచజాలడు. వెంకట్రామయ్య తీవ్రపరితాపాగ్నిలో పరితప్తమైపోయినాడు. దైవనిర్ణీతమైన శిక్ష ననుభవించుటకు కృతనిశ్చయుడైనాడు. "నాపాపఫలము నేనే అనుభవించెదగాక" అని అన్నపానీయములు మాని ఉపవాసవ్రతము సల్పినాడు.



"నా పాపఫలము నేనే అనుభవించెదగాక."

౧౨

ఏషాస్య పరమాగతి రేషాస్య పరమాసమ్పు,
దేషోస్య పరమో లోక ఏషోస్య పరమ ఆనందః.


పశ్చాత్తాపాగ్నియందు వెంకట్రమయ్య పాపసంచయం భస్మమైపోయింది. ఆత్మజ్ఞానము పొందినవాడు పరమాత్మను పొంది శాశ్వతానందం పొందజూచుట సహజమేకదా. వెంకట్రామయ్య నేడుభగవన్నామామృతము గ్రోలుచున్నాడు. భగవన్నామసంకీర్తనాతత్పరుడై,

"పరమానందముగోరు పరబ్రహ్మ భజన నింపారు
మనసా.
పరమభక్తులగోష్ఠిని జేరు పాయనిసత్యనిరతుడవై
వేమారు.
................................"

అని గానముచేయుచున్నాడు.

వెంకట్రామయ్య సినతండ్రి కొడుకు నరసయ్య సచ్ఛీలుడు, ధర్మబుద్ధిగలవాడు. మంచి ఆస్తిపరుడు, నిర్ధనుడైన వెంకట్రామయ్యను అతను చేరదీసి పోషించుచున్నాడు. వెంకట్రామయ్య పెద్దవయస్సువచ్చినవాడగుటచే కాయకష్టము చేయలేకపోయినప్పటికిని నరసయ్య గృహకృత్యములందు సహాయపడుచు కాలము గడుపుచుండెను.

మాబస్తీల్లోకూడా వెంకట్రామయ్యను బోలు పరపీడనానంద నిమగ్నులు, నిరంతర ధనలక్ష్మీసేవా ధురంధరులు, నిరంకుశాధికారాభిలాషులు, కపటనాటక సూత్రధారులు, గోముఖవ్యాఘ్రుము లెందరో గలరు. అధర్మవర్తనులై ఎంతకాలము మనగలరు. 'ధర్మమేవ జయతే' సర్వేజనాస్సుఖినోభవంతు.



3. చిట్‌పాణి లోయలో ప్రాతఃకాలము

ఇది ఉత్తరహిందూస్థానములో నివసను.

ఉమర్ ఖయామ్ చిత్రము



పొలుపుగ మాటనేర్చినవి పూఁగని కుండలు రెండువేలు లో
పల నొకమూలనుండి యిటు పల్కె నసం గని "కుంభకారులఁ
బిలిచినవారు, మమ్ముఁ బురవీధుల నమ్మినవార లేరి? యే
తలమున కేఁగినారలు? పదంతి యదేనియు విన్నఁ జెల్పుమా".

—పానశాల.

కమ్మరీఁడు

పండిత పెనుమెచ్చ సత్యనారాయణరాజు గారు

కటకట ! కమ్మరీఁడ !! యిటు క్రమ్మరఁ గొల్మిని నూఁదియూఁది బల్
చటులత నిప్పుగొల్పి కడు సాహసవృత్తినిగాఁచి యిన్ము; నీ
పటుతర బాహుపాండితి నవారణ మారణయంత్రసంచయం
బిటుల సృజింతె రేఁగఁగ నహీనభయంకర ఘోరయుద్ధముల్.

బొగ్గులుకొల్మిలోఁ బ్రోవిడియూఁదుచో; నెగయు పొగలు నింగి నేలఁగవియఁ
బొగయాఱి జిగిదేఱి భగభగమండుచో; నగ్నిచ్ఛటల్ దెస లలమికొనఁగ
సమ్మెటప్రేటులు పమ్ముచోఁ జెదరెడు; మిణుఁగుల్ కనులు మిఱుమిట్లుగొలుపఁ
గరఁచుచుఁ జఱచుచుఁ గడువడిఁ గమ్ముచో; నరులెడందల నడునడునడంకఁ
గ్రమ్మఁ జెమ్మటల్ మేన నక్తందివంబు నమ్ము లీఁటెలు తరవరు లాయసమున
నేమిటికిఁ జేయుచుంటివి యిట్టివీఁక, గడమపడకుండఁ జెప్పుమో కమ్మరీఁడ!

తొలుదొల్త దేవతల్ పొలదిండి మూఁకలున్; ఘోరంబుగాఁ బోరఁ గొన్నినాళ్లు
తరువాత శ్రీరామదశకంఠసైన్యముల్; ఘోరంబుగాఁ బోరఁ గొన్నినాళ్లు
పదపడి కౌరవ పాండవవాహినుల్; ఘోరంబుగాఁ బోరఁ గొన్నినాళ్లు
మొనమొన్న జర్మనుల్ ఘను లింగిలీషువార్; ఘోరంబుగాఁ బోరఁ గొన్నినాళ్లు
ప్రాచ్యపాశ్చాత్య దేశముల్ పాడువాఱె; దుర్భరాఘోరదుర్భిక్షఁ దోఁగితోఁగి
యొక్కపెట్టున నల్లాడి యుంటకకట! కావొకో నీవు కర్తవు కమ్మరీఁడ!

చెంగుము సాహసింపకుము సేయఁగఁబూనిన నెన్నొ యెన్నొ ని
ర్భంగములై సుభిక్ష నిడు ఫాలలవిత్రములాది సాధనా
లంగుగనుండె; వాని నగు నంగద యేరికిలేదు; గాన నీ
వింగ సృజింపఁ బూనుమవి; పృథ్వియు శాంతిలు శస్త్రమార్జకా!

ఇంకఁగాలే దదే హిమశైలభూభాగ; పతితదేవాసుర ప్రతతి రక్త
మారఁగా లేదదే శ్రీరామరావణా; హవరుధిరాభిషిక్తవసుమతియుఁ
బోవఁగాలేదవే పొలయానుగృధ్రముల్; శివకాకముల్ కురుక్షేత్రభూమిఁ
దొలఁగఁగాలేదవే వలపోయుభారత; సుందరీమణుల మునుంగు లకట!

యిట్టి భీభత్సరంగమ్ము లిన్నియున్నఁ; దలను బైకెత్తి చూడవు తలఁకఁబోవు
ప్రజల సంక్షోభమున కేమి భయముఁ బడవు; కటికిరాయొకో నీగుండె కమ్మరీఁడ!

మానుమమాను మింక ఘనమారణయంత్రము లేల చేయఁగన్
మానుగఁ గర్షకోపకర ణమ్ములఁ జేయుము నీతిబాహ్యమా
మానవ లోకమంతకును మక్కువ గూర్పుము గానిపించునీ
మానితనూత్నమార్గ మిది మాయురెయంచు నుతింత్రుధీవరుల్.

యుద్ధకళావిదగ్ధులగు యోధులు నవ్విన నవ్వని మ్మనం
బద్ధముగాఁ దలంచి యిది పావనభారతదేశమెంతయున్
వృద్ధి నిబద్ధిగాఁ గను సమృద్ధిగఁ బండుట క్షేత్రరాజముల్
బుద్ధమహర్షి సూత్రముల పూర్వ వికాసము నొందు దీనిచే.

ఓహరి సాహరిం బగర యుద్ధములం దెగటార్ప నాయుధాల్
సాహసవృత్తి నీవు మఱి సల్పక మానితి వేని నాఁచికో
లూహలె యెల్లడన్ బ్రబలి యుద్ధతు లీ భరతావనిన్ గడున్
మోహముతోడఁ గొందురని మోహమునొందకు శస్త్రమార్జకా!

తాత్పర్యంబున శాంతి సుస్థిరముగా ధాత్రిన్ దగన్ నిల్పఁగా
హృత్పద్మంబునఁ గోరి నీవు మఱి యీదృగ్ఘోర శస్త్రాదులన్
సత్పణ్యార్థివి యాచు మాని తవియేన్ సంయార్థులున్ బ్రీతి నీ
పత్పంకేజము లాశ్రయించెదరు కోపాటోపశూన్యాత్ములై.

ఆఱునే క్రోధాగ్ని యతిశాంతి రసపూర; జలదాళివర్షధారలను గాక
చెదరునే పరిపంథి జీమూత సంఘంబు; లతిశాంతి వాయుసంహతిని గాక
కూలునే యీర్ష్యాప్రకుంభినీజమ్ములు; తతశాంతి పరశుఘాతములఁ గాక
సమయునే లుబ్ధాహి జాలంబు ఘనతర; శాంతి గారుడమంత్రసమితిఁ గాక
పోవునే యహంకారప్రభూతమద్ది; "శాంతిభేతాళభర్జనసరణిఁ గాక
దూరమిది యోజనము చేసి తొలఁగవయ్య స్వీయప్రాక్తనకార్మికవృత్తి నింక

శాంతిపూనినీవు సరగ నీఘోరాతి ఘోరకర్మము లనుగొడవ లుడిగి
(?) విడిచిపుచ్చి నీదు విద్య మెఱయఁ జేయవయ్యరైతు చేవ దేర.

ఏనాఁడు రైతులందఱు నీనాఁశెపు పరికరముల నిక్కపుబుద్ధిన్
బూనెదరొ నాఁడె పృథ్వి యనూనవికాసమ్మునొందు నూతనశక్తిన్.

ఎపుడుకొడవండ్లు తొల్లిక లినుపకఱ్ఱు లాదిగాఁగలపనిముట్టు లాదరమున
నీవు సేయుదొ యావేళ నీ ప్రపంచ మధికశాంతిని బడసెడి నలర జనము.

ఫలభారమునఁ జేసి తలవాంచి వినయంబు చాటెడుశాలి సస్యమ్ముతోడ
గలకలనవ్వుచు నిలువెల్లఁబువ్వులఁ బరఁగెడు నలనువ్వుపైరుతోడఁ
బ్రతిపర్వముననుండి యతిరుచ్యరసపూరములుగాఱు పుండ్రేక్షు కులముతోడఁ
గ్రొంగ్రొత్తఫలములు గుత్తుగుత్తులుగాఁగ నలరారు ద్రాక్షాలతాళితోడ
సకలసస్యాఢ్యయై భూమి జరగునాఁడు నిన్నుఁదలపోసి కేల్మోడ్చి నిఖిలజనము
కలఁతలను మాటతలఁపక క్రాలుఁగానఁ బరఁగఁజేయుము కర్షకోపకరణముల.

ఎపుడు యుద్ధేచ్ఛయుడుగునో యీజనంబు కపుడ తొల్లింటి ఋషికాల మరుగుదెంచు
దాన సర్వంసహాదేవి సంతసించి స్వస్తివచనంబు వలుకుఁ బ్రశస్తమతిని.

అనువుగ ఓంశాంతిఃశాం తిన్ జనుపలుకు వినఁబడఁ దెల్లముగాఁగన్
జనములు పాఁడియుఁ బంటయు ఘనముగ; మనెదరు త్వదీయఘనతఁ బొగడుచున్.

ఏమనుచుంటివోయి! యిక నీదృశకృత్యము లాచరింపఁగాఁ
బోము; యటంచునా! భళిరె పుణ్యచరిత్ర! నమోనమోస్తు తే
యేమరుపాటనేని మఱి యెక్కడ నొక్కఁడు యుద్ధ మిద్ధరన్
ఏమియు నాచరింపకయ యీశ్వరు సత్కృపగల్గి వెల్గుతన్

సురచిరకంఢివస్త్రపరిశోభిత దివ్య తనూవిలాసినీ!
నిరుపమదీప్యమానమణినిర్భరపర్వతమండల స్తనీ!!
కరములు మోడ్చి మ్రొక్కెదము కావుము. కావుము. విష్ణుభార్య మా
చరణయుగాళితాఁకుడును సైఁచి యపారకృపా రసాత్మ వై.

కథకుడి కష్టాలు

మునిమాణిక్యం నరసింహారావు గారు, బి.ఎ., యల్.టి.

"శాస్త్రిగారూ మీరు ఆ భవభూతినీ కాళిదాసునూ చదివిందే చదివిందే ఎన్నిసార్లు చదువుతారండీ? ఆధునిక వాఙ్మయం చూడరేం వాఙ్మయ ప్రవాహం వర్తమానకాలంలో చిత్రగతులలో ప్రవహిస్తున్నది. అదిగమనించరేం"

"అల్లాగా ఏమిటోయి ఆధునికవాఙ్మయంలో ఉండే చిత్రవిషయము"

"నూతనత్వము"

"నూతనత్వమా? అంటే?"

"అంటే ఏమిటో మీకొకమాటలో చెప్పటం కష్టం. ఉన్న విషయం ఏమిటంటే భాష విషయంలోను భావం విషయంలోను మార్పు వస్తున్నది. నూతనత్వం బయలుదేరుతున్నది. ఆధునిక వాఙ్మయము నూతనత్వంతోడి కళకళలాడుతూ జీవకళలతో పొంగిపోతున్నది. త్రుప్పుపట్టిన ప్రాచీనవిషయాలను వదిలేస్తున్నాం."

"వదిలేస్తున్నాం అని అంటావు. నీవు గూడా కవి అయినావా?"

"కవిని గాదు లెండి. అదే మోస్తరు. పత్రికలకు వ్యాసాలు, కథలు వ్రాస్తున్నాను."

అవును, భారతి అనే పత్రికచూచాను.

"అదేనండి అట్టి పత్రికలలోనే నేనూ వ్రాస్తుంటాను.

అయితే అబ్బాయి నీవు వ్రాసిన కథ ఒకటి వినిపించు చూస్తాను"

"శాస్త్రిగారూ, ఇప్పటి కాలంలో బొడ్డూడని ప్రతివాడూ కథ వ్రాయటం మొదలు పెట్టాడు. కాని నిజమైన కథ వ్రాయటం చాలాకష్టం సుమండీ."

"ఏమిటోయి కష్టాలు?"

"అడిగారు కాబట్టి చెబుతాను. నేనే ఉన్నాననుకోండి. ఒక కథ వ్రాయాలంటే ఎన్నో విషయములు ఆలోచించాలి. వ్రాయటంలో ప్రాచీన పద్ధతులను వదలివేసి నూతన విషయాలను చొప్పించాలి. పురాణయుగంలో "అనంగ అనంగ ఒక రాజు ఆ రాజుకు ఏడుగురు కుమాళ్లు, వారందరు ఒకరోజు వేట కెళ్లారు. ఒక అడవిలో వారికి అతి చక్కని సుందరి కనుపించింది" అని వ్రాయటం ఆచారం, కొంత కాలమైనతరువాత పూటకూళ్ల పేదరాలు కథలలో ప్రవేశించింది. ఎవరో ఒకడు ఆమె ఇంటికి వచ్చి "పెద్దమ్మా పెద్దమ్మా ఈ వూళ్లో విశేషాలు ఏమి అని అడగటం ఆమె ఆ వూరి రాజుగారి కూతుర్ని గురించిచెప్పటం" అట్లాకథ నడపటం ఆచారం అయింది. పూటకూళ్ల పెద్దమ్మ కథకంతా సూత్రంగా ఉండేది. ఇప్పటి కాలంలో అల్లా కథ ఆరంభిస్తే నవ్వుతారు."

"ఎందుచేతనోయి?"

"అందులో నూతనత్వం ఏది. మాటవరుసకు చూడండి పూర్వము కృష్ణుని గానాన్ని గురించి మురళీగానం అనేవాళ్లు, కొంతకాల మైన తరువాత వేణుగానం అన్నారు. ఇప్పుడు అల్లా అంటె అంతా నవ్విపోరూ?

"మరి ఏమనాలోయి?"

"బొంగువాయిద్యం అనాలండి. ఇల్లా అనడంవల్ల అర్థం చెడకుండా సౌలభ్యం, మాధుర్యం నూతనత్వం కుదిరినవి."

"అల్లాగా. ఇప్పుడు కొంచెం అర్థం అయింది నూతనత్వం అంటే ఏమిటో. ఇది వదిలేసి నీ కథ విషయం ఏదో చెబుతానన్నావు చెప్పవూ?"

"ఇంతకూ చెప్పవచ్చేదేమిటంటే కథ నూతన ఫక్కీలో ప్రారంభించాలని. నేను ఆ విషయాలన్నీ ఆలోచించి తూచి చివరకు ఇట్లా కథ మొదలుపెట్టాను. [ఆమె మొదట ఆయనను మామిడిచెట్టుక్రింద నుంచుని చూసింది.]

"ఆగవోయి. ఇదేమిటోయి ఎవరు ఆమె? ఆమె పేరేమి? ఏవూరు ఆమెది? ఇవన్నీ చెప్పకుండా నామరూపాలు లేకుండా కథారంభం ఏమిటి?"

"చూశారా మీరు అడిగిన ప్రశ్నలన్నీ వస్తవి. వాటికి జబాబు కోసం పాఠకులు కథను కొసా చదువుతారు. ఆ విధంగా కథ పూర్తిగా చదువవలెననే ఉత్సాహం పుట్టిస్తున్నాను. కథారచనా చమత్కృతులలో ఇది యొకటి. అయితే నా కథానాయికకు ఏమి పేరు పెడదామని మహాబాధపడ్డాను. ఆధునిక కథకులలో వేలూరు శివరామశాస్త్రి గారు వ్యక్తులను పేర్లు పెట్టటంలో అసమానప్రజ్ఞ సంపాదించారు. ఎవరూ వినని పేరు ఒకటి ఆయన సృష్టించగలడు.

నేను అటువంటి పేరు ఒకటి అడిగి పుచ్చుకొందామనుకొన్నా గాని మళ్లీ ఇంకో ఆలోచన వచ్చి మానేశాను. నాయకికి సావిత్రి అనే పేరు పెట్టాను."

"సావిత్రి. పాత పేరేనే. నూతనత్వం ఏది?"

"పేరు పాతదైతే నేమండీ, పాతపేర్లే పెట్టి వాళ్లకు కొత్త వ్యక్తిత్వము కల్పించటంలో పోతున్నది. Old wine put in new bottles అనే సిద్ధాంతాన్ని ఆచరణలోకి పెట్టాను."

"బాగుంది. కథపేరు గూడా సావిత్రి అనే పెట్టినావా?"

"ఎబ్బే! అల్లా పెట్టలేదండీ. కథకు ఇంకా నామకరణం చేయలేదు. ఆ విషయంలో శివుడుగారిని అడగాలె. ఆయనదగ్గర కొఱవి దయ్యము, దొరసాని దుఃఖము, దయ్యాల కొంప, అనే చక్కని పేర్లు కొన్ని ఉన్నవి. అందులో ఒకపేరు అడిగి పుచ్చుకొంటా. ఏదో విధంగా ఆ గండం గడుస్తుంది. కాని కథావస్తువు విషయమే చెడ్డకష్టం వస్తుంది."

"ఏమిటి కష్టమోయి?"

"అదే కష్టమండి శాస్త్రిగారూ. నే పడ్డ కష్టాలు చూడండి! కథావస్తువుగా దేనిని గ్రహించాలా అని. ఒక వెధవముండ పెండ్లి తీసుకొందామని ఒక ఆలోచన వచ్చింది."

"ఛీ అదేమిటోయి. వెధవముండ పెండ్లి కథావస్తువ."

"మీకు కష్టంగా ఉందా. వెధవముండ పెండ్లి అయినా దీర్ఘసుమంగళీభవ అని పేరు పెడితో ఆదోషం పోతుంది. ఒకాయన కుమారుడికి నాగడు అని పేరు పెట్టాడట. అందరూ చీవాట్లు వేశారు ఆయనని. ఇదేంపేరు వెధవ పేరు వాడు రేపు స్కూలుకు వెడితే అంతా నవ్వరా అని. అప్పుడొకాయన క్రాపింగు పెట్టండి ఆ పాతపేరు పెట్టిన దోషం పోతుంది అన్నాడట. అల్లాగే వెధవముండ పెండ్లి కథావస్తువుగా గ్రహించినా పేరు పెట్టటంలో ఆ దోషం పోగొట్టవచ్చు. కాని అదొకటి దొరుకుతున్నది!"

"అదేమిటి అల్లా అంటావు పెండ్లిచేయటానికి వెధవముండ దొరకలేదు?"

"సరే. ఏ వెధవముండను తీసికొని ఇంత ఇంటిదాన్ని చేసి చేరెడు పసుపూ, చేరెడు కుంకుమా, ఒక చీరా ఇద్దామా అని పరకాయించి చూస్తే ఎవ్వరు కనిపించలేదు. ఎందుచేత ననగా వెధవముండలందరికి శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రిగారు కొద్దిరోజుల క్రిందనే వివాహం చేశారు. ఇంక ఒక్కతే మిగిలింది. ఆ ఒక్క అమ్మాయికి మొన్ననే సుమంగళీభవ అని వివాహం జరిగింది."

"పోనీ మొగాళ్ల వివాహం చేయరాదు"

"పోనీ మొగాళ్లకు ఎవరికైనా వివాహం చేసి కథ నడుపుదామా అంటే మా భావమరిది పెండ్లి అయిపోయిందా! కలెక్టరుగారి అబ్బాయికి వివాహం అయింది, చింతలపూడి వారి సంభావన అయిపోయింది."

"అల్లాగా మళ్లీ వివాహం కథావస్తువుగా తీసుకుంటే నూతనత్వం పోతుందన్నమాట. ఆహా బోధపడ్డది. అప్పుడేమి చేశావు?"

"ఏం జేసేదండి. మనుష్యవర్గం మానేసి జంతువర్గంలోకి పోయినా. జంతువును తీసికొని వాటిచేత మాట్లాడించి కిప్లింగులాగ కథ నడుపుదామంటే గొప్ప యిబ్బంది వచ్చింది."

"నీ ఇబ్బందులన్న విచిత్రంగా ఉన్నవి. ఇప్పుడు వచ్చిన ఇబ్బంది ఏమిటి?"

"చూడండి. ఉన్న జంతువులలోకల్లా కుక్కలూ, పిల్లులూ, తాలూకా గుమస్తాలలాగ కాస్త గౌరవంగా బతుకుతున్నవి. అయితే ఇందులో కుక్కలన్నీ శివుడుగారి దగ్గరున్నవి. పిల్లుల నన్నింటినీ చింతా దీక్షితులుగారు కాజేశారు. ఇక దున్నపోతూ గాడిదా మిగిలినవి."

"అవా నీ కథకు వస్తువు."

"ఎం జేసేది? నాకు విచారం వేసింది. పోని వాటిపైనే కథ వ్రాద్దామంటే అవీ అను

పించలేదు. గౌతమీచరిత్రలాగ ఒక గాడిద స్వీయచరిత్ర వ్రాద్దామంటే ఒక్క గాడిదైనా ఒక్క దున్నపోతైనా కనుపించందే! ఏమా చిత్రం అని పరకాయించి చూస్తే, స్కూలు మాస్టర్ల నిమిషనిమిషానికీ గాడిద, దున్న పోతూ అంటం వినిపించింది. ఇంక మన కెట్లా వస్తవి. అవి వాళ్ల సొత్తు. నిస్పృహ చెందాను. చూశారా శాస్త్రిగారూ నిజంగా మంచికథ వ్రాయాలంటే ఎన్ని కష్టాలున్నవో. ఇవన్నీ ఏం తెలుస్తయి ఇతరులకు. కథ వ్రాస్తే అది బాగుండలేదు, కథకు ఉండాలిసిన లక్షణాలు లేవు, టెక్నిక్ లేదు అని ఆక్షేపిస్తారు."

బోధ పడుతున్నదోయి. అపుడేమి చేశావు."

"పోని అని పక్షివర్గం లోకి వెళ్లానండి. ఏదైనా ఒక పక్షిని తీసికొని దాని చేత మాట్లాడించి నీతిపాఠం చెబుదామని"

"అయితే మరిచిపోయినా నీవు వ్రాసే కథలకు నీతి ఉంటుందా."

"అయ్యో ఉండేటట్టు చేస్తానండి. గుంటూరులో ఉండే భావనాచార్లుగారు లోకంలో ఉండే నీతులను అన్నీ క్రోడీకరించి సంక్షేపించి పది ముఖ్యనీతుల క్రింద తేల్చారు. నా కథకు అందులో ఏది తీసుకొన్నా సరిపోతుంది."

"సరే. సరే. పక్షులను మాట్లాడిద్దామనుకున్నావు. ఏమయింది"

"విన్నారా, సరే మంచి ఆలోచన వచ్చిందని ఇటు చూద్దును గదా ఒక్క పక్షీ లేదు."

"ఏమయినవి?"

"కోయిలలు చిలుకలు పార్వతీశకవుల దగ్గరున్నవి. ఇంకేముంది. ఇక గుడ్లగూబ మిగిలింది. దాన్ని చూస్తేనే నాకు భయం. అయినా తప్పనిసరి గదా దాని దగ్గరకు పోదునుగదా అది దేవులపల్లి వారి సంస్థానంలో ఆస్థాన కవిగా ప్రవేశించిందట. ఇక నాతో అది మాట్లాడుతుందా."

"చివరకు ఏమీ తోచక ఆంగ్లకవిలాగ చీపురుకట్ట పైన కథ వ్రాద్దామనుకొనేసరికి గురిజాడ అప్పారావుగారి పూటకూళ్లమ్మ వెంటబడ్డది చూశారా శాస్త్రిగారూ కథకుడి కష్టాలు ఇవి ఎవ్వరు గమనించరు. ఇంకేమి వ్రాసేది చెప్పండి. గంగిరెద్దు మీద వ్రాద్దేమంటే అడివి బాపిరాజుగారికి కోపం వస్తుంది. చిమ్మట మీద వ్రాద్దామంటే వేదుల ఆయనకు కోపమాయె ?

"అప్పుడేమి చేశావు. గొప్ప అవస్థే."

"నూతనత్వంకోసం పడ్డ పాట్లండి ఇవి. అప్పుడు తీవ్రంగా ఆలోచించగా ఆలోచించగా ఒక్క విషయం తట్టింది. అపుడొక క్రొత్తవ్యక్తిని సృష్టించినాను."

"అంటే పైన చెప్పిన స్త్రీ కాకుండా, వెధవ ముండ కాకుండా, కుక్క కాకుండా, ఉండే ఒక నూతన వ్యక్తి అన్నమాట"

సరిగ్గా అంతే. అది యొక వ్యక్తి. అది చూపులకు మనిషే. కాని మనిషి కాదు. దున్నపోతుగాదు. గుడ్లగూబ కాదు. కోతి కాదు,

పిల్లికాదు. కుక్క కాదు. వెధవముండ కాదు. అయితే గుడ్లు గూబవి. ముఖం కోతిది. బుద్ధి కుక్కది. ఎక్కింది దున్నపోతు. చూపులు పిల్లివి. ఇటువంటి వ్యక్తి ఎవరు చెప్పండి?"

"దున్నపోతు ఎక్కాడు అన్నావు కాబట్టి యముడు అనాలిసొచ్చింది. అయితే యముడు మళ్లీ పాతవస్తువేనే?"

"అయితేనేం. యముడిని ఎవరైనా ఇటువంటి వ్యక్తి అని చెప్పారా. ధర్మరాజు అన్నారుకాని కుక్కబుద్ధి కలవాడు అన్నారూ? చూశారా వ్యక్తిత్వంలో నూతనత్వం. ఇందాక తమకు మనవి చేసేనా లేదా ? పాతసారాయి క్రొత్తసీసాలలో పోయటం అనే సిద్ధాంతాన్నే మనస్సులో నుంచుకొన్నానని. అదండి ఇది."

"సరి సరి చాలా కష్టించారు."

"అయితే ఇప్పుడెంతవర కయింది? నాయిక పేరు కుదిరింది. నాయకుడు యముడు. ఇక ఏభాషలో వ్రాద్దామా అన్న శంక పట్టుకొంది. గొప్పకవులు ఏభాషలో వ్రాశారూ? ఎవరు గొప్ప కవులు అని మళ్లీ ప్రశ్న. నన్నయభట్టాది కవులు. నిజమే కాని వాళ్లు పాతబడ్డారు. ఆధునికకవులలో ఒకరు వాడుక భాషలో వ్రాయాలన్నారు. శ్రీపాదవారు గ్రాంథికంలో పుస్తకాలు వ్రాయాలన్నారు. వాళ్లేదో కొట్టుకొన్నారు. నాకెందుకు ఆసంగతి. మొత్తముమీద చాలమంది వాడుకభాషలో వ్రాస్తున్నారు. అయితే ఇంతటితో కష్టాలు గట్టెక్కలేదు. గిడుగు పంతులుగారు అరసున్నాలు లేకుండా వ్రాయమన్నారు. అసలు సున్నాలు లేకుండా వ్రాయమంటారు ఉమాకాన్తముగారు. ఈ ఉమాకాన్తముగారు—(ఉమాపతీ మందులు కనిపెట్టింది ఈయన యేమో నాకు తెలియదు.) ఈ మధ్య కొన్ని పుస్తకాలు వ్రాసి అందులో సున్నాలు పెట్టి వ్రాయడం మూలానే నన్నయభట్టు దగ్గరనుంచి నానాసాహేబువరకు కవిత్వం చెడిపోయిందనీ, అంతకు ముందు సున్నాలు లేకుండా ఉండి కవిత్వం సలక్షణంగా ఉందని వ్రాశారని ఎవరో అనుకొన్నారు. కృష్ణశాస్త్రిగారి కవిత్వం నిండా సున్నానీ అసలు ఆయన కవిత్వానికి అధిష్ఠానదేవత సున్నా అని వీరు సిద్ధాంతం చేశారట. వారిమతం అది. రెండు కలిపి కాస్త గ్రాంథికం కాస్త గ్రామ్యం కలిపి వేపపువ్వు పచ్చడిలాగ భాష తయారైతే వంటికి మంచిది. దేశానికీ మంచిది. పైత్యప్రకోపనలన్నీ పోతయి అని మల్లాది సూర్యనారాయణగారు వాదిస్తారు. ఉచ్చారణను ఆధారణను చేసుకొని వ్రాయాలని అతివాదులు, భాషలో శబ్దరూపాన్ని పాడుచేయకుండా ఉండాలని మితవాదులు అంటున్నారు. నే నిందులో ఏ మతాన్ని అవలంబించినా నా వ్యక్తిత్వానికి లోపం వస్తుంది. నూతనత్వానికి భంగంకలుగుతుంది. అందుచేత నేను గూడా ఒకరకం భాష తయారు చేశాను. నేనంటం ఏమిటంటే ఏదో పూర్వంనుంచి వస్తున్న అరసున్నాలు బొత్తుగా తీసివేయక, పూర్వంనుంచీ శబ్దానుశాసనాన్ని అనుసరించి అరసున్న వేసేచోట

మాలవీ



జో బన రూప సో పూరి రహీలనే ఏకహీ ఆపన ప్రీయరి ఝూవే,
పోల పటాతని సంకహీయే రతి ఆతుర అంగ్సై అంగసుహావే,
తాహీంకే సంగకరే రస రంగ సంకేత నికేత నికేతనికో చలి ఆవే,
లాలక హే మాలకోసకీ రాగనీ యాహీంకో మాలవీ నామక హావే.

[జయపుర చిత్రము: దివాన్ బహదూరు చతుర్భుజదాసు గోవిందదాసుగారి యనుమతిని.]

వేయకపోవటం, వేయనక్కరలేనిచోట వేయటము"

"అయ్యో. అదేమిటోయి, భాషను పాడు చేయటమే"

"పాడుచేయటం యేమిటి. భాషకు క్రొత్త క్రొత్త అలంకారా లిస్తున్నాము. దానికి నూతనత్వం కూరుస్తున్నాము ఏమంటారు"

"ఏమిటనేది, మీ చిత్తం."

"శాస్త్రిగారూ, ఈ విధంగా, పేరు, వస్తు పురసం, భాష మొదలైనవి ఇల్లా ఉండాలని నిర్ణయించి అప్పుడు కథ వ్రాయాలి చూశారా ఎంత కష్టం ఉందో!"

"చాలా కష్టమండీ—నాకు ఇప్పుడిప్పుడు తెలుస్తున్నది మీ నూతనత్వ తత్వము-ఇంతకూ మీకథ ఏమైంది? సావిత్రి కథ ఎట్లానడిపారు పాత కథ చెప్పారా?"

"శాస్త్రిగారూ నేను మొదటే మనవిచేసుకొన్నా పాత విషయములకే క్రొత్తరంగులు వేస్తున్నానని. కథ మట్టుకు పూర్వపుకథే కాని, ఈ క్రొత్తభాష, ఈ క్రొత్తభావాలు, ఈ నూతనత్వం. ఆ కథకు అమర్చేటప్పటికి బహు హృద్యంగా ఉంటుంది కథ చదివి వినిపించనా?"

"ఇప్పటికే చాల కాలహరణము అయిపోయింది వినటానికి ఓపిక లేదు. ఆ కథలో ఉండే నూతన విషయము లేమిటో మాత్రం చెప్పండి."

"అట్టేలేవు మొదటివిషయం సావిత్రి భర్త ఫలాని పేరు గలవాడని కథలో ఎక్కడా చెప్పకపోవటం."

"ఎందుచేతనూ—వాడికి పేరుందిగా"

"వెధవ. వాడికి ప్రాముఖ్యము ఏముంది కథలో. సావిత్రి మొగుడనే వాడికి పేరు. మన వూళ్ళో ఆయనను వెంకమ్మ మొగుడు అని చెప్పుకొంటారే అదేమోస్తరు! వాడు అనామధేయుడు."

"సరే ఇదొగొప్ప విషయమే. ఇంకేమున్నది."

"మిగతావన్నీ సామాన్య విషయములే అదోరంగుతో కనబడుతవి. సావిత్రీ సావిత్రిమొగుడు అడవికి వెడతారు. మొగుడు చస్తాడు. యముడు ప్రాణాలు హరించి మోటారుకారు మీద వెళ్లిపోతాడు. సావిత్రి ఇంకో కారులో వెంటబడుతుంది. యముడు కారు మెల్లగా పోనిస్తాడు. ఆయన దృష్టి సావిత్రిమీద పడుతుంది. కొంచెం సంచలనం కలుగుతుంది. ఇంక కొంచెం సేపు చూసేసరికి మోహములోకి పరిణమిస్తుంది ఆవికారము. సావిత్రి అంత చక్కనిదాన్ని చూస్తే "బ్రహ్మదేవునికైన పుట్టు రిమ్మతెగులు" అని ఉంది. మరి యముడి మాట చెప్పనక్కఅలేదు. వికారపుచూపులు చూస్తాడు మెల్లగా పలుకరించి ఏమి కావాలె అంటాడు. నావిభుని ప్రాణములు ఇయ్యమంటుంది. యముడు సావిత్రియొక్క ఆలింగనం కోరతాడు. సావిత్రి నిర్ఘాంతపోయి ధర్మోపదేశం చేస్తుంది.

అంతటితో నాలుగో ప్రకరణం పూర్తి అవుతుంది.

ఆరో ప్రకరణంలో వైతరణి దాటుతారు. ఏడో ప్రకరణంలో మళ్లీ అడుగుతుంది సావిత్రి తన విభుని ప్రాణాల నియ్యమని. యముడు మళ్లీ అయిదు నిమిషములు సావిత్రియొక్క భౌతిక శరీరం తనవశం చేయమంటాడు.

ఎనిమిదో ప్రకరణంలో భౌతికశరీరానికి ఆత్మకుగల సంబంధం చర్చకొస్తుంది.

సావిత్రికి ఒక్కటేకోరిక. అదేమీ భర్త యొక్క ప్రాణములను తెచ్చుకొనుట.

ఆమెకు భర్తయందు అపారమైన ప్రేమ. ఆమెప్రేమ ఎంత పవిత్రమైనదో ఎంత అగాధమైనదో ఎవ్వరు చెప్పలేరు. మహాపతివ్రత. ఆలోచించి సావిత్రి భర్తృప్రాణములకొఱకు, ఆయనమీదఉండే ప్రేమచేత తనభౌతిక శరీరాన్ని యముని కఠిన బాహువులలో పడేసి అయిదునిమిషములు ఆ సుకుమార శరీరాన్ని ఆ సురునివశం చేస్తుంది. యముడు సావిత్రితో సంభోగించి ఆమె పతిభక్తికి మెచ్చి ప్రాణాలు ఇచ్చేస్తాడు.

ఆ మహాపతివ్రత చేసిన పని తప్పులేదని భర్తయందు గల ప్రేమ అద్వితీయమని, భర్తృప్రాణరక్షణార్థమై ఆమె అమానుషమైన మాన త్యాగము నొనరించినదనీ సురాసురలు ఆనందించారు. నీచ మానవులు ఏమంటే లెక్కేమిటి. దేవదుందుభులు మ్రోగినయి అని వ్రాసి పూర్తిచేశాను"

"అయ్యో అయ్యో. నాచెవులలో సీసం కరిగించి పోసినా నా కింత బాధ పుట్టదోయి. ఇదేమిఅన్యాయమోయి సావిత్రిని దొమ్మరి ముండను చేశావు. అప్రాచ్యుడా."

"శాస్త్రిగారూ. అంటే భయపడపోకండి. నూతనంగా ఉందంటారా? లేదంటారా?"

"ఒరి నీ నూతనత్వం తగలెయ్య! నేను పోతా. ఈ మాటలు నా చెవులకు సోకనియ్యకు.'

నిద్ర

డాక్టరు నండూరు శివరావుగారు

సతత శ్రీవిభవాభిరాముఁడగు రాజన్యుండు నిన్ గాంచునే
తతకుంజాంతర డోలికన్ ననలపై దారుణ్యలావణ్య లో
ల్యతివల్ పాదము లొత్త తెమ్మెరలు పుష్పాసారసారం బనా
గతముం జల్లఁగ బవ్వళించియును నిద్రా! వేడ్కమై నొక్కెడన్.

తనుసారంబు ద్రవించి వెల్వడల స్వేదస్ఫూర్తి కాటెండలో
దినమెల్లన్ ధర దున్ని కర్కశధరిత్రిన్ జాపపై బండి క
ప్పను గట్టంగను లేని కాపులకు భూపాలుం డపేక్షించు నీ
ఘనబాహాపరిరంభ సౌఖ్యమునఁ జక్కం జేతు నిద్రాసతీ!

పరగ న్నిన్నొకరాత్రి పొందమికి సత్వంబేగు నాక్నొల్లదం
దుర, సత్యంబగు నేని గాలి తగులం దూలాడు కందోయి దు
స్తరమౌనే ముకుళింప యత్నమున, సత్త్వాధిక్యమే సౌఖ్యమౌ
ధరనిం గూడిన వానిదే సుఖము నిద్రా! కామ్యసౌఖ్యప్రదా!

ధరణిన్ దివ్యసుఖంబులీయఁగల యుద్యత్సంపదల్ గల్గియున్
నరుఁ డత్యంతవ్యథార్తుఁడై పొగులు నిన్ గానంగ లేకున్న నీ
కరుణాలోకనజాలమోహనము స్వర్గంబన్న మర్త్యాళికిన్
నరకం బున్నదె వేరు నీయదయకన్నన్ నిద్ర కామ్యప్రదా!

నినుఁ గన్నంతనె యెట్టిదుఃఖచయమేనిన్ బంచబంగాళమౌ
తనజన్మంబునఁ గాంచలేని సుఖసంధానాతి చిత్రమ్ములం
గనుఁ గామ్యంబు జనించుచోట తడవుగా క్ష్మాపాలచంద్రుండు చూ
డనివిన్ నిర్ధనుఁడైన నిన్ గలసి యుండన్ నిద్ర కామ్యప్రదా!

పల్లెటూరు స్కూలు తణిఖీ తంతు

భమిడిపాటి కామేశ్వరరావు గారు

వెంకటాయిగారు గడ్డిపాలెంలో ఉదర నిమిత్తం బడిపంతులుగా కుదురుకున్న సాధారణుడు. ఆయన బహు సౌమ్యుడు. ఆయనికి స్థిరాస్తి భార్య, చరాస్తి తనే. అతగానికి నమ్మకంగా వచ్చే సాలాదాయం ఏమీ అంటే ఒక ఆడశిశువు; కొండొకచో కవలలు. పైఖర్చుకి నాలుగురాళ్లుకాక, పంటలరోజుల్లో ఊరివాళ్లు వసూలుచేసి అతడికి ముట్టచెప్పే ఇరవై బస్తాల ధాన్యమూ అతని సంసారానికి కొంతకూడు. పంటలు అటూ ఇటూ అయినప్పుడల్లా ఈధాన్యం గురించి జనం లోపల కొంచెం తిట్టుకున్నా ఇస్తూనే ఉండేవారు. ఇది గాక, ఇతరత్రా ఓ అక్షరాభ్యాసం అనో, ఓ దసరా అనో పేరెట్టి అతడు ప్రజల దగ్గిర్నించి ఓ జామారో గట్రో గుంజుకుంటూండేవాడు. పైగా, ఓ దస్తావేజు గోకిపెట్టో, ఓ సంబంధం ముడెట్టించో, ఓ సాక్ష్యానికి తగులడో, ఓ బ్రాహ్మణార్థానికి ఏడిశో దిష్టి కొట్టకుండా ఇంతో అంతో కతుకుతూండేవాడు. ఇంకా, స్కూలు తణిఖీదార్ల లో ఎవడేనా ఒకొక్క తరిపి ఘటం వచ్చినప్పుడు అతగాణ్ణి మనుగుడుపుకి మేపినట్టు మేపి అతని సిఫార్సువల్ల గ్రాంటు కొడుతూండేవాడు. క్రితం ఏడు మాత్రం, పై అధికారి, గ్రాంటు సరిగా పారెయించలేదుట—ఏదో ఒకానొక సప్లయి తృప్తికరంగా జరక్క! ఇన్నిన్ని వీళ్లూ ఉండడంవల్ల అతనికి మరోహ లోటు ఏమీ రాకుండా నిమ్మకి నీరోసినట్టు జరిగిపోవలిసిందేకాని, ఒక్క అసిఘాత వచ్చిపడింది. ఆ పాలెం మొత్తానికి అతనిదే ధర్మలోగిలి. అందువల్ల ప్రతీప్రయాణీకుడూ కుడా వీళ్లింటో ఆగడం సాగించాడు, పొద్దెక్కితే పొద్దెక్కిందనీ, ఎండైతే ఎండనీ, వానైతే వాననీ, మబ్బైతే మబ్బనీ, ఏదైతే అదనీ కారణంగా చెప్పి, తన్ని మెడేసుగుని బలవంతపెట్టగా అవతల తన పన్లన్నీ నిప్పడిపోయినా సరే ఇకబాగుండదని తప్పనిసరివల్ల ఆగిపోతూన్నట్టు నటించి వాళ్లింటో ఆగని బంధువుడూ, తిష్టవెయ్యని పరిచయుడూ, బస చెయ్యని బంధుపరిచయుడూ, చెయికడగని పరిచయబంధువుడూ లేడు. అల్లాంటప్పుడు ఖర్చు ఒకయెత్తూ, చాకిరీ దాని పైయెత్తూగా మరీ! పిల్లల చాకరీతో గాక ఈపెద్దల చాకరీతో కూడా ఇంటావిడ తంటాలు పడేది. పోవడం రూఢైతేగాని, రావడానికి మార్గాలు ఏర్పడవు. వెంకటాయిగారు సంసారవిషయంలో వీల్లేక చదువు చెప్పడం విషయంలో మాత్రం కుమ్మరిపురుగులా ఉంటూ ఆర్జనకి ఇంకా అన్యమార్గాలు అన్వేషిస్తూండేవాడు. పక్కవూళ్లో ఎక్కడేనా (అనగా, గడ్డిపాలెం చుట్టూ ఊరగాయి కుండలున్నట్టు అనేక గ్రామాదులున్నాయి) ఎవరేనా కుండ తడుపుకుంటే సరి, అక్కడల్లా ఇతడు హాజరు—కబురు ఏ కాకి చెప్పేదోకాని! ఏదేనా తూతూబాకాగాని, రాండోలుగాని వినిపించితే అదే కన్యాప్రదాతగారి సవినయాహ్వానం, వేరే పిలుపెందుకు! అని వెంకటాయిగారి మతం.

ఒకసారి వెంకటాయిగారి పెళ్లాం పురుడోసుగోడానికి పుట్టింటికెళ్లింది—ఏటేటా ఇదో చిక్కగా! తొల్చూరుకొడుకు ఒక్కడూ మాత్రం తండ్రితో ఉండిపోయాడు (చదువు చెడిపోతుందని). ఆ తరవాతవాళ్లు అంతాకూడా ఆడపిల్లలే అవడంవల్ల వాళ్లు అయిదారుగురూ తల్లితోనే వెళ్లిపోయారు. దాంతోటి ఇంట్లో గంజికాచిపోసేవాళ్లు కరువయారు. కాని, జనం రావడం మానలేదు. కొన్నాళ్లు వెంకటాయిగారే చెయి కాల్చుగున్నాడు. అయితే తనపెట్టుతోటి తనూ కుర్రపాడగట్టూకుడా దిగనారుకు రావడంవల్ల తన పిన్నత్తగార్ని పదిరోజులపాటు పంపిపెట్టవలిసిందని ఆవిడ కొడుక్కి వెంకటాయిగారు రాయగా రామేశ్వరతీర్థం గంగనికలపడానికి ఆవిడ కాశీ వేంచేసిందని అతడు అప్పట్లో జవాబు రాసి మరి మాసంనాటికి ఆవిణ్ణి పంపించాడు.

ఆవిడ వచ్చింతరువాత కొంపలో హద్దులేని సొద మాత్రం ముదిరింది. వెనకటికి మల్లే ఎవడేనా వీళ్లింట్లో భైటా ఘిద్దామనుకుని గడపలో పాదం పెట్టేసరికి ఆవిడ వెంకటాయిగారి మీద ఓ టాప్పడవ బూతులు దిమ్మరించేది, లేకపోతే కుర్రాణ్ణి మాటని పిల్చి రుంజా వాయించినట్టు బాదేది. ఆపళంగా వచ్చినవాడు తారెత్తి నిష్క్రమిస్తూండేవాడు. కాని, మరో గ్రహచారం! ఎవరు మాట్లాడుతున్నాసరే ఆవిడ వినిపించుకోదు. పైగా, ఆవిడ వచ్చిన రాత్రిరే ఊళ్లో ఒక పెళ్లి ఊరేగింపుకి అవుట్లతో బాణాసంచా కాలుస్తూంటే, “ఇదేమిటి? ఇంత పొగ ఎక్కడిదో!” అని ఆవిడ ముక్కుమీద వేలేసుకోడాన్ని బట్టి, ఆవిడకి ఏమాత్రమో కొన్నివీసాలు చెముడు కూడా ఉన్నట్టు వెంకటాయిగారు గ్రహించాడు. గ్రహించి, ఆవిడ ఎవర్నేనా పట్టుకు దులిపేటప్పుడు తనే నోరు నొక్కుగుని, ఊరుకోమని, ఆవిడకి సంజ్ఞచేసేవాడు. సంజ్ఞలు చేస్తే చెమిటివాళ్లు కంట్లో పడతారు. అందుకని అల్లాంటప్పుడు ఆవిడ గట్టిగా, “నాకేం? నీ నోరే నొక్కుస్తా! ఎల్లాగైతేం, చేశావు బోడి ఉద్యోగం, మా అమ్మాయికి ఒక్కనగేనా పెట్టలేక పోయావు!” అని అరిచేది. “కొంపలో ఇదో తంపి కూడా వచ్చి పడిందేమిట్రా ప్రభో” అనుకుంటూ వెంకటాయిగారు స్వహస్తపాకం చేసుగునే నాటి కంటే కూడా చిక్కి సహమయాడు.

మరికొద్దిరోజుల్లో పక్కఊళ్ళైన నందిపిల్లిలో వివాహం అయింది. కర్మంజాలక వీరికి పిలుపుకూడా వచ్చింది. నడిచే త్రాణలేక వెంకటాయిగారు “పోనిస్తాదాం తగలేసిన భోయినం” అని చాలాభాగం విరక్తి తెచ్చుగుని మానేసెయ్యాలని అనుకున్నాడుగాని ఆవిడ “వెడితేవెళ్లు, లేకపోతే మాను. వెడితే నాకేమీ పుష్టీ లేదు, లేకపోతే నాకేమీ నష్టీలేదు. చచ్చినాసరే నేను ఈవాళ బియ్యమూ పొయ్యను పప్పూవెయ్యను” అని కేకట్టింది. పాపం. వెంకటాయిగారు ఎనిమిదింటికే స్కూలుకట్టేసి (ఇనస్పెక్టరు కొత్తవాడొచ్చాట్ట, వాడెల్లాంటి వాడో గదా అని మనస్సులో కొంత ఫికరగా ఉన్నా) కొడుకుని వెంటేసుగుని నందిపిల్లికి అడ్డం పడ్డాడు.

ఆవేళే రెండుజాములు తిరిగింతరువాత ఇద్దరు మనుష్యులు గడ్డిపాలెంలో ప్రవేశించారు. ఒకడు, కొన్ని కాగితాలూ గొడుగూ చంకని బెట్టుకుని భంట్రోతుకి మల్లే తొందరగా ముందు నడుస్తూంటే, రెండోవాడు బుట్టతల పాగా చుట్టి, పిల్లినడక అభినయించి, తలటెక్కించి, అంగలువేస్తూ వెంబడించాడు. ఆయన నడక యొక్క మాంద్యానికి ఒక కారణం దర్జా అయి ఉంటుంది కాని, అంతకంటె బలువయినకారణం బొజ్జ. ఈ చివర లక్షణంతోటి ఆయన సరిగ్గా మూడుమూర్తులా స్కూళ్లతనిఖీదారులాగ ఊరుకున్నాడు. ఊళ్లో చాలమంది హడిలిపోయి పగటి మతాబాలు కాలుస్తూ వీధులో నిలబడి ఉండగా, వాళ్లని దర్యాప్తుచెయ్యడంలో మేష్టరుగారు గ్రామాంతరం వెళ్లడంగ్రహించి, వాళ్లు తిన్నగా స్కూలు భవనందగ్గిరికి దారెట్టి, దాని సింహద్వారం తలుపు ఊతగయెత్తి పారేసి లోపల ప్రవేశించిన మీదట భంట్రోతు మాత్రం ఇవతలికివచ్చి మేష్టరుగారిఇల్లు అడిగి కనుక్కొని ఆయనా పిల్లాడూ నందిపిల్లి భోజనానికి వెళ్లడప్రసంగతి ఆ చెమిటమ్మగారి దగ్గిర్నించి కొన్ని పావుగంటలలో కమ్మెచ్చులాగి పుచ్చుగుని, ఒకకూలివాడిచేత ఆ ఊరు కబురు పంపించి, తను మళ్లీ స్కూలుభవనంలోకి వెళ్లిపోయాడు. ఊళ్లో పెద్దలుకొందరు చొరవచేసి లోపలికెళ్లి ఆ అధికారితో అనవసరపు సంభాషణచేస్తూ కూచున్నారు.

మనిషివాడు చావంతపని జరిగి నందిపిల్లిలోపడి పందిరివేసి ఉన్న ఒక ఇంటిదగ్గిర ఆగేసరికి అప్పుడప్పుడే బ్రాహ్మలు ఇవతలికివచ్చి త్రేణుస్తూ చేతులు కడుక్కోడంలో మేష్టరుగారు కూడా తనచేతికి ఏమాత్రమో జిడ్డుపట్టుకోగా తన బిరుసుగడ్డం వరపోకట్టేలా ఉండడంవల్ల వేళ్లు గడ్డాన్నెట్టి పాముతూ పక్కాయనతో, “పర్గాయిఇంట్లో విస్తరివేసేటప్పటికి ఎంతమొర్రో అంటూన్నా నెయ్యి కాస్త ఎక్కువగా పడితీరుతుందిస్మండి. జిడ్డు వదలటంలేదు!” అంటూ ప్రసంగంలో ఉండగా

మనిషివాడు ఆయన్ని సమీపించి, "వదల్తుందండి. ఇనపమేష్టారు వచ్చారండి. తమర్ని యెంటనే దయ్ సెయ్యమన్నారు" అన్నాడు. "ఓరి నీ యినుం కాల్చా! వచ్చింది మాసిగంగారా, కాళ్లుకడగడంగారా? ఈ మధ్య మాసిగంగారు మారి కొత్తవాడు కూడా వచ్చాడన్నారు! అతనొక్కడేనావచ్చింది? పెళ్లాంపిల్లలూకూడా రాలేదుకద, నాలుగెడ్లబండీ చేసుగుని? అతడేమీ ఖాళీబస్తాలూ, ఖాళీడబ్బాలూ వేసుగురాలేదు కద?" అని మేష్టరు కనుక్కున్నాడు. వాడు సమాధానం చెప్పకుండానే ఇందాకటి పక్కాయన, "అయ్యా, మాసిగం, కాళ్లుకడగడం అంటున్నారేమిటి? తెగతిని పెళ్లిపందిట్లో ఇవేం కూతలు మీ శ్రాద్ధపుకూతలు.?" అని కొద్దిగా కూకలేస్తూ హెచ్చరించాడు. తను మేష్టరుగనుక అవన్నీ పడితీరాలి అనుకొని గావును వెంకటాయిగారు అవన్నీపడి, "అయ్యా! స్కూళ్ల పెద్దతణిఖీదార్ని మేం తద్దినం అనీ, తరవాత ఆయన్ని మాసిగం అనీ, మరీ మైనరుతణిఖీదార్ని కాళ్లుకడగడం అనీ సంభాషణలో చెప్పుగుంటుంటాం. తద్దినపుబాధ అస్మదాదులైన అల్పులకి లేకపోబట్టి నేను పైరీతిగా ప్రశ్నించాను. వారు మాకు పిత, పితామహ, ప్రపితామహ లాంటివారు. ఇదీ సంగతి!" అనిచెప్పి, "కుర్రాడా, పదరోయ్?" అని కేకేసి పైమీది కోల్లాయి నడుంకి పటాకాలాగ బిగించి, అమాంతంగా ఎగడి, "ముందు సూచించకుండా వచ్చాడు, ఈకొత్తవాడికి ఇదోరోగం గావును" అని అనుకుంటూ ఉడాములమీద స్వగ్రామం జేరుకుని, పరిగెత్తే అవస్తలోనే బొట్టు గిల్లేసుకుని, జుట్టు రక్కేసుకొని, తమ యింట్లోకి అడుగెట్టి "గార్లొండి వంటకానీవమ్మోయ్!" అని పిన్నత్తగారి చెవులో ఉరిమి, బయటికి ఉరికి, తెంపుగుని పడ్డట్టు స్కూల్లోకి దూకి, ఆ బొజ్జాయనే అధికారి అయి ఉంటాడుగదా అనుకుని, ఆయన పాదపద్మసన్నిధిని గాలుపుకొట్టి గుడ్లు తేలేసి నోరువెళ్లబెట్టి కర్రలా బిగుసుకుపోయినట్టు పడిపోయాడు. ఈ అల్లరంతా నిజమే అనుకుని నలుగురూ పోగై, "క్షణంలో వచ్చేది తెలియదుగదా!" అంటూ జాలిపడి ఓ పెద్దచెంబుడు చన్నీళ్లు వెంకటాయిగారి మొహంమీద చరిచి, ఓతవ్వగిన్నెడు వేడిగంజి లోపలికి ఎక్కించగా, అప్పటికి ఆయన కాస్త కళ్లువిడడి, పెదవికదిపి, అధికారికేసి తిరిగి, "అయ్యా—తమరు—నందిపిల్లి—దార్ని—వస్తున్నారని—తెలిసి—అల్లా—వెళ్లి—" అని చెయ్యి ఊపుతూ, "ఏమైతేం? క్షమించాలి!" అని గొణగగా, అధికారి నిజంగా అతడు గాలుపుదెబ్బ తిన్నాడనుకుని, "ఓ యెస్, క్షమించాను లెండి. ఎండగదా ఎందుకొచ్చిన శ్రమ మీకిది? మేం రామూ? బండీ పంపలేదని కోపగించే బాపతు కాదు మది! ఫర్వాలేదు లేవండి!" అని అభయం ఇచ్చిన మీదట వెంకటాయిగారు లేచి, "తమకు వేళదాటింది. దొరువుదగ్గిర ఒళ్లుతడుపుగుని మడిగట్టుకోండి" అని ప్రార్థించగా, ఆయన "అట్లానే, కాలకృత్యాలు అయినాయి. ఇక లేవడమే. మా ఆలస్యం లేదు. కాని, నా కోసం తెగశ్రమపడి ఎక్కడలేనివీ పుట్టించుగొచ్చి విశేషయత్నంచేసేరు గనక! ఒక్కటీ వద్దు. ఈపక్కఊళ్లో—ఏవదీ? (అని కళ్లుమూసుగుని) దేవుడు చాలా మేలుచేస్తే, గోకారం! (కళ్లు తెరిచి) గోకారంలో నాకు పెట్టిని భోయినం ఏంభోయినమండీ! నాలుగు కూర్లు, నాలుగుపచ్చళ్లు, క్షీరాన్నం, మాషచక్రాలు, అబ్బ, అబ్బ! యథోవిధి, యథావిధి! అయితేం, నేను ఆదినించీ ఇంత జఠరాగ్ని జీర్ణపుష్టీ ఉన్నఘటాన్ని గనక ఆట్టే చిక్కులేక పోయింది. మరో నాదారిస్వరూపం అయితే ఈపాటి టిక్కట్టు పుచ్చుకోవలిసిందే, సరే, త్వరగాకానీండి. నేను ఉండలేను" అనగా, "చిత్తం. పచ్చడీ మెతుకులూనండీ, నాకేముందీ, కుటుంబీకుణ్ణి, రండి" అంటూ వెంకటాయిగారు అధికార్ని తిన్నగా తనఇంటికి తీసిగెళ్లి, ఆయనమొఖం ఇంకా ఏదో ఆలోచనలో ఉన్నట్టు కనిపెట్టి, "వస్తా" అని ఆయన దగ్గిర ఒక్కమాటు సెలవుపుచ్చుగుని, "అబ్బాయి, పంతులుగారికి తుంగచాప వెయ్యి, చూస్తావేం?" అని కుర్రాణ్ణి కసురుగుని, లోపలికివెళ్లి, ఒకపావుగంట తరవాత ఒక గిన్నెపట్టుగుని పైకివచ్చి, "వంటాలస్యం ఉందండి ఒక్కక్షణం. ఈలోపులో తమరిది స్వీకరించాలి!" అని అది అక్కడపెట్టగా, అధికారి "మీకేమన్నా మతి చలించిందా ఏం?" అని గట్టిగా కోపపడి, వెంటనే "ఏం

తెచ్చారేమిటి? ” అని నిమ్మళంగా కనుక్కున్నాడు. “అబ్బే,ఒక సేరుపాలు—మట్టితోడలంటివి—మరగ కాచి, ఇంత మిరియప్పొడీ పటిగి పంచదార మార్గ్రముూ రంగరించానండి. మాంచిపని చేస్తుంది. ఇదివరకాయన ఇదంటే చెవికోసుకునే వారు. మరోమాట చెప్పకండి, పుచ్చుగోండి” అని మేష్టరు పట్టుపట్టగా, అధికారి అతి సిగ్గుతో అయిష్టంగా (విషంపుచ్చుగుంటూన్నట్టు అభినయిస్తూ) నిమిషంలో గిన్నెలో తడేనా లేకుండా ఊడిచేసి, పిదప నాలుగైదు నిమిషాలు కళ్లుమూసుగుని ఆయాసంనటించి, కళ్లుతెరిచి, “అబ్బ!” అని,

అ—అయితే పంతులుగారూ!

వెం—చిత్తం!

అ—వంటాలస్యం ఉండనే ఉంది గనుక, ఈ లోపున పోనీ నేను తలంటు అభ్యంతరం తీర్చుకుంటేం?

వెం—(మనస్సులో, “నాదుంపతెంపు,నీమొహం తగ......”అనుకుంటూ.) ఓ మరీ మంచిదీ! తమ ఓపిక! మంగల్ని పిలిపిస్తాను! అబ్బాయి, ఇల్లారా! (కుర్రాడు వస్తాడు)

అ—మంగలి ఏం లాభం! అంటుకునే వస్తువు లభ్యంకానప్పుడు?

వెం— ఏవస్తువు?

అ—ఆవునెయ్యి! నేను గోఘృతంతోగాని అభ్యంగనం చెయ్యను. అల్పులు వాడుకునే తైలాలకి మెదడు మెత్తగవాసన! నా మెదడు కోసుకోవాలని పెద్ద పెద్ద కంపెనీలవాళ్లు, తన్నుకుంటున్నారు!

వెం—ఎవరుతన్నుకున్నా, సాయంత్రం ఊళ్లో కనుక్కుని కాస్తకాస్తే పోగుచెయ్యాలండి.

కుర్రాడు—అమ్మకి పురుడొచ్చిన తరవాత తాతయ్యగారిఊరు పంపడానికి ఓశేరు ఆవునెయ్యి కొన్నావుగా నాన్నా! ఇంట్లో ఉంటేనే లేదంటావేం?

వెం—(కుర్రాణ్ణి చేగోడీ నమిలినట్టు నమాలుదాం అని మనస్సులో అనిపించినా పైకి నవ్వుతూ) మరేంలేవ్! ఇట్టే మరిచిపోయాను!(అని అధికారికేసి తిరిగి) మావాడికి, పాఠాలుతప్ప కడంవి అన్నీహృత్కవిలిగా జ్ఞాపకం ఉంటాయండి, మీ ధర్మమా అని.

అని ఇంట్లోకివెళ్లి, నెయ్యితెచ్చి, మంగల్ని పిలిపించి, అధికార్ని తలంటుకి కూచోపెట్టి, దొరువునీళ్లు తెచ్చి, నీళ్లకింద మంటచేసి, నీళ్లు ఆయన కోరినన్నీ బాలింతరాలికి పోసినట్టుపోసి, ఆయనచేత మొత్తానికి మడి కట్టించాడు.

ఈలోగా, అడక్కుండానే కుర్రాడు చెప్పిన మాటలవల్ల వంటచేసే ఆవిడ పేచీమనిషి అనిన్నీ, తన ఘ్రాణేంద్రియ సాహాయ్యంవల్ల తయారవుతూన్న పిండివంటల స్వభావమున్నూ అధికారి పసి పట్టి, పొట్ట నాసుగుపోకుండా బట్ట కొంచెం వొదులుచేసుగుని వీధి అరుగుమీద పచారు చేస్తున్నాడు. వెంకటాయిగారు వచ్చి, “పీటా అదీ వేశారు, రండి” అని అధికార్ని పిలిచాడు “మనికి, అల్లాంటివి లేవు వడ్డించెయ్యమనండి” అని అధికారి వడ్డనకి హుకుం ఇచ్చాడు. మేష్టరు మళ్లీ లోపలికెళ్లి ఒక్కక్షణంలో పైకొచ్చి, “వడ్డనఅయింది, రండి” అని అధికార్ని లోపలికి తీసుగువెళ్లేసరికి, అధికారి నిర్జీవుడైపోయినాడు. అనగా, మరేంలేదు, విస్తరి కేసి చూసేసరికి గుండె ఝల్లుమని పోయింది. దాల్లో, బకాసురుడికి తోడినట్టు పంభంముట్టుకు తోడి ఉంది. దాని అగ్రమందు — సార్వా గడ్డికొంపమీద కొండ ముచ్చుమొహంలాగ—వెక్కిరిస్తూ ఉత్తికాయంత ఉసిరీ పచ్చడి ఉంది. అధికారి, అంతమనిషీకూడా, పట్టిపాకం చలిమిడి అయిపోయి ఆపీటమీద కూలబడి, మరోటేమీ అనలేక “మీతో మరీ! ” అన్నాడు. వెంకటాయిగారు, “నేను తరువాత కానిస్తానులెండి, ముందు తమరుపుచ్చుగోండి ప్రొద్దుపోయింది. ఏమీ ఆక్షేపెయ్యలేకపోయాం. నిమ్మళంగా కూచోవాలి. కావలిసినవి నాతో చెప్పి వడ్డించుకోండి, ఆవిడకి చెముడు” అని మనవి చేసుగున్నాడు. అధికారి కళ్లనీళ్లతో పరిషించి, విస్తరి చూపిస్తూ, “ఎల్లా నేనిది ఏడవడం? ” అన్నాడు. తక్షణమే, వెంకటాయిగారు, నిరుడు తనకి తక్కువగ్రాంటు మాత్రమే రాగలదని పైనించివచ్చిన ఆర్డరుకాగితం తెచ్చి అధికారి మొహంమీదపెట్టి, “నేనెల్లా ఏడవడం ఇదీ! ”

అని ఒకొక్క అక్షరమే ఉచ్చరించాడు. అధికారి ముక్కుమీద (ఎడంచేత్తో) వేలుపెట్టుకొని, "ఇదివరకు వాడికి ఏకదాహంట, నేనూవిన్నా. అది తీరక చాలా చోట్ల ఇల్లానే చేశాట్ట. నేను గ్రాంటు కురిపిస్తాను చూడండి, అన్నం పట్టుకు చెబుతున్నాను!" అని వెంకటాయిగారిని సముదాయించాడు. "అల్లాయితే రానీ వమ్మా రానీ! ఆపెద్ద విస్తరి ఇల్లాపెట్టు!" అంటూ వెంకటాయిగారు ముసలమ్మకి సంజ్ఞలు చెయ్యగా, ఆవిడ వేసివున్న విస్తరి పట్టుకుపోయి, తాజావిస్తరి తెచ్చి పెట్టింది. అధికారి మొఖవికాసంతో దంత పరిశ్రమ చేస్తూ రంగంలో ప్రవేశించాడు. నేతిగిన్నె పక్కనే ఉండడం ఇంటిదగ్గర అలవాటని ఆయన చెప్పడంవల్ల, వెంకటాయిగారు ఆవిడచేత అల్లా చెయించడమే కాక, దొన్నె కుట్టివేసి, అందులోకూడా ఆద్యం ఉంపించాడు. చిటికెలో అధికారి, గారెల పర్వంలోకి వచ్చాడు. మొదట్లో, ఆవిడ రెండు పుంజీలుమాత్రమే వడ్డించింది. అవి జమిలిగాతింటూ, అధికారి,బొజ్జ ఎడంచేత్తో నిమురుకుంటూ,


అ—అబ్బ! ఏమిటో అనుకుంటాంగాని, భోజనం చెయ్యడంకూడా కష్టమేనండి.

వెం—అడ్డమా! నా ఉద్దేశంకూడా అంతేనండి. నింపాదిగా కూర్చోండి. తమకు తెలియని దేముంది! కోటి విద్యలూ కూటికొరకే!

పదపడి, ముసిలావిడ పళ్లెంతో గార్లు మారు తెచ్చింది. వేగినవి వడ్డించమని ఆవిడతో చెప్పమని అధికారి (అంగాస్త్రంపెట్టి ఎడంచేత్తో ముక్కుతుడుచుకుంటూ) కోరగా, వెంకటాయిగారు తనవేలితో పళ్లెంలో వేగిన గారెలున్న భాగంచూపించి, ఆ ప్రాంతానివి వడ్డించమని ముసలమ్మకి సంజ్ఞచేశాడు. వేగినవి ఆపళ్లెంలో మరో ప్రాంతాన్ని ఉన్నాయని తన తాత్పర్యం అయినట్టుగా, ముఖంచిట్లిస్తూ అధికారి అ భాగం చూపించాడు. వెంకటాయిగారు తనమాటే నెగ్గాలని తను మొదట చూపెట్టిన చోటే మళ్లీచూపించాడు. ముసలమ్మకి ఈయొక్క వయినం బోధపడక, ఇవీ, అవీ, మరి మిగిలినవీ కూడా అధికారి విస్తట్లో బోర్లించి, పళ్లెం వెంకటాయి నెత్తి నెట్టికొట్టి "సత్రంబొక్కు జంతువుల్ని తీసుగురావద్దని ఎన్నిమాట్లుచెప్పినా సిగ్గులేదు. మర్యాదట! తెచ్చి తెచ్చి ఎవణ్ణో సర్వభక్షకుణ్ణి తెచ్చావు! కుర్రాడికి ఒక్కటేనా లేదు. వాడికోసం మళ్లీవండి తగులడాలి!" అని సాధిస్తూ వంటింట్లోకి తుర్రుమంది. అధికారి, "ఈమెకి ఇంత కోపం ఏమిటండీ! నేనుగనుక సరిపోయింది. మరోళ్లయితే తక్షణం లేచిపోదురీపాటికి! బాగానే ఉంది. మీకు దెబ్బ తగల్లేదుకద!" అని వెంకటాయిని ఓదార్చి,నిశ్శేషంగా గార్లుపుచ్చుగుని, "మజ్జిగ అక్కర్లేదండి" అన్నాడు. వెంకటాయిగారు చాలా నొచ్చుగుని "అయ్యో కర్మమా! కోపంవచ్చినట్టుంది. మీ రేమీ అనుకోకండి. ఆవిడ స్వభావమే అంత!" అన్నాడు. అధికారి "అందుకోసం కాదండి. గార్ల తరవాత పెరుగైనా సరే చేదే." అని లేచి చెయ్యికడుక్కుంటూనే డ్రెస్సు వేసుకోబోతూ "ఇక మనం బళ్లోకివెడదాం. పిల్లల్ని పిలుచుగురండి. మీ కుర్రాణ్ణి ఇంతలో భంట్రోతుకి అన్నంపెట్టమనండి" అన్నాడు. వెంకటాయిగారు "చిత్తం" అని లేచి కోటు తొడుక్కొని పిల్లలకోసంవెళ్లాడు. కుర్రాడు భంట్రోతుకి పీటవేసి వడ్డన ప్రారంభించాడు. అధికారి కోటుతొడుక్కొని, గుండీలు పెట్టుగుని, తలపాగా పెట్టుగుని "బాబోయ్!" అని కెవ్వునికేకెట్టాడు. "ఏమిటి! ఏమిటి" అని భంట్రోతు అడిగాడు. "తేలు తేలు! తలంతాఅంట పొడిచింది. పాగాలో ఉంది గావున బాగా నొవ్వకుడుతోంది." అని కళ్లు బిగించి మూలుగుతూ ఉరుకున్నాడు. తరువాత భంట్రోతు చెప్పిన మీదట ఆయన పాగా తీసి దులపగా కప్పంత తేలు రాలింది. చెప్పుచ్చుగు కొట్టి కుర్రాడు చంపాడు. చంపి,"మా నాన్నదగ్గిర ఉల్లిపాయితో చేసిన తేలుమందు ఉందండి" అని ధైర్యం చెప్పాడు. "అది ఒకవేళ వెల్లుల్లిపాయేమో నాకు నయించదు. నే వేసుగోను కుర్రాడా!" అని అధికారి డోక్కోడం ప్రారంభించాడు. భంట్రోతు కరువో కాలమో అన్నట్టు అన్నం అంతా రెండు ముద్దల్లోలాగుతూ, అధికారితో, "భయంలేదండి, అయ్యగారు! తలమీద కట్టడం వల్లమరిపైకి ఎక్కడానికి వీల్లేదు. తమరు వేపపుల్లా,

౪౩-వ అఖిల భారత జాతీయ మహాసభ-కలకత్తా

ఇతరమహాసభలు



౧. శ్రీ పండిత
జవాహర్‌లాల్ నెహ్రూగారు
అధ్యక్షుడు, భారత సోషలిస్టు యువజన
మహాసభ-కలకత్తా



౨. శ్రీ సర్ పురుషోత్తమదాస్ ఠాకూర్‌దాస్‌గారు
అధ్యక్షుడు, భారత వాణిజ్యమహాసభ-కలకత్తా



౩. శ్రీ కే. నటరాజన్‌గారు
అధ్యక్షుడు, భారత పత్రికారచయితలసభ, కలకత్తా



౮. శ్రీ మహాత్మా గాంధీగారు
అధ్యక్షుడు, రాష్ట్రభాషాసమ్మేళనము—కలకత్తా



౯. శ్రీ యస్. శ్రీనివాస అయ్యంగారు
అధ్యక్షుడు, భారత స్వాతంత్ర్యసమితి—కలకత్తా

గారెలాంటి వస్తువులు వాడతారు గనుక ఆ చేదుకి తేలు కాటు లోపలికి అసలు ఎక్కదు. మందు అనవసరమండి" అన్నాడు. వాడి తిండి అవుతూనే ఇద్దరూ స్కూలుకి పరిగెత్తారు. మేష్టారబ్బాయికూడా వెనకాలే వెళ్లాడు. మరి కాన్సేపటికి కొంతమంది కుర్రాళ్లని వెంటబెట్టుగుని మేష్టారు స్కూలు జేరుకున్నాడు. అధికారి పొట్ట వొదిలి తలపట్టుగని ఆపసోపాలు పడుతున్నాడు.

మే—అదేమిటండి?

అ—తేలండీ!

మే—ఎక్కడా?

అ—తలమీద.

మే—మందు తెస్తునా?

అ—వద్దండీ. ఇప్పుడు టైములేదు. అసలుపని పాడవుతుంద మందేస్తూ కూర్చుంటే!

అని మూలుగుతూనే "చూడండీ! మేష్టారు!"

మే—చిత్తం!

అ—ఈవేళ శుక్రవారం. నేను రాత్రి అన్నం తినను.

మే—దయచేసి చెప్పండి, ఏం తింటారో!

అ—ఇందాకటివే అయిదారు పెరుగులో పారెయించమని ముసలమ్మకి కబురు పంపండి.

మే—(తేలయేది జెట్టయేది ఆ మినప దినుసు మీద వీడి ఏవ అల్లానే ఉంది అని మనస్సులో అనుకని) అవశ్యం!

అని తిట్టుగుంటూ కుర్రాణ్ణిపంపించాడు. వాడు ఇట్టేవెళ్లి చక్కావచ్చాడు.

అ—మేష్టారూ! నాకు బాధగా ఉంది! సంగతి త్వరగా తెమల్చండి!

మే—తమ చిత్తం! నాలో ఏముంది!

అ—సరే! స్కూలంతా సరిగ్గా ఉన్నట్టేనా?

మే—చిత్తం.

అ—హాజరు పట్టీ, వగైరా, అన్నీ! (అని మూలుగుతాడు).

మే—చిత్తం.

అ—అయితే, తమరు కాస్త తలపాగాయేనా కుడా లేకుండానే వచ్చారేం?

మే—మీకు చాదస్తంగాని, మాపరమటింట్లో చిలక్కొయ్యమీద సిరండి వెళ్లి! దాన్ని గుమ్మిడిపండు లాటి ఇస్త్రీమడత తలపాగా నాది ఉందో లేదో తమకు బోధపడుతుంది! లేదనే మీ ఊహ?

అ—హాజరు పట్టీలో ఉన్న పేర్లేనా ఇప్పుడొచ్చిన వాళ్లవి?

మే—మీకు వెర్రిగాని, కానివాళ్లుంటే నేను వీధులోనే పంపించెయ్యనూ!

అ—సరే, వీళ్లు ఏయే క్లాసులు?

మే—అందరికీగూడా ఏక మొత్తాన్ని గట్టిగా చెప్పడమేగాని, క్లాసులంటో భేదం నే ఎరగను. అక్కడికీ, అదుగో ఆ ముగ్గురూ పైక్లాసు. ఈకడం వాళ్లంతా కిందిక్లాసు!

అ—పైక్లాసు వాళ్లకి కూడా పుస్తకాలు లేనట్టున్నాయేం?

మే—ఈ మధ్య పెళ్లి ఊరేగింపుకి పాలెం అంటుగుందండి. అప్పుడవి కాలిపోయి ఉంటాయి

అ—సరే. అల్లాయితే నేను కాస్త లోకజ్ఞానం పరీక్ష చేస్తాను. మీరు తప్పుగోండి. (అని కొంత మూలుగుతాడు. పిల్లలు కొంచెం నవ్వుతారు)

మే—చిత్తం.

అ—ఏయ్! విభూతి కుర్రాడు! మీ ఇంటి పేరు?

వి—గడ్డిల్లు.

అ—నీ కన్నెల్లుంటాయి?

వి—పెద్దవాళ్లని కనుక్కోవాలి.

అ—నేను పెద్దవాణ్ణేనా?

వి—అవునండి.

అ—ఎంచేత?

వి—మీకు బొజ్జ ఉందిగా!

అ—(“విషయం మార్చి ప్రశ్నలు వేస్తే అసలు మాట్లాడరేమో వీళ్లు” అని మనస్సులో అనుకుని) తరవాతివాడు! బొజ్జ ఎల్లా వస్తుంది?

త—గార్లు తింటేనండి.

అ—(మేష్టరు కేసి చూసి) మీస్కూల్లో అఖంకులున్నారే!

మే—చిత్తం తమ దయ!

అ— మూడో వాడు! బూర్లు తింటే మాత్రం రాదూ?

మేష్టారి అబ్బాయి— (అడక్కుండానే) ఆవడలు తిన్నా వస్తుందండి.

అ—(కోపంతో) ఎవరండీ, ఈ పిల్లవాడు! మా చెడ్డవాడూ!

మే—చిత్తం. క్షమించాలి. మా వాడేనండి.

అ—ఓహో! అవునండోయి. అయినా సరే అడక్కుండా సమాధానం చెప్పకూడదు. నేను కనక సరిపోయింది, క్షమించాను. (అని మూలిగి) నాలుగోవాడు! బొజ్జ యెందుకు?

నా—బండి యెక్కడానికండి!

అ—ఛీ! అయిదోవాడు!

అయిదో—పెద్దపెద్ద కోట్లు కుట్టించుకోడానికండి!

అ—ఛీఛీ! ఆరోవాడు?

ఆ—ఆయాసంగా ఉంటూంటే చేతులు జేర వేసుగోడానికండి!

అ—టట్ ! అవేవీకావు. అంవర్నీ కడుపులో పెట్టుగోడానికి. చాలు కాని, ఈ పుస్తకం తీసుకో! పైక్లాసులో మొదటివాడు! ఎక్కడేనా తీసి వాచకం కానీ!

మొ—(ఎదో తీసి) “ఆ ముని అంతట...”

అ—“ముని” అంటే ఏమిటి, రెండోవాడు!

రెం—మునిమండి.

అ—మరి నేను మునినేనా?

రెం—కాదండి.

అ—ఎం చేత?

రెం—“ముని” అంటే మంచి మనిమండి.

అ—అక్కసితో ఆగు! మూడోవాడు! నువ్వు ఉత్తరం చూపెట్టు!

మూ—ఇంటిదగ్గర ఉందండి.

అ—ఉత్తరపు దిక్కు కపోవడమేమి టిక్కడా. (అని పళ్లుబిగిస్తాడు).

మూ—అదాండీ! (అని ఇంటికప్పు చూపిస్తాడు)

అ—ఎవ డాచెప్పిందె?

మూ—మా అన్నయ్యండి, మొన్న సెలవలకి వచ్చి మ్యాపులో చూపించాడు.

అ—విన్నాంగాని, మేష్టారూ, తమరు కొంచెం గజ్జికట్టండి, విందాం.

మే—చిత్తం! తమకు బాధ తగ్గిందాండి!

అ—చీత్తం! నాగోడవెందుకు, తమరు ఉపక్రమించండి!

మే—ఎంతమాటన్నారు! అల్లానే. బాలలారా! (అని గొంతుకసర్దుకుని) సూర్యుడు భూమిచుట్టూ గిరగిర గిరిగిరా తిరుగుచున్నాడు.

అ—అదేమిటయ్యా, అబద్ధాలూ!

మే—ఆ మాటకొస్తే మీరు చెప్పండిచూస్తాను! ఏం ఎక్కువచెబుతారో మహా! ఇందాకణ్ణించి విన్నాగా నేనూను!

అ—స్మృతిమీరి మాట్లాడకండి!

మే—అయ్యా, పిల్లలుగలవాణ్ణి! పెద్దలనాటి నించీ ఇంతే! పైగా నాకు సర్వీసు అయిపోతోంది. ఇహ తప్పుగోమని ఊళ్లోవాళ్లూ అంటున్నారు (కోపంగా) పైన మీచిత్తం!

అ—పిల్లలుగలవాడవైతే మాత్రం, తల్లకిందులు చదువా చెప్పేది?

మే—మనవిచేశాగా! అల్లాయితే బాలులారా భూమేట సూర్యుడిచుట్టూ తిరుగుతూంట! విన్నారా? గిరగిరా!

అ—ఇదేమిటి! నమ్మకం ఇంతట్లో ఎల్లా మార్చు గున్నావు? మళ్లీ అప్పుడే భూమి గిరగిరా?

మే—అయ్యా! నా జీతం రాళ్లు నాలుగూ గిర గిరా తిరిగి వస్తూంటే నాకు చాలు.

అ—నాకూ అంతే.

మే—బాగా అన్నారు! మీ కడుపు చల్లగా! అల్లాంటప్పుడు దేంచుట్టూ ఎవరు తిరిగితే, ఎవడికొంప ఏం మునిగిపోయింది చెప్పండి. పైగా ఎవరిచుట్టూ ఎవరు తిరిగినా, లెక్కల్లో తేడాలుండవని మా పంచాంగం శాస్త్రుల్లుగారన్నాడు. మీతో నేను ఏకీభవిస్తూనే ఉన్నాను. గాని స్వల్పాల్లో నాతో పట్టింపులుపోకండి, ఊరిఖేను.

అ—సరే లెండి.

అని అధికారి రాయడం అభినయించి, తానిది వరకే రాసి గోప్యంగా తెచ్చిన కాగితపుముక్క ఒకటి పైకితీసి, అసలు రిపోర్టు తరవాత పంపుతాననిన్నీ అది ఎట్లా ఉండవచ్చునో మచ్చు చూపించుతున్నాననిన్నీ చెప్పి, తను ఈ సంగతులు మహా, అప్పుడేరాసినట్టు చదివాడు.

"మనోగణితము మోతాదు. లెక్కలు సుమారు. తెలుగు జబ్బు. నల్లజల్ల నల్లగానూలేదు, బల్లపరుపు గానూలేదు అది ఘోరమరమ్మతు కోరెడిని. స్కూలులో స్వేచ్ఛదేశీయకసరతు సున్న. బోధనా పరికరములు శూన్యము. ఉక్తలేఖనము తప్పులకుప్ప. చూచివ్రాతలో శ్రద్ధ మిళితమైలేదు. చూచివ్రాతలో చూచుటయు,వ్రాయించుటయు, దిద్దుటయు ముఖ్యములు. చిత్రలేఖనము ఎంతైన వృద్ధికి జాగా ఒసంగుచున్నది. నేను, అందరికీ తెలిసిన విషయముగురించి, తమారమి, ఒక మాదిరి పాఠమిస్తిని. పిల్లలు పద్యములను అర్థమగునట్లు చదవకూడను. గొంతెత్తి పాడవలెను. ఉపాధ్యాయుడు పిల్లలను పోగుచేసికొని వచ్చినట్లు కన్పింపదు."

మే—తమరు చదివిన వాటిల్లో చాలా ఇప్పుడు జరగనేలేదే?

అ—ఆమాత్రం నాకు తెలియకపోలేదు. నా ఉద్దేశం ఏమిటంటే,

ఒకవేళ అవికూడా జరిగి ఉంటే వాటి విమర్శ ఇల్లా ఇల్లా ఉంటుంది సుమా, కబడ్దార్, అని.

సరే పిల్లలకి రేపు సెలవనిచెప్పి పంపించెయ్యండి.

మే—చిత్తం. కొంచెం వీళ్లని ప్యాసుచేసి మరీ వెళ్లరూ?

అ—ఓ యెస్. సరే. పెద్దక్లాసు ఎందరూ?

మే—ముగ్గురు.

అ—సరే. ముగ్గురే గనుక అంతా ప్యాస్. చిన్న క్లాసు చాలా ఉన్నారా?

మే—మరేనండీ! చిక్కొచ్చిందీ!

అ—టీకాలు వీళ్లల్లో ఎవరికి లేవో, చెప్పండి!

మే—ఆ వీభూతి వెంగ్రాడికి లేవండి.

అ—ఇహ నేమ్మరీ! వాడు తప్ప చిన్న క్లాసంతా కూడా ప్యాస్!

పిల్లల్ని పంపించేసి, స్కూలుకట్టేసి, అంతా మేష్టరుగారి ఇల్లు జేరుకున్నారు. క్రమేణా చీకటి పడింది. అధికారి ఆవడల్ని పరామర్శచేశాడు. చేస్తూ, మేష్టర్ని పిల్చి, "నైట్‌స్కూలు గ్రాంటుకూడా మీరు లాగుతూన్నట్టున్నారు. నైట్ స్కూలికి పదండి చూద్దాం" అన్నాడు. అందుకు, మేష్టరు, "చిత్తం. నైట్‌స్కూలు ఏదీ అని అడిగితే ఓటి చెప్తాను వినండి. నైట్‌స్కూలనే పదార్థం తమ కటాక్షవీక్షణంతో కూడుకుని ఉండేదేగాని వేరే ఉంటుందని చూస్తున్నారా యేమిటి? ఇప్పుడు తమరు దయచెయ్యగా ఈ పగటిస్కూలు నివేదించుగున్నాడా, ఈ విధేయుడు! ఈ మాటు తమరు వేంచేసినప్పుడు అక్కడికి ఆ కాస్తమాటా దక్కించుకుని ఆ నైట్‌స్కూలుని కూడా తమ ఎదట దాఖలుచేసుగుంటాడు!" అంటూ విధేయతతో దాటుకున్నాడు. అధికారి బేవ్ మని త్రేణ్చి చిరునవ్వునవ్వి, "ఈ మాట తప్పకండి"

అని హెచ్చరించాడు. మేష్టరు నాలిక కరుచుకుని "అంతే! సెబాసు" అన్నాడు.

మరికాస్సేపటికి మేష్టరు అధికారి దగ్గిరికి వెళ్లి "ఇక నేను పడక 'అరణ్యామెంటు' చేస్తాను" అన్నాడు. తక్షణం భంట్రోతు వెంకటాయిని వీధులోకి పిల్చుకుపోయి కొంతసేపు చెవిలో ఏదో ఉపదేశించాడు. వెంకటాయిగారు, "తప్పుతుంది బాబూ; అల్లానే!" అన్నాడు. భంట్రోతు "తొమ్మిది దాటకూడదు. దాటితే మళ్లీ పంతులుగారికి భయం. భయం అంటే మనుష్యుల్ని గురించి కాదు. పురుగూ బుట్టా ఉంటుం దని!"

అన్నాడు. వెంకటాయిగారు, "అల్లాగే వెళ్లివస్తా!" అని కండువా వేసుగుని ఎక్కడికో వెళ్లాడు.

ఆయన వచ్చేసరికి పిల్లులేరు. నిద్రపోతూన్న కొడుకుని లేపి వెంకటాయిగారు అడగగా వాడు ఏమీ ఎరగనన్నాడు. ముసలమ్మ సమాధానం గ్రహించే సరికి తెల్లారుతుం దేమో అని భయమేసి వెంకటాయిగారు ఆవిణ్ణి అడగనేలేదు. ఆ రాత్రి వెంకటాయిగారికి నిద్రపట్టలేదు.

మర్నాడు టపాలో వెంకటాయిగారికి మరి నాలుగు రోజుల్లో ఆ స్కూలికి తణిఖీతంతు జరుగుతుంది గనక సిద్ధముగా ఉండవలసిందని అసలు అధికారి దగ్గిర్నించి ఉత్తరం వచ్చింది!

పసిపిల్ల

చిట్టావూరి కామేశ్వరరావు గారు

వనజదళమున మకరంద కణమువోలె
శుభ్ర గగనాంగణంబునఁ జుక్కవోలె
తల్లియొడిలోనఁగల పసిపిల్ల, నిన్నుఁ
గనుఁగొనంగ సంతోషము గలుగునేల?

తల్లిముఖమును జూచి సంఫుల్లవదన
వై పకపక నవ్వెదవు నిరంతరముగ!
అందు నూతనసోయగ మరసెదో? సు
ఖాలయముఁ గాంచెదో? మత్తేమైనఁ గనెదొ?

జీవనంబను నిద్దురఁ జెంది, మృత్యు
దేవతానికేతన శోభ దెలియలేక
మెలఁగెదము మేము;—విందపై మేదినీవ
లయమున కరుదెంచితివి విలాసగతి వి

నూతనముగ మధుర మానసాతనాల
య సుఖసంపదలు స్మరించి యలరు గుత్తి
వోలె మురువుగ నవ్వెదవో? ప్రపంచ
మను విశాల నాటకశాలఁ గనిన కతనఁ

బలుకనేరని యానందభావ మనుభ
వించెదో?—అనిమిత్తము లెంచరాని
హేయవిభ్రాంత కష్టసుఖాయుతములు
నగుమనోగతములెఱుఁగమి,నరిదికుతుక (?)

మొలుకు తీయని నగవులు వెలుఁగఁ జేసె
దో?—ఒకటియుఁ గాకుండిన నుజ్జ్వలం బ
మలమహానందభరితనిశ్చలగుణంబు
పుణ్యమగు నాదికారణ మూర్తివేమొ!

రాగిణీకుమారి

పులవర్తి కమలావతీదేవి

రాగిణీకుమారి నివాసము కలకత్తా నగరము. ఆమె తండ్రి పేరు ఫణీంద్రనాథబోసు; తల్లి పేరు శివకామినీదాసి. తండ్రి కలకత్తానగరమున వైద్యవృత్తి వలన జీవించుచుండెను. రాబడి యంత యధికముగ లేకున్నను వారుమాత్రము గౌరవముగనే జీవించుచుండిరి. రాగిణీకుమారి మిగుల సౌందర్యవతి. ఆమె మొగము చందురుని హసించుచుండెను. అంతియగాక యీ యమ మిగుల గుణవతి. తండ్రికి తన కుమారి తను ఉన్నతవిద్యలు చదివింపవలయునని కోరిక. రాగిణీకుమారికి పదునాఱేండ్ల ప్రాయము. ఆయమ నాల్గవఫారమును క్వీను ఎలిజబెత్తు కళాశాలలో చదువుచుండెను. పిల్లలందఱిలో నామెయే తెలివితేటలలో మిన్నయగుటచేత నుపాధ్యాయినులెల్ల రాయమ్మాయి యన్న ప్రాణపదముగ నెంచుచుండిరి. విద్య వినయమున్నప్పుడే రాణించును. రాగిణీదేవి మూర్తీభవించిన వినయదేవత. ఇంతియగాక యీయమశీల మెంతయు కొనియాడదగినది. బడికి వేళ యతిక్రమింపకుండ నరిగి తన పాఠములనెల్ల క్రమముదప్పకుండగ వల్లించి మరల యింటి కరుగుదెంచిన తోడనే తన మాతృదేవతకు గృహకృత్యములలో సాహాయ్య మొనరించు చుండెడిది.

ఆదివారపు సెలవు దినములయందు రాగిణీదేవి తన చెలికత్తెలతో సముద్రపు టొడ్డునకు షికారున కేగుచుండెడిది. ఒకనా డామె తన వాడుకచొప్పున చెలికత్తెలతో సముద్రపు టొడ్డునకు షికారేగినది. కాలమానము వాతావరణమును చాల బాగుండుటచే చెలికత్తెలామెను జలక్రీడలకై ప్రోత్సహించిరి. వారి మాటలు కాదనజాలక రాగిణీదేవికూడ వారితోడ సముద్రజలములయందు క్రీడ నొనర్ప మొదలిడెను. కర్మవశమున రాగిణీదేవి కాలు జారి చెలికత్తెల చేతుల పట్టు విడచి సముద్రమున పడిపోయెను. చెలికత్తెలెల్లరు భీతమనస్కులై యార్తనినాదము లొనర్చుచు నచటి కనతి దూరమున గూర్చుండియుండిన పురుషులను బిల్చి వారికి జరిగిన సంగతిని వివరించిరి. కాని యా పురుషులెల్లరు 'అయ్యో, పాపము' అనువారలే కాని యొక్కడైన నా గభీరజలముల దిగి యా లలనావతంసమును మృత్యుగహ్వరమునుండి తప్పించువాడు లేకపోయెను.

అప్పుడే గాలిషికారున కరుదెంచుచున్న యదుభూషణు డను యువకు డీ జనసమూహమును సమీపించి వారివలన జరిగిన సంగతి నెఱింగి దన ప్రాణములనేని లక్ష్యపెట్టక సముద్రము పోటివేళయందున్నదని జడియక యదటున నా గభీర జలరాశి మధ్యంబున దుమికి మిగుల కష్టముతో గలయవెదకి రూపంబున సుధాబ్ధిపట్టియగు నిందిరను తిరస్కరించు జలజాతాక్షి రాగిణీకుమారిని దన బాహువుల

చే పట్టుకొని తీరమును జేర్చెను. ఇది వీక్షించు చున్న జనులెల్లరు నా యువకుని ధైర్యస్థైర్యముల వేవిధముల గొనియాడిరి.

రాగిణీదేవి చైతన్యవిహీనయై యుండెను. యదుభూషణుడు దగ్గిరనున్న చిదుగుల నేరిచి తెచ్చి యగ్ని రగుల్కొల్పి రాగిణీదేవికి ఉష్ణమును కలిగించెను. కొంతసేపటికి శతప్రతేక్షణయగు రాగిణి కన్నుల దెరచి తన ప్రాణ రక్షకుడగు యదుభూషణునకు వందనము లర్పించి తన కంఠమునను న్న యొక బంగరుగొలుసును బహుమతిగ నీయబోయెను. కాని యదుభూషణు డా కాంచనాభరణమును వందనములతో నామెకే ఇచ్చి యొక బండిని గొనితెచ్చి యా యిందుముఖిని పితృగృహమునకు గొంపోయెను. జరిగిన కథయంతయు రాగిణీకుమారివలన నామె తలిదండ్రులు లాలకించి యదుభూషణుని తమ కొనర్చిన యుపకృతి కభినందించి యప్పుడప్పుడు తమ గృహమున కిరుగుదెంచు చుండుమని ప్రార్థించిరి.

యదుభూషణుడు ప్రవేశపరీక్షకు చదువు చుండెను. అతడు తన తరగతి యందలి విద్యార్థు లందఱికన్న మిగుల చురుకైనవాడు. అంతియకాక యతని కీతయన్న మిగుల సరదా. 'అఖిలభారత-ఈతపందెము'లో నాతడు మొదటివాడుగా గెలిచి 'కింగుజార్జి' సువర్ణపతకమును బొందెను.

యదుభూషణుడు పైన వివరించిన సంగతులు జరిగినప్పటినుండియు రాగిణీకుమారి యింటికి తరుచు వెళ్లుచుండెడివాడు. రాగిణీకుమారియు తనకు దెలియని పాఠముల నీతని వలన దెలిసికొని బాగుగ చదువుకొనుచుండెను.

కాలక్రమమున వారిస్నేహము మోహముక్రింద పరిణమించినది. ఇందిర యా శరదిందువదన; అరవిందనాభు డా యదుభూషణుడు. వారిరువురు సుగుణయుతులు; అనురూపవంతులు; విద్యాసంపన్నులు అట్టివా రొకరి నొకరు ప్రేమించుటలో నేమి యాశ్చర్యము?

శివకామిని విద్యావిహీన. ఆమె కెంత సేపును ధనవంతుడగు నల్లుడు దొరకవలయుననియే కోరిక.

కొమార్తె నున్నతవిద్యకై చదివించుటాపాలతి కెంతమాత్రము నిష్టములేదు. కలకత్తా నగరమున నంబాలాల్ అను లక్షాధికారి కలడు. అతడు విద్యాశూన్యుడు. అంతియ కాక స్ఫోటకమువలన నాతని రూపముగూడ వికృతముగ నుండెను. అతనిభార్య కాలధర్మ మొందెను. శివకామిని వారి యింటికేగి తనకొమరిత రాగిణిని వివాహ మొనరించు కొనవలసినదని కోరెను. వారి కింతకన్న నేమి కావలయును? వా రొప్పుకొనిరి. తండ్రికి రాగిణిని యదుభూషణున కిచ్చి వివాహ మొనరింపవలయునని కోరికగ నున్నది. యదుభూషణుడు లక్షాధికారి గాకున్నను విద్యావంతుడు.

రాగిణిని అంబాలాలున కీయనియెడల యే నూతిలోనో, గోతిలోనో పడుదునని పట్టుబట్టు

కొని శివకామిని అన్నాహారముల వర్జించికూర్చుండెను. చివరకు భర్తగూడ లొంగిపోవలసివచ్చెను. ప్రియసుత దీనాలాపము లాయమ చెవి జొరలేదు. యదుభూషణు డొనరించిన యుపకార మింతలోనే యామె స్మృతిపథమునుండి మాయమైనది. ఆమె కంబాలాలుని లక్షరూపాయలు దప్ప నింకేమియు గోచరింప లేదు. చివరకు రాగిణీకుమారిని అంబాలాలున కిచ్చుటయే స్థిరపడినది. యదుభూషణు డీవార్త రాగిణీ వదనమునుండి వినినంతనే మొదలునఱకబడిన కదళీతరువువోలె నేలంగూలి కొంత తడవునకు స్పృహ దెచ్చుకొని మిగుల విచారించెను. రాగిణీకుమారికి గూడ నేమిచేయుటకును దోచలేదు. దైవసమానులగు తలిదండ్రుల మాట ధిక్కరించుట యామె కెంతయో పాపకార్యముగ దోచినది. అందువలన యదుభూషణుని తనపై యాశ వదలుకొనుమని చెప్పివైచి తలిదండ్రుల గాంచి "జననీజనకులారా, ఈ దేహము మీవలన నుత్పత్తియైనది. నా సుఖమును చూడవలసిన మీరలే యివ్విధమున నా గొంతుకోయ దలచుచుండ నిక నాకు దిక్కెవ్వరు? మీ మాటకు నేనెదురుపల్కను గావున మీ చిత్తమువచ్చినవారికి నన్నిచ్చి పెండ్లిసేయుడు." అనగా విని శివకామిని హర్షపులకితగాత్రియై అంబాలాలు ఇంటి కరిగి ముహూర్తము త్వరలోననే కుదుర్చుకొని వచ్చెను. వివాహదినము సమీపించినది. రాగిణీదేవిని చీని చీనాంబరములతోడను, అమూల్య రత్నాభరణముల తోడను అత్యద్భుతముగ నలంకరించిరి. కాని పూర్ణిమాశశాంకు దిరస్కరించు నామె మోముదమ్మిపై మాత్రము కత్తివైచినను నెత్తురుచుక్కలేదు. ఆమె యాననము చింతాకులితమై యుండెను. పెండ్లికొమరుడును పెండ్లికొమరితయు, రంగీతోలావీధిగుండ శ్రీరామచంద్రుని యాలయమున వివాహమాడుటకై యూరేగింపుతో బయలువెడలిరి. తల్లిదండ్రులును, బంధుమిత్రులును మహోత్సాహముతో యూరేగింపు వెంట నడుచుచుండిరి. ఊరేగింపు జుమ్మామసీదును సమీపించినది. ఆ సమయమున ఉత్తరహిందూస్థానమంతయు హిందూమహమ్మదీయ కలహములతో నిండియుండెను. మహమ్మదీయులయందు సంఘీభావము గలదు. అంతియగాక మతమన్నచో వారు తమ ప్రాణములనైన నర్పించుటకు వెనుదీయరు. బాజాభజంత్రీలతో ఉత్సవము ముందునకు పోవుచుండెను. ఒక్కుమ్మడి పెక్కుమంది మహమ్మదీయులు తాముండిన జుమ్మామసీదునుండి వెలువడి యూరేగింపుపైబడి లాఠీలతో మోద మొదలిడిరి. తన యనుంగుపత్నిగానున్న రాగిణీదేవిని రక్షించుటకైన యత్నింపక అంబాలాలు పిరికిపందయై యీ దేహము శాశ్వతమైనదని యెంచి కాలికి బుద్ధిసెప్పి పారిపోయెను. రాగిణీదేవి తల్లియు తండ్రియు అంబాలాలు చర్యనుగాంచి మిక్కిలి వ్యసనపడిరి. శివకామిని యుక్తాయుక్తముల నెఱుంగక యిట్టివానికి తనతనయ నర్పింపదలచినందుల కెంతేనియు మదిజింతిం

చెను. కాని కాలము విషమస్థితియందుం దుండెను. కాలాగ్ని రుద్రులవలె మహమ్మదీయులు హిందూ-ఉత్సవమందున్న వారిపై బడి మోదుచుండిరి. అందఱును తమకు మరణ మకాలమున రానున్నదా యని వగచుచుండిరి. అట్టియెడ యదుభూషణు డాత్రోవను పోవుచు నాదురంతమునుజూచెను. ఆతనిరక్తనాళములయం దుష్ణరక్తము ప్రవహించుచున్నది. చేతిలో నొక్కకత్తి తప్ప వేరు ఆయుధమెద్దియునులేదు. పరిస్థితులగూర్చి యాతడించుకేనియు వెనుదీయలేదు. తలచుకొనినయెడల నింకొక సందుగుండ నాతడు నిరపాయముగ దాటిపోగలడు కాని యితరులకు కష్టసమయములయందు తోడ్పడుట యాతనికి చిన్నప్పటినుండియు నలవాటు. చుట్టుపక్కల మావులపై గూరుచుండి తమాషాను పరికించుచున్న హిందూవర్తకులతో నాతడిట్లనియెను "హైందవ యువకులారా" ఏల యీ లీల చూచుచునూరకున్నవారు? మీనాళములయం దా భీమసేనుని రక్తము పారుటలేదా! సింహశార్దూలముల చించిచెండాడిన భరతుని భూమియందు జన్మించినమీా కీపిఱికితన మెట్లు లభించినది?

జన్మ అశాశ్వతము. మనకు మరణ మెపుడైన నున్నదియే. వీరమరణమును పొందిన జన్మరహితమగు వీరస్వర్గమును జూరగొందుము. లేక విజయులమైన యబలామానసంరక్షణ పుణ్యఫలమును బడయుదుము." అని వీరాలాపములబల్కి వారినెల్లర దనవెంట నిడుకొని మహమ్మదీయులనెల్లర తన యవక్రవిక్రమంబున బారదోలి పెండ్లివారినందఱిని మృత్యుగహ్వరమునుండి రక్షించెను. పెండ్లికూతురు రాగిణీదేవి తన ప్రాణరక్షకుడు యదుభూషణుడే యని వినినప్పుడు పొందిన యానంద మింతింతయనరాదు. శివకామిని ఫణీంద్రుడు ఆ యదుభూషణుని భూషించి యనుకొన్న ముహూర్తమునకే శ్రీ రామచంద్రుని యాలయమున రాగిణీకుమారిని కన్యాదాన మొనరించిరి. నూతన దంపతులు పొందిన యానందమునకు మేర లేదు. శ్రీరామచంద్రుని కరుణవలన నా దంపతులు చిరకాలము మానవసేవ యొనర్చుచు తమ జన్మమును సార్థక మొనర్చుకొనిరి.

మీకు మేలైన సువాసనగల అత్తరులు కావలెనా?

అటులైన అత్తరులకు రాజని పిలువబడు ఆటోదిల్‌బహార్‌ను వుపయోగించుడు



కొన్ని బిందువులను మీ చేరుమాలుపై చిలికినతోడనే యింపగు, పుష్పసంబంధమగు సువాసన నీచుట్టుపట్లవ్యాపించును.

ఇంతటిరమ్యమైన, మనోహరమైనవాసనను నీవు బజారులో కొను యితర అత్తరులలో పొందజాలవు.

'ఆటోదిల్ బహార్' అను పేరును యిపుడు జ్ఞాపకమునకు తెచ్చికొనుడు. దానిని ఒకమారుపయోగించుడు. దాని మనోహరమైన, శాశ్వతమైన సువాసనకుతన్మయత్వమును చెందుదువు.

½ ఔన్సు	బుడ్డి	వెల	రు.	2-0-0
¼ ,,	,,	,,	రు.	1-4-0
1 డ్రాము	,,	,,	రు.	0-12-0
మాదిరిసీసా		,,	రు.	0-2-0
సువాసనగలకార్డులు			రు.	0-1-0

వి. పి. చార్జీలు ప్రత్యేకము

కొనునపుడు దయచేసి 'ఆటోదిల్ బహారు' అను పేరును జాగ్రత్తగా పరిశీలించి కొనుడు. అన్నిచోట్లను అమ్మబడును.

సోల్ ఏజంట్లు:—

ఆంగ్లో యిండియన్ డ్రగ్ అండు కెమికల్ కంపెని,

285, జుమ్మామసీదు బజారు, బొంబాయి.

నొప్పులుగాని, తీపులుగాని, ఏవైననుసరియే తొలగింపవచ్చును



మీరు ఏల నొప్పులవలన బాధపడవలెను. ఆ నొప్పులు తలయందైననుసరే, దేహమున యితరచోట్లనైననుసరియే, నడుమునొప్పి, వాయువునొప్పులు, పడిశెము, గొంతురాపిడి, కాళ్లనొప్పులు, కీళ్లనొప్పులు, నాడినొప్పులు, బెణుకునొప్పులు, మొదలగు నొప్పులైనను సరియే, తప్పక త్వరలో

'ఆడమేన్స్ సైప్రెస్ సాల్వ్'

అనువానిచే మాన్పవచ్చును. ఇది వుపశాంతికరమగు అంజనము కాదు. ఇది చాలా మేలైన తైలము. ఇది చాలా విలువగల ఓషధులచే తయారుచేయబడినది. దీనిచే నొప్పులు మొదలంటపోయి తత్క్షణమే నిన్ను ఆనొప్పియొక్క బాధనుండి తొలిగించును. **వేలకువేలు** దీనివల్ల లాభపడిరి.

వెల బుడ్డి 1 కి రు. 1-0-0. వి. పి. చార్జీలు ప్రత్యేకము.

ఈ అత్యద్భుతమగు బాధనివారిణి ఫలమును కనుగొనుటకు యీ క్రింద పేర్కొనిన **అంగడినుండి 2 అణా**లకు శ్యాంపిలుడబ్బీ తెప్పించుకొనవచ్చును.

మెస్సర్సు:—ఎ. బి. పారెక్, 259, చైనాబజారు, మద్రాసు.

సోల్ ఏజంట్లు:—ఆంగ్లో యిండియన్ డ్రగ్ అండు కెమికల్ కంపెని,

285, జుమ్మామసీదుబజారు, బొంబాయి.

ఏల మీరు కామినియాతైలమునుమాత్రమే వాడవలెను?

(రిజిష్టరు చేయబడినది)



ఎందుకనగా:

కామినియాతైలము వెంట్రుకలకు చాలలాభకరమైనది

కామినియాతైలము వెంట్రుకలు ఊడిపోవుటను ఆపును.

కామినియాతైలము వెంట్రుకలు పొడవుగాను, దళము గాను కాంతిగాను పెరుగుటకు తోడ్పడును.

కామినియాతైలము సువాసనతైలము మాత్రమే కాదు. అయితే వెంట్రుకలు పెరుగుటకు కావలసిన ఓషధులు ఇందులో గలవు.

కామినియాతైలము పుర్రెకు చల్లదనమును గలిగించి మెదడుకు విశ్రాంతి నిచ్చును.

చదువుడు, ఆలోచింపుడు, ఆర్డరును పంపుడు.

కలకత్తాలోనున్న ఫార్వర్డుపత్రిక తెలిపినది:—"ఆంగ్లో ఇండియన్ డ్రగ్ అండ్ కెమికల్ కంపెనీవారిచే పంపబడిన అత్తరులు, వాసనతైలములు విభజింపబడి, పరీక్షచేయబడుటవలన అందులో హానికరమైన వస్తువులు లేదని ఋజువుపరచబడినది. కామినీయా వాసనతైలమునందు మనోహరమైవ అత్తరు చేర్చబడినది. మెదడుకు చలువను గలిగించును."

సి. యు. ఆర్. కార్వెల్లో, ఎస్. ఏ. సర్జను, పెరా ద్వీపమునుండి వ్రాసినది:— "కామినియాతైలము మిక్కిలి మంచిదనియు, తృప్తికరమైనదని నిస్సందేహముగా కనుగొంటిని. ప్రత్యేకముగా చుండుకు, పుర్రెకు త్వరలో గుణమును గలిగించును. ప్రస్తుతము వాడుచున్న నా రోగులకందరికిని దీనిని శిఫార్సుచేసితిని."

బుడ్డి 1 కి ధర రూ. 1—0—0	వి. పి. ఖర్చులు రూ. 0—6—0
బుడ్లు 3 కి ధర రూ. 2—10—0	,, ,, ,, 0—12—0

హెచ్చరిక:—ప్రతిపట్టణమునందును, గ్రామమునందును యున్న సుప్రసిద్ధమైన దుకాణములందు కామినియాతైలము విక్రయించబడుచున్నది. మీరు అడుగునట్టి దుకాణమునందు దొరకనిచో అతనిపేరును మాకు తెలుపుచూ, ఆర్డరును మాకు నేరుగా పంపుడు. కొందరు వర్తకులు ఎక్కువలాభమునకై ఆశపడి పేరులేని వర్తకుగుణతులు గలవి, తక్కువరకమువి "శ్రేష్ఠమైనదని" తెలుపుదురు. గనుక అట్టి తంత్రములను నమ్మి మోసపోకుడు. ఎల్లప్పుడును కామినియాతైలమునే పట్టుపట్టి తెప్పించి వాడుడు. ఇతరమైనవాటిని తెప్పించవద్దు.

ఆంగ్లో ఇండియన్ డ్రగ్ అండ్ కెమికల్ కంపెనీ.

285, జుమ్మామసీదు, బొంబాయి.

కృష్ణుని పలుకు*

శ్రీ శివశంకర శాస్త్రిగారు

మూన్నాళ్ళనుండియు ముద్దులకృష్ణు
వెదకుచున్నావుగా వెర్రి రాధమ్మ!
మూడుజన్మలకైన ముగ్ధమానసము
కనుగొనజాలునే కల్యాణరూపు?
ఆయాసమేకాని అన్వేషణమున,
దయ కల్గ నాతండె దర్శనం బిచ్చు.
చాటేల అతని కో చంచలనయన?
ప్రత్యక్షముగ నుండి భ్రమియింపజేయు.
వీక్షణావరణంబు వీడిపోకున్న
సాధ్యమెట్లాను తత్సందర్శనంబు?
అతనిజాడలు పట్టు నంత నేర్పరివ?
గుట్టుమట్టెల్ల నీ వెట్టెరుంగుదువో?
పాదంబు కడుపులో బ్రహ్మాండమెల్ల
నిండును మంజీర నినదంబుతోడ.
పిచ్చిదానా, నీకు బృందావనమున
అతని చిన్నెలే అగపడలేదె!
బృందలో నేటికి—పృథ్వి నెల్లెడల
కన్నులు గలవారు కాంచగాగలరు.
నెమలిపింఛము భవన్నీలాంశుకమున
బంగారుశాలువు బాహుయుగ్మమున
వెలయుచున్నవి చూడు వెర్రినారాధ!

పుష్పమై యాతండు పొదలలో లేడు
నీకొప్పులోననే నిండియున్నాడు.
తమ్మిలో దేనెగా ద్రవియింపలేదు
నీముఖాబ్జమునందె నెలవుకొన్నాడు.
వంశిలో లీనమై వర్తిల్లలేదు
వరలుచున్నాడు నీవాక్సుధాఝరిని.
మోహనాంగుని ఏల మూలల వెదుక
నిఖిలలోకమ్ముల నిండి యుండంగ?
ఆతడు దొంగిలి నట్టి దో రాధ,
వెన్న కా, దాలాటి స్విన్నమానసము.
సిగ్గులు హరియించె, చీరలు కాదు,
తరుణు లాతని దారి తప్పింపలేదు,
దారితప్పినవారి దరిజేర్చునతడె,
మధురలో పౌరులేమరపింపలేదు,
భక్తు లెల్లెడ వాని బంచుకొన్నారు.
నిలువజాలవయేని నీవు శ్రీకృష్ణు
విగ్రహంబును నేడు వీక్షింపకుండ
బాహ్యచక్షువు మూసి పరమార్థదృష్టి
వీవృతంబు సేయ, తద్విశ్వరూపంబు
సాక్షాత్కరించు ఈ క్షణములోపలనె!
ఇతి శ్రీమద్రాధావల్లభో విజయతే!

---

* మన్మిత్రులు, పూజ్యులు నయిన శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారి కోరికపై శ్రీ శారదా నికేతన వార్షికోత్సవమున పాడుటకై చెప్పినది. శ్రీ రాయప్రోలు సుబ్బారాయకవీంద్రుని "జడకుచ్చులలో" "రాధపిలుపు" నకు మారువేసమున కృష్ణుని ప్రత్యుత్తరము.

జైనుల మతకథలు

పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి గారు

[౧౦. పంచనమస్కారకథ]

శ్లో. తొం చేవ్వ మోక్ఖపదవీ, తొం చియ సరణం జణస్స సవ్వస్స,
తొం ణిక్కారణవిద్దో జాయిజరామరణవాహిహరో.†

—పంచనంద్యాచార్యుఁడు.

ఎక్కాలీ ప్రసిద్ధిపొందిన దేశాలల్లో పూర్వకాలాన అంగదేశం వొకటి. మనకథజరిగిన కాలంలో అంగదేశాన్ని పాలిస్తూన్నరాజు పేరు నరవాహనదత్తుడు. నరవాహనదత్తుడన్న పేరు కొంచెం రాజసాన్ని కనపరుస్తూన్నా, పరిపాలనకార్యాలు ఆలోచిస్తే ఆ పేరు శుద్ధసాత్త్వికాన్ని వెల్లడిస్తూ (నరులకు వాహనుడు-అనగా ప్రజలప్రేమకు పాత్రుడు) ఉండేదని పెద్దలు చెబుతుంటారు. అసలే మాంఛీ తెలివితేటలు కలవాడాయె. అపైని ప్రజాప్రేమా ఆస్తికత్వం — మొదలయిన వన్నీ వుండటంచేతా, అంధర్నీ సమానంగా చూసుకోవడంచేతా ఆరాజుపరిపాలనా అంటే మహా ఆనందం ప్రజలకు.

ఇల్లా వుండగా నరవాహనదత్తుడి రాజ్యానికంథా అలంకారప్రాయమైన చంపాపట్నంలో వృషభదాసు—అని వక కోమటి మహాపుణ్యాత్ముడు వుండేవాడు. పుణ్యాత్ముడంటే పుణ్యాత్ముడా! ఎప్పుడూ జినస్మరణే. ఏప్పుడు చూసినా జినసేవయే. జినకథాశ్రవణమే. రాత్రుళ్లూ పగళ్లూ విధీవిరామం లేకుండా ఎంతెంతమందో భక్తులు సన్యాసులు పండితులు మొదలయిన పెద్దలందరూ రావడం, నానావిధాలయిన మతసంభాషణల్తో కాలక్షేపం జరగడం—ఇదీ ఆయనపని. దీనికి తగ్గట్టే ఆయనభార్యాగారుకూడా—ఆమెపేరు అర్హద్దాసీలేండి—అమితదైవభక్తి గలది. భర్తచేసే ప్రతీపన్లోనూ ఆకునకుతొడిమెలాగా అంటుకూనే వుంటుందీ. కాబట్టే అనుకూలమైనదాంపత్యంకంటే మించిన పుణ్యలోకం లేదంటూరు; పెద్దలు.

వృషభదాసు చాలా సంపన్నుడూ, కావలసినంత నౌకరీచాకరీలు కలవాడూ; ఆపైన పెద్దసెట్టికూడాను. ఆయనదగ్గఱ ఉద్యోగం దొరుకుతుందంటే ఉబ్బిపోని వాళ్లు ఎవ్వరూ ఉండరంటే నమ్మండి. అంతప్రేమతో సేవకులను ఆదరిస్తాడన్నమాట. వృషభదాసుదగ్గఱ ఉండే సేవకులలో గోపాలుడుకూడా వకడు. వాడిపని ఎప్పుడూ అతనిపశువులను మేపుకొరావడం. ప్రతిరోజూ పొద్దుటే లేచి పశువులు తోలుకోపోయి మేపుకొని వస్తూంటాడువిసుగులేకుండా. ఇల్లా వుండగా వకనాడు మామూలుకు మల్లే అడవికిపోయి వస్తూంటేగా దోవలో మాంచి మంచులో కూచోని కదలకుండా మెదలకుండా సమాధిలో వున్నచారణయోగినిమాశాడు గోపాలుడు. గడగడ వణికిపొయ్యేచలిలో—ముద్దలు ముద్దలుగా మంచుపడుతూన్న బయలులో—చివఱకు గోచీ అయినా లేకుండా నిశ్చలంగావున్న ఆమున్ని చూశేప్పటికి గోపాలుడుహృదయం నీరైపోయింది. కాని ఏంచెయ్యడానికీకూడా తోచలేదు. తనదగ్గరా బట్టాపాతా ఏమీ లేవాయె అతనికి కప్పడానికీని. పైగా అతన్నిగుఱించి జాలిపడుతుం

---

†ఛాయ:—శ్లో. త్వం చైవ మోక్షపదవీ, త్వంచైవ శరణం జనస్య సర్వస్య, త్వం నిష్కారణవైద్యో, జాతి జరామరణవ్యాధిహరః.

అర్థము:—ఓజినదేవా! మాకునీవే మోక్షమార్గం. సర్వజనానికిన్నీ నీవే దిక్కు. (మాబోంట్లకు) నీవే నిష్కారణవైద్యుడు. జాతి జరా మరణం రోగం—మొదలయినవాటి వన్నీ హరించేవాడవు.

డగానే ప్రొద్దు వాలిపోతున్న దాయెను. ఏంచెప్మా అను కుంటూ చాలాసేపు అక్కడ్నే నిలుచున్నాడు. ఎంతసేపు నిలుచున్నా కొయ్యబొమ్మ తెచ్చి కొట్టినా పల్కదు అన్నమో స్తరుకు ఏమీ లోపం లేదు.

చివఱకు ఎల్లాగో ఓలాగా ఇంటికి చేరుకున్నాడు. ఆరాత్రి ఏమీ నిద్దర పట్టలేదు వాడికి. తరవాత వాడు చాలాసేపు ఆలోచించుకొని వృషభదాసు ఇంట్లోవుండే కొన్నిబట్టలు తీసికోని ఇంకా ఝామురాత్రి ఉండగానే బయలుదేరి పశువుల నోలుకొని సరిగ్గా చారణముని వున్నచోటుకు చేరాడు. ఆతెచ్చిన బట్టలన్నీ ఆయనకు చుట్టబెట్టి పశువుల్ని చుట్టుప్రక్కల తోలి తానుమాత్రం ఆయనకు సేవచేస్తూ ఉన్నాడు. ఇంతలో తెలతెల్లవార వస్తున్నది. ఇంతలోచారణముని కన్ను తెఱచి చూశాడు. ఎదట గోపాలుడూ తనకు నిండాబట్టలు కప్పి పరిచర్య చేస్తుండడం గమనించి నవ్వుకొన్నాడు. తర్వాత ఎవరు నీవూ? అన్నాడు. ఉన్నదంతా చెప్పగానే జాలిపుట్టి వాణ్ణి దగ్గరికి తీసికొని "నాయనా! బుద్ధిమంతుడవోయ్. చూడూ నీకు ఏకమంత్రం వుపదేశిస్తాను. దాన్ని నీవు జపంచేస్తుంటే ఎంత కష్టమైన పని అయినా సుగ్గుతుం టుంది సుమా."— అని చెప్పి "ణమో అరిహంతా ణం"— అని ఉపదేశం చేసి వెంటనే వెళ్లిపోయాడు. గోపాలుడు అప్పట్నించీ దాన్ని శ్రద్ధతో జపం చేస్తూ వచ్చేవాడు.

ఏకనాడు గోపాలుడు పశువుల దగ్గఱికి వెళ్లకుం డా ఇంట్లోనే వుండవలసి వచ్చింది. అందులోనూ ఆనా డు వృషభదాసు దగ్గరకూర్చొనే పనిచెయ్యాలసి వచ్చిం ది. పనిచేసేప్పుడంతా ముందుగా ఏమో పెదవులు కద లిస్తూ చెయ్యడాన్నిచూచి "ఏమోయ్. ఇంత పొగరు వచ్చిందా? ఏమిటీ గొణుగుతావూ?"— అని ఆగ్రహ పడ్డాడు వృషభదాసు. ఏమీలేదు—అని మొదట తప్పిం చుకోడానికి చూశినా వృషభదాసుకు ఆగ్రహం హెచ్చి పోతున్నది: ఇఖ విధిలేక వున్నదంతా చెప్పేశాడు గోపాలుడు. వృషభదాసు మహా ఆనంద పడ్డాడు— భలే! నాకు సేవకు దనిపించావు — అంటూ అతణ్ణి ప్రేమదృష్టితో ముంచెత్తినాడు. ఎందుకని అంటారా? చెప్పలే సజ్జన లక్షణమే అదీ! కాబట్టే 'సతత స్సత్యం ధర్మానురాగిణః' అన్నారు.

గోపాలుడు ఇట్లామంత్రాన్ని నిరంతరంగా జపిస్తూ తనపనులు తాను నిరభ్యంతరంగా చేస్తున్నాడు. ఈమధ్యకాలంలో ఇంకోచిత్రం జరిగింది. గోపాలుడు మామూలుగా పశువులను తోలుకోని అడవికి పోయేడు. అక్కడికి గంగానది కూతవేటుదూరంలో వుంది. వర్షా కాలం అయినందుచేత ఆరోజుల్లో గంగ ఇద్దరీ అద్దరీ తన్ని పారుతున్నది. గోపాలుడు పరధ్యానంగా పశువుల వెంట వస్తున్నాడు. ఇంతలో పశువులకి అద్దరిని మిసమిస లాడుతూ ఏపుగా పెఱిగిన పచ్చికపట్లు కనపడ్డాయి. వెంటనే అవి తోకలెత్తికొని అరుస్తూ ఏటికడ్డంగా పరి గెత్తసాగాయి. గోపాలుడు ఈసంగతి కనిపెట్టేలోప ల్నే దాదాపు ఆవులన్నీ నదిలో దూకినవి. ప్రవాహం చాలా జోరుగా వున్నది. ఏమో ఏ మ వు తుం దో? అనే చింతతో ఆమంత్రాన్ని పఠిస్తూనే గోపాలుడు తా నుకూడా గభాలున గంగలో దూకాడు. సరిగా ఆసమ యానికే అక్కడ పెద్ద సుడిగుండం ఏర్పడ్డది, ఇదివరకే అందులోకి వచ్చి తల్లక్రిందులుగా ఒకపెద్దతనాబీ తిరుగు తున్నది. గురిమూసి దూకినట్లు ఆదూలం గోపాలుడి డొక్కలో పొడుచుకున్నది. సరి గోపాలుడు మునిగి పోయాడు. ప్రచ్ఛన్న దుర్జనకృత్యంలాగా ఆతనాబీ అతని ప్రాణాలు తీసివేసింది.

ఈవిధంగా చచ్చిపోయిన గోపాలుడి ఆత్మ కొన్నాళ్లకు కర్మశేషంవల్ల అర్హద్దాసీగర్భంలో ప్రవే శించింది. భార్య అపరూపంగా గర్భం ధరించినందుకు వృషభదాసుకు కల్గిన సంతోషానికి హద్దూపద్దూలేదు. ఆసంతోషాన్ని ఆయన అనేకధర్మకార్యాలవల్ల వెల్లడిం చాడు. చిట్టచివఱకు అర్హద్దాసికి మొగపిల్లడు పుట్టాడు. పిల్లడన్నా పిల్లడా? బంగారపు విగ్రహం. అమిత గారా బంగా పెంచుతున్నారు. పిల్లాడిపేరు సుదర్శనం— అన్నారు. లోకులంతా అన్నారుకదా—ఒక్కపేరే కాదు, రూపం, గుణం, తేజస్సు—అన్నీ కూడా సుద ర్శనమే—అని.

క్రమంగా సుదర్శనం పదిపద్ధారు ఏండ్లవాడైనాడు. అందుకు తగ్గట్టే చక్కగా విద్యాబుద్ధులూ—మర్యాదామాన్యతా అబ్బినాయి. కావలసినంత ఐశ్వర్యం. ఓ—బోలెడందరు హితులూ ఏర్పడ్డారు. మంచి అందం, దానికి మెఱుగుబెట్టే యౌవనం, క్రమంగా అతనిలో జతపడ్డవి. ఇక చెప్పవలసిందేముందీ? వీళ్లూ వాళ్లూ అనేభేదం లేకుండా అంతా అతన్ని రెప్పాలకుండా చూసి మురిసి పోతుండేవాళ్లు. ఊళ్లోవాళ్ల సంగతే ఇల్లావుంటే కన్నతల్లితండ్రుల ఆనందానికి మేర వుందా; చెప్పండీమఱీ.

వృషభదాసు వన్నెవాసీ కల కొడుకుని చూసి కోని పొంగిపోతూవున్నా, వైరాగ్యమార్గంలోనుంచి వంచితుడు కాలేదు. కాబట్టి భార్యతో ఆలోచించి, అన్నివిధాలా వియ్యానికి తగ్గసాగరదత్తశెట్టికూతుర్ని మనోరమను కోడలినిగా చేసికొన్నాడు. తర్వాత మఱికొంతకాలం పోనిచ్చి రాజుగారితో మనవిచేసి తనశెట్టిపదవిని అతనికిఇప్పించి తాను భార్యతోసహా సమధిగుప్తునిఆశ్రమానికివెళ్లి అక్కడ జినదీక్షనుస్వీకరించి మహాఆనందంతో

శ్లో. ధన్యోఽస్మి పుణ్యనిలయోఽస్మి నిరాకులోఽస్మి
శాంతోఽస్మి నష్టవిపదస్మి విదస్మి దేవ!
శ్రీమజ్జినేంద్ర భవతోఽంఘ్రియుగం శరణ్యం
ప్రాప్తోఽస్మి చే దహ మతీంద్రియసౌఖ్యకారి.

అని భజనచేస్తూ సిద్ధిపొందినాడు. నిజమే. విచణుల కృత్య మింతే అంటారు.

సుదర్శనం తర్వాత తన గుణసంపదవల్ల రాజుకు అత్యంతం విశ్వాసపాత్రుడైనాడు. విశ్వాసమంటే కాస్తాకూస్తా గాదు. సుదర్శనం ఒక్కక్షణం దగ్గఱ లేకపోతే ఇఖ రాజుకు మతిపోతుంది. అంతే. దీనిబట్టి తెలిసికోండి. వారిస్నేహం ఎల్లాంటిదో!

రాజుల్తో స్నేహం పాముల్తో చెలగాటం—వకటే అంటారు. రెండూ మొదట చాలా ఆనందమే కలిగిస్తాయి. కాస్తంత మధ్య చిక్కుపడ్డదా అంటే—రెండూకూడా ప్రాణాలు తీసేస్తాయి. ప్రస్తుతం ఈసామెతకి ఉదాహరణంగానే ఉంది సుదర్శనంజీవితం. ఏమంటారా?—రాజుతో మైత్రి రోజుకు రోజూ ఎక్కువ అవుతూండడం మూలాన్ని అతనికి సిరీసంపదా ప్రజల్లోపలుకుబడీ పరపతీ—అన్నీ వున్నాయి. సరే దీనికి ఆనందించాలసిందే.

కాని ఇంకో బెడద పట్టుకొన్నది. రాజుగారి పట్టపుదేవి వుంది వఖ మహాయిల్లాలు. ఆమెకు రాజు ఎంతప్రేమించినా, ఏమేమి చేసినా తృప్తిలేదు. ఆయిల్లాలు 'నాఽగ్నిస్తృప్యతి కాష్ఠానాం' అనేతరహాలోది. సుదర్శనాన్ని చూశేటప్పటికల్లా ఆమెమనస్సు దుర్దర్శనం అయిపోతుంది. ఒళ్లు జలదరిస్తుంది. తర్వాత ఏమిటో ఏంచేస్తున్నదోకూడా తన్ను తాను తెలిసికోలేనంత జడమైపోతుంది ఆ ఆత్మ. ఏంచేస్తుందీమఱీ? విచారిస్తే ఆమె తప్పు ఏమీ కనపడలేదు. న్యాయంగా మొదట నవ్వులూ తుళ్లులూ—ఆ తర్వాత సైగలూ—పిమ్మట రాయబారాలూ సాగించింది. ఏంసాగిస్తే ఏముందీ? పాపం అవన్నీ—అంధేందూదయముల్, మహాబధిరశంఖారావముల్—అన్నట్టే అయ్యాయి. చిట్టచివఱకు తనదాసీని ఆశ్రయించి ఆమెను ఎల్లాగైనా కార్యం గట్టెక్కించమని ప్రార్థించింది.

అనడానికి దాసీదే. అయినా అది—పేరు నిపుణిక—ఎన్నోవిధాల నీకిది తగదని చెప్పింది. అదలించింది. బెదరించింది. ఏమీ ప్రయోజనం కనపడలేదు. చివఱకి విసిగి సరే ఏలాగో అతన్ని ఇక్కడికి తేవడం నాపని. తర్వాత సాధించుకోవడం మీ వంతే—అన్నది నిపుణిక. ఓ! చాలు. ఈ పాటిచేస్తే అంతా అయినట్టే!—అని చిటికవేసింది రాణి.

తరవాత నిపుణిక సుదర్శనాన్ని వెంబడించే ఉండేది. ఎందుకంటే—కాస్తంత సందు దొరికితే ఈమంత్రం అతనిచెవులో వుపదేశించడానికి! అయితే ఏంచెయ్యనూ? ఏమీ సందు దొరక లేదు. ఎప్పుడు చూశినా, ఏవేళవెళ్లినా రాజూ సుదర్శనం కలసే వుంటున్నారు. ఆఖరుకి వఖనాడు ఎల్లాగైనా ఇవాళ్ల పట్టితీరాలెనని పట్టుదల్తో అతన్ని అనుసరించింది. రాత్రి చాలాసేపు అయింతర్వాత సుదర్శనం రాజుదగ్గఱ సెలవుతీసికొని వెళ్లుతున్నాడు. దాశి అతనివెంట వెళ్లింది. వెళ్లగా వెళ్లగా చివఱకు వాళ్లిద్దరూ ఒకరివెనకాల మఱొకరు చొప్పున స్మశానంలోకి

చేరారు. సుదర్శనం అక్కడ కాయోత్సర్గం చెయ్యడానికి కూర్చోబోతూ వెనక్కి తిరిగి చూసేసరికి నిపుణికవున్నది. విచారిస్తే సంగతీసందర్భం అంతా బోధపడ్డది. సుదర్శనం ఆమెను గట్టిగా చీవాట్లు పెట్టి తరిమివేసినాడు. దాసి వెనక్కివచ్చి రాణితో జరిగినవిషయం యావత్తుచెప్పింది. అయినా ఆమెవదల్లేదు. "సరే! ఉండే చోటు తెలిసిందికదా! ఇక ఫరవా లేదు. రేపు ఎల్లాగైనా తీసికోరాక తప్పదు లేకుంటే నిన్ను ఏంచేయిస్తానో! చూచుకో" అన్నదిరాణి. పాపం పచ్చివెలక్కాయపాకంలోబడ్డది నిపుణిక.

మర్నాడు రాణీ దాసీ — ఇద్దరూ మాట్లాడుకున్నారు. ఎట్లాగైనా సుదర్శనాన్ని ఆనాడు తేవలసిందే అనుకున్నారు. అయితే ఉపాయ మెల్లా? పోతుటీగ దూరకుండా జనానాకు పహరా ఇస్తుంటారాయెను. అందుకని నిపుణిక ఒకయుక్తి చేసింది. పగటిపూటే ఊళ్లో తిరిగి మనిషి అంత ఎత్తుగల మట్టిబొమ్మను సంపాదించింది. దానికి మగవాడివేషం వేసి కనికనిచీకట్లో ఆబొమ్మను బండ్లో పెట్టుకొని జనానాలోనికి వస్తున్నది. పహరా వాళ్లు ఆబండిని చూసి ఆపి పరీక్షించారు. లోపల ఎవడో మగవాడు కూర్చున్నట్టు కనిపిస్తే ఆగ్రహంతో ఆబండ్లోవున్న బొమ్మని చెయిబట్టుకొని జఱ్ఱున లాగారు. వెంటనే అది క్రింపబడి తుత్తునకలైపోయింది. వెంటనే నిపుణిక లేచి కండ్లెఱ్ఱజేసి అరుస్తూ—"ఇంత పొగరెక్కిందా? రాణీగారు ఇవాళ్ల ఉపవాసం వుండి నరవ్రతం చేస్తూంది. ఆమె ఈబొమ్మను పూజిస్తేనే గాని ఇక గంగముట్టుకోదు. అందుకే నేనీబొమ్మను నాల్గురోజులనుండీచేయించి తీసికొచ్చాను. మీరు బద్దలు చేస్తారా? నేను వెళ్లి రాణితో చెబుతాను. వీపులు బ్రద్దలు అవుతాయి"అని ప్రచండంగా ఉపన్యాసం ఆరంభించింది. ఆదెబ్బతో పహరావాళ్లు హడలిపోయి ఆమెను అనేకవిధాల ప్రార్థించారు. చివఱకు ఎల్లాగో సమ్మతించినట్లు నటించి—'అల్లా అయితే నేను మఱోబొమ్మను తెస్తాను. మఱిమీరు అడ్డుకోకూడదా'—ఉన్నది. "తల్లీ—బుద్ధివచ్చింది. మఱల ఇల్లాంటితప్పుచేస్తామా?" అన్నారు వాళ్లు. నిపుణికకు పట్టరానంత ఉత్సాహం వచ్చింది.

వెంటనే నిపుణిక శ్మశానంలోకివెళ్లింది. అక్కడ అప్పటికప్పుడే సుదర్శనం కాయోత్సర్గాన్ని అవలంబించివున్నాడు. నిపుణిక కదలకుండా మెదలకుండా కూచున్నవాణ్ణి కూచున్నట్లే బండ్లో పెట్టుకొని అంతఃపురంలోకి వచ్చి రాణీగారి యెదుట సరకు దింపింది. రాణీగారు ఆమెకు చాలా బహుమతులిచ్చి పంపివేసి ఏన్నోవిధాల అతన్ని సమాధిలోంచి చలింప జేయుటకై పాట్లుపడ్డది. ఆలింగనాలూ, గిచ్చుళ్లూ మొదలయిన విద్యఅంథాచేశింది. కాని సుదర్శనుడు కదలకుండా,చలించకుండా ఉన్నాడు. స్థాణువత్ అథవా నల్లచట్టువత్. కాబట్టే పెద్దలు అన్నారు కూడాను:—

'సంతః కష్టశతైశ్చాఽపి చారిత్రాన్న చలం త్యపి.'
—నేమిదత్తుడు.

ఇంతవరకూ వున్నరాణిగారి మోహమంతా చివరకు విసుగెత్తి నిరాశగా మారి క్రమంగా ఒక్కొక్క మెట్టూ ఎక్కి ఇక్కడినుండీ కోపంగా ఆవిర్భవించి చివఱకు ప్రబలమైన ద్వేషంగా అలముకొన్నది. ఇక మఱి ఆ ద్వేషాన్ని ఆపుకోలేక దాన్నంతా సాహసంగా మార్చివేసుకొన్నది. వెంటనే ఆమె ఏంజేసిందనుకొన్నారూ! ఒళ్లంతా గిచ్చుకొని గాయాలు చేసికొని పెద్ద పెద్దరాగాలు తీయడం ఆరంభించింది ఆదెబ్బతో అంతఃపురం అంతా వక్కుమాటు గోల్లుమన్నది. ఒక్క గోల్లుమనడం మాత్రమే గాకుండా ఆ యేడ్పు ఫిరంగి దెబ్బలాగా సూటిగా వెళ్లి రాజుగారి గుండెలకు ధాంమని తాకింది. దానితో ఆయన చిందరవందరై అంతఃపురానికి పరుగెత్తికొని వచ్చాడు.

రాణిగారు ఆయన్ను చూస్తూన్నే వెక్కి వెక్కి యేడుస్తు సుదర్శనుడు తన్ను బలాత్కరించాడు— అనే మొదలయిన కృతు లెత్తుకొని స్వరమున తాళలయాదులు తప్పకుండా గానా బజాయించింది. రాజుగారి వివేకమంథా ఇదివఱకే గంగలో కలిసింది కాబట్టి వెంటనే అతన్ని వురిదీయించడానికి ఉత్తరువిచ్చాడు. అయినా సుదర్శనుడు కదలలేదు. మెదలలేదు. తలార్లు ఆయన్ని తీసికోపోయి అప్పుడే శ్మశానం ఉరిస్తంభానికి కట్టివేసి కత్తులతో ఒక్కమాటుగా కంఠానికి గురిచూసి కొట్టారు.

కాని ఏంచిత్రం జరిగిందనుకొంటారూ— అప్పుడా కత్తులు పూలమాలలై అతనికంఠానికి చుట్టుకొన్నవి. దేవతలు అతన్ని పూలతో నింపారు.

తర్వాత రాజుగారు ఈసమాచారం తెలిసి అక్కడికి వచ్చి అతన్ని ప్రార్థించి తీసికొనిపోయి యప్పటిలాగానే అతన్ని ఉంచారు. కాని సుదర్శనుడు విరక్తుఁడై తనకొడుకు సుకాంతుడికి ఆ పదవి ఇచ్చి తాను విరక్తుడై అడవులకు వెళ్లి మునియై జైనేంద్రదీక్షను పూని దర్శన జ్ఞాన చారిత్ర తపోత్యాగాదులచే కేవలజ్ఞానము నొంది నిర్బాధకమగు మోక్షపదవి నొందినాఁడు. కనుకనే పండితులు జినుని యిట్లు నుతించుచుందురు గదా!

శ్లో. సజయతి జినచంద్రః కేవలజ్ఞానకాంతిః
ముదిత సకల భవ్యోత్కృష్ట నేత్రోత్పలాఢ్యైః;
అసురసురనరేంద్రైః ఖేచరేంద్రైః స్వభక్త్యా
శ్రుతజలధిమునీంద్రైః స్సేవిత శ్శర్మదాతా.

౧౦ పంచనమస్కార మంత్రకథ ముగిసినది.

రాధికావిరహము*

మద్దూరి సాంబయ్యా గారు

లలితయమునానదీతీర కలితవనుల
నొంటిమెయి నొక్క విరిపొదరింటియందు
నీపయి విరాళిఁ దాపమందెడిని రాధ
నాథ! దయచేయు, మో జగన్నాథ, కృష్ణ!

మోవి తేనియ లానుచు ముద్దుగొనుచు
లాలనలు సేయు నిన్నుఁ దలంచి రాధ
మంతనంబున నీకయి మరులు జెంది
దెసలఁ బరికించుచుండె నేతెమ్ము కృష్ణ!

నిన్నుఁ గలయంగవచ్చుచు నెలఁత మిగుల
వడిగ నడువంగఁబోయి కంపంబుఁ జెంది
తొట్రిలుపదాంబుజంబులఁ ద్రోవనడుమ
సోలి పడుచుండె రమ్ము గోపాలకృష్ణ!

వలపు సెగలకుఁ దాళక వెలఁది తెల్ల
తమ్మితూడులె చే కడియమ్ములట్లు
పూని నీతోడఁగూడి సంభోగమందు
నాస జీవించియుండె రావయ్యా, కృష్ణ!

మాటిమాటికి నొక వింత మండనంబు
లీలఁగైసేసి తానె శ్రీలోలుఁడనెడు
భావనాపారవశ్యమై పడఁతియుండె
నొక్కపరి చూతుగాని రావోయి, కృష్ణ!

"చెలియ, యిదియేమె తడవయ్యె చెలువుఁ డింక
రాకయుండె నడుమ నుపద్రవము లేమి
గలుగఁబోవుగదా" యని పలుమరు నను
నడుగుఁ గడు నాతురత రాఁగదయ్యా, కృష్ణ!

కరిమొయిలులీల నలమిన యిరులఁ గాంచి
పతి యిదే వచ్చెనని బాహులతలు సాచి
కౌఁగిలించుచు మై నెఱుంగని వలపున
ముద్దిడుచునుండు మాటి కమ్ముదిత కృష్ణ!

తాను కైసేతఁగాంచి సిద్ధపడియుండి
నీవు వచ్చుట తడవైన నిలువలేక
సిగ్గువిడి నల్వురు వినంగ బిగ్గరగ మ
హార్తితో నేడ్చు రాధ రావయ్యా, కృష్ణ!

ఇది జయదేవకవివిరచిత
సదమలగీతంబు రసికజనులకు మిగులన్
ముదమొసఁగి కృష్ణుని పయిన్
గదలని సద్భక్తి నిలుపుఁగాతసతమ్మున్.

---

*జయదేవకవి రచిత గీతగోవింద మహాకావ్యమందలి "నాథహరే జగన్నాథహరే" అను ద్వాదశాష్టపదికి అనువాదము.

హరిదాసు

రాజావాసిరెడ్డి శ్రీదుర్గా సదాశివేశ్వరప్రసాద్ బహదర్ గారు

16 వ శతాబ్దియందొక పురుషుడు ఢిల్లీ సమీపమందలి యరణ్యములో వసించుచుండెను. ఇతని యూరు పేరులేవియో, కులగోత్రములేవియో, తలిదండ్రులెవ్వరో, పూర్వవృత్తాంతమెట్టిదో, తెలియరాకున్నవి. కాని జనము వీనిని 'హరిదా'సని పిలుచుచుండిరి. ఇత డైహికసంపదలు నశ్వరములని గుర్తించి మునిజనములకు శరణ్యమైన యరణ్యముజేరెను. అక్కడ నొక కుటీరము నిర్మించుకొని యందు నివసించుచుండెను. అక్కడ నితడు ప్రశాంతముగా గూర్చుండి పరమపురుషుని ధ్యానించుచుండువాడు. ఇట్లత డొకొకతూరి భక్తిపరవశుడై మహానంద మనుభవించుచు నాకలి దప్పులగూడ నెరుగకుండు వాడట. సంగీతశాస్త్రమున బాగుగా బరిశ్రమించిన వాడు. గాత్రము శ్రావ్యమైనది. తంబురా బట్టుకొని భక్తి తత్పరుడై పరమేశ్వరునిగూర్చి భక్తిగీతములు పాడుచున్నప్పుడు శ్రోతలకుఁగూడ హృదయముఁ జలించి దేహము పులకరించునట్లు భక్త్యావేశముపొరలివచ్చును.

ఈతనికి 'తాన్సే'ననువాఁడు శిష్యుడుండెను. తాన్సే నితనియొద్ద సంగీతము జక్కగా నేర్చుకొన్నాడు. తాన్సేనుడు సుగుణమణి యనిపించుకొన్న 'అక్బర్ చక్రవర్తి' యాస్థానమున సంగీతపండితుడుగా నున్నాడు. సార్వభౌముడు తనకు తీరిక గలిగినప్పుడెల్ల తాన్సేనుని పిలిపించుకొని గీతముల పాడించి యానందించువాఁడట. శ్రావ్యమైనవాని గీతసరణి ననేకమార్లు పాదుషా ప్రశంసించుచుండువాడు. ఇట్లతడు ప్రస్తుతించినపుడెల్ల తాన్సేనుడు 'రాజా! ఇందు నాప్రజ్ఞ యేమియులేదు. ఇదంతయు నాగురుపాదుల కటాక్షమే! నేను వారి పాదపరాగపరమాణువును. మీప్రస్తుతులన్నియువారికి జెందదగినవి.' అన్ని విన్నవించుచుండువాడు. ఈ మాటలు వాని వినయశీలమునకు నిదానములని చక్రవర్తి యనుకొనుచుండెనేకాని వానినంతగా సరకుచేయకుండెను.

ఒకనా డేలనో సార్వభౌముని మన మీ మాటలపై పారినది. భగవానుడు హరిదాసుని పరీక్షించుటకీసంవిధానము సంఘటించుచున్నాడేమో? సార్వభౌముడు ఇట్లడిగినాడు. "తాన్సేన్! నీగీతములందలి మాధుర్యముచే ముగ్ధుడనై నిన్ను ప్రశంసించినపుడెల్ల నీవు నీగురుని ప్రస్తుతించెదవే అతడెవరు? ఎక్కడనున్నాడు? ఆతని గీతమాధుర్యము నాకు చవిజూపవా?" అని. అత డామాటల కేమియు బదులు చెప్పలేదు. ఎంత గ్రుచ్చి గ్రుచ్చి యడిగినను బదులు చెప్పకుండుటచే అక్బరు కోపగించెను. అప్పుడు తాన్సేనుడు "అయ్యా! అతడు ఆస్థానములకువచ్చి అడుగుకొనువాడు కాడు. సమయముచూచి ఆయనకడకు మిమ్ముతీసికొని పోయి ఆయనపాట వినిపించెద" నని ఆయన

చెప్పెను "సరే యట్లేచేయు" మని చక్రవర్తి యనెను.


పిమ్మట తాన్సేను డొకనాడు పాదుషా గారిని తనవెంట తనగురువు హరిదాసు ఉన్న యడవికి తీసికొనిపోయి సార్వభౌముని ఆతని కుటీరము వెలుపల కూర్చుండబెట్టి "అయ్యా! మీరిచ్చట సడిసవ్వడి చేయక గూర్చుండియుం డుడు. నేను లోపలికి బోయి యాభక్తవర్యుని ప్రసన్నుని జేసికొని పాటపాడించెదను." అని చెప్పి తాను లోపలికిబోయెను. గురునకు సాష్టాంగపడి లేచి కుశలాదికము లడిగి "స్వామీ! సంసారపు గజబిజి పాటులచే మనస్సు చీకాకై యున్నది. భక్తిపూరితమైన తమగానమును విని చిత్తశాంతి సమకూర్చుకొనుటకు వచ్చినాను. అనుగ్రహింపకోరెదను." అనెను. హరిదా సంతట తంబురాను చేతికి తీసికొని శ్రుతిసవరించి పాడ నారంభించెను. కొంతసేపగు నప్పటికి భక్తివివశుడైన యతనిగానప్రవాహము మృదుస్వనముతో ననర్గళముగా ప్రవహింప సాగెను. కుటీరము వెలుపలనున్న అక్బరు చక్రవర్తిగూడ ఆ గాన మాధుర్యమునకు ముగ్ధుడై ఆనందపారవశ్యముచే నప్రయత్నముగ నోరెత్తి 'వహ్వారే' యని ప్రశంసించెను.

ఆధ్వని విని హరిదాసు "తాన్సేన్! వెలుపల నెవరో యున్నట్లున్నారే!" యనెను.


"ఔనుస్వామీ! అక్బరు సార్వభౌముడు శ్రోత్రపేయమైన మీ గానమును విన గుతూహలపడి నన్ను గోరగా తీసికొనివచ్చి వాకిట కూర్చుండబెట్టితి" నన్నాడు తాన్సేను. హరిదా సామాటలు విని "తాన్సేనూ! నీవవివేకివిగదోయీ! ఐహికభోగములలో నంటుకొని యున్నవారి నిట్లు తీసుకొని రాదగునా? అట్లయిన మన చిత్తశాంతి జీర్ణింపదోయీ! అయినను వాని నింతదూరము తీసికొని వచ్చితివి కాన లోపలికిగూడ గొనిర"మ్మనెను. తాన్సే నట్లు చేసినాడు. అక్బరుపాదుషా లోపలికి వచ్చి తాను సార్వభౌముడనని గర్వింపక హరిదాసు పాదములపైబడి నమస్కరించినాడు. హరిదాసు పాదుషాను కుశలమడిగి "చిరునవ్వుతో నాపాట వినుటకా యింత దూరమువచ్చితివి? ఇదిగో పాడుదును. నీమనసార విను" మనెను. అని తంబురా దీసికొని పాడసాగెను. ఆగానమాధుర్యముచే నాకర్షితములై రెండులేడిపిల్లలు పరుగుపరుగున వచ్చి యక్కడ నిలచి చెవులు దోరగించికొని వినుచుండెను. హరిదాసిట్లు కొంతసేపు పాడి విరమించెను. అక్బరప్పుడు తన మెడయందున్న అమూల్యమైన మౌక్తికహారమును తీసి హరిదాసుని పాదములపై నిడెను. సర్వస్వము త్యజించిన సన్న్యాసి కావెలలేని ముత్తియపు పేరుతో ప్రయోజనము? మట్టిబెడ్డయు, మణియు వాని దృష్టిలో సమానము లేకదా! హరిదాసు డాపేరును తీసి తనచెంతనున్న జింకపిల్లలలో నొకదాని మెడలో వైచెను. ఆజింకపిల్లలు చెంగు చెంగున దుముకుచు పరుగెత్తిపోయినవి.

అక్బ రదిచూచి లజ్జపడి తనలో నిట్లనుకొనినాడు:—"అమూల్యమైన ఈ హారమును


౪౩-వ అఖిల భారత జాతీయ మహాసభ-కలకత్తా



౭. శ్రీ కే. యఫ్. నారిమన్‌గారు
అధ్యక్షులు, భారత యువజనసభ-కలకత్తా




౧౮. శ్రీ డాక్టరు యం. ఏ. అన్సారిగారు
భారతీయవస్త్రప్రదర్శనోత్సవ ప్రారంభకుడు-కలకత్తా




౯. శ్రీ యం. ఆర్. జయకరుగారు
అధ్యక్షులు, సంఘసంస్కరణమహాసభ. కలకత్తా



౬. శ్రీ డా. జి. వి. దేశముఖగారు
అధ్యక్షుడు, అఖిలభారత వైద్యమహాసభ-కలకత్తా




౫. శ్రీ సుభాషచంద్రబోసుగారు
స్వచ్ఛందసేవాదళ నాయకుడు, జాతీయమహాసభ-కలకత్తా



౧౧. దేశబంధునగరమున జాతీయమహాసభా మంటపద్వారమున కెదురనున్న జాతీయపతాకము



౧౨. జాతీయపతాకముచెంత మహాసభాధ్యక్షుడు, మహాత్ముడు



౧౩. జాతీయమహాసభా మంటపసింహద్వారము



౧౪. భారతీయ వస్తుప్రదర్శనావరణ ప్రవేశద్వారము

నేనెంత కష్టపడి సంపాదించితిని. ఈయడవిజనునకు దీనివిలువ యేమితెలియును. కోతికి కొబ్బరికాయ చిక్కిన ట్లయినది వీని కీహారము లభించుట” అని అక్బరు పాదుషా ఆతనిగానసౌష్ఠవము గుర్తించినాడు; ఆదరించినాడు; నిరీహుడైన యతడది స్వీకరింపకుండుటచే సిగ్గుపడినాడు; చీకాకుపడుచున్నాడు; తనహారపు విలువ దలచికొని చింతించు చున్నాడు కాని వాని యాధ్యాత్మికసౌష్ఠవమును గుర్తింపలేక పోయినాడు; దానికి విలువగట్ట లేకున్నాడు. అది సామాన్యజనులకు సాధ్యమగునా? హరిదాసు పాదుషాయొక్క ముఖవిక్రృతిచూచి ఆతని హృదయము తెలిసికొన్నాడు. తెలిసికొని మరల తంబురా మీటుచు గానమొనర్పసాగినాడు. ఆవనమందలి లేడు లన్నియు పరువు పరువునవచ్చి గానము వినుచున్నవి. వాని యన్నిటి కంఠములందును పాదుషాహారముం బోలిన వెలగలహారములేయున్నవి! ఆ విచిత్ర సంవిధానము పాదుషాచూచినాడు. ఆశ్చర్యపడి లజ్జతో తలవంచుకొనుచున్నాడు. వాని యూహాప్రపంచమంతయు స్వప్నమువలె నంతర్ధానమైపోయినది. హరిదాసుని ప్రభావము గుర్తించినాడు. అత డొక మహాత్ము డనుకొన్నాడు. తన యవివేకపు తలపుల దెలిసికొనియే యతడు తనను మృదువుగా మందలించుట కిట్టి సంవిధానము గల్పించినా డనుకొన్నాడు. మిసమిసల చూచి మోసపోయి ఐహికసుఖములు మాత్రమే యపేక్షించి పారమార్థిక సౌభాగ్యము భంగపరచుకొనరాదని తెలిసికొన్నాడు.

ఇంతలో హరిదాసు “సార్వభౌమా! వీనిలో మీహార మేదియో గుర్తించితీసికొం”డని చెప్పినాడు. పాదుషా కప్పు డేమి చేయుటకు తోపలేదు.హరిదాసుని పాదములపైబడి“నన్ను క్షమింపు” మని వేడుకొన్నాడు. హరిదాసు వానిని లేవదీసి “రాజా! భయములేదు. ప్రాపంచికసౌఖ్యములే పరమార్థమనుకొనకుము. సద్వృత్తికలవాడవై పరలోకపాథేయమును సమకూర్చుకొనుము. న్యాయదృష్టితో ప్రజాహితముగా రాజ్యము బాలింపుము. మతపక్షపాతము లేని నీవంటిప్రభువు లభించుట ప్రజలభాగ్యము. నీకు మంగళమగుగాక! పోయిరమ్ము.” అని యాశీర్వదించి పంపెను.

ఈ కథ హిందూమహమ్మదీయమైత్రి కొరకు పరిశ్రమించిన అక్బరుపాదుషాయొక్క సౌజన్యమును ప్రకటించుచున్నది.

అంతస్సమాధి

శ్రీ. శ్రీనివాసరావుగారు (కవితాసమితి)

"ప్రతివర్ష వసంతోత్సవ
కుతుకాగత సుకవి నికరగుంభిత కావ్య
స్మృతిరోమాంచ విశంకిత
చతురాంతఃపురవధూప్రసాదన సరసికా !"

అని పఠించితి 'పారిజాతాపహరణ'
సత్ప్రబంధమునందు—అక్షణమునందె
మనసునకు నవశత ఘటిల్లెను! గ్రహింప
రాని ఆవేగమున చేతిలోని పుస్త
కము ధరణిపైన పడియె! అఖండవివిధ
భావభంగీతరంగ సంపదలు పొదల,
హృదయమెగసెను పూర్వ విస్మృతనితాంత
దశదిశాంత పరిశ్రాంత ధవళకీర్తి
చామరమ్ములతో సముజ్జ్వలవిభావి
రాజితమ్మగు శ్రీకృష్ణరాయభూప
మంటపమునకు—

—కవిశిఖామణు లనేకు
లదియె మధురాతిమధురదివ్యప్రబంధ
కథన సుధల నఖండ సుఖప్రదముగ
చిలుకుచున్నారు !—

—కృష్ణరాయలు మజ్జ్వ
లాంగదీధితు లెగసి స్వీయాక్షికోణ
నిర్గతాపాంగరుచి సమున్మేషమునకు
వింతసొగసుల నెగడించు విధము చూప
అదిగో ముదమున పారవశ్యమ్ము చెంది
మెచ్చుచున్నాడు నయన నిమీలనమున,
క్రమదరహాసమున, శిరః కంపనమున !

* * * *

మది గలంచిన శైశిరోన్మాదరేఖ
వదలి నంతట నూత్న లావణ్యమునకు
సదమలానూన తేజః ప్రశస్తి నొసగు
శ్రీగరిష్ఠవసంతసమాగమమున
మెల్లగా వీచు పిల్ల తెమ్మెరల కులికి
కులుకు మెలకువతో నవకోరకములు
నూతన వయః పిపాసాపరీతహృదయ
సదనసంస్థిత గాఢవాంఛలకు రేగి
తెరలు తెరలగు సిగ్గుదొంతరల పొరల
మనసు బిగువున నెగజిమ్మికొనుచు, ఘనవి
యోగశాంతిని కలగాంచి ఒడలు నిలువు
పులకరిల్లిన హృదయ మాపుకొనలేక
వలపుదెసల పిసాళించు వలను తెలిపి
విరిసి వెలిగి విజృంభించువేళలందు
ఏమనోహరమంజు లారామభూమి
సౌరభానంతసౌందర్య సౌఖ్యగతుల
నందనవనోప మానంద బంధురంబొ
అదియె విలసిలు కృష్ణరాయల సభాప్ర
భాశుభాకరతలము—

* * * *

—ఆ వైభవమ్ము
అప్పటి ధరారమణ గౌరవాతిశయము,
ఆదినమ్ముల సౌఖ్యానుమోదరక్తి,
నాటి సంపత్సమృద్ధి, ఏనాటికైన
ఆంధ్రనిర్భాగ్యధాత్రికి నలవడునొకొ?

గుంటూరి పెద్దయ్యగారు

బులుసు పాపయ్యశాస్త్రి గారు

దరిదాపుగా ఇన్నూరు సంవత్సరాల కిందట గుంటూరి త్రివిక్రమశాస్త్రి అనే పండితుడు గోదావరిజిల్లా నుండి విశాఖపట్నంజిల్లాకు వచ్చెను. ఈ జిల్లాలో తొలి మజిలీ ఉపమాకా క్షేత్రానికి పడమరగా నాలుగుమైళ్ల దూరములో ఉన్న వేంపాడు అనే గ్రామములో చేరెను. ఆ ఊరిలో అప్పుడు బ్రాహ్మణులు లేరు. సంపన్నులయిన క్షత్రియులు త్రివిక్రమశాస్త్రిగారిని ఆ ఊరిలో నిలిపిరి. త్రివిక్రమశాస్త్రిగారి వాడుకపేరు పాపయ్య. ఈపేరు ఆయనకు రావడానికి చిత్రమయిన కారణమున్నది.

త్రివిక్రమశాస్త్రిగారి తల్లి బొత్తిగా అపసంతిది, పరమ సత్యకాలము. గడుసుదనము లేశమూ లేనిది. ఆలాటి అపసంతివారిని వేళాకోళాలు చేయడము చాలామందికి సరదాగదా. నక్కాగా, పుష్టిగా, ముద్దుగా ఉన్న తన కొడుకును (త్రివిక్రమశాస్త్రిగారిని) ఆమె యెత్తుకుని ముద్దులాడుతూ ఉన్నప్పుడు ఇరుగమ్మలూ పొరుగమ్మలూ ఆమెతో, "నువ్వెందుకు ఆలాగు ముద్దులాడుతావూ? ఆ బిడ్డడు నీ కొడుకు కాడులే" అనేవారు. వారు హాస్యాలాడుతూ ఉన్నారని గ్రహించలేని ఆసత్యకాలపు ఇల్లాలు ఆ బిడ్డను గట్టిగా సందిట బట్టుకుని ఆ హాస్యాలాడే వారితో, "నా పాపడేనర్రా, నే కనుక్కొన్నానర్రా, నా పాపడేనర్రా, నాకళ్లతోడర్రా," అనేది. ఈలాగు దినదినమూ నాలుగయిదుమార్లు 'నా పాపడు, నాపాపడు' అనవలసివస్తూ ఉండేది. ఆ బిడ్డణ్ణి 'పాపడూ', 'పాపా', అని పిలుస్తూ ఉండేది. తరువాత తరువాత ఇరుగమ్మలూ పొరుగమ్మలూ, "నీ పాపడేడీ, నీపాపయేడీ." అంటూ ఆ బిడ్డడికి 'పాపడు,' 'పాప,' అని నామకరణమే చేసివేసిరి. అతడు ఎదిగిన తరువాతకూడా 'పాపయ్య' అన్న వాడుక పేరే స్థిరమయ్యెను.

త్రివిక్రమశాస్త్రిగారికి ఇద్దరుకొడుకులు. పెద్ద కొడుకు అచ్చన్నగారు, రెండవ కొడుకు పెద్దయ్య అనే వాడుకపేరు గల వెంకటశివుడు. ఈయన అన్నదమ్ములిద్దరిలో చిన్నవాడయి ఉండగా పెద్దయ్య అన్న పేరు ఎందుకు వచ్చెనో తెలియదు. దానికారణము ఆయన శ్రీ శంకరభారతీస్వామివారితో పద్యములో చమత్కరించి చెప్పిరి. ఆ పద్యము తరువాత వ్రాస్తాను.

పెద్దకొడుకయిన అచ్చన్నగారికి తండ్రి చదువు ఏమీ అబ్బలేదు. సాము చేయడమూ, ఊరిలో రాజులతో కూడి వేటలకు వెళ్లడమూ, అడవిపందులూ కణుజులూ మొదలయిన మృగాలను పొడవడమూ—ఈ విద్యలు అబ్బినవి. ఆయనకు లోకజ్ఞానము తక్కువ, తిక్క హెచ్చు.

పెద్దయ్యగారు అలాటివాడు కాలేదు. ఆయన తండ్రివద్ద మంచి సంస్కృతపాండిత్యము సంపాదించెను. ఇంతే కాక ఆంధ్రసాహిత్యమూ కవితానైపుణ్యమూ కుదుర్చుకొనెను. ఈ విద్యలవల్ల ఆయనకు చాలా లాభమున్నూ గౌరవమున్నూ వచ్చెను.

ఆయన ఉన్న వేంపాటికి ఎనిమిది మయిళ్లదూరములో ఉన్న సత్యవరము కాకర్లపూడివారు ఏలుతూ ఉండేవారు. అప్పటిరాజుగారు విద్యాప్రియులు. 'రుక్మవతీపరిణయము' అనే ఆంధ్రప్రబంధమున్నూ, 'ప్రద్యుమ్నాభ్యుదయము' అనే సంస్కృతకావ్యమున్నూ చెప్పి, అడిదము సూరకవిగారికి సమకాలికుడయి ఆయనతో వాదాలాడిన రేకపల్లి సోమనాథశాస్త్రిగారు ఆ కాకర్లపూడివారి ఆస్థానపండితుడు. మన పెద్దయ్యగారు ఆ సంస్థానాధిపతుల దర్శనముచేసి, శ్రావ్యమయిన పెద్దపెద్ద సంస్కృతసమాసాలూ చిత్రమయిన పార్సీలబ్జులూ వేసి ఒక నవోత్పలమాల చెప్పెనట. అది నాకు దొరకిన ప్రతినిబట్టి ఈ దిగువ వ్రాస్తున్నాను. లేఖకప్రమాదాలు ఉన్నట్టు తోస్తుంది. ముఖ్యముగా అవి పార్సీలబ్జులలో హెచ్చుగా ఉన్న వేమో.

న వో త్ప ల మా ల

వీరు తెనుంగు సాము లర
బీతర బీయతు లొప్ప గొప్ప స
ర్కారు లవల్ జమీలు దర
ఖారుగ నేలిన రాజమాన్యహం
వీరులు డక్కనీలు తజ
వీజుగ లాయక యున్న మేటి మం
జోరు జొహారు యాబురు మ
షూరు మదారు ఖరారుదారు బి 4
ల్కారుషు తుఫ్‌సవారులు హ
లో వెలగోలు తుపాకిబారు బ
ర్దారు జిరాగుజాల సర
దారులడౌరు కడాని తేరు లం
బారు మిటారు నౌబతు షు
మారు ఫిరంగి ఫుకారు కుత్తినీ
డౌరు గుడారు పైకము కొ
టారు మదారు బజారులందు సే 8
దారు మదారు దారుసర
దారు సవారు షికారు లందునే
క్ర్యారుగ నూఱుమాఱులు త
యారుగ నీరి హజారమందు వే
యాఱులు పెద్దకేరులు జొ
హారులు చూచి హమీరు లౌర ద
ర్బారు ఘసందుమీఱు వహ
వా యని మెచ్చు నవాబువారు వస్ 12
షేరు బహాదరుల్ పెదవ
జీరులు నూఱులు మాఱుకొన్నఁ దా
ర్మాఱుగ మోది కోటలను
మాపి తమాము మకాము లెల్ల ఫీ
ర్మా రొనరించి మిక్కిలి మ
రాతపు లంది రిబేజుమాలు ద
ర్బారులు దారు గేరు దళ
వాయుల చాయలు దేరు కల్కుకై 16
జారు కడానిబాహు నిమ
చాలు తలు క్కన బందొఁ బస్తుగా
బోరు బజోరు కాఁకరల
పూఁడి వజీరు లదే యనన్ మహో
దారులు పూర్ణ నిర్మల సు
ధాకర కాంతికలాపకీర్తి వి
స్తారులు భూరి భూసుర వి
తాన మహాహుతి గంధ గౌతమీ 20
తీర నిసర్గ దుర్గ పరి
దీపితహర్మ్య తలాగ్రభాగ సం
చారులు, దేవ వారవన
జాతముఖీసమ వారకామినీ
వారకరాబ్జకీలిత సు
వర్ణమణిద్యుతి దండచామర
ప్రేరిత వాతధూత నవ
ఫేనసమాన వితానమండపా 24
గార సువర్ణపీఠ పరి
కల్పితరాజ్య రమామహీమహో
దారులు సేతు శీతపసు
ధాధరమధ్య మహీతలస్ఫుర
ద్వీరవిశేష సంజనిత
తీవ్రదవానల బాడబాగ్ని సం
హార మహోగ్రనేత్ర చటు
లానలతుల్య పటుప్రతాప త
ప్తారినృపాల జాల మకు
టార్చితపాదపయోజపీఠసం 28
స్కారులు, రామచంద్రపుర
పాలనివాసులు, రామచంద్రవం
దారులు, రామచంద్రవసు
ధావరపౌత్త్రులు, రామచంద్రవ
ద్వీరయశోవిశిష్టగుణ
విస్తృతిమంతులు, రామచంద్రధా 32
త్రీరమణాభిధానులు, వ
రిష్ఠవసిష్ఠసగోత్రపావనుల్,
కారణజన్ము, లబ్ధిశశి
కల్పకఖేచరగోత్రదానదీ

త్కారతు, లిందిరాసుతవ
సంతజయంత సమానసుందరా
కారులు బ్రహ్మకల్పము సు
ఖంబుగ వర్ధిలు వార లిద్ధరన్. 36

ఈనవోత్పలమాలే కాక యీ క్రింద వ్రాసిన పద్యమున్నూ చెప్పిరట:

సీ. నీమేను శత్రుల నెమ్మేని కెగ్గ్రాకు;
నీసాగు వైరుల నెనుకసాగు;
నీ కటాక్షరులంబోనీక టారుగఁ జేయు;
నీగద పరుల దండించును గద;
నీ బల్లె మహితుల ప్రాబల్యమడగించు;
నీ శక్తిరిపుల ఖండించుశక్తి;
నీ పంఖి పరింపక్షి నిర్మూలనమొనర్చు;
నీ యమ్ము పరవాహినికి భయమ్ము;
నీదు కైజారు కైజాతి నిఖిలశతులఁ
దార్చు జముపీటికి నిజము ధాటి ధాటి
కడఁగివైరులనోంచుఁ గాకరలపూఁడి
రామచంద్రావనీప, సూర్యప్రతాప.

పై నవోత్పలమాల శిష్టు కృష్ణమూర్తిశాస్త్రిగారు చెప్పినదని మొన్నమొన్న ఒకమాట వింటిని. “గౌతమీ తీర...సంచారుఁ,” “రామచంద్రపురవాసులు,” అనే మాటలనుబట్టి యీపద్యము గోదావరిజిల్లాలో ఉన్న రామచంద్రపురము నేలుచుండిన కాఁకరలపూఁడివారి పయిని చెప్పిన పద్యముగా కనబడుతుంది. శిష్టు కృష్ణమూర్తిశాస్త్రిగారు గోదావరిజిల్లావారు గనుక ఆయనే యీపద్యము చేసినవారేమో. సీసపద్యమందున్న “రామచంద్ర” రాజుగారి పేరే ఉండడముచేత అదిన్నీ ఆయనదేయేమో. కానివిశాఖపట్నంజిల్లాలో అవి గుంటూరి పెద్దయ్యగారి పద్యములే అని చిరకాలమునుండి ప్రతీతి.

ఈక్రింద వ్రాసిన పద్యము వత్సవాయివారిమీద చెప్పిరట. ఎప్పుడో ఏస్థితిలోనో తెలియదు:

ఉ. భూమిపతిత్వదిగ్విజయ
భోగసమృద్ధులు గల్గి వానర,
స్తోమసహాయమండముని
దూమణకార్యమ్ము లెల్ల మాని నా,
సా మగు వత్సవాయికుల
సంభవరామనరేంద్ర చంద్రు తో
రామనరేంద్రచంద్రు లెన
రారు కృపాశర భాగ్యకాంతులన్.

ఈ క్రింది పద్యములున్ను ఆయన చెప్పినవే అని నాకు దొరకిన పద్యాల కాకితములో ఉన్నది.

ఉ. తిట్టినఁ బర్వు తక్కువని
తిట్టఁగరా దొకవేళఁ గాక చేఁ
దిట్టినఁ జెట్టుకాయ వడిఁ
దెంచిన యట్టులు లోతు నీళ్లలోఁ
బుట్టి మునింగినట్లు పెను
బూతము గొట్టినయట్లు మారి చే
ముట్టినమాడ్కి బల్ పిడుగు
మొత్తిన భంగిఁ దుపాకి గుండు చేఁ
గొట్టినరీతి నుండవలెఁ
గో! యన లోభినృపాల కోటికిన్.

తిట్టితినా భుజంగవిష
దిగ్ధదవానలధాగధగ్య చి
చ్చిట్ట చిటార్భటీ ప్రకట
తీవ్రవచోగ్ర మహోగ్ర విస్ఫుర
ద్ఘట్టన విస్ఫులింగ లయ
కారణ కారణ లబ్ధలుబ్ధరా
ట్పట్టణ గోపురధ్వజని
పాతహతాహతిఁ గాఁగ నే మతీ

తిట్టితి నా జగద్విలయ
తీవ్రనిశాతకృతాంతదంతసం
ఘట్టనజాతపావకశి
ఖాతతి భగ్గున మండఁజేతుఁ; జే
పట్టితినా సుధామధుర
పాయసగోఘృతగోస్తనీరసల్
తట్టుపునుంగు వాసనలు
దారొకను మత్కవితాచమత్కృతిన్.

ఉ. వ్యాళవిభుండు ప్రజ్ఞగల
వాఁడని చెప్పుటె కాని రెండు వే
ల్నాలుకలుండినన్ దినము
నం దొక్కటైనను బొంకలేఁ,డహో!
వ్రాలిన కంకిపాటి భగ
వాను నృపాంకని ప్రజ్ఞ యెట్టిదో
వాలుక యొక్కటే, దినము
నన్ బదిలక్షలున్ బొంకు నిద్దరన్.

చ. గురుతర ఘూర్జరకుచము
కొంకుమఱుంగుపట్లు, ద్రావిడీ
తరుణిపయోధరంబు పయి
దార్లోకనుపట్లు", నాంధ్రసుందరీ
సరసఘనస్తనంబు నర
చాటుపచోట్లు, జనాళిచేతిలోఁ
గరమరుదైనచోఁ బొడ్డము
కాయయె ....

ఈ కడపటిపద్యము ఈయనకుమారుడు పాపయ్యగారు చెప్పినదని నా వినికి.

పెద్దయ్యగారు పద్యాలు చెప్పో, తమ పాండిత్యము మరొకవిధముగా కనపరిచో సత్యవరసంస్థానాధీశ్వరుల మన్నన పొంది వారివల్ల మాన్యాలు సంపాదించిరి. అవి యిప్పటికిన్ని ఆ కుటుంబమువారు అనుభవిస్తూ ఉన్నారు

ఆ దినములలో 'వేంపాడు' మొదలయిన యేడు గ్రామాల కరణపుపని ఖాలీ ఆయెను. ఆ పనికోసము చాలామంది దరఖాస్తులు పెట్టిరి. పెద్దయ్యగారిని కూడా దరఖాస్తు పెట్టుమని ఆ ఊరిరాజులు చెప్పిరి. కాని, "నేను కావ్యాలూ ప్రబంధాలూ చదువుకున్నానుగాని లౌక్యవిద్య నేర్చుకోలేదు. కరణపుపనికి నేనేలాగున తయారు పడగలను?" అని పెద్దయ్యగారు వెనుకదీసిరి. కాని రాజులు చాలా బలవంతపెట్టడముచేత ఆయనకూడా దరఖాస్తు పెట్టిరి. కమీషనరు దొరగారు దరఖాస్తుదార్ల నందరినీ పిలిపించి వారి వారికి గల అర్హత లేవో అడిగిరి. ఎవరి ప్రజ్ఞలు వారు చెప్పుకున్న తరువాత, దొరగారు, "మీ రందరూ బ్రాహ్మణులుగదా, మీకులవిద్య అయిన సంస్కృతము నేర్చి ఉందురు. 'మహిమ్నస్తోత్రము' (పుష్పదంతకృత శివమహిమస్తోత్రము) లో మొదటి అయిదు శ్లోకములకూ అర్థము చెప్పగలవారు లెండి," అనిరట. పెద్దయ్యగారు ఒక్కరే నిలబడిరట. దొరగారు పెద్దయ్యగారిచేత ఆ శ్లోకముల కర్థము చెప్పించి విని సంతోషించి పయిని చెప్పిన కరణపుపని పెద్దయ్యగారికి ఇచ్చిరట ఆ ఉద్యోగము ఆయన మనుమలవరకూ ఆకుటుంబమువారే చేస్తూ ఉండిరి.

ఆ రోజులలో తెనుగు జిల్లాలలో మతవిషయములలో అధికారము గల శంకరాచార్య పీఠసులు "ఉద్దండ భారతీ స్వాములవారు." ఆయన చాలా చండశాసనుడట. ఆయన చెప్పినట్టు పాదపూజలు చెల్లించని వారిని దెబ్బలు కొట్టించేవారట. ఆ స్వాములవారు తమ సంచారములో వేంపాడు వస్తూవుండగా విని పెద్దయ్యగారు ఊరిబయట స్వాములవారి త్రోవలో ఉన్న చెరువుగట్టుమీద కాచుకొని ఉండిరట. స్వాములవారు రాగానే పెద్దయ్యగారు ప్రత్యుత్థానాభివందనాలు చేసి స్వాములవారిని పల్లకీదింపించి అక్కడనే కూర్చుండబెట్టిరట. స్వాములవారు నీపే రెవరని అడుగగా పెద్దయ్యగారు

ఉ. ఆరయ వేముపాటిపుర
మందుఁ బ్రసిద్ధుఁడు, సద్గుణుండు, గుం
టూరుకులప్రసూతుఁడు, ప
టుత్వకవిత్వమహత్త్వతత్త్వవి
ద్యావసికప్రధాన ధన
దానవిధాన నిదాన మానగం
భీరమహారసజ్ఞులగు
పెద్దఁ, 'పె'ద్దనఁ బెద్దయాఖ్యుఁడన్.

అని చెప్పిరట. స్వాములవారు విని, "తెనుగు కవిత్వపు ముక్కలు నాలుగు బడబడలాడించి పండితుడనని విఱ్ఱవీగుతూ ఉన్నావు కాబోలు. 'ఆపోహిష్ఠేత్యాది' మంత్రానికి అర్థము చెప్పు, నీ పాండిత్యం చూస్తాము" అనిరట. పెద్దయ్యగారు తడుముకోకుండా అర్థము చెప్పిరట. స్వాములవారు సంతోషించి, "మీ గ్రామానికి

వస్తాము, తోవతీయి," అనిరట. పెద్దయ్యగారు, "స్వామీ, మా గ్రామమే మీదర్శనానికి వచ్చినది. మా గ్రామంలో బ్రాహ్మణకొంప నాది ఒక్కడిదే. ఇక్కడ ప్రముఖులు రాజులు; వైష్ణవ సంప్రదాయము వారు." అనిరట, స్వాములవారు, "అయితే ఇక్కడ మాకు పాదపూజలూ భిక్షలూ ఏమీ జరుగవా?" అనిరట. పెద్దయ్యగారు, "ఇదుగో, శిష్యుడు చెల్లించుకునే పాదపూజ," అని పళ్లెములో రూపాయలు పోసి, "ఇంతకంటె ఈ గ్రామములో ఏమీ లభించదు," అని సవినయంగా విన్నవించిరట. స్వాములవారు పెద్దయ్యగారిని తమవెంట దీసుకుని నక్కపల్లి వెళ్లి ఆరాత్రి తమ పండితులనూ పెద్దయ్యగారినీ కూర్చుండబెట్టి కొంతగోష్ఠి చేయించి మెచ్చి మరునాడు పెద్దయ్యగారికి 'గుర్రము కోకలు' బహుమతిగా ఇచ్చిరట. గుర్రము కోకలు ఇయ్యడమన్నది అసాధారణ సమ్మానము.

నక్కపల్లి హుండా పదిహేను గ్రామములు కొత్తగా ఇంగ్లీషువారి స్వాధీనమయ్యేను. వాటిశిస్తు వసూలు కాక చిక్కులుపడి కమీషనరుగారయిన అలెగ్జాండరు దొరగారు పెద్దయ్యగారికి ఆ హుండా గుత్తకిచ్చిరట. శిస్తులు వసూలుచేసి యిచ్చి పెద్దయ్యగారు మెప్పు పొందిరట. ఆ గ్రామములలో చిన దొడ్డిగల్లు (దొడ్డిగల్లు అనేది వాడుకరూపము) చిక్కులుపెట్టెనట. పెద్దయ్యగారు ఈక్రింది పద్యము చెప్పిరి:

గీ. వట్టిమాటలు గల్పింపఁ బుట్టినిల్లు
కడమ వ్యవహారముల కరకాలిముల్లు
గుత్తకిచ్చిన యూళ్లలో గొగ్గిపల్లు
దొంగలకు మడ్డిగల్లు నీదొడ్డిగల్లు.

ఒకసమయములో ఆయన తనవృత్తాంతము చెప్పుకోవలసి వచ్చినప్పుడు ఈక్రిందిపద్యము చెప్పిరి.

సీ. జననాయకులు నూది సర్వదుంబాలాగ
మెచ్చి యేలికి మాన్య మిచ్చినారో
బ్రౌనుకట్టిా లెక్కపట్టి కర్ణాలలో
మెచ్చి యేరికి సెలవిచ్చినారో
అల్కసాండరుదొర యాదిలో నేరికి
మెచ్చి హుండా గుత్తకిచ్చినారో
శంకరభారతీ స్వామివారేరికి
మెచ్చి గుఱ్ఱముకోక లిచ్చినారో
అట్టియోగ్యత లెక్కల గట్టితనము
మాములీయతు సాహిత్య మహిమములకుఁ
బెద్దయగువారి కెవ్వార లుద్ధతులఁ బఁ
బరగణా కర్ణము లోకి బహదరీకి.

ఈపద్యము ఆయనే చెప్పినదో ఆయనను పొగడుతూ మరియెవరైనా చెప్పినదో తెలియదు

పయిపద్యము లన్నింటిలోనూ సెరసులు కనపడవచ్చును. అవి కవివో లేఖకపాఠకులవో చెప్పజాలను. పద్యములు నాకు దొరికిన కాకితములలో ఏలాగు ఉన్నవో ఆలాగు వ్రాసినాను. ఆయన పాండిత్యము గొప్పదయినా కొద్దిదయినా సత్యవరసంస్థానమువల్ల మాన్యాలు సంపాదించెను దొరగారివల్ల ఏడు గ్రామాల కరణపుపని సంపాదించెను. శంకరాచార్యుల వారివల్ల గుర్రము కోకలు సంపాదించెను

పెద్దయ్యగారి అన్నగారు అచ్చన్నగారు విద్వాంసులుకారు. ఆయనకు తిక్కహెచ్చు కటుంబము ఆస్తి అంతా పెద్దయ్యగారు సంపాదించినదే అయినప్పటికీ కొందరి దుర్బోధవల్ల అచ్చన్నగారు ఆస్తి పంచిపెట్టమని తమ్ముణ్ణి బలవంతపెట్టిరి. పెద్దయ్యగారు "మనకు పంపకమనగా ఏమిటి? మన ఆస్తిలో మీకు కావలెనది మీరు పుచ్చుకొండి" అనిరట. అందుపయిని తిక్కఅచ్చన్నగారు ఇంట్లోనుండి రుబ్బురోలూ పొత్రమూ తెచ్చి, 'రుబ్బురోలునాదీ' పొత్రము నీదీ' అనినీ సన్నెకల్లూపొత్రమూ తెచ్చి, 'సన్నెకల్లునీదీ, పొత్రము నాదీ," అనిన్ని, రోలూ రోకళ్లూ తెచ్చి, "రోలునాదీ, రోకళ్లునీవీ," అని, ఈలాగే పీటలూ మంచాలూ పరుపులూ మొదలయినవి పంచి, "దాసీసుబ్బిని పిలువు, దానిని ఈ ఫిరంకత్తితో రెండుముక్కలు చేస్తాను, నీకోముక్కా నాకోముక్కా," అనిరట పెద్దయ్యగారు లోలోపల నవ్వుకొని, "మన ఆస్తిలో నాకు వంతు అక్కరలేదు. ఈ

ఆస్తిఅంతా మీతో ప్రపుతాన; మీరు సత్యవరమువెళ్లి అక్కడి మనమాన్యాలు అన్నీ మీరు అనుభవిస్తూ సుఖముగా ఉండండి" అని బళ్లమీద సామాను కట్టించి అన్నగారితో సత్యవరము పంపిరి.

అన్నగారి మామగారు కొల్లూరి బాపన్నగారు. ఆయనా తిక్కవారే. అల్లుడు జయంతి సోమన్నగారు, ఆయనా తిక్కవారే. వారి తిక్కలు చూచి పెద్దయ్యగారు ఈ క్రింది పద్యము చెప్పిరి.

క. కొల్లూరి బాపనాఖ్యుని
కల్లుఁడు గుంటూరి యచ్చనాఖ్యుఁ డతనికిన్
అల్లుఁడు జయంతి సోమన;
అల్లురకును మామగార్ల కజుఁడొనఁ గూర్చెన్.


పెద్దయ్యగారికి ముగ్గురు కొడుకులు. వారిలో రెండవవారైన పాపయ్యగారికే యింటివిద్య అబ్బెను. ఆయనను గురించి మరొకమారు వ్రాస్తాను.

భరతధాత్రి


బండారు తమ్మయ్యగారు

విజ్ఞాన సర్వస్వ విఖ్యాతిగైకొన్న వేదముల్ గన్నపవిత్రవాణి
దేవదుర్జేయుఁడౌ రావణుఁ బొరిగొన్న శ్రీరాముఁ గాంచిన వీరమాత
ప్రాణకుట్టనమైనఁ బలికి బొంకని బలిదానవేంద్రునిఁగన్న దానశీల
సత్యార్థమై కష్టశతములువడిన హరిశ్చంద్రుఁగన్నసూనృతచరిత్ర
షేక్స్పియరాదులఁ జిన్నవుచ్చెడు మేటి కాళిదాసునిఁగన్న జ్ఞానరాశి
తరతరంబులనుండి పరదేశనరపతి ప్రతతి కన్గుట్టిన రత్నగర్భ
కూర్మితో నెప్డు ముప్పది కోట్లప్రజల భవ్యజాహ్నవీముఖనదీపయము లొసఁగి,
లీలఁ బాలించు వింతబాలెంతరాలు స్వర్గసౌఖ్యప్రదాత్రి, శ్రీ భరతధాత్రి.


మైసూరు సబ్బుపరిశ్రమ చిత్రములు



౧. గవర్న్మెంటువారిసబ్బుఫ్యాక్టరీ భవనము - బెంగుళూరు



౨. సబ్బులను తయారుచేయు యంత్రములు




3. సబ్బుబిళ్లలకు ముద్రలు వేయుట




౪. సబ్బుబిళ్లలను కాగితములలో చుట్టుట.

మైసూరు సబ్బుపరిశ్రమ చిత్రములు



౫. సబ్బుపెట్టెలను ఎగుమతికొఱకై రైలుస్టేషనుకు పంపుట




౬. మైసూరు దసరా ప్రదర్శనమునందు ప్రదర్శింపబడిన గవర్నమెంటువారి సబ్బుఫ్యాక్టరీశాల



౧. యస్. జి. శాస్త్రిగారు
బి.ఏ.యం.యస్.సి. (లండన్), యఫ్.సి.యస్.,యఫ్.యస్.యస్., ఇంజినీరు.

వీరు ప్రప్రథమమునుండి గవర్నమెంటువారి సబ్బుఫ్యాక్టరీకి అధికారిగా నుంటున్నారు.



౨. సబ్బును కాచెడు తొట్టి

మైసూరునందు సబ్బుపరిశ్రమ

(బి. సుబ్రహ్మణ్యముగారి ఆంగ్లవ్యాసమునుండి)

౧

పరిశుభ్రముకొఱకు హిందువులు షీకాయ, కుంకుడుకాయ, కొన్ని చెట్లపట్టలు, క్షారము గల మట్టి (సర్జికా) మొదలగువాని నుపయోగించుట యెక్కువ. ఇప్పుడు సంవత్సర సంవత్సరమునకును సబ్బుల యుపయోగమును హెచ్చగుచున్నది. పశ్చిమ దేశములలో నీసబ్బుల కిదివరకెక్కువ వాడుక యున్నను భారతీయులును సబ్బువాడుక యందు త్వరాభివృద్ధిని గాంచుచున్నారు. ముతుకరకముగాను, ఆధునిక శాస్త్రీయపద్ధతులవలన నాగరికముగాను కూడ భారతదేశమందు చేయబడు సబ్బులు కాక 1926-27 సం॥ విదేశములనుండి రూ 1,59,00,000 విలువగల సబ్బులు దిగుమతి యైనవని యొకరిలెఖ్ఖవలన తేలుచున్నది.

సబ్బులుచేయు విధము సూత్రరూపమున చాల సులువు. కాస్టిక్ సోడాతో కలిపి తైలములు క్రొవ్వులు ఉడుకబెట్టి గ్లిసరిన్ చేర్చిన యెడల సబ్బు తయారగును. సోడియమ్ లవణములయొక్కయు క్రొవ్వుగల అమ్లముల యొక్కయు కలయికయే సబ్బు.

౨

1916 వ సం॥ చెన్నపురి వస్తుపరిశ్రమల ప్రదర్శనమునందు సర్ ఫ్రెడరిక్ నికాల్సన్ గా రుపన్యసించుచు "స్థితిగతులు ప్రతికూలముగా నుండిన తప్ప యేదేశమందైనను కావలసినంత ఉపయోగకరమగు ముడిపదార్థము దొరుకునప్పుడు దాని నుపయోగించుకొని మంచివస్తువులు తయారుచేయకపోవుట దోషమే యగును" అని చెప్పిరి. ప్రపంచమంతటిలోను భారతదేశమున నూనెనిచ్చుపదార్థములు చాల ఉత్పత్తియగుటచే నూనె చవుకగాను యెక్కువగాను కావలసిన యే పరిశ్రమమైనను భారతదేశమందు వృద్ధిపొందుట కవకాశములు గలవు. సబ్బు తయారుచేయుటకు భారతదేశము మిక్కిలి తగియున్నది. సబ్బు తయారుకు కావలసిన ముడివస్తువులలో ముఖ్యమైనవి నూనెయు, కాస్టిక్ సోడాయును. 100 కి 85 వంతులు తైలములును మిగత 15 వంతులు కాస్టిక్ సోడాయు నవసరమగును. అంతేకాక ప్రపంచమున సబ్బుచేయు దేశములన్నియు నెక్కువ నూనెనిచ్చు పదార్థములు కలవికావు. భారతదేశమొక విషయమున వీటిని మించిన యవకాశము కలది. విదేశములు మొదట నూనెపదార్థములపై రవానాఖర్చుల నిచ్చుకొని, పిదప తయారైన సబ్బులకును ఖర్చుల నిచ్చుకొనవలయును. అనగా ముడిపదార్థములపై 100 కి 85 వంతులపై మొదట రవానా ఖర్చులుపెట్టి తీసికొనిపోయి, తయారైన పదార్థముపై నూ

టికి నూరువంతులకును ఖర్చులుపెట్టికొని మన దేశమునకు చేర్చినవెనుకనే విదేశీయులు తమ సబ్బుల నమ్ముకొనవలసియుందురు. మనదేశమున దిగుమతియగు సన్నివస్తువుల విషయమునను సుమారుగా నీవిషయమే నిజము. మన దేశములోనే సబ్బులు తయారైన నూటికి 15 వంతులు ముడిపదార్థములు, కాస్టిక్ సోడా, కొబ్రైయే మనము రవానా ఖర్చులు పెట్టుకొనవలయును. మనదేశములోనికి దిగుమతియగు సబ్బులన్నిటిపైనను నూటికి 15 చొ|| పన్ను విధింపబడుచున్నది. ఇదియు భారతదేశమున సబ్బు పరిశ్రమకు తోడ్పడుచున్నది. భారతదేశపు సబ్బుల చెల్లుబడియు భారతదేశముననే యుండును గాన తయారుచేయువానికిని సులువు. భారతీయ కార్మికుని పని బాగుండనిదో, వానికిచ్చు కూలియు తక్కువయే కదా.

ఈ విషయములను గమనించిన మనదేశమున సబ్బుపరిశ్రమ యద్భుతముగ సాగగలదను నుత్సాహము కలుగును. కాని ప్రతికూల విషయములును కొన్ని కలవు. విదేశమున వస్తువులు చేయువారు పెద్దయెత్తున నొకే సమయమున లెక్కలేనంత సామగ్రి చేయగలుగుటచే వారి తయారుధర యెక్కువ యుండదు. మరియు విదేశములలోని వస్తునిర్మాతలు సుమారు నూరేండ్లుగా సాంకేతిక విద్యయందు గొప్ప నైపుణ్యమును అనుభవమును గలిగి యుండుటయు వారికొక గొప్పబలము. అసలు మొదటనే విదేశవస్తు నిర్మాతకు పెట్టుబడిఖర్చు లెక్కువ యుండకపోవుటచేత మూలధనమునకు వడ్డీ ఖర్చు మొదలగునవి సంవత్సరసంవత్సరమునకు నెక్కువ యుండవు. ఈ కారణముల వలననే మరమ్మతులకును, ప్రాతయంత్రముల విడిచి క్రొత్తయంత్రములు కొనుటకును కూడనగు ఖర్చు తక్కువయగును. తయారుచేయు వస్తుసామగ్రి పెద్దయెత్తుబడిమీద యెక్కువ యగుటచేతను, కాయకష్ట మెక్కువ లేకుండ యంత్రములమూలముననే యన్ని పనులను చేయించుకొను నుపాయము లుండుటచేతను యూరపుఖండమునందేచోటనైనను భారతదేశమందేపట్టణముకంటెనైనను సబ్బుచేయుటకగు వ్యయము తక్కువయగును. తయారైనవస్తువుల వ్యాపారముగూర్చి చూతుమనిన నేడు భారతదేశమున రైల్వేరవానా ఖర్చులు చాల యెక్కువ. మద్రాసునుండి బెంగుళూరునకుగాని బెంగుళూరునుండి బొంబాయికిగాని యగు రవానాఖర్చు విదేశమగు లండనునుండి భారతదేశమున బొంబాయి, కరాచి, చెన్నపురి, కలకత్తా; యే నగరమునకు గాని యగు వ్యయముకంటె హెచ్చు. నిర్భాగ్యమగు మన మాతృదేశమున యేపరిశ్రమగాని వృద్ధినొందుట కీవిషయమొక గొప్ప యవరోధము. ఇంతేకాక భారతదేశమందుకంటె పారిశ్రామికవిషయములందెక్కువ యభివృద్ధిగాంచిన విదేశములయందు వ్యాపారమునకు పెట్టుబడివిషయమున సహాయము చేయుటయందు ప్రభుత్వమువారైననేమి, యితర ప్రత్యేకవ్యక్తులైన నేమి మిక్కిలి యుదారముగను ఉపకారబుద్ధితోను ఉందురు. ఆధునిక విదేశీయ వ్యా

పారమునందొక శతాబ్దముకంటె హెచ్చు అనుభవము, ప్రకటనలద్వారమున వ్యాపారప్రచారము, ముఖ్యవ్యాపారమునకు తోడుగ నితర చిన్న చిన్న పరిశ్రమలు; ఇవన్నియు నుండుట వలన యూరపుఖండపు వస్తునిర్మాతలు ప్రపంచమందరితోడను వ్యాపారమున పోటీతగిలి గెలువగలుగుచున్నారు. ఈమధ్యనే క్రొత్తగా రసాయనిక పరిశ్రమాదులయందు ప్రవేశించి చిన్న యంత్రసాధనములను కొలది పెట్టుబడిని మాత్రము కలిగిన భారతీయ వస్తునిర్మాతలీ పోటీయందు జయమొందుట కష్టము కదా. మొన్నమొన్నటివఱకు భారతదేశమున రసాయనసాంకేతికశాస్త్రజ్ఞులు బహుకొలదిగ నుండుటయు నిజముగ నొక లోపమే. ఇప్పుడట్టివారు వలసినంతమంది యున్నారు; వ్యాపార పరిశ్రమలకొఱకు తమకాలమును శక్తిని వినియోగించి పాటుపడుచుండు పెట్టుబడిదారు లట్టివారి సేవాసహాయములను వినియోగించుకొనకుండిన దోషము వారిదే యగును.

3

మైసూరు సంస్థానప్రాంతముల లభించు ముడిపదార్థములతో మంచిరకపు సబ్బులు తయారుచేయు నవకాశముల విషయమున బెంగుళూరు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌సైన్స్‌నందు వరుసగ కొన్ని పరిశోధనలు గావింపబడిన పిదప 1917 వ సం॥ బెంగుళూరునందు మైసూరు ప్రభుత్వమువారి వలన నొక సబ్బు ఫ్యాక్టరీ స్థాపింపబడెను. మైసూరునందు పరిశ్రమల నన్నిటి నభివృద్ధిచేయుటకు దివాను సర్. మో. విశ్వేశ్వరయ్యగా రేర్పరచిన విధానమం దిదియొక భాగము. ఇంగ్లాండునుండి యంత్రసాధనములు తెప్పింపబడి 1918 సం॥ మే నెలనుండి యంత్రశాలయందు పని యారంభింపబడినది. మైసూరు ప్రభుత్వమున పారిశ్రామిక రసాయనికుడును, రసాయన యంత్రశాస్త్రజ్ఞుడును, ఇంగ్లాండునందలి సన్‌లైట్ సబ్బు ఫ్యాక్టరీ యందు ప్రత్యేక శిక్షణమును బడసినవారునైన శ్రీ యస్. జి. శాస్త్రి, బి. యే. యమ్. యస్. సి. (లండన్), యఫ్. సి. యస్. యఫ్. యమ్. యు. గారు వ్యవహర్తగనుండి పనుల సాగించుచున్నారు.

మొట్టమొదట, బజారులోదొరుకు మంచిరకపు బట్టలుదుకు సబ్బుతో నేవిధముగను తీసిపోని బట్టలసబ్బును మాత్రము తయారు చేసిరి. కాని మఱి కొలదికాలములోనే మంచి రకపు అందమైన ఒళ్లుతోముకొను సబ్బులు చేయుటారంభించి 1918 నవంబరు నెలలో మైసూర్ టాయ్‌లెట్ సోప్స్‌ను విక్రయించుటారంభించిరి. మైసూరు ప్రభుత్వమువారు స్థిర పద్ధతులపై నేర్పడిన పరిశ్రమలను ప్రోత్సహించి యభివృద్ధిచేయుచు సంస్థానమున నున్న యితరపరిశ్రమలకును, వస్తునిర్మాతలకును ఆదర్శప్రాయముగ నుండునట్లు తమ యంత్రాలయములోని వస్తువులు అత్యుత్తమమైనవిగను, నమ్మకమైనవిగనునుండునట్లుచూచుచున్నారు. అందుచే నీ యంత్రాలయము నవీన నాగరిక

పద్ధతులపై నడుపబడుచున్నది. పెట్టుబడిగా వ్యయపరచిన మూలధనమంతయు, దానిపై వడ్డీతోసహా నేడు మైసూరుప్రభుత్వమువారికి వచ్చివేసినది.

ఈ సబ్బులు తమకొక పేరును గడించికొన్నవి. భారత దేశమున నన్ని ప్రాంతములవారిచే నుపయోగింపబడుచున్నవి. మైసూరు చందనపుసబ్బు చాలమంది యెరుగునదే. ఈ యంత్రాలయాధికారులు తమ సబ్బులు యేవిధమగు కల్తీగాని లేక చెడుపదార్థములు చేరనివైయున్నవని పూచీకత్తు (హామీ) నిత్తురు. అథమము పది ఆంగ్లేయుల యంత్రశాలలయందును, మరన్ని భారతీయ యంత్రశాలలయందును, నేడీ చందనపుసబ్బులను తయారుచేయుటయే యిక్కడి చందనపు సబ్బుల శ్రేష్ఠతకు నిదర్శనము. ప్రపంచమంతటిలోను మంచి చందనపు నూనె యెక్కువగా గలదగుటచే మైసూరుసంస్థానమున శ్రేష్ఠమైన చందనపు నూనె సబ్బులు తయారుకాగలవు. చందనపుసబ్బేకాక యింక మూడు నాలుగు విధములసబ్బులు నిచ్చట చేయబడుచున్నవి. టర్కిష్ బాత్ సబ్బు, కార్బాలిక్ సబ్బును తయారగుచున్నవి. వైద్యాలయములందును, ఆరోగ్యసంస్థలందును, క్లబ్బులందును మిక్కిలి యుపయోగపడునట్టి యొకవిధమైన తేలిక సువాసనగల ద్రవరూపమైన సబ్బును తయారుచేయుట యీ మధ్యనే యారంభించిరి. బెంగుళూరులోను, మైసూరులోను, సివిల్ మిలిటరీవైద్యాలయములం దీద్రవరూపమైన సబ్బునుపయోగించుచున్నారు. ఈ వస్తువుయొక్కయుపయోగతకు తృప్తినొంది చెన్నపురి జనరల్ హాస్పిటల్‌వారును దీని యుపయోగము నారంభించినారు. ఇట్టి ద్రవరూపమైన సబ్బు అమెరికాయందును యూరపు ఖండమునందు నుపయోగింపబడుచున్నది. గ్రేట్ బ్రిటన్‌లోను యిప్పుడిప్పు డుపయోగించుచున్నారు. భారత దేశమునమాత్రమిట్టిది మొదటి ప్రయత్నమేకాని జయప్రదమైనది. కాలక్రమమున నిది తగు నాదరమును బడసి పేరుపొందునని యాస కలదు.

మైసూరుప్రభుత్వ సబ్బుఫ్యాక్టరీని స్వయంపోషకమగునట్లు చేయుటకొక ఎలెక్ట్రొలైటిక్ ఆల్‌కాలీ ప్లాంట్‌ను స్థాపించి దానిద్వారా ఫ్యాక్టరీకి కావలసిన కాస్టిక్ సోడానంతయు తయారుచేసుకొనవలెనను నుద్దేశ్యము కలదు. బెంగుళూరునందు విద్యుచ్ఛక్తి చాల చవుకధరకు లభించును; ఇండియాప్రభుత్వమువారివద్దనుండి పన్ను (duty) లేకుండ ఉప్పును సులభముగా పొందవచ్చును. ఇచ్చట తయారగు కాస్టిక్ సోడా యంతయు బెంగుళూరులోనే ఖర్చుకాగలదు; అందుచేత నొక ఎలెక్ట్రొలైటిక్ ఆల్‌కాలీ ప్లాంట్ నేర్పరచి ఫలితమును పరీక్షించి చూచుటకు మంచి యాశావంతమగు నవకాశములు కలవు. ముతకరకపు గ్లిసరిన్ తయారుచేయుట కొక వాక్యూమ్ ఇవాపొరేటర్


తెప్పింపబడినది; త్వరలోనే దానిని నిర్మించి పని నారంభింతురు.

మైసూరుప్రభుత్వమువారీక్రొత్తపరిశ్రమను నెలకొల్పుటవలన సంస్థానమున ప్రత్యేక వ్యక్తుల ప్రయత్నములకును ప్రోత్సాహము కలిగినది. నేడు బెంగుళూరులోనే సంవత్సరమునకు సుమారు నాలుగులక్షల రూపాయల వ్యాపారమును చేయు మూడునాలుగు సబ్బు యంత్రాలయములు కలవు. ముందు చెప్పబడినట్లు మైసూరు దర్బారువారి విధానమేమన: క్రొత్తకొత్త పరిశ్రమల నారంభించుటయు, భారతదేశమునను ఉత్తమతరగతి వస్తువులు తయారుకాగలవని చూపుటయు. సంస్థానములోని ప్రత్యేకవ్యక్తులగు వ్యవహారికులు సిద్ధపడి యీ ప్రభుత్వమువారి పారిశ్రామిక సంస్థలను తీసుకొని జయప్రదముగ నడుపగలమను హామీ నిచ్చుచో ప్రభుత్వమువారు వీనిని ప్రజలకు బదలాయింతురు (లోబరతురు.)

౪

సబ్బు పరిశ్రమకు సంబంధించినంతవరకు, భారతదేశమున నత్యుత్తమ తరగతి సబ్బులు తయారుకాగలవని యనేకమారులు నిరూపింపబడినది. ఈ పరిశ్రమ బాగుగా వృద్ధినొంది వ్యాపించుటకు కొన్ని యార్థికాంశము లడ్డు తగులుచున్నవి. అంతేకాక, స్వదేశ పరిశ్రమలను గట్టిగా ప్రోత్సహించుటకు వలయు జ్ఞానవంతమగు ప్రజాభిప్రాయమింకను కొఱవడియున్నది. కాని పరిస్థితులు యేటేట సుభసూచకముగ మారుచున్నవి. భారతదేశమున నేడు కొన్ని పరిశ్రమలు చక్కగా కొనసాగజాలకుండుటకీ స్వదేశపరిశ్రమాభిమాన లోపమే కారణము. లేనియెడల సర్ పి. సి. రే గారి యధ్యక్షతక్రింద నారంభింపబడిన కలకత్తా సోప్ వర్క్సువారి పని చాలింపబడియుండకుండును. ఒక్క సబ్బులకొఱకే భారతదేశమునుండి సంవత్సరమునకు సుమారు ఒకటిన్నర కోట్ల రూపాయలకంటె నెక్కువ విదేశములకు పోవుచున్నవి. సబ్బు వాడుక యెక్కువగుచున్నకొలది యేటేట నీ మొత్తము మెక్కువకూడ నగుచుండును. మనదేశమునుండి పరదేశముల కేకధారగా పోవుచున్న యీ ధనప్రవాహమును దేశాభిమానులింకను నెన్నాళ్లు సాగనిత్తురు? ఈ యపార ధనప్రవాహము నాపుటకు జ్ఞానవంతమగు ప్రజాభిప్రాయమే ముఖ్యావసరము.

జ. బ్రహ్మానంద



శాసన పరిశోధకుడు

శ్రీయుత రామన్ మహాశయులు

మండాది రామనాథం గారు

యమ్. ఏ., డి. యస్‌సి. (ఆనర్స్) యఫ్. ఆర్. యస్.

క. ఉప్పర మెగసి యజాండము, చిప్పలు రాలంగ మేరుశిఖరంబుల పై
గుప్పించి యెగసి కొందు నో, తప్పక నామనసులోని తహతహదీరన్.— శ్రీనాథుఁడు.

మహాత్ముల జీవితము లత్యద్భుతములు. అద్భుతము లన్నమాత్రముననే పామరుడును వారల చరిత్రములతో దన కానిక్యక మేమని నిరుత్సాహపడ నవసరము లేదు. అనసూయ మైన మనస్సుతో వారల చర్యల నెన్న డేని



శ్రీయుత రామన్ మహాశయులు

దలచుకొనిన దన్మయత్వము గలుగునన్న యావంతయు నతిశయోక్తి లేదు. వారల నర్థము చేసికొనవలెనన్న ననసూయ మైనబుద్ధిమాత్రము కావలయును. అందులకనే శ్రీ కృష్ణభగవానుడు తన భగవద్గీత నెట్టి నికృష్టమైన తార్కిక వివర్శనకైనను జవా బిడగలుగు దానినిగా జెప్పినను నప్పుడప్పుడు తన నర్థము చేసికొనుట కనసూయ మైన బుద్ధి కావలయునని వక్కాణించియున్నాడు.

మహాత్ముల చరిత్రము లద్భుతములు మాత్రమే కాదు. అవి పావనములు కూడను. మనము చీకటిలో బడి దారిదొరకక యనర్థపడునప్పుడు, వారల చరిత్రలు, వారల యాదర్శములు, వారల భావములు తేజోమయములై మనల నజ్ఞానాంధకారమునుండి విముక్తులను జేయ సమర్థములై యున్నవి. వారల ప్రకాశ మొక పర్యాయము కేవలము గడ్డిపోచపైన బ్రసరించిన నాగడ్డిపోచకూడ నొకానొకకాలమునకు ఉత్కృష్టదశనందుటకవకాశమేర్పడును.

ఒక సంఘముయొక్క గాని, ఒక దేశముయొక్క గాని, వ్యక్తిత్వమును నాగరికతయును స్ఫుటముగా గుర్తింప వలయునన్న, ఆసంఘములోనిగాని, ఆదేశము లోనిగాని, మహనీయుల చరిత్రములను, యాదర్శములను దిలకించుటయేముఖ్యమన్న ఎవరును అపార్థము చేసికొనరని భావించెదను. తదితరులచరిత్రలను శోధనచేయుట యన్న ఒక మూర్ఖుడు గణితశాస్త్రమునందు త్రిభుజము యొక్క మూడు కోణములు కలసి 180 డిగ్రీలని నిరూపించుటకు గాను, తనకు శక్తి యున్నంతవరకు, లేక తనజీవితకాల మంతయు వేరువేరు త్రిభుజములను గీయుచు వాని కోణములను కొలచుచుండిన ట్లుండును.

ఈరాత్రి నేనొంటిగాగూర్చొని శ్రీ రామన్‌గారి చర్యలనుగూర్చి, జీవితమునుగూర్చి యాలోచించినప్పుడు పైన జెప్పినభావములే నాయాలోచనములను గప్పివేసినవి. మొదట ఎన్నటలేని యాశ్చర్యభావము, తదుపరి నా పామరత్వమును నేమరచిపోయి పారవశ్యభావమును బొందితిని. మా దేశము పరదేశీయుల ఇచ్ఛాప్రభుత్వమునకు

లోబడి తన వ్యక్తిత్వమును జూపుట కవకాశములు చాల తక్కువగనున్నను, మా దేశముయొక్క దాస్యనివృత్తియను బలవత్తరమైన యవసరమునునది గాంధిమహాత్మునివంటి దేశభక్తులను బడయుటయేగాక శాస్త్రపరిశోధనకు గావలసిన పారతంత్ర్యరహితమేమి, భాగ్యవంతత్వమేమి, యను నవకాశములు మా దేశమున శూన్యములైనను, పేరెన్నికగన్న ఐరోపియన్ శాస్త్రజ్ఞులతో—గొప్పయవకాశము లుండి గొప్పవారలైన శాస్త్రజ్ఞులతో—తుల్యముగు పీఠము నలంకరింపసమర్థులగు శ్రీరామన్ మహాశయునివంటి అధిక మేధాశాలిని మా దేశము బడయగల్గినదని తలచుకొనిన, యే స్వదేశీయునకు పరమానందము కల్గకుండును? అట్టియానందోద్రేకమే ఈమహాశయునిగురించి మా తెలుగువారలకు తెలియబరచవలయునను కోరికకలుగజేసినది. ఈవ్యాసమునం దాయనను మహనీయునిగా నేనెందులకు భావించినది చదివిన కొలది క్రమముగ తేటపడగలదు. ఆయనను గూర్చి వ్రాయుటకు బూర్వమే శాస్త్రమునం దాయన ప్రవీణత వహించియున్నాడో ఆపదార్థవిజ్ఞాన శాస్త్రవిషయమై చదువరులకు, వేర్వేరుశాస్త్రములయందు దానికి గల స్థానమును గుర్తించుటకై కొంతపరిచయము కలుగజేయ సాహసించెదను.

ప్రకృతిశాస్త్రములు ప్రకృతిని వర్ణించుశాస్త్రములు. ప్రకృతియందు వింతలను కనుగొని వాని నలవాటుపరచుకొనుట ప్రకృతిశాస్త్ర ఉద్దేశ్యములలో ముఖ్యమైనదియని చెప్పవచ్చును. అలవాటుపరచుకొనుటయనునది ముఖ్యముగా గమనింపవలెను. అయ్యదియే, ప్రకృతిని జూచి ఆనందించు కవిత్వమునుండి మన ప్రకృతిశాస్త్రములను స్పష్టీకరించును: కవి యెంతసేపటికి ప్రకృతిలోనివింతలను జూచి గంతులువేయుచు సంగీతము పాడుచుండును. తనకింతాశ్చర్యము కలుగజేసినదానికి కారణమేమోయను విమర్శన మాతని కుండదు. అట్టి విమర్శనయే యున్న అతని ఆశ్చర్యము కొద్దికాలముమాత్రమే యుండగలదు. అప్పుడు కవిత్వమున కవకాశమేయుండదు. కావున ప్రకృతి నర్థము జేసికొనుటకు, కవిత్వము ప్రథమసోపానమైనను, 'తల్లీనతావాప్తి'చే ప్రకృతిని నిజముగా నానందించుట కంతరాయమై యున్నది.

ప్రకృతిలోని వింతలను జూచుటయే కవిత్వమని యొప్పుకొనబడిన, ప్రకృతిశాస్త్రజ్ఞుడు కవియై యుండవలెనని చెప్పవచ్చును. కవిగాకుండుటయే, మనము జూచు చాలమంది ప్రకృతిశాస్త్రజ్ఞులు నిజమైనశాస్త్రజ్ఞులు గాకుండుటకు కారణము. కవి యానందము నిచ్చువాడుగదా యని (నా పైమాటలచే) కవియై యుండవలసిన, ప్రకృతిశాస్త్రజ్ఞులయొద్దకు వెళ్లి ఆనందమునకు బదులు విషాదమునుగూడ బడయుట అరుదుకాదు "వింత" యను మాటకు గొంతయర్థమును చెప్పవలసియున్నది. మనకు తెలయనిదే వింత. అదేకాదు; మన కిదివరకు దెలిసినవాని మూలకముగా అర్థము చేసికొనుటయే వింత నర్థముచేసికొనుట. ఒక్కొక్కప్పుడు మన కంతయు దెలిసినదనికూడ బొరపడుచుందుము. అట్టివానిలోనుండి మేధాశాలియైన శాస్త్రజ్ఞుడు వింతలను జూపగలడు. అనగా మనకు సామాన్యముగా దోచు విషయములనుండియే ఆతడసామాన్యవిశేషమును బడయగలడు. చూడుడు! ఆనందింపుడు! గెలీలియోయొక్క అధిక మేధాసంపత్తిని! ప్రార్థనామందిరమున తనకుమాత్రమేగాక ఇతరుల యెదుటను వ్రేలాడుచు ఉయ్యెలలూగుచున్న ఒక దీపమును జూచి అట్టియవస్థయందున్న మరి యేవస్తువునకుగూడ చెందునట్లు, కొన్ని సిద్ధాంతములను నిరూపించినారు. (Laws of pendulum) ఈసందర్భమున ప్రకృతిశాస్త్రవిషయమై మరియొకసంగతి జ్ఞాపకమునకు వచ్చినది. అయ్యది ప్రకృతియందొకచోట నొకవిశేషము కనుగొని, దానిని ప్రకృతియంతకును యేయేయవస్థలం దాధర్మము చెందునో కనుగొనుటకూడను. ఇది మన శ్రమలను చాలవఱకు తగ్గించును. ఇది మన శ్రమలకు విరామమనెడి ఫలమనికూడ చెప్పవచ్చును. ప్రతివస్తువుయొద్దకు వెళ్లి నీసంగతి యేమి యని యడుగకుండ మేధాశాలియైన వాడు తన విమర్శకబుద్ధిచే (Analytical mind) సర్వాంగీకారమైన ధర్మమును బడసినప్పుడు వాని యానందమునకు మేరయుండదు. ఆసంగతి నితరులకు దెలియబరచిన వారలు "అమ్మయ్య మనకష్టములనుండి బయట బడితిమి. దురవగాహముగానున్న ఈప్రకృతి, చివరకు కొన్నిధర్మములకు లోనైనదే" అని మనస్సునకు విశ్రాంతి కలుగును.

ప్రకృతి సాధ్యమైనదికదా యని పూర్తిగా గర్వమును చెందకపూర్వమే, మరల ప్రకృతి యసాధ్యమైనదిరా యని వెంటనే యనిపించును. ఏమన ఎవరైన ప్రపంచమున జరుగు ప్రతిసంగతికి కారణమును జెప్ప నడుకట్టిన, అప్పుడు ప్రకృతియొక్క విచిత్రమును, దాని యనంతత్వమును దానిముందు మనయొక్క స్వల్పతయును గోచరింపకమానదు. దీనికికారణము ఒకతీరుగా యిట్లు జెప్పవచ్చును. వస్తువులనుగురించి మనము తెలిసికొనిన కొలది సందేహములు హెచ్చగుచుండును. ఒకానొక కాలమున వస్తువుల చలనమునుగూర్చి పరిశ్రమచేసి, ఆశాస్త్రమందు సర్వాంగీకారమగు ధర్మములను గ్రహించి, ఆధర్మములనుండి, అమితమైన దూరముననున్న, నక్షత్రములయొక్కయేమి, గ్రహములయొక్కయేమి, చలనమును, వానిబరువును, వానికి మనకుండు దూరమును, సూర్యగ్రహణమును, చంద్రగ్రహణమును, అవి ఎప్పుడు వచ్చునదియు చెప్ప నేర్చుకొంటిమి. అయ్యది యమోఘమైనపనియే. అంతమాత్రమున వస్తుతత్వము ముగిసెనా? ప్రకృతి శాస్త్రచరిత్రమునుదిలకించినచో, మనము ప్రకృతి పైభాగముండే యుంటిమనియు, దాని ఒక్కపొరనైనను చీల్చజాలకుంటిమనియు ఇప్పటి మనజ్ఞానముతో గ్రహింపగలము. తర్వాతనో నిశితమైన మానవునిబుద్ధి తనకన్న ఎన్నతరముగాని రెట్లు ఎక్కువపరిమాణము గ్రహములనుండి అదేవిధముగా నెన్నతరముగాని తనకన్న నెన్నిరెట్లో తక్కువ పరిమాణముగల 'మాలిక్యూల్' అను నణువుపై ప్రసరించినది. కాని కొన్నాళ్ల వరకు ఈఅణువులు మహాగ్రహములలో మహానక్షత్రములలో నిరాఘాటముగా విహారముచేసిన మనవిమర్శనాబుద్ధికిని, మన గణితశాస్త్రమునకును, చొరవనిచ్చినవికావు. ఒకప్పుడు ఈగ్రహము లమితదూరముగా నుండుటచే వానిసంగతి మనకు ఏమి తెలియగలదాయని నిరుత్సాహపడినరోజులును గలవు. అంతేకాదు. మనవిమర్శనాశక్తి ప్రవేశింపలేనిచోట్ల, మన కవితాశక్తి విజృంభించినది. సూర్యగ్రహణము చంద్రగ్రహణమును, దుష్టరాక్షస నిరోధమని యూహించితిమి. చంద్రునియందున్న కళంకమునకు ఏమియో గాధలను కల్పించితిమి. కాని కొన్నినాళ్లకు అవి ఎంతదూరములైనను, మనగదిలోగూర్చొని, గడితలుపులు వైచికొని, కాగితమును, కలమునుతీసికొని, మనలెక్కను పూర్తిచేసితిమి గదా?

ఈఅణువులు ఎక్కడచూచినను అవియే. కాని వానిని మనస్థూలదృష్టితో చూడజాలము. వానివిషయమై మనము తెలిసికొనగల్గినది అవి సమిష్టిగా మన ఇంద్రియములు గోచరింపగలుగు కొన్నిగుణములను. అట్లయిన, పాఠకుడు, ఈగుణములనుండి అసలువాటిసంగతి ఏమో గ్రహింపగూడదా యని సులభముగా ప్రశ్నింపవచ్చును. అయ్యా, అట్టి మనమార్గము అనపాయకరమైనదికాదు. ఏమన, ఒకవస్తువునుచూచుట, వానిపైకి గలుగు మార్పులను గ్రహించుట ఇది సులభమే కావచ్చునుగాని, ఒక గదిలోనేమున్నది తెలియకుండనే, బయటగోడలను, ద్వారమునుజూచి గదిలోని సంగతులన్నియు తెలిసికొనప్రయత్నించుట మొదలిదానియంత సులభము కాజాలదు. పూర్తిగా చెప్పలేమని చెప్పుటకు వీలు లేదుగాని, మనమార్గము మాత్రము ప్రమాదాస్పదమైనది యని చెప్పవచ్చును ఈఅణువులపైని పరిశోధనయు నట్టిదియే యైయున్నది.

పదార్థములు అణువుల సమ్మేళమని స్థిరపడినది. (మరికొన్నినాళ్లకు) ఇకనంతట వస్తువులగుణములు రకరకములుగానుండుటకు కారణము యీఅణువులనుండి మొదలిడితిమి. కొన్నాళ్లు మనయాటలుసాగినవి. కాని, మన యమితశోధనయే మరల మనకు ముప్పునుదెచ్చినది. ఈ భౌతిక అణువు (Molecule) అనేదానినికూడా విభజించి వేయవలసివచ్చినది. Atom అనేదియే పరమాణువని నిశ్చయమునకు వచ్చితిమి. మనశాస్త్ర మింతటితో పూర్తియైనది అనితృప్తిపడితిమి. కాని విరామమేమోయని ఎరుగని, మనబుద్ధి, తదనుకూలమైన మనపరిశోధన, ఈ పరమాణువునుగూడా భేదించివేసినది. అయ్యది ప్రోటన్ (Proton) అను ఒక సూర్యగ్రహముచుట్టు ఎలెక్ట్రన్ (Electron) అనుగ్రహములు పరుగెత్తుచున్నవని. చూచితిరా, మనముస్థూలనక్షత్రమండలినుండి సూక్ష్మనక్షత్రమండలికి దిగితిమి. ఇదియంతయును శ్రద్ధగా చదువుచున్న

పాఠకుడు, సకారణముగనే, ఇట్లు ప్రశ్నింపవచ్చును. మీరుచెప్పునదంతయును ఊహాఖేలనముకాదని మమ్ముల నొప్పింపగలరా? మీరు మాకు ఆప్రోటానును, Electron నును మాయీకంటికి చూపగలరా? యని ప్రశ్నింప వచ్చును. అప్పుడు ఏదైనలేదని చెప్పుటకు బెంగాలీ వాడు ప్రయోగించు మందహాసమునే మేమును ప్రయోగింపవలసియుండును. కాని మామందహాసము బెంగాలీ వానియంత భావసూన్యమైనదికాదు. దాని వెనుకనే ఇటుల జవాబుకూడా నిచ్చెదము. "నాయనా, ఒకవస్తువున్నదనిచెప్పుటకు,మనకన్నులు చూచినచూచినట్లు లేకున్న చూడనట్లా! మన యెండాకాలమున శోషింపజేయుచు వీచుపశ్చిమగాడ్పు, దానిరూపమును తిలకింపనంతమాత్రమున, లేదని యనుకొనగలమే? దానిని తలచుకొనిన, చల్లనికాలమనకూడ,గుండెలదరుటమానునే!అంతియకాదు. మన ఇంద్రియ స్ఫురణయావశ్యకతములేకయే,ఒకవస్తువు యొక్క గుణములను విమర్శించు పద్ధతులను మాశాస్త్రమవలంబించుచున్నది. అచ్చోట జ్ఞానదృష్టియును, పరిశోధనయును రెండును ఒకదానికి నొకటితోడై ఎచ్చోట స్థూలదృష్టినినిగుడింపలేమో యచ్చట జొన్పి ఊహాఖేలనమనుకొనుడి, మరి ఏమైననను కొనుడి; వస్తుతత్త్వమును గ్రహింపసాహసించెదము. మాసాహసము మీరెన్నడు తలవని, వినని సంగతులను మాయీపై జ్ఞానముపయోగపరచుకొని, మీకన్నులకగుపడునట్లుగనే, మీచెవులకు వినుపడునట్లుగనే, కొన్ని సంగతులను చూపగల్గు బహుమతిని పొందుచున్నది. "అట్లైనప్రోటన్ (Proton) Electron స్థిరపడినట్లేకదా! ప్రకృతికంతయు గనిపెట్టితిరికదా!" యని ప్రకృతిశాస్త్రజ్ఞుని నభినందింపమొదలిడెదరా,సమభావముతో, ఆతడిట్లుచెప్పును. "ప్రకృతియనంతమైనది. దానిచేష్ట లద్భుతములు. ఒకపరి తనరహస్యమునంతయు బట్టబయలు చేసినట్లుండును. ఒకపరి గంభీరముగ నగాధముగ నుండును. Protonను Electronను గనిపెట్టితిమే యనుగర్వము మా కావంతయును లేదు. ప్రకృతి ఇంకను మమ్ము వెక్కిరించుచునే యున్నది. కాని అయ్యదియే మేము కోరుకొనునది. ప్రకృతి ఎంత అనంతత్వమును దాల్చుచున్నదో దానితోబాటు నిశితమగు మా బుద్ధియు ననంతత్వమును దాల్చుచున్నది."

ఈ సందర్భమున ప్రకృతిశాస్త్రమునకు ప్రతిపక్షులనుండి కఠినమైన ప్రశ్న పరంపరలను గురిపింపజేయు నంశమును కదలించితిని. అయ్యది మన యింద్రియస్ఫురణ యావశ్యకతలేకయే వస్తుతత్త్వమును గ్రహించు పద్ధతులను ప్రకృతిశాస్త్రము లవలంబించుచున్నదనుట గురించి ప్రతిపక్షుల ప్రశ్నల Max Planck గారి మాటలతో సంక్షేపముగ చెప్ప వచ్చును.

"Is the Physical world simply a more or less arbitrary creation of the intellect or are we forced to the opposite conclusion that it reflects phenomena which are real and quite independent of us? Expressed in a concrete form, can we rationally assert that the conservation of energy was true, even when nobody could think about it or that the heavenly bodies will move according to the Law of gravitation, when our earth and all that there is in is in ruins?"

ప్రపంచమే నిజమని నమ్ము పాశ్చాత్త్యుల నుండి ఇట్టి సందేహములు బయలు దేరినచో, వేదాంతశాస్త్రమును మొదలిడుటతోడనే ప్రపంచ మంత కల్ల యని ప్రారంభించు మన హిందువులు, ఇంతకన్న గాఢతరమైన ప్రశ్నలు వేయక మానరు. Max Planck మహనీయుడు, ఆప్రశ్నలకు సవినయముగా జవాబునిచ్చినాడు. అనగా సవినయ మనుదానికి చెప్పుచున్నాను. ప్రపంచములో సూటిగా జవాబిచ్చుటకు శక్యముగాని ప్రశ్నలు కొన్ని ఉండును. దీనికి కారణము జవాబను మానాస్పదమయినది యగుటయని ప్రతిపక్షులు భావింపవచ్చును. భ్రమింప వచ్చును. కాని ఆయావిషయములయం దనుభవమున్న వానికి, మొదలునుండి, యాయావిషయములయందు పెంపొందిన వానికి, తనజవాబుయొక్క నమ్మకము నే మాత్రము ననుమానింపడు. కాని అట్టి ప్రశ్నల కున్న కష్టములవలన సూటియైన జవా బీయజాలదు, అతని

జవాబుఅనుభవమే. ఈవిషయమును నుచ్చరించుచు Max Planck గారు వ్రాసిన దిందు పొందుపరచెదను.

"No Physicist doubts the truth of the observation that a being endowed with physical intelligence and possessing means of detecting ultraviolet rays, wou[d recognize these rays as being similar to the normally visible ones, though no one has seen either an ultraviolet ray or such a being. No chemist has any scruples about ascribing to solar sodium, although he can never hope to put a salt of Sodium into a test-tube..............................
Indeed however confidently one lays the foundations of the world-picture of the future no general rules can be formulated. The greatest foresight is here desirable. There is a second consideration in connection with this question what it simply and solely depends upon is the realisation of a definite object even though unattainable. This object is——not the complete adaptation of our ideas to our perceptions but the complete liberation of the physical picture from the individuality of the seperate intellects. This is perhaps a more accurate paraphrase of what I have called ....in order to avoid misunderstanding "the liberation from the anthropomorphous elements" as if a picture could be independent of the painter: this is a contradiction in terms."

దీనికి పోల్పదగు విషయము భగవద్గీతయం దొకటి యున్నది. అయ్యాది కర్మచేయుచుండుము, కర్మను నమ్మకుండుము, దానియం దాసక్తిని వహించకుము అని చెప్పు సందర్భము. ఇయ్యది పైకి చూచుటకు ఒకదాని కొకటి సంబంధింపన ట్లగుపడును. అంతేకాదు వికటవాదు లున్న యెడల నపహాస్యములను జేయ సాహసించెదరు. వెనుక ఒకడొకడట భార్యను కాఫీ నియ్యమని యడుగుటకు My dear idea, will you give me an idea of coffee?" అని అన్నాడట. వీనిమాటలనే పరికించి, కృష్ణుని వేదాన్తమున కర్థశూన్యము చేయుదురో? దీనికి జవాబు, అనుభవజ్ఞులగు వేదాన్తులే. ఈ భావమునకు ముగింపుగా, భగవద్గీత నుండి 2 శ్లోకముల నుదాహరించెదను.

శ్లో॥ నైవకించి త్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్
పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్ నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్.

శ్లో. ప్రలపన్ విసృజన్ గృహ్ణ న్నున్మిష న్నిమిష న్నపి
ఇన్ద్రియాణీన్ద్రియార్థేషు వర్తన్త ఇతి ధారయన్.

ఈయర్థమునే, మాప్రకృతిశాస్త్రజ్ఞుల యాదర్శముల కన్వయింతురు గాక !

పదార్థ విజ్ఞాన శాస్త్రమును గురించి చెప్పుటకు మొదలు ప్రకృతి శాస్త్రములను వర్ణించితిని. నిజముగా ఈశాస్త్రముల యొక్క 'యుద్దేశ్యము బరికించినచో దాని యైక్యభావము వలన, శాస్త్రము లన్నియు ఒకేశాస్త్రముగా కనుపట్టును. ముఖ్యముగా గణితశాస్త్రము, పదార్థవిజ్ఞాన శాస్త్రము, రసాయన శాస్త్రము ఒకదాని కొకటితోడుగా నుండును. ఒకదాని హద్దులుమీరి మరియొకదానిలో పొర్లుచుండుటయును సంభవించుచుండును. అందులకనే ఇప్పు డీక్రింది శాస్త్రములు కూడ బయలుదేరినవి ఏమనగా Applied Mathematics (లేక Mathematical Physics, Physical Chemistry) కాని ఒక సంగతి మాత్రము చెప్ప వచ్చును. Physics తదితర 2 శాస్త్రములకును మధ్యస్థానము నాక్రమించుచున్నది. అచ్చమైన గణితశాస్త్రజ్ఞుడు తాను రచించుకొన్న ప్రపంచమును తనవిమర్శకబుద్ధిచే పెంపొందించుచుండును. అతడు ప్రపంచమును జూడ వెరచును. రసాయుడన్ననో, ఓపికగల్గి పైచూపులకు (అతని చూపులకు గూడను) పరస్పర సంబంధములేని ప్రకృతిలోని విశేషముల జాబితాను తయారు చేయును. వానిని విమర్శించుదమన్న శాంతచిత్త మతనికుండదు, ఇక Physicistలో

ఈ 2 గుణములును మేళవించినవి. ఈ 2 గుణములలో నతని కేదికొరవడినను నిజమైన Physicist అనిపించు కొనడు. కాని దాని స్థానమును మీకు పొందు పరచి నను కొనెద.

పదార్థవిజ్ఞానశాస్త్రము మొదలెన్నియో ఉపభాగములతో నిండి బయలుదేఱినది. ఆవిభజనము ఒకమోస్తరుగా మన ఇంద్రియవ్యాపారము మూలముగా జరిగినదని చెప్పవచ్చును. ఉదాహరణము కన్నులతో జూచునది లేక ఇంకను మరిశాస్త్రీయముగా జెప్పవలయునన్న కన్నులతోజూచుటకు సహాయభూతమైనది. అది తేజము. దానిపై తేజోశాస్త్రము బయలుదేరె. మన శరీరము ఉష్ణమును, శీతమును గుర్తించును. మనత్వగింద్రియమునకు, అట్టిభావమును కలుగజేయునది ఉష్ణమంటిమి. అయ్యది ఉష్ణశాస్త్రమయ్యె. తర్వాత కర్ణములతో వినునది శబ్దము. శబ్దశాస్త్రము ట్లుత్పన్నమయ్యె. దీనికన్న పూర్వము (Mechanics) ఉద్భవమైనది. అయ్యది వస్తు చలనమును గూర్చినదై యున్నది.

మన ఇంద్రియములతో నేసంబంధము లేకుండ, మరి 2 శాస్త్రములున్నవి. అవ్వవి, Magnetism, Electricity యును, అనగా అయస్కాంతమును గురించియు, విద్యుత్ను గురించియు. మొదటిది—ఇనుము నయస్కాంత మాకర్షించును. దానివిషయమైన చర్చ Magnetism. రెండవది—అద్దముపై పట్టువేసి రుద్దిన, పట్టునకు చెందువంటి పదార్థముల నాకర్షించును. ఇది విద్యుత్. దీనిశాస్త్రము Electrcity యని యనిపించు కొనును. ఈరెండు శాస్త్రములును, పరస్పరసంబంధము లేకుండ మొదలిడినవి. రానురాను మనజ్ఞాన మభివృద్ధియైనకొలది కదలెడివిద్యుత్, కదలని అయస్కాంతమెట్లు వర్తించునో, అట్లు వర్తించుననియును, అయస్కాంతమును గదలించినయెడల, దానిపరిసరములందున్న ఏవిద్యుత్ వలయము నందైనను (circuit) విద్యుచ్ఛక్తిని కలిగించుచున్నదనియు గుర్తింపబడినది. దీనిని స్వచ్ఛముగ నర్థముచేసికొనినది Faraday, ఫారడే అను మహనీయుడు. అతనియూహ యప్రతిమానమైనది.

అంతకుపూర్వము 2 విద్యుదుద్వేగమును చెందిన వస్తువులను (Electric charges) దగ్గరకు తీసికొని వచ్చిన, ఆరెండు నాకర్షింపబడకుండనుండవలెనన్న, వానిరెంటిని అగబట్టవలెనని కనిపెట్టబడినది. ఈశక్తికికారణము, ఆరెండువస్తువులయందున్న విద్యుత్తే కారణమని తలచిరికాని, ఆరెంటిమధ్యనుండు స్థలమునకు (Space) ఏమైన సంబంధమున్నదా యని యాలోచించిన వారు కారు. కాని ఈమహనీయుడు, అస్థలమునందు వేర్వేరు పదార్థములనుంచి, అప్పుడు ఆ 2 చార్జీలకు నుండెడి యాకర్షణశక్తిని కొలువగా, వేర్వేరుపదార్థములకు వేర్వేరుగా నుండెనని గ్రహించెను. దానివలన ఆయనగ్రహించిన దేమనగా, 2 (Charges) మధ్యనుండు స్థలమునకు గూడ, ఆశక్తితో సంబంధ మున్నదని, అతడిట్లూహించెను. ఒకచార్జినుండి మరియొకదానికి, దారములు కట్టినట్లు గాని, లేక రబ్బరునాళములతో కట్టినట్లుగాని, ఊహించినచో, వాని కట్టి యవస్థకలుగునో, అట్టియవస్థయే ఆరెండుచార్జీల మధ్యప్రదేశమునకు కల్గినదని భావించినాడు. అనగా పరస్పరమాకర్షించుకొను చార్జీలను; ఆకాశమును ప్రదేశమం దుంచితిమేని, ఆయాకాశమునందు స్థితి ఎట్లుండుననగా, రబ్బరునాళములను రెండుచేతులతో లాగిన నెట్లుండునో, అట్లుండును. రబ్బరు నాళమును మీరు లాగినపుడు అది ఏమిచేయుచున్న దనుకొనెదరు? అది మీరెండుచేతులను దగ్గరకు తీసికొనరా బ్రయత్నించుచున్నది. దానినిగుంజు మీప్రయత్నమునకు అది ముడుచుకొనవలెనని దానిప్రయత్నమునకును, రాజీకుదిరినది. అట్టిస్థితియే ఈయాకాశమునందు కూడ కల్గినది. అట్లుగాక, పరస్పరము వైముఖ్యభావమును జెందు చార్జీలను ఆకాశప్రదేశములోనికి, దీసికొనివచ్చిన యెడల, ఆమధ్యప్రదేశపు పటము నెట్లూహించెదరు? నేజెప్పవలెనా? అప్పటిస్థితి, రబ్బరు తనసహజస్థితినుండి యదిమినట్లుండును. ఇట్టి యద్భుతమైన యూహ, ఎట్టి యమోఘమైన విశేషములను బయటికి తీసికొనివచ్చినది? విద్యుత్తునకును పదార్థమునకువలెనే, జడత్వమున్నదని సూచింపబడినది. కాన, ఏవిద్యుద్వలయమునయినపూర్తి చేయుటతోడనే, రావలసిన విద్యుత్ ప్రవాహము రాదు.

కొంచెము ఆలస్యము పట్టును. ఎవరో అడ్డుకొన్నట్లుం డును. ఈమహానీయుని నామమే, అయస్కాంతప్రవలనము—కాక—అయస్కాంతముచుట్టు నుండెడు ప్రదేశమునందున్న శక్తి కేదయిన మార్పుగల్గిన అయ్యది విద్యుత్ప్రవాహమునకు సమానమని కనిపెట్టబడిన విషయమందును శోభించుచున్నది. ఈతడు విద్యుత్ పరిసరప్రదేశమును వర్ణించినరీతి, అయస్కాంతత్వమునకును, విద్యుత్తునకునుగల పరస్పరసంబంధమును కనిపెట్టుట. ఈ రెండును (Physics) నకు గొప్పనూత్నతేజము నిచ్చినవి. వీనిఫలితములు మీరు వినినయెడల నాయర్థమే మోమీకు స్ఫురింపగలదు. ఆమహానీయుడిట్లు(Magnetism)నకును (Electricity) కి నైక్యత గూర్చుటయేగాక తేజస్సునకును పైవానికిగూడ సంబంధము గల్పించినాడు. ఈతడు పూర్తిగా తత్సంబధము కనిపెట్టెనని నేనుచెప్పనుకాని మనకదృష్టకరమైన యతని యనుమానము తత్సంబంధముపైకి పోయెను. అయ్యదియే పదివేలు. అతడు చేసిన ప్రయోగములు సంబంధమున్నదని నిరూపించినవి. సంబంధమిట్టిదని నిరూపించుటకు అతడు కేవలము (Physicist) అగుటవలన చెప్పలేకపోయినాడు. కావలసినది అగణితమైన గణితశాస్త్రప్రజ్ఞ. అది యతనికి కొరతపడియె.

ఈసందర్భమున నాయభిప్రాయము నొకదానిని చెప్పదలచినందులకు పాఠకులు క్షమింతురుగాక. ఇట్టిమహానీయులబుద్ధి గణితశాస్త్రమందు విహార మొనర్చిన బుద్ధికన్నను ఎన్నతరమైనదని నాభావము. ఇది గణితశాస్త్రజ్ఞుని తీసివేయుటకాదు. ఆఘటితమైన యెన్నియేని సమస్యలను సలీలముగ పరిష్కరించు వీరిమేధాశక్తియల్పమే? నేనిక్కడ జెప్పదలచినది, అట్టి మేధాశక్తికినిగూడ మించియున్నది. Faraday వంటి మహానీయుని బుద్ధి అని. ఏమన గణితశాస్త్రమనునది, Physicist నకు ఆయుధమునంటిది. దానిలో నిరంకుశప్రౌఢి యున్నైనా, ఎట్టి విపదంధకారమునుండియైనను తత్సహాయమున విముక్తినందగలడు.

అదినిశ్చయము. ఈగణితశాస్త్రమునందుండు చమత్కారమేమనగా, అయ్యది, ఒక్కొక్కప్పుడు తదధినేతను అంధకారమునుండి బహిర్గతునిజేసినప్పుడు అతని కన్నులకు మిరుమిట్లుగొల్పుప్రకాశమైన విశేషములను జూపును. ధృడహృదయుడయ్యెనా వాని నర్థముచేసికొనును. కాదు ధృడహృదయుడుమాత్రమే కాదు. ప్రపంచజ్ఞానముకూడ కావలెను. నాభయమేమన తల్లీన తావాప్తిజెందిన యీగణితశాస్త్రజ్ఞులకు ప్రపంచస్ఫురణమే ఒక యవమానముగా భావింతురు అందువలన నేపైనసూచనచేసిన ప్రకారముగ విశేషములు వీరికాశ్చర్యమునుగాని ఆనందమునుగాని కలుగజేయవు. వెంటనే పుటత్రిప్పివేసి మరి యొక ప్రశ్ననందుకొందురు. ఆది యట్లుండె.

Faraday గణితశాస్త్రమను నాయుధము లేనివాడు. కాని అతడు కనిపెట్టియర్థము చేసికొనిన విషయములో గణితశాస్త్రజ్ఞుడయినవాడు, దీనితర్వాత ఇది, దీనితర్వాత ఇది, ఇట్లు సక్రమముగనే వేసినగాని రాదు అని ధృడనిశ్చయుడై చెప్పు విశేషములు, ఏమని భావింతురు? Faradayయొక్క మేధాశక్తిని! చెమటపడిసి, అప్పటికి అర్థముచేసికొనలేని జవాబులనుబడసెడు ఈగణితశాస్త్ర సహాయములేకనే కన్నులకు గట్టినట్లు, అమోఘమైన ఫలితములను బడయుటకు ఆబుద్ధి ఎట్టిదై యుండవలెను! అయ్యలారా! ఇదే మహానీయత. సామాన్యులమైన మనము అడుగులో అడుగువేసికొనుచు నడచిననేగాని గమ్యస్థానమును చేరలేము. అదియును అనుమానమే. మహానీయులకో, మనమార్గములు వారలకనవసరము. అంతయు వారి దివ్యదృష్టికి ప్రసన్నమగును. వారల కేత్రోవవెడలిన సులభమో, మనకన్న బాగుగ తెలియగలదు. అట్టి మహానీయతయే, శ్రీయుతరామన్ మహాశయునియందున్నదని నాశక్తికొలది చూప ప్రయత్నించెద.

(సశేషము.)

కుక్కుటధ్యానము

డాక్టర్ నిడమర్తి ఈశ్వరప్ప గారు,
బి.ఎ.,యం.డి.బి.,యఫ్.యం.హెచ్.సి.

గండిసె ముంజూరిలో మాటు మడఁగియుండి-పిడుగువలె వచ్చి నీవాత వేసికొనెదె
నన్నో? ప్రేయసినో? చిన్నినాయనలనో?-సేగి నీ కే మొనర్చితే చెనటికత్తి!

బ్రహ్మయిచ్చిన యాయువు బ్రదుకనీవు-పోవునెడ నిముసమ్ము వాపోయనీవు
భార్యకుం బిల్లలకుఁ దుది పలుకుసున్న-ముందుగాఁ జెప్ప రారాదె మొండికత్తి!

తిండికి నీఁకు బాయసముఁ దియ్యని పండ్లను బిండివంటలున్
దండిగ లేవె? యేల కరుణాలవశూన్యత మమ్ముఁ జంపెదో?
పండుగ లేవివచ్చిన నపారముదబ్ధిని నీవు దేలగా
గండము మాకెగాదె? కడికండలుగా మముఁ జేసె దోసరా!

నీదువాకిలికడ వచ్చి నిలుచుబండి-బందుగునిఁ దెచ్చుఁగాని మాపాలి కతఁడె
మృత్యుదేవత యనగ నసత్యమానె?-బండియా మా కది ఫిరంగిగుండుగాని?

పాప మెఱుంగమోయి, నిరపాయముగా మముఁ జేయ వైతి వే
పాపముఁ జేసినామొ తొలిబాముస, నీభవమందు మమ్ము దు
ష్ప్రాపులఁ జేర్చి యిట్లు బలవన్మరణంబును గూర్చితేల? మా
తాపముఁ దీర్పవా రెవరు దైవమ! నీవె దయం దొలంగినన్.

కరకర నూఱుకోయి పిడికత్తిని నాయఁడ, బండరాతిపైఁ
బరపరఁ గోసి నీపొలము పంటకు నన్బలి వెట్టుకోయి, వ
త్సరముఁ గుటుంబపోషణము సల్పెడి నీవరిఁ గోసికొమ్మ న
న్నురవడిఁ జంప నాపలల మొక్కదినమ్మునఁ గుక్షినింపునే?.

ముప్ప్రొద్దుల నమ్మమ్ము ముద్దుగాఁ జేరిచి తవిటియుండల మేపు తండ్రి వీవ
కుక్కలు నక్కలుం గొఱుకకుండగ మమ్ముఁ గూటఁగాచెడి రక్షకుండ వీవ

పెంపను మముఁ బట్టి చంపను విక్రయింపను శక్తిఁ గల్గిన ప్రభుఁడ వీవ
కల్యవైతాళికుల్గాఁగ నిన్నేల్కొల్పు చరణాయుధమ్ముల స్వామి వీవ
ఏయెడం గృతజ్ఞులము నీయెడను మేము-అట్టి మముఁ గొట్టి నీపొట్టఁ బెట్టికొనెదె?
తనయులం జేతులం జంపి తినెడితండ్రి-యుండునే యెందు మానిసిదిండిగాక?.

గోముగఁ గాపువాఁడు మముఁ గూడును గూఁడును గూర్చి పేర్చియున్
బ్రేమను వీడి చంపి పలురీతులఁ జేసిన మందుమాకుల
న్నేమము నీటఁ గల్పి యవినీతిని బాపఁడె పాపడండె? ని
న్నీమముగా మనీషులకు శేముషి యిట్టి యమానుషంబులన్.

ఖగనాథుండదె నింగి నిశ్చలత రెక్కల్సాపి చక్రాకృతిం
దిగుచున్ రివ్వున మీఁది కేఁగుచును సంధింపంగ నేగున్న నే
నెగురందన్నుకపోవ నిట్లొడుపుమై నెంతే న్విజృంభింప నా
సగప్రాణం బెటు సంతతిం దనదు పక్షద్వంద్వము న్గప్పెడిన్!

అకట! బేలవుసుమ్మి నాప్రాణపదమ!-సంతుఁ గావంగ నెంతే దిసంతుఁగొట్టి
గ్రద్దపై ముక్కుమొగ మెత్తుగాఁగఁ జేతె?-కాచికొనెదవా యర్భకుకత్తినుండి?

కొండలమించుమేటి వరికుంభము మ్రింగెడిదేవి పొట్టకుం
గండియ యున్నదో యది యగాధమొ? యాఁకలి దప్పి తీఱకే
కుండలతోడఁ బానకముఁ గ్రోలుచు మారుధిరంబు జుఱ్ఱు నా
చండికకొల్వు కుక్కుటపు జాతికి మారణహోమ మక్కటా!

తప్పక సృగాలవైద్యుండు తమముమీఱ-విధిగ మముఁజూచు మేమన్నఁ బ్రీతిగాన
వానిఁ గనినంత జాడ్యము ల్వాయుమాకు-వానిపంటివైద్యము చేయలేని దేది?

గుడిసెలో నీవింక గుఱకల విడకుండఁ బ్రాగ్దిశాంగన వెల్లఁబాఱకుండ
నభిసారికల్స్వగృహములకుఁ బోకుండఁ బిట్టలు పొట్టకై వెడలకుండఁ
జుక్కలొక్కొక్కటే రుక్కుదక్కొనుచుండ రిక్కరాయఁడు చిక్కి పొక్కుచుండ

జాయాపతులయక్కు సమసిపోవుచునుండఁ జోరులసతు లింక స్రుక్కుచుండ
నఱచిలేపెద మోయి నిన్నునుపఁ గృషికి-"కొక్కురోకోయి" కాదోయి కోడికూఁత
"కొయ్యఁబోకోయి"యంచు వేకువను మొదలుఁ-బ్రార్థనముఁ జేతుమోయి మాపాలిఱేఁడ!

అన్న ! నామాంసమన్న నీప్రాణమైన-నకట నేఁ జావకీఁక తప్పదన్న నాదు
పీఁక నొక వ్రేటునం దెగవేయుమయ్య-నులిపిమాత్రము నన్జంప వలదు వలదు.

వీరాగ్రేసర ! కత్తివట్టితని గర్వింపంగ నేలాజి మా
వారి న్నీవలె దున్మలేదె కలహవ్యాజంబు లేకుండ? నా
గోరు ల్వాలవె? సవ్యసాచినిజమీ కూలంకషప్రజ్ఞనీ
నారంగస్థలులందుఁ జూడవె నను న్నాశస్త్రకౌశల్యమున్?

అని వెనుఁ జూపినంత మన నక్కడె యోధుఁడ! పోషకుండు జం
పును మఱి నిన్ను నక్కలకు బువ్వముఁ బెట్టును గాని చూడు నే
వెనుకకుఁ దగ్గినన్ రిపువు భీతిని, గాయముఁ జెందినన్ దటా
లున నను వెచ్చగాఁ గడుపులో నిడికొంచు భరించు నాదృతిన్.

జినుఁడ, బుద్ధుఁడ, బాపఁగా జీవహింస-మఱల నొకసారి యవతరింపఁగరాదె?
కావవేల మహాత్మ ! యోగాంధి మమ్ము-నాలకై కంకణముఁగట్టు నపరబుద్ధ?

కొందఱు తిందురు మము మఱి-కొందఱు మేమన్న ముట్టుకో నొల్లరు మీ
రందఱు విడచి యమందా-నందము మా కిడఁగరాదె నరవరులారా!

౪౩-వ అఖిల భారత జాతీయ మహాసభ-కలకత్తా


౧౬. పండిత మాలవ్యాదులు
విషయనిర్ణయసభకు పోవుచున్నారు






౧౮. అధ్యక్షులు, వసంతా దేవి, సేనుగుప్త
మున్నగువారు సభకు పోవుచున్నారు

౧౫. బాబూ రాజేంద్రప్రసాదు,
శ్రీనివాస అయ్యంగారు మొదలయినవారు
సభకు పోవుచున్నారు






౧౭. సర్ సి. పి. రామస్వామి అయ్యర్ గారు,
బిసెంటుగారు కన్వెన్షన సభకు పోవుచున్నారు



౨౦. భారతీయ వస్తుప్రదర్శన ప్రదేశము



౨౧. దేశబంధు నగరమునందలి విషయనిర్ణయ మహాసభ



౧౯. అద్భుత ఊరేగింపు

బ్రహ్మచర్యము

గొల్లపూడి శ్రీరామశాస్త్రిగారు

శ్లో. శిష్యస్య త్రిక్రమేణైవ విద్యామాప్నోతియచ్ఛుచిః, బ్రహ్మచర్యవ్రతస్యాస్య ప్రథమః పాద ఉచ్యతే.

(తా. సత్యము, శాంతము, ఇంద్రియనిగ్రహము, మొదలగు సద్గుణంబులచేఁ బవిత్రుఁడై విద్యాభ్యాసమొనరించునాతని నియమమే బ్రహ్మచర్యముయొక్క మొదటిపాద మనఁబడును.)

మనుశాసనమును బట్టి బ్రహ్మచర్య రహితమగు విద్యాభ్యాసముగాని, విద్యాభ్యాస శూన్యమగు బ్రహ్మచర్యముగాని లేదనుట స్పష్టము. ఈకారణము బట్టియే మనపూర్వులు గురుకులవాస మొక్కనియమముగ నేర్పఱచియుండుట.

పూర్వము విద్యార్థులు గురుకులములందేయుండి, గురువుల యాజ్ఞకు బద్ధులై బ్రహ్మచర్యమును బాలించుచు విద్యాభ్యాస మొనరించుచుండెడివారు. తల్లిదండ్రులు బాల్యముననే కాలధర్మము నొందినచో, వారిపుత్రుఁడు గురుకులవాసమునుండి వచ్చుపర్యంతము, అతనిస్థావర జంగమాత్మకమైన యాస్తిని రాజు కాపాడవలయునని మనువు శాసించియున్నాఁడు. ఆకాలమున గురుకులవాస మెంతటి నియమముతో వర్తిల్లుచుండెనో దీనింబట్టి తెలిసికొనవచ్చును. భీష్మాచార్యుఁడును గురుకులవాస మేర్పఱచియే ద్రోణాచార్యుని మూలమున కౌరవపాండవులకు సకలవిద్యలలవడఁజేసినట్లు విదితమయ్యెడి.

మఱియు, పూర్వకాలమున విద్యార్థులవయోబుద్ధుల పరిశీలించి వారివారి యిష్టానుసారముగా వివిధవిద్యలబోధించుచుండెడివారు. విద్యార్థులు సంఘభూతములతోపాటె గురువులతోను స్నేహము గలిగియుండి, సృష్టికార్యములోని జీవితరహస్యముల ముఖ్యముగఁ దెలిసికొనుచుండెడివారు. భూతదయ, కృతజ్ఞత, మొదలగు లోకోత్తరగుణంబులలవడఁజేయుచు, విద్యార్థులను బ్రహ్మచర్యపాలకులనుగాఁ జేయుటయే యానాఁటి గురువులముఖ్యకర్తవ్యమైయుండెను. కనుకనే యప్పటి విద్యావంతులు తేజోవంతులై ఘనకార్యములొనర్చి నేఁటికిని మనచే గీర్తింపఁబడుచున్నవారు.

ఇఁక నేఁటి విద్యావిధానము నరయుఁడు. మన పూర్వులచే నిషేధింపఁబడిన భృతకాధ్యయనాధ్యాపనములే (డబ్బు ఇచ్చి చదువుకొనుట, డబ్బు తీసికొని చదువు చెప్పుట) సర్వతోముఖముగా రాజ్యము చేయుచున్నవి. ఈపద్ధతివలని నష్టములు కరతలామలకములగుటచే విశేషించి వివరింపఁబనిలేదు. తాత్కాలిక గురువులు; తాత్కాలిక శిష్యులు. ఒకమాట యధికముగ మాటాడినచో "నేను జీతముగట్టలేదా?" అని విద్యార్థియనును. ఆవిషయమును మఱల నొకపర్యాయము చెప్పవలసినదని విద్యార్థి యడిగినచో గంటయయినది. ఇంకొక పర్యాయ మాలోచింతమని యుపాధ్యాయుఁడనును. శిష్యవాత్సల్యము, గురుభక్తి అనువానికిఁ బ్రవాసము ఘటిల్లించుట కీవిద్యావిధానమేకదా కారణము.

మఱియు, ఈకాలమున విద్యార్థికిని ఆత్మీయశక్తులు గలవను భావములేక విద్య గఱపఁబడుచున్నయది. ఉపాధ్యాయులదృష్టిలో బాలురు యంత్రములుగఁ బరిగణింపఁబడుచున్నారు. ఇంతయేల? చిరంజీవులను నిర్జీవప్రతిమలనుగ నీనాఁటి విద్యావిధానము చేయుచున్నదనుట యతిశయోక్తి యనఁజాలము. ఆత్మికశక్తులకు విరుద్ధముగు పరిశ్రమంబును నెడతెగక చేయుచుండుటచే విద్యార్థులనారోగ్యవంతులగుచున్నారు. ఇట్టిస్థితిలో దేశసేవ యన్నవారికిఁ దలకంటగించుననుటలో నాశ్చర్యమేమి? అధ్యాపనమూలమున నుపాధ్యాయుఁడు [illegible] బోసికొనుచు, బాలుర భవిష్యజ్జీవితము దుఃఖభాజనముగా నొనర్చుచున్నారనుట నిశ్చయము. ఇట్టి విద్యార్థులకు మాతాపితృభక్తి, దేశభక్తి, బ్రహ్మచర్యము అనునవి యెట్లలవడును? విచారింప నేఁటికాలమున జ్ఞానోపార్జ

నోద్దేశముతో విద్యాభ్యాస మొనరించు వారుఅరుదనియు జెప్పనగును. కనుకనే పట్టభద్రుల మనుకొనువ రును నిష్ప్రయోజకులుగ నుండఁగలుగుట.

ఈసందర్భమున విద్యాపరమార్థమును గుఱించి యించుక ముచ్చటించుట యవసరము గాకపోదు. విద్య యన ఆత్మశిక్ష. మానవకళ్యాణమును వెలువరించుటయే శిక్ష యనఁబడును. విచారింప, ఈశ్వరాంశములై మనుజునిలో నణఁగియున్న స్వార్థత్యాగము ధర్మనిష్ఠ, భూతదయ లోనగు పవిత్రగుణముల వికసింపఁజేయుటయే విద్యాప్రయోజనము. శ్రుతులు, స్మృతులు లోనగునవియన్నియు నాత్మవికాసమును పెంపొందించుటకేయేర్పడినవి. ఆత్మజ్ఞానమునకు దూరమగు విద్య యొకవిద్య గానేరదు. ఈవిషయముననే పాశ్చాత్యులకును, భారతీయులకును గొప్ప వ్యత్యాసము గలదు. 'మృగాదులకంటె మనుజుఁడు విలక్షణమైన బుద్ధిగలజీవి.' అని పాశ్చాత్య సిద్ధాంతము. కనుకనే వారి పరమావధియు శక్తికొలఁది బుద్ధికి సానబెట్టి, అసాధ్యములను సాధ్యములుగా నొనర్చుటమాత్రమే. దీని ననుసరించియే వారి విద్యావిధానమును నున్నయది. ఇఁక భారతీయ సిద్ధాంతము దానికెంతయు వ్యతిరేకము. మనుజుఁడు ఈశ్వరాంశసంభూతుఁడు. ఇతనిపరమావధి తనయందిమిడియున్న యీశ్వరతత్త్వమును ప్రతిఫలింపఁజేయుట. వివిధవిద్యాప్రయోజనమును ఇయ్యదియే. తొల్లింటి విజ్ఞులు, ఆత్మజ్ఞానమునకు సాధనముగాని ప్రయత్నము నిరర్థకమనియే ఘంటాపథముగా జెప్పియున్నారు. భారతీయ సిద్ధాంతమునకు దూరమై, జీవుని శృంఖలాబద్ధునిఁ గావించునదియగు నిప్పటి విద్యావిధానము, ఇట్లే కొంతకాలముండినచో భారతదేశము నామమాత్రావశిష్టమగునని బుద్ధిమంతులు పెక్కండ్రు నుడువుచుండుటకుఁ గారణ మితర మేమియుఁగాదు.

విద్యాప్రయోజనము ఆత్మికశక్తిని వికసింపఁజేయుటయని తెలిపియుంటిని. అట్లయిననే సర్వకార్యములును హస్తగతములగును. సామాన్యదృష్టితోఁ జూచినచో మనశక్తి చాల స్వల్పమనియే తోచెడి. కాని, ఈబ్రహ్మాండము లన్నియు సృష్టించి అంతరిక్షమున దాఁటుమారు గాఁదుండ నిలిపిన యీశ్వరుని శక్త్యంశమని తలఁచితిమేని యీ మనశక్తి కుండు పరిమాణ మపారమని తెలియఁగలదు. ఇట్టి మహాద్భుతశక్తిగర్భితంబగు మన శక్తిబలము నించుకైనఁ గనుఁగొనవలయునన్న, అయ్యది దుర్వినియోగమొందకుండఁ బ్రయత్నింపవలయు. దానికి ముఖ్యసాధనము నిగ్రహము. దీనినే యింద్రియనిగ్రహ మందురు.

నిగ్రహముచే నాత్మికశక్తులన్నియు నపారబలసమన్వితము లగును. ఈరహస్యము దెలిసియే తొల్లింటి ఋషులు తన్నిగ్రహమునకై పడరానిపాట్లు పడి తుదకు సంకల్ప సిద్ధులైనట్లు వినుచున్నారము. కొందఱుమునులు మౌనవ్రతముఁబూని తమ వాక్శక్తిని వీర్యవంతముగ నొనర్చియున్నారు. అట్టివారిపలుకులు వేదవాక్యములును, తిట్లు శాపములును గాఁజాలినవి. ఇక సంకల్పశక్తి సామర్థ్య మనిర్వాచ్యము. దీనికే భావనాశక్తి యనియుఁ బేరు. దీని ప్రభావముచేతనే కవీంద్రులు లోకోత్తర గ్రంథముల రచియించి మృతజీవులైరి. దీనిప్రభావము చేతనే శూరులు శత్రుసంహార మొనరించి కీర్తికాయులైరి. దీనిప్రభావముచేతనే పరమమునులు బ్రహ్మసాక్షాత్కారమును బడసి నిత్యానందభరితులైరి. ఇంతయేల? ఈశక్తికి మించినపదార్థము బ్రహ్మసృష్టిలో దొరకదనిన నొక్కమాటతో సరిపోవును.

ఇట్టి యద్భుతశక్తికిఁ గారణమగు నిగ్రహము బ్రహ్మచర్యముపై నాధారపడియున్నది. గృహమునకు స్తంభమువలె శరీరమునకు మూలాధారము బ్రహ్మచర్యమనఁదగును. "బ్రహ్మచర్య మాయుష్యకరాణాం—లోకములో నాయుస్సును వృద్ధిపఱచుకొనుటకుఁ గల సాధనములలో బ్రహ్మచర్యమును మించినది లేదు. దేనిచే వాలఖిల్యాది ఋషిసత్తములు దీర్ఘాయుష్యాదులఁ బడయఁజాలిరో, అట్టి బ్రహ్మచర్యరసాయనంబును గ్రోలి మీరును దీర్ఘాయురారోగ్య బలసంపన్నుల రగుడు" అని చరకముని యుపదేశించియున్నాఁడు.

"ఆచార్యో బ్రహ్మచారీ బ్రహ్మచారీ ప్రజాపతిః;
ప్రజాపతి ర్విరాజతి విరా డింద్రో ఽభవద్వశీ"


బ్రహ్మచర్యపాలనముచే మనుష్యుఁడు ఆచార్యపద మలంక

రించును. దానిచే భూపాలకుఁడై జనులను దన వశవర్తులఁ గావించుకొనునని పైవచనాభిప్రాయము. ఆయువు, వీర్యము, బుద్ధి, కీర్తి లోనగునవి యన్నియు బ్రహ్మచర్యమును బాలింపని కతమున నష్టములగునని మును లుద్బోధించి యున్నారు.

ఇట్లు ఆయుష్యవర్తనంబును, సర్వకార్యసాధకంబును నగు నీబ్రహ్మచర్యవ్రతము బాలుర కెంతటి యావశ్యకమో వేఱ చెప్పఁబనిలేదు. భవిష్యద్దేశ సౌభాగ్యము వారిపై నాధారపడియుండుటచే వారీవ్రతపాలనంబున నప్రమత్తులై యుండిననే, ఏనాఁటికైన భారతమాతకు ముక్తిగలుగునని చెప్పుట కవకాశ మేర్పడును.

'బ్రహ్మచర్యం త్వా విద్యాగ్రహణాత్'

విద్యాభ్యాస మొనరించునంతకాలము బ్రహ్మచర్య వ్రతమెంతయు ముఖ్యమను ఋషిపుంగవుల వచనమును నాదరించుచు మనవిద్యార్థులు తేజోవంతులై దేశసౌభాగ్యమునకుఁ గారకు లగుదురుగాక యని కోరుచున్నాను.



శ్రుతి-స్వరముల పరిణామము

పండిత వింజమూరి వరాహనరసింహాచార్యులుగారు

శ్లో. "చైతన్యం సర్వభూతానాం వివృతి జగదాత్మన నాదబ్రహ్మతదానంద మద్వితీయ ముపాస్మహే.

పెక్కువత్సరములనుండి భారతీయ సంగీతమందలి శ్రుతులగూర్చియు, స్వరములగూర్చియు మనవారేమి, పాశ్చాత్యులేమి వివాదపడుచునేయున్నారు. ఒకస్థాయి యందు పండ్రెండుస్వరములుమాత్రము కలవని కొందఱును, బదునారుగలవని కొందఱును అభిప్రాయ పడుచున్నారు. ఈభిన్నాభిప్రాయములకు కొంతతావులేక పోలేదు. భారతవాగ్గేయులుశారఙ్గదేవుఁడు, నారదుఁడు, రామామాత్యుఁడు, సోమనార్యుఁడు, వేంకటమఖి, యిత్యాదులెల్ల ఈ సంగతులందేకాభిప్రాయులుకాక భిన్నమతముల జెప్పియుంటయు నొకకారణము కాకపోదు. సౌంస్కృతకాలపు సంగీతస్థితినిగూర్చి గమనింపనెంచిన పాశ్చాత్యశాస్త్రకారులు సర్ విలియమ్ జోన్సు, పాటర్సన్, కెప్టను విల్లార్డు, కెప్టనుడే, ఏ. జె ఇల్లిస్, జొసానోక్వె మొదలగువారు మనవారిరచనలను సరియైనతత్త్వముతో భాషాంతరీకము జేయజాలి యుండకపోవుటచే గొంత భిన్నాభిప్రాయములతో నుండిరి. ఇటీవలి మనశాస్త్రపరిశోధకులు సర్ రాజా సౌరేంద్రమోహన టాకూర్, సహస్రబుద్ధి, అబ్రహాం పండితార్, డీవల్ మొదలగువారు కొందఱు పాశ్చాత్యుల ననుసరించుటకే నుత్సాహము జూపినట్లు కొన్ని విరుద్ధాభిప్రాయములనే జెప్పిరి. మఱికొందరు తమయభిప్రాయములను జెప్పినవారును గలరు. ఈ సంగతులనెల్ల నాచిన్నిపొత్తమగు "22 శ్రుతులు-స్వరావళి"ని వివరించితిని. కావున నాచర్చలిటు జెప్పకయే నాయేర్చుకొలది మనశ్రుతులు స్వరావళి యెట్లు కలుగునో క్లుప్తముగా జెప్పుదును

ముఖ్యముగా ప్రకృతపు కర్ణాటక సంగీతమున జతుశ్రుతి రిషభమనియు, షట్శ్రుతి రిషభమనియు నిట్లు కొన్నిస్వరములు శ్రుతులసంఖ్యతో జేర్కొనుటచే స్వరముల నెంచునపుడెల్ల శ్రుతులగూర్చికూడ కొంత తెలియవలయు. ప్రథమమునుండియు నీదేశమున నొక స్థాయియందలి శ్రుతు లిరువదిరెండుమాత్రముకలవని చెప్పబడుచుండెను. క్రీ. పూ. నాల్గవశతాబ్దమునాటి భరతనాట్యశాస్త్రమును దీనికి పూర్వమైన గర్భోపనిషత్, కుటిమియామిలై శాసనములు మున్నగు శాస్త్రములు దీనిగూర్చి చెప్పుచుండుటచే, మన ద్వావింశతి శ్రుతిపద్ధతి గ్రీకుశాస్త్రజ్ఞుల "ఒలింపియన్" మొదలగువారి శ్రుతిపద్ధతి "(Quarter tone)" కన్న పురాతనమైనదని గ్రహింతుము. 'ధీరద్ధ్వావింశతిం శ్రుతీ ర్మన్యంతే' అని యిరువదిరెండు శ్రుతులుమాత్రము గణింపబడవలెనని మనవారు జెప్పుచుండిరి. కోహలుఁడు యిరువదియారు శ్రుతులు కలవని చెప్పునది త్రిస్థాయియందలి వాని జేర్కొనుటే యని ఖల్లినాథుడు చెప్పెను. "అనంత్యంహి శ్రుతీనాంచ సూచయంత్యిం విపశ్చితః" అని చెప్పుటనుగూర్చి కూడ ఖల్లినాథుఁడు వ్రాసెను కాని యీ సంగతి సంగీతప్రశంసమున కుదురదని ఖండించెను. నాద మనురణనాత్మకము కావున కొన్నిచలనములు కలిగినప్పుడెల్ల నాదముదయించుచుండును కావున యనంతములగు నాదములు కలవని గ్రహించినను యన్నినాదములను శ్రవణేంద్రియము గ్రహించుట లేదు: కావుననే నిమిషమునకు 32 చలనములకు తక్కువకలవి, 3,000 చలనములకు పైన కలవి శ్రవణేంద్రియము గ్రహించదని పాశ్చాత్యశాస్త్రజ్ఞులు లెక్కవేసిరి. "శ్రవణేంద్రియగ్రాహ్యత్వాత్ ధ్వనిరేవ శ్రుతిర్భవేత్" అని యెంచబడుటవలనను అనంతశ్రుతు లిట యప్రస్తుతము.

ఇటీవల పింగేల్, సహస్రబుద్ధిగార్లు 44 శ్రుతులుగలవని వింతసంగతులు చెప్పిరి. కాని వీరిపరిశోధనములంత ఫలవంతములు కాకుండెను. 22 శ్రుతులను గణించుటే భావము. కడచినవత్సరమున చెన్నపట్టణమున జరిగిన అఖిలభారత గాయక మహాసభవారు నాచెప్పుచొప్పున 22 శ్రుతులే మన సంగీతమునకు దగియున్నవని

యెంచుట మనభాగ్యమే. యింతటనుండి యీవివాదము సమసిపోగలదని నాతలంపు. ఇందుకు నిదర్శనముగా చెన్నపట్టణమందలి సి. సుబ్రహ్మణ్యయ్యరు కొలదిదిన ములక్రిందట 22 శ్రుతులకు నే జెప్పిన విలువల గణించి వ్యాసములు వ్రాయుచున్నారు.

ఒకస్థాయియందు 22 శ్రుతులకన్న నెక్కువ, ముఖ్యముగా 53 యేల యెంచబడ దనుదానికి సమాధానమట. యప్రస్తుతమైనను, ఒకవాక్యములో శ్రుతు లెక్కువగుకొలది వానివిలువయు మిక్కిలి తక్కువగుటచే శ్రవణేంద్రియము వాని వరుసనాదముల నంత చక్కగా గ్రహింపలేదని జెప్పవచ్చును.

మనస్థాయియందలి స్వరావళి మూడురకముల శ్రుతిచేరికలచే నలరారుచున్నది. భరతాదివాగ్గేయులను ఈమూడువిధము లగువానినే "ద్విశ్రుతి స్త్రిశ్రుతిశ్చైవ చతుఃశ్రుతిక యేవచ" అని చెప్పియుండిరి.

యిందుచే యెన్ని విభాగములు చేయదలచినను యీ మూడు హంశములు జ్ఞప్తియందుంచవలయు: 1. స్థాయియందు 3 విధములగు శ్రుతియంతరము లుండవలెను; 2. 3 పెద్దయంతరములు (Ratios) రెండేసి తక్కిన చిన్నయంత్రములు నుండవలెను. 3. అంతరములు క్రమభిన్నములతో (Integers only to be used) నుండవలయును. ఈసంగతులు పోసగునట్లు స్థాయిని యీవిధముగు శ్రుతులుగల విభాగికముగ మాత్రము జేయవచ్చును—

ఒకస్థాయియందలి శ్రుతులు	పెద్దయంతరముల నిష్పత్తి (Ratio)	అంతర గాంధారమునందలి శ్రుతులు	అంతర గాంధారపు విలువ	పంచమము శ్రుతులు	పంచమపు విలువ
			(cents)		(cents)
22	4 : 3 : 2	7	382 ,,	13	709 ,,
29	5 : 4 : 3	9	372 ,,	17	704 ,,
32	6 : 4 : 5	10	375 ,,	19	712.5 ,,
34	6 : 5 : 3	11	388 ,,	20	706 ,,
41	7 : 6 : 4	13	380.5 ,,	24	702 ,,
46	8 : 7 : 4	15	391 ,,	27	704 ,,
53	9 : 8 : 5	17	385 ,,	31	702 ,,

ఇందుచే 22 విభాగములే తక్కువసంఖ్య గలిగి పైసంగతులను క్రమము నిలబెట్టుచుండుటయే కాక, హెల్మహోల్ట్జ్ శాస్త్రవేత్త చెప్పు గాంధారవిలువ 386 కును, పంచమమువిలువ 702 కును కూడ సరసముగా సరిపోవుచున్నది. 53 శ్రుతుల విభాగపు పద్ధతియు నవ్యమయ్యు పైకారణముచే యెక్కువభాగములు సంగీతమున నొప్పవు. తక్కినపద్ధతులు 29 భాగికమున పంచమము నవ్యమయియు గాంధారమున కొంతశ్రావ్యత తగ్గియున్నది. 32, 34, 38 కూడ నవ్యముగా లేదు. ఇందుచే 22 శ్రుతులే మిక్కిలి తగినపద్ధతియని యెంచవలయును. అందుచే మనవారు మిక్కిలి ఘనతజెందిరి. వీరి చాతుర్యమాశ్చర్యమే.

శ్రుతులసంఖ్య 22 అని యెంచినపిమ్మట వీని పేర్లు సప్తస్వరముల స్థానములు మున్నగు సంగతులు ముఖ్యములు భారతవాగ్గేయులలో భరతుడు శ్రుతులపేర్లు నచించియుండలేదు. కాని శారంగదేవునకు పూర్వము నారదుడు "సంగీతమకరందమున" వీనిపేర్లను జెప్పెను. కాని యేమికారణముననో యీ పేర్లు యనంతరమున వాడబడి యుండలేదు. శారంగదేవునిపేర్లనే ప్రతివాగ్గేయుండును రామామాత్యుడు, సోమనాథ్యుడు, అహోబలుడు దామోదరుడు మున్నగువారు వాడియుండిరి. 1. తీవ్ర, 2. కుముద్వతి, 3. మంద, 4. ఛందోవతి, 5. దయావతి, 6. రంజని, 7. రక్తిక, 8. రౌద్రి, 9. క్రోధ, 10. వజ్రిక, 11. ప్రసారణి, 12. ప్రీతి, 13. మార్జని, 14. క్షితి, 15. రక్త, 16. సందీపిని, 17. ఆలాపిని, 18. మదంతి, 19. రోహిణి, 20. రమ్య, 21. ఉగ్ర, 22. క్షోభిణి, వరుసన సప్తస్వరములు ఛందోవతియందు షడ్యమును, రక్తికాయందు రిషభమును, క్రోధయందు గాంధారము మార్జనియందు మధ్యమము ఆలాపినియందు పంచమము, రమ్యయందు దైవతము, క్షోభిణియందు నిషాదమును మనవాగ్గేయులు చెప్పుచుండిరి. ఇందుచే శ్రుతులు నాలుగేసికాని మూడేసి కాని, రెండేసికాని చేరినప్పు డుదయమగు స్వనము స్వరమనబడుచున్నదని గ్రహింతుము. మధుకణలేశములు ప్రత్యేకముగా నంతమాధుర్యము కలవి కాకపోయినను ఇట్టివి కొన్నిచేరి మధువెట్లయ్యెనో అట్లే శ్రుతులు

కొన్ని చేరి స్వరములై రంజింపజేయుచున్నవి. క్షీరము దధిరూపము దాల్చుచందమున, మృత్తిక ఘటముగ నేర్పడువిధమున, సప్తవర్ణములు వెలుతురునకు కారణ మగు భాతి శ్రుతులు స్వరరూపము దాల్చుచున్నవి— షడ్జగ్రామమున స్వరము లిట్లున్నవని భరతాదులమతము. షడ్జము 4 వ శ్రుతియందును, రిషభము 7 వ శ్రుతియందును గాంధారము, 9 వ శ్రుతియందును, మధ్యమము 13 వ శ్రుతియందును పంచమము, 17 వ శ్రుతిపైనను దైవతము, 20 వ శ్రుతిపైనను నిషాదము, 22 వ శ్రుతి యందును కలుగుచున్నవి. ఇందుచే షడ్జగ్రామము

స రి గ మ ప ద ని స
3 2 4 4 3 2 4 శ్రుతులచొప్పున నున్నది. ఇంతయే కాని జోన్సుగారు, పాటర్సను డే, ఇల్లిసు మొదలగువారు చెప్పువిధమున

స రి గ మ ప ద ని స
4 3 2 4 4 3 2 శ్రుతులు చొప్పున లేదు. వీనియంతరములు మొదలగు సంబంధములు, యిత్యాది సంగతులనెల్ల క్రమముగ నేనువ్రాసిన పుస్తకమున జూచుకొనునది. పూర్వపు షడ్జగ్రామము పైవిధమున యుంటచే ప్రకృతపు స్వరావళికిని, దీనికిని మిగుల భేదముకలదు. వెల(?)గ్రామరాగపద్ధతి రామామాత్యునికాలము 1549 నాటికే యంత మొందుటయు, మూర్ఛనలతో గూడిన రాగము లన్నియు నించుమించు ఒక్కస్వరము షడ్జమునుండియే ప్రారంభింప బడునట్టి పద్ధతి వాడుకనందుటయు, షడ్జమధ్యమ గ్రామసంపుటి కలుగుటచే మధ్యమము 'వినాశీ' గ గ్రహింపబడుటయు, మొదలగు మార్పులు కలిగెను. అందుచే బూర్వపుపద్ధతి యప్పటికే కనుబడుట లేదు.

శుద్ధస్వరావళి

కాని షడ్జగ్రామమున స్వరావళి యమరియుండు విధమున అనగా స్వరములు

స రి గ మ ప ద ని స
3s 2s4s 4s 3s 2s4s శ్రుతుల చొప్పున కలిగియుండు విధముగుదానిని రామామాత్యుడు ముఖారిమేళమని పేర్కొనినాడు. దీనినే యితడు శుద్ధస్వరావళిగ నెంచినాడు. "శుద్ధసప్తస్వరైర్యుక్తో ముఖారీమేళకోభవేత్" అని చెప్పినాడు. ఇందు 3 రకముల యంతరములు అనగా పెద్దయంతరములు 4 శ్రుతులుచొప్పునను, 3 శ్రుతులు చొప్పునను కలవియు జిన్నయంతరము 2 శ్రుతులను కలిగినదియు నున్నవని గ్రహింపవలయును. తన వింశతిమేళములందు నిదియే ప్రధానమైనదట. అహోబలుడును యీ విధమగు స్వరసమూహమును శుద్ధస్వరావళిగ నెంచెను. అనంతరము వేంకటమఖియు నీస్వరావళిని శుద్ధములుగనే యెంచి ముఖారిమేళమని తన లక్ష్యాన్విత మగు 19 మేళకర్తలందు ప్రథమమున బేర్కొనినాడు. అనంతర మితడు డెబ్బదిరెండు మేళముల నేర్పరచి రచనకల్పితములని, చెప్పు వానియందలి మొదటిదౌ గాంగరాగము కనకాంబరియని చెప్పనదియే యీశుద్ధస్వరావళికి తుల్యముగుచున్నదని నవీనుల యభిప్రాయపడుచున్నారు. కాని యిప్పుడు దక్షిణమున శంకరాభరణమేళము అనగా

స రి గ మ ప ద ని స
4 3 3 4 4 3 2 శ్రుతుల చొప్పునగలదానినే శుద్ధమేళముగ కొందరెంచుచున్నను ఉత్తరమునను దీనినే శుద్ధస్వరావళియని జెప్పుదురు. వారు దీనినుండి కోమలస్వరములు గాని తీవ్రస్వరములుకాని జేర్కొనుట కద్దు. పాశ్చాత్యదేశములందును యీస్వరావళినే (Diatonic majer scale) శుద్ధస్వరావళిగా నెంచబడుచున్నది. మన శంకరాభరణమునకును పాశ్చాత్యుల యీ ఘనస్వరావళికిని (Major scale) దైవతమునందు మాత్రము కొంచెము వ్యత్యాసము కలదనుసంగతి మనము మరువకూడదు. వీరిస్వరావళి యిందుచే

స రి గ మ ప ద ని స
4 3 2 4 3 4 2 శ్రుతుల చొప్పునయున్నది. అనగా మనము 405 స్పందనములుగల దైవతము నుపయోగించుతరి వారు 400 స్పందనములు గలదానినే వాడుదురు. ఎట్లులైనను మన ప్రకృతపు శంకరాభరణమునుండియే మిగిలిన వికృతస్వరములు కలిగినవందుము. వికృతముల కాధారము లగునవే శుద్ధస్వరము లందుము. ఇందువలనను శంకరాభరణమేళపు స్వరములే శుద్ధములని చెప్పుదురు. అ

హోబలుడు వీణెతంత్రియందు శుద్ధస్వరములను కలుగ జేయుటకు జెప్పుయంశములు మనము గమనించిన యెడల నీస్వరములు శంకరాభరణమునకు దుల్యములే యని తలంతుము,

ఈస్వరావళియొక్క యంతరముల నారయుట పైన చెప్పినశ్రుతులబట్టి యుండును. చతుశ్శ్రుతికమును ఘన స్వరము (Major tone) అనియు, త్రిశ్రుతికమును (Minor tone) అనియు, ద్విశ్రుతికమును (Semi-tone) అనియు పాశ్చాత్యులు చెప్పుకొందురు. వీని విలువలు వరుసగ (1) చతుశ్రుతికము $3/2 \times 3/2 \div 2/1 = 9/8$. (2) త్రిశ్రుతికము $5/4$ $8/9 = 10/9$ (3) ద్విశ్రుతికము $4/3$ $4/5 = 16/15$ అగును. ఈ సంగతులవలన మన ప్రకృతి వికృతి స్వరావళి పేల 22 శ్రుతు లెట్లు కనుగొనవచ్చునో మందు చూతుము—శంకరాభరణస్వరావళి యీ విలువలతో నిట్లున్నది:—

స రి గ మ ప ద ని స

9/8 10/9 16/15 9/89 810/916 15

వికృతి స్వరములు

స్వరములు నియతశ్రుతులనుండి మారి వేరుస్థానములం దుండినప్పు డవి వికృతిస్వరము లని గ్రహింపబడు చుండెను. ఇట్లు నియతస్థానములనుండి ఒకశ్రుతిప్రమాణమున కాని, ద్విశ్రుతిప్రమాణమున గాని తగ్గినప్పుడును, హెచ్చినప్పుడును యీ వికృతిస్వరము లేర్పడుచుండును. ఒకస్వరమునుండి మరియొకస్వరమువరకు రెండుశ్రుతులు మాత్ర మున్న నిట ఒకవికృతిస్వరమే కలుగునని గ్రహింపవలయును. ఇట్టి వికృతిభేదములు స్వరము లన్నియు బొందుచుండిన ట్లిప్పుడు కాని, పూర్వకాలమున గాని మాచము. గ్రామరాగకాలమున, అనగా 4 వ శతాబ్దము, భరతునికాలమునకు బూర్వమునుండియు గల్లినాథుని క్రీ. వె. 1460 లేక రామామాత్యుని కాలము క్రీ. వె. 1549 వరకు 'మధ్యమము' 'అవినాశి'గ నెంచబడెను. ఇందుచే షడ్జపంచమము లిప్పటివలెకాక వికృతులు కలవిగనే భావింపబడెను. రామామాత్యుడు కొంత యీపద్ధ తవలంభించినను, సోమనార్యుడు, అహోబలుడు మొదలగువారు షడ్జపంచమములు 'అవినాశి' స్వరములుగ నెంచి, మధ్యమము 'వినాశి' లేక వికృతులు పొందునదిగ జెప్పి మార్గదర్శకు లైరి. ఇప్పటికి నీపద్ధతి యమలునందు కలదు. ఇందుచే రి, గ, మ, ద, ని, స్వరములు అయిదుమాత్రము సోమనార్యుని కాలమునుండియు వికృతులను పొందునవిగ భావింప బడు చుండినను, యీ వికృతుల సంఖ్యగూర్చిన పాఠభేదములు భిన్నాభిప్రాయములు నేటివరకు ప్రబలుచునే యున్నవి. సోమనార్యుడు చెప్పు 7 వికృతులు వేంకటమఖికి రుచింపలేదు. రామామాత్యుడు చెప్పు 7 వికృతులు సోమనార్యుడు భిన్నముగ జెప్పెను. శార్ఙ్గదేవుని 12 వికృతులు రామామాత్యుడు ఖండించెను. ఇట్లు పూర్వపు వాగ్గేయులే భిన్నాభిప్రాయులై వేరువేరు మతముల జెప్పుతరి వనయూహ లెట్లుండునో యాలోచింపుడు.

భరతాది వాగ్గేయుల మతములు

వికృతిస్వరములను ప్రత్యేకించి భరతముని చెప్పక పోయినను, 1. కాకలీనిషాద, 2. అంతర గాంధార, 3. షడ్జసాధారణ, 4. మధ్యమసాధారణములను, "స్వరసాధారణము" లనుపేర మరినాలుగు యితరస్వరములను చెప్పియుంటచేతను, వీని నుపయోగించుటకు గొన్ని నిబంధనలు చెప్పుటచేతను యీతడును రాగకళను పోషించుటకు శుద్ధస్వరములు మాత్రము చాలకపోవుటచే వికృతిస్వరముల యావశ్యకతను గమనించె నందుము. 8 శతాబ్దము లైనవెనుక శార్ఙ్గదేవుని కాలమునాటి కీయావశ్యకత యత్యంత మగుటచే కాబోలు, పెక్కువికృతులు చెప్పబడుచుండెను. శార్ఙ్గదేవుడు 12 వికృతిస్వరములను చెప్పుటచే నితనికి మొత్తము 19 స్వరము లేర్పడినవి. కాని యితడు భరతుని 'స్వరసాధారణ' ములను గూడ జెప్పియుంటచే తనవికృతములు లక్ష్యములు కావనియు, దానే వానిని యెంచి చెప్పెననియు గ్రహింతుము ఈతని వికృతిస్వరములు చ్యుతచ్యుతషడ్జములు త్రిశ్రుతాత్మక చతుశ్రుతాత్మక గాంధారములు లేక సాధారణాంతర గాంధారములు, చ్యుతచ్యుత మధ్యమములు, షడ్జమధ్యమ గ్రామపంచమములు, చతుశ్రుతిక

రిషభద్వైవితములు, కాకలి కైశికి నిషాదభేదములు— వీనిస్థానములు, ఏయే శ్రుతియందివి కలుగునదియు మొదలగుసంగతులు నాపుస్తకమున స్పష్టముగ దెలియును. ఇతని అచ్యుతషడ్జమధ్యమములు మున్నగునవి శుద్ధముల నుండి భిన్నములు కావు. కావుననే రామామాత్యుడు, సోమనార్యుడు, అహోబలుడు యిత్యాదులు యీనుత మవలంభించి యుండలేదు. ఇందుచే 3 శతాబ్దములకు వెనుక రామామాత్యుడు వీని ఖండించి ఏడువికృతులనే చెప్పెను. ఇతనికి మొత్తము పదునాలుగు స్వరములు కలవు. అవియెల్ల లక్ష్యమందు దృఢ మని రచించెను. ఇతడు పంచమమును పూర్వపువారివలె కాక వికృతులు పొందునదిగ నెంచెను కాని షడ్జమమును వారివలె వికృతులు పొందునదిగనె చెప్పెను. ఇతని వికృతిస్వరములు 1. 10 వ శ్రుతినిగల సాగ లేక షట్శ్రుతిరి. 2. 11 వ శ్రుతినిగల అంతర గ. 3. 12 వ శ్రుతినిగల చ్యుత మ. లేక చ్యుతమధ్యమగాంధార; 4. 16 వ శ్రుతినిగల చ్యుత ప. లేక చ్యుతపంచమ మధ్యమము; 5. కైశికి ని. లేక షట్శ్రుతిధైవితము; 6. కాకలి ని. 7. చ్యుత స. లేక చ్యుతషడ్జనిషాద. ఈయన చ్యుతమధ్యమగాంధారము, చ్యుతపంచమ మధ్యమము, చ్యుతషడ్జనిషాదములను బేర్కొనుట కవి గాంధారమధ్యమనిషాదసంబద్ధు లని చెప్పుటకే. వీనినే సోమనార్యుడు వరుసగ మృదుమధ్యమము, మృదుపంచమము, మృదుషడ్జమని పేర్కొనినాడు. కాని వీనిని, ప్రాచీనవికృతము, * లని యలక్ష్యము చేసినాడు. సోమనార్యుడును రామామాత్యునివలె 7 వికృతులనే చెప్పెను కాని వీ రిరువురకు భేదములు కలవు. ఇతనికిని మొత్తము 14 స్వరము లగుచున్నవి. పై ప్రాచీన వికృతములతో 17 స్వరముల గును. ఇతనివికృతులు 1. 4 వ శ్రుతియందలి చతుశ్శ్రుతి రి. లేక తీవ్రరి. 2. 10 వ శ్రుతియందలి సాధారణ గ. లేక షట్శ్రుతి రి. 3. 11 వ శ్రుతియందలి యంతరగాంధారము; ౪. 15 వ శ్రుతియందలి షట్శ్రుతి మ. (ఇదియే మన ప్రతిమధ్యమము;) ౫. 21 వ శ్రుతియందలి తీవ్ర ద. లేక చతుశ్శ్రుతి ద. ౬. 23 వ శ్రుతియందలి కైశికి ని. ౭. 24 వ శ్రుతియందలి కాకలి ని. ఈయనచెప్పు స్వరములందు శు. రి., శు. ద. లు తప్ప తక్కినస్వరము లిప్పు డాస్థానములనే, అనగా ఆయాశ్రుతి విలువయందే, వాడబడుట విదితము. అందుచే నిప్పుడు శు. రి. శు. గ. లను వదలి, అంతర గ. కాకలి ని. స్వరములను శుద్ధస్వరములుగ నెంచినప్పుడు 5 వికృతులను గ్రహింతుము. కావున 7 శుద్ధస్వరములతో నివి జేరిన మొత్తము 12 స్వరము లగుచున్నవి.

ఆనంతర మర్ధశతాబ్దమునకు వెనుక అహోబలుడు తన వికృతిస్వరములకు బేర్లను వీరివలెనెంచక, ఒక్కొక్క శ్రుతి యధికమగువానిని వరుసగ తీవ్ర, తీవ్రతర, తీవ్రతమ, అతితీవ్రతమము లనియు, నొక్కొక్క శ్రుతి తగ్గియుండిన వాని నిట్లే కోమలములనియు, నూతన పేర్లను చెప్పి యుత్తర హిందూస్థానమువారికి మార్గదర్శకుడాయెను. ఇతని తీవ్రతరరిషభము శుద్ధగాంధారమే; తీవ్రతమ గ. శుద్ధ మధ్యమమే; పూర్వ ని. శుద్ధనిషాదమే. ఈయన చెప్పు శు. రి. శు. గ. మొదలగు శుద్ధస్వరములు షడ్జగ్రామమందు పూర్వులు చెప్పనవే.

ఇక వేంకటమఖి కాలమున షడ్జపంచమములు పూర్తిగ 'అవినాశీ' స్వరములుగ నెంచబడెను కద! ఈయన పంచశ్రుతి రిషభధైవితములు వరుసగ శుద్ధ గాంధార నిషాదస్థానములందే కలవని చెప్పుటచే వికృతి స్వరములు మొత్తమీయన అయిదే చెప్పినవాడాయెను. సోమనార్యుడు, వీని నొకశ్రుతి కోమలముగ జతుశ్శ్రుతి రిషభమని, చతుశ్రుతి ధైవితమని చెప్పుటచే నివి శుద్ధ గాంధార, శుద్ధనిషాదములతో దుల్యములు కావనియు, నివియే యిప్పుడు వాడబడునవనియు గ్రహింపవలయును. వేంకటమఖి చెప్పు వికృతులు వరుసగ (1) 10 వ శ్రుతి యందలి సాధారణగ లేక షట్శ్రుతి రి; (2) 11 వ శ్రుతియందలి అంతర గ; (3) 16 వ శ్రుతియందలి వరాళి మధ్యమము; (4) 25 వ శ్రుతియందలి కాకలినిషాదము.

(ఇట పంచ శ్రుతి, రి. ద. లు, శు. గ., శు. ని. లందే కలవు. శు. గ., శు. ని. లిప్పుడు ఎంచబడుటలేదు.

* షడ్జమము 4 వ శ్రుతి యంటిమి కావున కాకలి 'ని' 24 వ శ్రుతి యైనది.

బర్మా-భారతదేశములలో మాకు చాల ప్రసిద్ధి కలదు

వెండిసామానులు

బంగారుసామానులు

పరిశుద్ధమైనట్టియు అందమైనట్టియు

ఉపయోగకరమైనట్టియు వస్తువులు

పరిశుద్ధత—కలితీలేని వెండిని అనగా చాదీవెండిని కాసులబంగారమును మాత్రమే యుపయోగించెదము. మేము తయారుచేసిన ప్రతివస్తువపైనను మా డయమండు ట్రేడుమార్కు తప్పకుండ నుండును.

అందము—మా నమూనాలు అన్నియును క్రొత్తరకముగాను బహుసొగసుగాను యుండును. ఈకాలమునందలి నవనాగరీకులు ఆమోదింపబడిన పద్ధతులపైని వెండిసామానులను సాటిలేని నూతనస్వరూపములతో తయారుచేయించుచున్నాము.

ఉపయోగము—కలితీలేని వెండిసామానులను కొనుటవలన ధననష్ట మేమియును కలుగదని వేరుగాచెప్ప నక్కరలేదు. "ఏది శ్రేష్ఠమైనదో అదియే యెల్లప్పుడును చౌకయైనది" అను సామెతప్రకారము వస్తువును కొనునప్పుడు అది యెన్నియేండ్లు మన్ను ననువిషయమునుబట్టియే ధరను నిర్ణయింపవలసియుండును.

మీరు మీయింట నుంచుకొనుటకును ఒకరి కిచ్చుటకునుగూడ చూచినంతమాత్రముననే మీ కాశ కలిగింపగల వెండిసామానులు మావద్ద నున్నవి.

అన్నివిధములైన సామానులును మావద్ద సమృద్ధిగా నున్నవి. వానిలో మంచివానిని మీ రెన్నుకొనుటలో మీరు కోరినచో నిపుణులగువారు మీకు సలహానిచ్చుటకు సిద్ధముగా నుందురు. బహుమతిచేయుటకు యేరకము వెండిసామానులు కావలసినను అనుకూలమైనవానిని యెన్నుకొనుటలో మే మన్ని సౌకర్యములను కలుగజేసెదము.

మా పద్ధతి—నవరత్నముల వ్యాపారమునందు మే మేపద్ధతి నవలంభించియున్నామో ఆపద్ధతిని వెండి బంగారు సామానుల వ్యాపారమునందుగూడ మే మవలంభించియున్నాము. మోసములేకుండను కిమ్మతుచేయునట్టియు సరుకులను యిచ్చుటయే మాపద్ధతి!

ఎస్టిమేటులు—ఏరకము వస్తువులకైనను మేము నమోనాలును సిద్ధపరిచి కోరినవారి నమోనాలను ఎస్టిమేటులను పంపించెదము.

మీ ఆదరణను కోరుచున్నాము.

సురాజ్‌మల్ లల్లూభాయ్ అండు కో,

డయిమండు మర్చెంట్సు అండు జ్యూయలర్సు,

గోల్డు అండు సిల్వరు స్మిత్సు,

135, బిగ్ బజారు, తిరుచనాపల్లి. **313,** ఎస్ప్లనేడు, మదరాసు.

కావునను, అతడు వీనిని ముఖారిమేళమందలి విగనే యెంచుటచేతను యివిప్పుడు దృశ్యములుగ నిట చేర్పఁబడ లేదు. చతుశ్రుతి రిషభదైవితముల నితడు చెప్పలేదు.) ఈయన చెప్పు అంతరగాంధార, వరాళిమధ్యమ, కాకలి, నిషాదస్థానములు గమనీయములు. సోమనార్యుడు లక్ష్యముగ 'బూర్వోక్తవికృతము' లని చెప్పున వీయన గణించి ముఖ్యములని చెప్పునట్లు ఆస్థానములందే తన పైస్వరములను చెప్పుట సాహసమే. ఈయన చెప్పు ఈయంతరగాంధార స్థానము సోమనార్యుని మృదుమధ్యమము కావున యీ స్థానమున, అనగా 303$\frac{3}{4}$ చలనముల విలువకలదిగ, నిప్పటి యంతరగాంధారము లక్ష్యమునలేదు. సోమనార్యుని అంతరగాంధారమే, అనగా 300 చలనములు కలదే, యిప్పుడు వాడబడుచున్నది. తక్కినస్వరములు యీయన వరాళిమధ్యమము, అనగా సోమనార్యుని మృదుపంచమము, 341$^{1}/_{3}$ చలనములు విలువగలదానిని కూడ నిప్పుడు వాడుచున్నారు. మరియు నీయన కాకలి నిషాదమును, అనగా సోమనార్యుని మృదుషడ్జమును, 455$^{5}/_{8}$ చలనములుకలదానిని యిప్పటి శంకరాభరణమున వాడుటయు గద్దు. ఇందుచే సోమనార్యునిస్వరములేకాక, యతడు తోసిరాజనిన 'ప్రాచీనవికృతములు' అనగా వేంకటమఖిచెప్పునవియు, నిప్పటి గానమందు లక్షింపబడుచున్న వనవలసియున్నది. కాని లక్షణమందిప్పుడు 12 స్వరములే చెప్పబడుటచే నైదువికృతులనే నెంచవలయును. ఫిడేలునందు యన్నిస్థానములు ధృవమగుచున్నను; 'సారికలు'గల వీణెయందు మాత్రము 12 స్వరములే ధృవమనినను పైవానినెల్ల మనవారు గమకములచే నారోపించగలుగుచుంట విదితము. మనవారిప్పుడు లక్షణమందు చెప్పు 12 స్వరములందలి వికృతులు (1) శ్రుతియందలి శుద్ధ రిషభము; (2) 10 వ శ్రుతియందలి సాధారణగాంధారము; (3) 15 వ శ్రుతియందలి ప్రతిమధ్యమము; (4) 19వ శ్రుతియందలి శుద్ధ దైవితము; (5) 23వ శ్రుతియందలి కైశికి నిషాదము. శుద్ధస్వరములు (1) శుద్ధషడ్జము; (2) చతుశ్రుతి రిషభము; (3) అంతరగాంధారము; (4) శుద్ధమధ్యమము; (5) శుద్ధ పంచమము; (6) చతుశ్రుతి దైవితము; (7) కాకలినిషాదము. నివీ విలువలు షడ్జమునకు గల వీనిసంబంధము యంతరముల తో నిట్లున్నది:—

స్వరము	చలనములు	అంతరము
షడ్జము	240	1
శు. రి. లేక ద్విశ్రుతి రి.	256	$\frac{16}{15}$
చతుశ్రుతి రి.	270	$\frac{9}{8}$
సాధారణ గ.	288	$\frac{6}{5}$
అంతర గ.	300	$\frac{5}{4}$
శుద్ధ మ.	320	$\frac{4}{3}$
ప్రతి మ.	337 $\frac{1}{2}$	$\frac{45}{32}$
శుద్ధ ప.	360	$\frac{3}{2}$
శు. ద. లేక ద్విశ్రుతిగ.	384	$\frac{8}{5}$
చతుశ్రుతి ద.	405	$\frac{27}{16}$
కైశికి ని.	432	$\frac{9}{5}$
కాకలి ని.	450	$\frac{15}{8}$
హెచ్చు స.	480	2

కాని కొందఱు పదియారుస్వరములు స్పష్టముగ నున్నవనియు, వేంకటమఖియు శు.రి., పంచశ్రుతి రి., శు. గ., సాధారణ గ., షట్శ్రుతి రి., అంతర గ., శు. మ., వరాళి మ, శు ప., శు.ద., శు. ని., పంచశ్రుతి. ద., కైశికి. ని., షట్శ్రుతిద కా. ని. శు. స అను 16 పేర్లుగల స్వరములను చెప్పెననియు మొదలగు సంగతులు చెప్పుచున్నారు. కాని వేంకటమఖి పంచశ్రుతి, రి., శు. గ. లు; షట్శ్రుతి రి. సాధారణముగ లు, పంచశ్రుతి ద., శు.ని. లు, షట్శ్రుతి ద. కైశికి ని. లు వేరువేరుస్వరములు కావనియే చెప్పియుంట వీరు గమనించుటలేదు. ఇట్లు వేంకటమఖి పద్ధతి ననుసరించి కాక చతుశ్రుతి రిషభదైవితలను గ్ర

హించినయెడల నివి శుద్ధగాంధార నిషాదములతో దుల్యములు కావు కనుక వీనిని వేరుస్వరములుగ నెంచి చెప్పవచ్చును. కాని శు. గ. శు. ని. లను మనము లక్ష్యమున గ్రహింపకున్నాము కావున వీరు చెప్పునట్లు స్వరములు భావింపలేము. వివిధపేర్లు ఒక్క స్వరమునకే వేంకటమఖి చెప్పుటచే వానినెల్ల ప్రత్యేకములుగ వీరు గ్రహించునెడల సోమనార్యుని 21 పేర్లుగల స్వరములను యట్లే రామామాత్యుని 22 పేర్లుగల యన్నిస్వరములను వీరు వింతగ గ్రహింపవలసియున్నది. కొందఱు చతుశ్శ్రుతి రిషభము శుద్ధగాంధారము యిట్లు చతుశ్శ్రుతిదైవతము, శుద్ధనిషాదము నొక్కస్థానముననే యున్నవని పొరపాటభిప్రాయపడి యందుచే శుద్ధ గ. ని. లు లేవనుచున్నారు. వీరు వేంకటమఖి చెప్పునట్లు పంచశ్రుతి రిషభదైవతములు వరుసగ శుద్ధ గ. ని. లతో దుల్యము లగుననియు, చతుశ్శ్రుతి రి. ద. లు ఒక్కటి కావనియు గ్రహింపప్రార్థితులు. అప్పుడు సోమనార్యు డెంచు స్వరము లన్నియు గలుగగలవు. మరియు కొన్ని రాగములం దిప్పుడు లక్ష్యమున ముఖ్యముగా మన తోడి, గౌళ యిత్యాదులందు, శుద్ధ రి. ద. లు కొంత కోమలములగు వానినే అనగా ఒక్కశ్రుతి కలవానినే, మేటిగాయకులు వాడుచుంటచేతను, వేంకటమఖియొక్క వరాళి, మ. ను, సోమనార్యుని 15 వ శ్రుతియందలి షట్శ్రుతి మ. ను, ప్రతిమధ్యమమునుకూడ వాడుటచేతను సోమనార్యుని కాకలినిషాదముకన్న వేంకటమఖి చెప్పు ఒకశ్రుతి యధికమగు కాకలినిషాదమును కూడ నవీనులు వాడుటచేతను, కొన్ని రాగములందు విపులము లగువానిని ముఖ్యముగా 420 చలనములుగల దేవగాంధారి యిత్యాదియందలి దైవతమును, సావేరి గాంధారము మున్నగువానిని వాడుటచేతను యీ మొదలగు కారణములచే నిప్పటిస్వరములు పై స్వరములుమాత్రమే కావనితోపించుచునే యుండును. కావుననే యిరువదిరెండు శ్రుతులు మనసంగీతమున కాధారము లగుచున్నవందుము.

పైస్వరములను ముఖ్యసంవాదిపద్ధతివలన కనుగొని వానినేర్పరచి, ద్వావింశతిశ్రుతులయందు ఏయేస్వరమెంతటి విలువ కలదియు నారయుట ముఖ్యము. అనగా శ్రుతులవలన ఏయేస్వరము లెట్లు కలుగునదియు సంవాదత్వమున నెంచుదము. స్వరములయంతరముల నేర్పరచుటకు ముందు వీని తత్వముగూర్చి కొన్ని ముఖ్యసంగతులు నేర్వవలయును. ధ్వనులు యను రణనాత్మకములు. ఏదేని వస్తుచలనమువలననే ధ్వని కలుగుచున్నది. సోమనార్యుడు "అను రణనాత్మకధ్వనిః" అని వచించినాడు. స్వరము లిట్లయ్యు చెవికి స్నిగ్ధము లగునవియే యని శార్ఙ్గదేవుడు చెప్పెను. "శ్రుత్యనంతరభావీయ స్నిగ్ధో౽నురణనాత్మకః స్వతో రంజయతి శ్రోతృచిత్తం స స్వరముచ్యతే" సోమనార్యు డుదాహరణముగ నిట్టిస్నిగ్ధములగు ధ్వనులు తంత్రి కదలునప్పుడెల్ల దానియందలి భాగభాగములందును కలుగుచుండు ననియు నివే స్వయంభు ధ్వనులనియు జెప్పెను. ఇట్టిస్వరములను వరుసగ జేర్చి చెప్పి 'స్వరపరంపర' యని పేరిడెను. స్వరపరంపరయందలివి సంవాదిబద్ధముగనే యుండును. ప్రథమస్వరము యనంతరము మనము సంవాదిస్వరముగ గ్రహించు 2 వ స్వయంభుధ్వని దీనికి హెచ్చుస్వరమే యనియు, 3 వ స్వయంభుసంవాదిస్వరము పంచమమనియు, 4 వది మధ్యమమనియు, నైదవది గాంధారమనియు నిట్లు గ్రహింపవచ్చును. ఈ సంగతులు రాగవిభోదయందు చూచుకొనునది. సంవాదిస్వరములను గుర్తించుటకు భరతాది మనవాగ్గేయులు రెండుస్వరములకు 13 శ్రుతులు కాని, 9 శ్రుతు కాని వ్యత్యాసముండవలయునని దృష్టాంతముగ జెప్పిరి. 13 శ్రుతులు వ్యత్యాసమున్నది పంచమమనియు, 9 శ్రుతులుకలది మద్యమమనియు గ్రహింతము. హెల్మహోల్ట్సుశాస్త్రవేత్తయు స్వరపరంపరను (Harmonic-series) తీగెయందు ముళ్లు (Nodes)కలుగజేసి యనుభవింపవచ్చుననియు, వీని ప్రమాణ మాయాస్వరముయొక్క సంఖ్యయే చెప్పుననియు మొదలగుసంగతులు చెప్పెను. ఇందుచే రెండవస్వయంభుధ్వని లేక స్వరము $2/1$; 3 వది లేక పంచమము $3/2$; 4 వది లేక మద్యమము $4/3$; 5 వది, లేక గాంధారము $5/4$ యగుచున్నవి.

పైస్వరముల యన్యోన్యతవలన సంవాదిపద్ధతి ననుసరించి, అనగా షడ్జపంచమపద్ధతి, షడ్జమధ్యమపద్ధతి, షడ్జగాంధారపద్ధతి, వీనివలన మనస్వరములను, శ్రుతులను, యెంచుదము; కేవల మొక్క షడ్జపంచమపద్ధతి కాని,

షడ్జమధ్యమపద్ధతికాని, షడ్జగాంధారపద్ధతికాని యట్లు చేయుటకు సాధ్యపడకున్నది. అందుచే నీమూడుపద్ధతుల నవలంభింపవలసియున్నది. అప్పుడును కొలది చిన్న మార్పులు కలుగుచుండును. ఈచిన్నమార్పులు మనసంగీతముననే యేల ప్రపంచమందలి యందటి సంగీతపద్ధతులకు దృశ్యములే – యావశ్యకములే. షడ్జపంచమపద్ధతి ననుసరించి కొన్ని స్వరములు చూడుడు:—

(1) స 1 —— ప $3/2$

(2) ప $3/2$ —— చతుశ్రుతి రి. $9/4$ ఒకస్థాయితగ్గిన

(3) చ. రి. $9/8$ —— చతుశ్రుతి ద. $27/16$

(4) చ. ద. $27/16$ —— మృదు మ. $81/32$ (ఇది అంతరగాంధార మని కొందఱెంచుదురు. కాని యిది మృదుమధ్యమమే యగుచున్నది. ఇందుచే భరతుని 13 శ్రుతుల వ్యత్యాసము ననుసరించి చ. ప., అం. గ. లు సంవాదులు కావవలయును.) ఒకస్థాయితగ్గిన

(5) మృదు మ. $81/64$ —మృదు స. $243/128$

(6) మృదు స. $243/128$—వరాళి మ. $243/128 \times 3/2 = 729/256$ (దీనికి ఒకస్థాయి తక్కువ వరాళి మ. $729/512$. ఇది $64/45$ కు తుల్యముగ నున్నదందుము.

(7) వరాళి మ $64/45$ —ద్విశ్రుతి రి. $32/15$, ఒకస్థాయి తగ్గిన

(8) ద్విశ్రుతి రి. $16/15$ —ద్విశ్రుతి ద. $8/5$

(9) ద్విశ్రుతి ద. $8/5$ —సాధారణ గ. $12/5$ ఒకస్థాయి తగ్గిన

(10) సా. గ. $6/5$ —కై. ని. $9/5$

(11) కై. ని. $9/5$ —ఏకశ్రుతి మ. $27/10$ ఒకస్థాయి తక్కువ

(12) ఏకశ్రుతి మ. $27/20$—ఏకశ్రుతి రి. $81/40$ ఒకస్థాయి తక్కువ

(13) ఏకశ్రుతి రి. $32/80$—ఏకశ్రుతి ద. $243/160$

(14) ఏకశ్రుతి ద. $243/160$ —త్రిశ్రుతి రి. $729/320$

(15) త్రిశ్రుతి రి. $729/320$ —త్రిశ్రుతి ద. $2187/1280$ ఒకస్థాయి తక్కువ

(16) త్రిశ్రుతి ద. $2187/1280$—మ. మ. ....

* ఇక్కడనుండి విలువలు వ్యత్యాసములు కావున గణనీయములు కావు. వరాళి మ. యందు స్వల్పమార్పు చేయవలసి వచ్చినది. షడ్జమధ్యమ పద్ధతిని చూతము.

(1) స/. —— మ $4/3$

(2) మ. $4/3$ —— శుద్ధ ని. $16/9$

(3) శు. ని. $16/9$ —— శుద్ధ గ. లేక పంచశ్రుతి రి. $64/27$

(4) ఒకస్థాయి తగ్గిన పంచశ్రుతి శు. గ. లేక రి. $32/27$ ఏకశ్రుతి ద. $128/81$: దీనికి ఒకకోమా విలువ అనగా $81/80$ కలపినయడల ద్విశ్రుతి ద. కలిగి $8/5$ వచ్చును.

(5) ద్విశ్రుతి ద. $8/5$ — ద్విశ్రుతి రి. $32/15$ ఒకస్థాయి తగ్గిన

(6) ద్విశ్రుతి రి. $16/15$ — ప్రతి మ. $64/45$: కాని యిది వరాళి మధ్యమ మగుచున్నది. ఇందుచే భరతముని 9 శ్రుతుల వ్యత్యాసము ననుసరించి ద్విశ్రుతి రి., ప్రతి మ. లు సంవాదులు కాక ద్విశ్రుతి రి., వరాళి మ. లు యట్లగుచున్నవి.

(7) వరాళి మ. $64/45$ — మృదు స. $256/135$

(8) * ఇంతటినుంచి యీపద్ధతి విలువలనుకరములు కావు. ఏకశ్రుతి ద. యందు కొలదిమార్పు చేయవలసి వచ్చినది. షడ్జ గాంధారపద్ధతి మాత్రము.

(1) అంతరగాంధారము $5/4$ — కాకలినిషాదము $15/8$

(2) కా. ని. $15/8$ — ప్రతి మ. $45/32$

(3) ప్ర. మ. $45/32$ — ద్విశ్రుతి రి. $135/128$: ఇది కొంచము తీవ్రమగుటచే నొక కోమా $81/80$ తీసివేసిన ఏకశ్రుతి రి. $25/24$ వచ్చును.

(4) ఏకశ్రుతి రి. $25/24$ — ఏకశ్రుతి ద. $25/16$ ఒకస్థాయి తగ్గిన

(5) ఏకశ్రుతి ద. $25/32$ — శుద్ధ గ. లేక

— త్రిశ్రుతి రి. $75/32$ ఇక్కడనుంచి సరళ విలువలు రావు.

ఈ మూడుపద్ధతులయందలి విలువలు సంపుటీ చేసిన మనకార్యము నెరవేరుచున్నది. మనద్వావింశతి శ్రుతుల విలువలు, వీనియందలి యిదివరలో మనము గమనించిన స్వరములవిలువలు యీ విధమున గనుపరుపవచ్చును. కాని యిట త్రిశ్రుతిరిషభ ద్వైవితముల వినుపించుటలేదు. కావున వీని నిట్లు గమనింతుము. త్రిశ్రుతి ద్వైవితము అంతర గాంధారమునకు మధ్యమవ్యత్యాసము కలది కావున నిది $5/3 \times 4/3 = 5/3$ యగుచున్నది. దీనికి పంచమవ్యత్యాసమున నున్న త్రిశ్రుతి రి. $5/3 \times 2/3 = 10/9$ అగును. ఇవికూడ పైవిలువలకు జేర్చిన నవి యిట్లు సమన్వయము చేయవచ్చును—

స్వరము		శ్రుతుల నెంబరు		సవరణ స్వరముల విలువ	సెకనునకు కంపనముల విలువ	అంతరము (షడ్జము స్వరమునుండి)	సెంట్ల విలువ (cents)
స	షడ్జము	0	0		240	1	0
రి	ఏకశ్రుతి రి.	1		248	250 *	24/25	70
	ద్విశ్రుతి రి.	2	ద్విశ్రుతికము		256	16/25	112
	త్రిశ్రుతి రి.	3	త్రిశ్రుతికము		266 2/3	10/	182
	చతుశ్రుతి రి.	4	చతుశ్రుతికము		270	9/8	204
గ	శుద్దగాందారము గ.	5	త్రిశ్రుతికద్విశ్రుతికము		284 4/9	32/27	294
	సాధారణ గ.	6	చతుశ్రుతికద్విశ్రుతికము		288	6/5	316
	అంతర గ.	7	చతుశ్రుతిక త్రిశ్రుతికము		300	5/4	386
	మృదు మ. గ.	8	ద్విచతు శ్రుతికము		303 3/4	81/64	408
మ	శుద్దమధ్య మ.	9	చతుశ్రుతి త్రిశ్రుతి ద్విశ్రుతికము		320	4/3	498
	ఏకశ్రుతి మ.	10	ద్విచతుశ్రుతికము ద్విశ్రుతికము	324	324–3331/3	27/20 లేక 25/18	520 లేక
	ప్రతిమధ్య మ.	11	ద్విచతుశ్రుతిక త్రిశ్రుతికము		337 1/2	45/32	590[568
	వరాళి మ.	12	చతుశ్రుతికత్రిశ్రుతికద్విద్విశ్రుతికము		341 1/3	64/45	610
ప	శుద్దపంచ మ.	13	ద్విచతుశ్రుతికత్రిశ్రుతికద్విశ్రుతికము		360	3/2	702
ద	ఏకశ్రుతి ద.	14	చతుశ్రుతిద్విత్రిశ్రుతిద్విద్వి శ్రుతికము	372	375 *378	25/16 లేక 63/40	
	ద్విశ్రుతి ద.	15	ద్విచతుశ్రుతిత్రిశ్రుతిద్విద్వి శ్రుతికము		384	8/5	814
	త్రిశ్రుతి ద.	16	ద్విచతుశ్రుతిద్విత్రిశ్రుతిద్వి శ్రుతికము		400	5/3	884
	చతుశ్రుతి ద.	17	త్రిచతుశ్రుతిత్రిశ్రుతిద్విశ్రుతికము		405	27/16	906
			1౬ కి బదులు ప్రత్యేక స్వరములు	420	420	7/4	
ని	శుద్ద ని.	18	ద్విచతుశ్రుద్విత్రిశ్రుతిద్విద్విశ్రుతికము		426 2/3	16/9	996
	కైశికి ని.	19	త్రిచతుశ్రుతిత్రిశ్రుతిద్విద్విశ్రుతికము		432	8/5	1018
	కాకలి ని.	20	త్రిచతుశ్రుతిద్వి త్రిశ్రుతిద్విశ్రుతికము		450	15/8	1088
	మృదు స. ని.	21			455 5/8	243/8	1110
ṡ	హెచ్చు స.	22	త్రిచతుశ్రుతిద్విత్రిశ్రుతిద్విద్విశ్రుతికము		480	2/1	1200

ఇట 6 శ్రుతులవిలువలు అనగా (1) ఒకశ్రుతి రిషభము, (2) చ్యుతమధ్యమగాంధారము, (3) ఏకశ్రుతి మధ్యమము, (4) వరాళి మధ్యమము, (5) ఏకశ్రుతి దైవితము, (6) చ్యుషడ్జ నిషాదము విలువలు కొంత భేదాభిప్రాయములను కలుగజేయుచున్నవి. ఇందుకుకారణము స–ప, స–మ, స–గ పద్దతులందు మనము చేసిన


కొలది సవరణలే. ఇట్లుచేయనిది సరళ విలువలు కనుగొనలేము. వీనివిలువలు నిర్ధారణ సేయుటకు లక్ష్యమే ప్రధానముగ నున్నది. ఇందుచే వీని నిట్లెంచుదుము.—

(1) ఏకశ్రుతి రి. ద. లు :—మన పైవిలువ ననుసరించి షడ్జము 240 చలనము లగుదానిగ నెంచినప్పటి రిషభము 250 చలనములు కలదిగనున్నది. ఉత్తర హిందుస్థానమున లక్ష్యమందు 252 చలనములు కలది, అనగా $21/20$ యంతర మగు రిషభమే వాడుచున్నారు. దక్షిణమున మనవారు పైదానికన్న కొంచము కోమలమగుదానినే వాడుట కద్దు. ఇందుచే లక్ష్యము ననుసరించి కర్ణాటకగానమున 248 చలనములు గల రిషభమే కల దనవలయును. కావున 5 వది యగు నీ రిషభమును, దీనికి సంవాది యగు ఏకశ్రుతి దైవతమును సరి చేయవలసియున్నది. ఏకశ్రుతి దైవతము స—ప సమ—పద్ధతుల ననుసరించి రెండువిధములవిలువలు జూడసూపుచున్నవి. $25/16$ $63/40$ యంతరముల చొప్పున నున్న 375, 378 చలనములు గల ద్వివిధ విలువలందు 378 విలువగల దైవతమును ఉత్తరమున వాడుచున్నారు. కాని 375 విలువ గలదానిని మాత్రము కర్ణాటకమున వాడబడుటకానము. అందుచే మనము సవరణచేసిన విలువ ననుసరించియున్న రిషభమునకు పంచమమగు దైవతమునే మనవారు గణించుటచే దీనివిలువయు 372 గ నెంచవలసి యున్నది. ఇది $31/20$ అంతరముకలది యగును.

(2) వరాళి మ :—ఇదియు రెండువిలువలకు తావిచ్చుచున్నది. ఇందు ఒక చతుశ్రుతికము ఒక త్రిశ్రుతికము, రెండు ద్విశ్రుతికములు చేరియున్నవనియు, ఒక్క చతుశ్రుతికము, రెండు త్రిశ్రుతికములు, ఒక్క ద్విశ్రుతికము, చేరియున్నవనియు నిట్లు ద్వివిధాభిప్రాయమునకు లోనగుటచే దీని విలువ $64/45$ లేక $40/27$ అను రెండు విధముల తోపించుచున్నది. కాని లక్ష్యమందుత్తరముననుు, దక్షిణముననుు $64/45$ అంతరము కలదియే వాడబడుటచే దీనివిలువ $341\ 1/3$ చలనము లగుచున్నది.

(3) మృదుషడ్జ మృదు మధ్యమములు:—మృదు షడ్జము విలువయు పై స—ప, స—మ, పద్ధతుల వలన రెండు విధము లగుచున్నది: (1) $256/135$; (2) $243/128$. దీనియందు కొంచెము తీవ్రమగు దానినే కర్ణాటకగానమున మనవారు పాడుచున్నారు. స—ప. పద్ధతి ననుసరించిన $243/128$ విలువగలదానినే మనము గణింపవలయును. కాని ఉత్తరమున $256/135$ విలువగలది వాడబడుట విదితము ఈస్వరమునకు సంవాది యగు మృదుమధ్యమముకూడా నీ రెండు విలువల ననుసరించి ద్వివిధముగ దోపించు కాని మనము పైదాని విలువ $243/128$ గ నెంచితిమి. కావున దీనికి సంవాదియగు మృదు మ. విలువ $81/64$ అగు నదియే మనము గణింతుము.

(4) ఏకశ్రుతిమ:—ఏకశ్రుతిమధ్యమమువిలువయు ద్వివిధమున, అనగా $27/20$, $25/18$ గ జూడసూపుచున్నది. స—ప. పద్ధతి ననుసరించి కలిగిన $27/20$ విలువగల మ. మనకు తగియున్నది. కాని కొంత శ్రమపడిగణించిన విలువ, అనగా ఏకశ్రుతి రి. మధ్యమ మగు నదిగ దీని నెంచునప్పటి విలువ $25/24 \times 4/3 = 25/18$ అగును. ఇది మనకు నవ్యముకాదు. ఉత్తరమున వాడబడు $27/20$ యంతరముగల 324 విలువ గలదియే మనము వాడిన నవ్యము. ఇయ్యది దక్షిణమున నంతగా లక్షింపబడకపోవుటచే దీనివిలువ యిది యని సులభముగ జెప్పజాలకున్నాము. ఇట్టి దీనిని మనము గ్రహించుటకు బదులు, దేవగాంధారి, ఆరభి ఇత్యాది రాగములందు పరిస్ఫుటమగు మరియొకస్వరము మనగానమున నావశ్యకముగ నుండుటచే నద్దానిని యములునకు జెట్టుట ముఖ్యము. దీనివిలువ 420 చలనము లగుటచే నిది $7/4$ అంతరమున నుండినది. కావున మనగానమున నంతగా కానబడని ఏకశ్రుతి మ నుపయోగించుటకు బదులు 420 చలనములుగల యీస్వరము నుపయోగించుట సమ్మతము. ఈమార్పు లన్నియు నాశ్రుతివీణె (Diachord sonometer) యందు గమనించితి కావున, మేటిగాయకుల సమ్మతము నొందిన వగుటచేతనునే నీమార్పులను చేయుటకు సాహసించితిని.



౧. తూర్పుకనుమలు దాటుచున్న పెన్నానది ఛాయాచిత్రకారుడు: కె. యన్. ప్రసాదరావుగారు



౨. కుదురని బేరము

(రెండవ బహుమానము) ఛాయాచిత్రకారుడు:
యం. కె. రంగస్వామి అయ్యంగారు, త్రిప్లికేను.




3. 'బైసికిల్' ప్రయాణము

(మూడవ బహుమానము)
ఛాయాచిత్రకారుడు: రామారావ్ వర్మ, రాజమహేంద్రవరము



౪. ఛాయాచిత్రగ్రాహకుడు. ఛాయాచిత్రకారుడు: యం. కె. రంగస్వామి అయ్యంగారు, త్రిప్లికేను.



కరికాల చోళ మహారాజుల శాసనపు ప్రతిబింబము

చుము. ఆవ్యక్తి దూరదృష్టిగలవాఁడు కాకపోయిన పక్షమున వానిభరోసావలన కార్యమారంభింపకుము.

౨. జీవనముకొఱకు ధనమును, ధర్మముకొఱకు జీవనమును త్యాగము చేయుము.

౩. మంచిపేరు సంపాదించువిషయమున నీ సమయమును వ్యయపఱుచుము. నీవు ప్రకృతమైన ఐశ్వర్యమును కోరుదువేని సంతుష్టుఁడవు, త్యాగివి యగుము.

మూఁడవ వైపున

౧. విఱిగిపోయిన దానికొఱకును, పోఁగొట్టుకొన్న దానికొఱకును, దొంగిలింపఁబడిన దానికొఱకును నష్టమయిన దానికొఱకును, కాలిపోయిన దానికొఱకును, దుఃఖింపకుము.

౨. అన్యుని యింటిలోఁ గూర్చుండి ఆజ్ఞాపింపకుము. నీయింటిలోఁగూర్చుండి భోజనము చేయుట నభ్యసింపుము.

౩. స్త్రీకి వశీభూతుఁడవు కాకుము.

నాలుగవ వైపున

౧. మందమయిన, నీచమయిన కులమునుండి స్త్రీని పరిగ్రహింపకుము. సిగ్గులేనిపురుషునితో కలిసి కూర్చుండకుము.

౨. చరిత్రహీనులగు వ్యక్తులకు దూరముగా ఉండుము. అనుగ్రహము తాలూకు మర్యాదను తెలిసికోఁజాలని వానియందు సద్భావ ముంచకుము.

౩. ఇతరుల వస్తువులయందు లోభపడఁ బోకుము.

౪. రాజులకు భయంపడుము. ఏమా? వారగ్గివలెనే కాలి కాల్చివేయుదురు.

౫. నీ విలువను తెలిసికొనుటకు ప్రయత్నింపుము. ఇతరులవిలువకుఁ దగిన ఆదరణ చూపుము. నీ కంటెను ఉన్నతస్థితిలో నున్నవానితో వివాదపడకుము.

ఐదవ వైపున

౧. రాజునకు, రమణికి, కవికి భయపడుచు ప్రవర్తింపుము.

౨. ఏప్రాణినికూడ హింసింపకుము. ఇతరుల దోషములను వెదకు స్వభావమును వదలిపెట్టుము.

౩. ఆనందపూర్వకముగా ఉండుట కభ్యసింపుము. ప్రతిసమయమునను విరక్తుఁడవయి యుండకు. ఇట్లుండెదవేని నీజీవనము దుస్సహమై పోయెడిని.

౪. నీకులములోని స్త్రీలను సమ్మానించుచు, వారిని రక్షించుము.

౫. క్రోధమునకు వశీభూతుఁడవు కాకుము. వివాదసమయమున నెప్పుడును శాంతిని స్వీకరించుటకై సిద్ధపడుము.

౬. ఆదాయమును మించిన వ్యయము చేయఁబోకుము.

౭. మొట్టమొదటను క్రొత్తమొక్కలను వేసి తర్వాతను చెట్లు నఱకుటకు ప్రయత్నింపుము.

౮. పండుకున్నప్పుడు ప్రక్కను మించునట్లు కాళ్లు చాఁపకుము.

సమాధిస్థలమును విడుచునప్పుడు ఖలీఫా దీనిమార్గము ఎప్పటికిని బంధుచేయవలెను. అట్లు చేసినచో నెవ్వరును లోభపడి మృతశరీరమును గూర్చి అమర్యాదచేయుట కవకాశ ముండదు. అని యాజ్ఞాపించినాఁడు. అది మొదలామార్గము బందుచేయఁబడినది. అటుపైని మరి యెవ్వరును అచ్చటికి వెళ్లఁజాలకపోయినారు. ఇప్పటికిఁగా దెప్పటికిని వెళ్లఁజాలరు. ఆస్థానమెచ్చట నున్నదో ఆసంగతియే యెవ్వరికిని తెలియదు.

(మాధురినుండి)

[పురాణం సూర్యనారాయణ తీర్థులు]

విమానప్రమాదములు

1928 సం॥ మొదటి 6 మాసములయందు జరగిన ఘోరములసంఖ్య

గాలిలో ఘుర్ణణమువలన	2
నిండుయెగురులో విమానేతరమగు ఘుర్ణణమువలన	25
ఎంజిన్ చెడుటచే గాలినుండి జారిపడుట, గిరగిర తిరుగుటవలన	17
ఎంజిన్ చెడకుండానే గాలినుండి జారిపడుట, గిరగిర తిరుగుటవలన	98
అన్ని కారణములచే బలవంతముగా నేలకు తాకుటవలన	83
అనవసరముగ నేలకు దిగిపోవుటవలన	55
ప్రమాదమునుండి తప్పించుకొనుటవలన	44
బరువెక్కించుటచే ప్రమాదమువలన	10
గాలిలో తగులబడుటవలన	4
నానావిధములు	41
తెలియనివియు, సందేహాస్పదములును	11
మొత్తము	390

విమానసంచారము చేసినవారు

ప్రాణాంతకమైన గాయములు(చనిపోయినవారు)	153
ప్రమాదకరమగు గాయములు	133
చిన్న గాయములు	143
ఘాతపడకుండ తేలినవారు	399
సంఖ్య	828

(లిటరరీ డైజెస్టునుండి)

[దుర్గమహంతి ఆదినారాయణ]

"హారప్ప"

౧౯౨౯ వ సం. జనవరి నెల 'ఇండియన్ ఆంటిక్వేరి పత్రికయందు శ్రీవినోదవిహారీ రాయ వేదరత్నగారు సింధునదీ ప్రాంతముల బయలు పడిన 'హారప్ప' యను నగరము కొందఱు పరిశోధకులు పేర్కొనినట్లు అనార్యులకు జెందినది కాక ఆర్యులకు జెందినదే యగునని యీ క్రిందిశ్రుతిస్మృతి ప్రమాణములను పురస్కరించుకొని నిశ్చయించుచున్నారు.

ఈశిథిలము లార్యనాగరకతకు చెందినవని నేను తలతును. ప్రాచీనకాలమున నార్యులు సప్తసింధుప్రాంతములను, పంజాబునందును నివాసము చేయుచున్నపుడు ఈ (మోహంజోదారో, హారప్ప)నగరములను రెంటిని దేవనిర్మితదేశము (ఋ.వే. ౩-౩౩,౮,మనుసం. ౨-౧౭) అనగా ఒండుపేరుకొని ఏర్పడిన సముద్రగర్భస్థలమున నిర్మించియుందురు.

వేదకాలమున 'హరియుపియ' అను ఒక నగరముండెను. అచ్చట చయమనపుత్రుడు అభ్యావర్తి రాజునకును, వరశిఖునిపుత్రులకును యుద్ధము జరిగెను. ఇంద్రుడు అభ్యావర్తితో చేరి హరియుపియనగరమునకు తూర్పుపడమరగలవిడిసియుండిన వరశిఖపుత్రులను చంపెను. (ఋ. వే. ౪-౨౭, ౫)

పరుష్ణి (రావి)నదిచేరువను చయమనపుత్రుడగు కవికిని, దండెత్తివచ్చిన సుదాసునకును(ఋ.వే.౭-౧౮,౮) ఆర్యవీరునకును మఱియొక యుద్ధము జరిగెను. ఈయుద్ధమున ఇంద్రుడు సుదాసునితో చేరి కవిని చంపెను.

దీనినిబట్టి చయమనునిపుత్రు లొకరిపిదప నొకరీహరియుపియ నగరమును పరిపాలించిరనియు, ఎత్తివచ్చిన శత్రువులతో రెండు మారులు పోరాడిరనియు, నే నూహించుచున్నాను. హరియుపియనగరము పరుష్ణి (రావి) నది ప్రక్కనుండెను కాబోలు. రావినదికి తూర్పువైపున నున్న హరియుపియ యే ఇప్పటి హారప్ప కాదగును. ఇంద్రుడు కవితో యుద్ధముచేసినపుడీహరియుపియను విధ్వంసము చేసి, వేఱొకచోట సుదాసుని కొఱకొక క్రొత్తనగరమును నిర్మింపజేసి యుండును. (ఋ. వే. ౭-౨౦, ౨.)

ఈసుదాసుడు పురుకుత్సునిపుత్రుడగు (ఋ. వే. ౭-౧౯,౩) త్రసదస్యునకును, యదుతుర్వసులకును (ఋ. వే. ౭-౧౯,౬; ౪-౩౧, ౧౭). సమకాలీనుడు. త్రసదస్యుడు క్రీ. పూ. ౫. సహస్రాబ్దమున రాజ్యపాలనము గావించెనని నేను లెక్కించి ఊహించుచున్నాను. ఆతని కాలమున ప్రయాగకు తూర్పున ఒక సముద్రముండెను. (మను, ౨౨, ౨౧-౨౨)

ఆసముద్రమిపుడు డైమండురేవునకు (నవద్వీపము దగ్గరనున్నది.) దక్షిణమున నున్నది. కావున అభ్యవర్తి అతనిసోదరుడు, కవి క్రీ. పూ. ౫వ సహస్రాబ్దమున హారప్ప లేక హారియూపియను పరిపాలించియుందురని నే నూహించుచున్నాను. అభ్యవర్తి ఒకచక్రవర్తి (ఋ. వే. ౭-౨౭-౪). భరద్వాజఋషి అతనివలన గోవులను ఇతరవస్తువులను కానుకలు పడసెను. కావున, భరద్వాజ ఋషి, అతనికి పురోహితుడనియు, అభ్యవర్తి పృథువంశములోని ఆర్యుడనియు (ఋ. వే ౬-౨౭, ౫) నిస్సంశయముగా నేను చెప్పగలను. హారియూపియ లేక హారప్ప క్రీ. పూ. ౫వ సహస్రాబ్దమున నొక ఆర్యచక్రవర్తికి రాజధానిగ నుండెననియు, సుదాసు డచట ఆర్యులతో యుద్ధముచేసెననియు (ఋ. వే. ౭-౮౩,౧) ఇపుడు స్పష్టమగుచున్నది. కాబట్టి, హారియూపియ లేక హారప్ప నగరము క్రీ. పూ. ౫వ సహస్రాబ్దమున అనార్యనాగరకతకు కాక ఆర్యనాగరకతకు స్థానముగానుండెనని నేను నొక్కి చెప్పగలను.

అవమానకరమే-నిజమయితే

కొందఱు భారతీయసంస్థానాధీశులు, 'భారతీయ ప్రభుత్వపు రాజకీయశాఖలోనికి భారతీయుల నధికారులుగ తీసికొనుట యెంతయు కానిపని'యని యొక మహజరును బట్లరు కమిటికి పంపుకొనిరని ఇండి యన్ నేషనల్ హెరాల్డుపత్రిక చెప్పుచున్నది. అఖండ(ఆంగ్ల)సామ్రాజ్య రాజకీయ ప్రతినిధులుగ భారతీయులను నియమించుట తమగౌరవమును కుంచించుటగా వారు తలచుచున్నారట. హెరాల్డుపత్రిక, పంచితముకాదేని, ఈసంస్థానాధీశులు విదేశప్రభుత్వము తమపై నధికారమెలపుట కవమానమును జెందకుండుటయేకాక, ఎంతసమర్థుడయినను భారతీయుని, తమ్ము తలద్రొక్కియేలుచు నిరంతర మొకకంట కనిపెట్టియేయుండుటకై నియమింపబడు నేవిదేశీయవ్యక్తికంటెను తీసిపోయిన వానిగా తలచుచున్నారు. ఇది లజ్జాకరము.

[మాడరన్ రివ్యూ]

వేరుపురుగు డైరక్టరులు

"ప్రపంచములో అన్నిదేశాలముందూ బ్రిటిషు పరిశ్రమ నేడు పలుకుబడికి వస్తున్నది. ఎక్కువ అర్హమూ, సమర్థమూ, అయిన పారిశ్రామిక జాతిగా ప్రపంచములో బయలు రావడానికి ప్రయత్నిస్తున్నది. ప్రయత్నము సాఫల్యముకాగలదు. కాని అందుకు దారి కఠినమైనది. ఈసంధిదినాలలో బాధ్యత ఉన్నవాళ్లకు నేను ఉపదేశించే ముక్కలివి: "ఈతరుణ మప్పుడే తరగతిభేదాలు లేక దేశపుయువకులు వెలువడి, దేశపుసామర్థ్యము ప్రదర్శించితే, మనమింతవరకూ మనుటకు తోడ్పడిన పారిశ్రామిక ఔన్నత్యము ను తిరిగీ పడసి, తిన్నగా సాగించగలుగుదుము." ఇది అసమర్థులకు కాలముకాదు. వాళ్ళ వయస్సుతో నిమిత్తము లేదు. ఉమ్మడివర్తకసంఘాలు వచ్చి పరిశ్రమల చోటు లాగుకున్నప్పుడు సంఘనిర్వహణకు సంబంధించినవాళ్లూ, వాటిడైరెక్టర్లూ అనేకులు బయలుదేరి బలిసిపోయిన సంగతి నాఅనుభవముతో చెప్పగలను. ఆడైరెక్టర్లు పరిశ్రమలకు వేరుపురుగులు. లేశమూ తమతప్పు లేక వేలకొలదిమంది పరిశ్రమల మితనిర్మాణము (Rationalisation of Industry) వల్ల పనినుండి తొలగిపోతూ ఉన్నప్పుడు, అధికారస్థానాలు ఆక్రమిస్తున్న డైరెక్టర్లనూ, వంతులు తమకు పట్టుకొని లంచాలవల్ల నేకాని పరిశ్రమల నిర్మాణముకని వదలిపోవనివాళ్లనూ మాస్తూ ఇక దేశము సహించలేదు. వ్యర్థులు సమర్థులకు చోటిచ్చివేయాలి. ఆనియమమువల్ల నే బ్రిటిషుపరిశ్రమ నిలుకడకు పెనగులాడు నేటికాలములో సాగిపోగలదు."

—రివ్యూఆఫ్ రివ్యూస్.

అని బాల్డ్వినుగారు బ్రిటిషువారిని గట్టిగా ప్రోత్సహించిరి. భారతీయులకును—ఆంధ్రులకు—ప్రోత్సాహము గలుగగల దను నాశతో నీబాల్డ్వినుగారి మాట లిట నుద్ధృతము లయినవి.

బిల్వమంగళస్వామి

భక్తితత్త్వమును ప్రేమ తత్త్వముతో నైక్యముచేసి పండితపామరజనహృదయంగమముగ మధురకవితాగానము చేసిన మహామహులలో బిల్వమంగళస్వామి — లీలాశుకులు — ఒక్కరు. భారతభూమి నా సేతుశీతాచలము నెల్లరును ఆనందముతో గానము చేయుచున్న శ్రీకృష్ణకర్ణామృతమువలన నీతడు లోకప్రసిద్ధిని జెందియున్నాడు. ఈ కవిసత్తమును ప్రతిప్రాంతమువారును తమతమప్రాంతమువానినిగా తలచుచున్నారు. ఇతని దేశ, కాలముల నింతవఱకు గట్టిగా తేల్చినట్లు కానరాదు. శ్రీయుతులు మానవల్లి రామకృష్ణకవి (యం. ఏ.) గారు, ప్రాచీన గ్రంథపరిశోధనము గావించి యందు దుపలబ్ధము లయిన బిల్వమంగళకర్తృక గ్రంథములను, ఇతరగ్రంథప్రమాణములను పురస్కరించుకొని ఇతని దేశకాలములనుగూర్చి, చర్చించి, ఆంధ్రహిస్టారికల్ రీసర్చిసొసయిటీ త్రైమాసికాంగ్లపత్రిక, జూలయి (౧౯౨౮) సంచిక యందు కొంత చర్చించియున్నారు—ఆచర్చ యిట్లు కలదు:

లీలాశుకుల కృష్ణకర్ణామృతము మిగుల ప్రసిద్ధిని గాంచినగ్రంథము. నూటేసిపద్యములుగల మూడు భాగములందు గలవు. లీలాశుకకర్తృకములగు గ్రంథములు పెక్కు బయలు పడినవి. సంస్కృతప్రాకృతవ్యాకరణములు, ఉపనిషత్తులు, తాంత్రికగ్రంథములు, కావ్యములు, భక్తిప్రధానములగు స్తోత్రములు నిప్పటికిలభించినవి. సంస్కృతవ్యాకరణశాస్త్రమున నతడు వైయాకరణి 'దేవు' డను నాతడు రచియించిన 'దైవ' మను గ్రంథముపై 'పురుషకార' మను వ్యాఖ్యానమును రచియించెను. భోజదేవుని 'సరస్వతీకంఠాభరణ' మను సూత్రాత్మక వ్యాకరణగ్రంథమునకు 'కృష్ణలీలావినోద' మను పేరున నొక విస్తృత వ్యాఖ్యను బిల్వమంగళుడు చేసెను. సిద్ధాంతకౌముదిఫక్కి నున్న 'సుబంతసామ్రాజ్యము' 'తిఙంతసామ్రాజ్యము' అను రెండు వ్యాకరణగ్రంథములు బిల్వమంగళుని శైలిని బోలియున్నవి. వరరుచి ప్రాకృతవ్యాకరణసూత్రములను నిరూపించుటకుగాను భట్టికావ్యముఫక్కిని రచియించిన 'గోవిందాభిషేకము' లేక 'శ్రీచిహ్నకావ్యము' అను పేరుగల ప్రాకృతకావ్యమున బిల్వమంగళుడు మొదటి యెనిమిది సర్గములను రచియించెను. చివర నాలుగు సర్గములను అతనిశిష్యుడు, దుర్గాప్రసాదుడు రచియించెను. కేనోపనిషత్తుపైగల శంకరభాష్యమునకు 'శంకరహృదయంగమ' మను నొక వ్యాఖ్యకు బిల్వమంగళుడు కర్త. వివిధకృష్ణపూజావిధానములను వివరించు 'క్రమదీపిక' యను నొకతంత్రగ్రంథ మీతనికృతి. ఈ పేరుగల గ్రంథము భిన్నకర్తృక మింకొకటి కలదు. బిల్వమంగళుని కావ్యములలో సర్గత్రయాత్మకమయిన 'కాలవధ' మొక్కటి యుపలబ్ధమయినది. లీలాశుకులస్తోత్రముల పెక్కులు మనోహరభావములకును, సుందరరచనమునకును పేరుగన్నవి. గణపతి, కర్ణోత్కటుడు, రామచంద్రుడు, అభవుడు, బాలకృష్ణుడు, కృష్ణుడు, దక్షిణామూర్తి—వీరిని స్తుతించు నవియె యిపుడు లభించినవి.

పైగ్రంథములన్నియు బిల్వమంగళుని దేశకాలములను కనుగొనుట కెట్లుపకరింపగలవో చూతము. దుర్గాప్రసాదుడు గోవిందాభిషేకమును పూర్తిచేయుటయేకాక

కావ్యమున కంతటికిని వ్యాఖ్యానమును వ్రాసియున్నాడు. గురువును గుఱించి అందు ఏమిచెప్పినాడు?

"కోదండమంగళపచో గదితే హి ధామ్ని
 శ్రీకృష్ణదర్శనపరః కిల కర్ణభృత్యః;
జాతః క్రమేణ పరహంసపదే స్థితోఽస్మి
 న్యోఽంకస్థిత స్తమవలోక్య జగామ తృప్తిమ్.
శ్రీపద్మపాదమునివర్య వినేయవర్గ
 శ్రీభూషణం మునిరసౌ కవిసార్వభౌమః;
శ్రీకృష్ణరూప పరమామృత పానశీల
 శ్చక్రే తదీయచరితం బహుధా హితాయ."

—సర్గ ౧.

"శ్రీకృష్ణలీలాశుక బద్ధకావ్యం
 వివృత్య లోకస్య హితాయ పూర్వమ్;
తచ్ఛేషపూర్తించ పునర్విధాయ
 విస్పృణ్మహేఽధోత్తరభాగ మేతమ్."

—సర్గ ౯.

"ముక్తిస్థలాలయ శివాపదభక్తిలేశా
 ద్దుర్గాప్రసాదయతి రిత్యభిధాం దధానః;
కర్తా స్వయం సుకృతమాత్రఫలా న్యభీప్సుః
 కృష్ణేఽర్పయా మ్యథ విశుద్ధకరో మహాన్తః."

—సర్గ ౧౨.

"చాపమంగలఘురో జఈసరో
 బిల్వమంగలఘురో వహాఇ జో;
మజ్ఝ ఏస పరిఆరకారణా
 భమ్మదం ఉపగఓ పసీఅట."

(ఛాయ:—చాపమంగలగృహో యతీశ్వరో
 బిల్వమంగళగృహో వా భవతి యః;
మమ ఏష పరిచారకారణాత్
 బ్రహ్మతా ముపగతః ప్రసీదతు.)

దీనినిబట్టి లీలాశుకుడు సన్న్యాసియనియు, ఆశ్రమ స్వీకారమునకు పూర్వ మాతనియింటి పేరు 'కోదండమంగలము' లేక 'బిల్వమంగలము' అనియు స్పష్టమగుచున్నది. ఇతడు పద్మపాదాచార్య పరంపరాగతుని శిష్యుడని రెండవశ్లోకమున సూచనగలదు. దుర్గాప్రసాదుడు 'ముక్తిస్థలము'నకు జెందినవాడు. ఇక 'బిల్వమంగళ' అను మాట కర్థమేమి? దానికిని కోదండమంగళమునకును సంబంధము గలదా? కలదు. మలయాలమున 'విల్లునకు సంబంధించిన'అను అర్థముగల 'విల్వ' అనుపదమునకు 'బిల్వ' అనునది ఔత్తరాహోచ్చారణము. 'విల్' అనుపదము ద్రావిడభాష లన్నిటిలో 'విల్లునకు' సామాన్యవాచకము. మలయాలమున 'విల్వ' అనునది విల్లునకు ధర్మవాచకము. కావున 'బిల్వమంగళస్వామి' అనగా 'విల్వమంగళ' కుటుంబమున జన్మించిన ఒకసన్న్యాసి అని అగును. దుర్గాప్రసాదుడే అతనిని 'లీలాశుకు' డనుచున్నాడు. ఇపుడు వీరి అభేదమును సులభముగ ఊహింపదగును. కొచ్చి సంస్థానమునందలి తిరుమ్మారులో పద్మపాదు డొకమఠమును స్థాపించినాడు. అచ్చటగల పెక్కు వ్రాత గ్రంథములయందు 'విల్వమంగలత్తె' అని వ్రాయబడియున్నది.

ఇక ముక్తిస్థల మెక్కడనున్నది? అని జగన్నాథమా? లేకున్న మలబారులో ఆపేరుగల యేదయిన నొక ప్రదేశమా? అది శ్వేతారణ్యమునకు దక్షిణమున ౧౦ మైళ్లదూరమున నున్న 'మూక్కుత్తల' కాదగును. అది జగన్నాథమైనచో దుర్గాప్రసాదుడు బిల్వమంగళుని అనుగ్రహమును 'పూరి'వద్ద సంపాదించియుండునని అనవచ్చును. గణపతి స్తోత్రమునందు తత్కర్త పడమటి (అరేబియా) సముద్రమునకు తూర్పున చేరువలో నున్న దోరసముద్రమను స్థలమునందలి ఒకదేవతను పేర్కొన్నాడు. ఈదోరసముద్రము మల్లిక్‌కాఫూరు రూపుమాపిన బల్లాలరాజుల రాజధానియగు సుప్రసిద్ధద్వారసముద్రము. కేనోపనిషద్భాష్యవ్యాఖ్యాన మిట్లు ప్రారంభించుచున్నది.

"తత్త్వం కిమపి కృష్ణస్య సముత్తీర్ణజగద్భ్రమమ్,
స్వప్రభం సుఖసామ్రాజ్యం స్వాదతే స్వాదిమావహ.
వన్దే భగవతీం గంగాం తుంగాం భగవత స్తనుమ్;
ఉన్మజ్జంతి నిమజ్జంతి యస్యాం భువనవీచయః.
కేనేషితపోనిషదః (?) కృష్ణలీలాశుకో మునిః;
ఆచార్యవచసాం చార్థ మాహ వీక్ష్య వివక్షితమ్.

విస్తృతిం ద్వయతత్త్వజ్ఞా వేదవ్యాఖ్యా సుశిక్షితాః;
పదవాక్యప్రమాణజ్ఞాః పరీక్షంతా మిమాంక్రమాత్."

ఇందలి ౧౦గానదీస్తుతికల శ్లోకము. దీని నాతడా చేరువను—కాశీపురమున గావచ్చును—ఉండి రచియించి యుండునని సూచింపవచ్చును. 'కాలవధ' మను నాతని కావ్యమున మృత్యుభీయమువలన శివలింగమును కౌగిలించుకొనియున్న మార్కండేయుని జేరవచ్చిన యముని శివుడు నిర్జించినగాథ వర్ణితమైనది. ఈగాథ సామాన్యమేయైనను దానికిని శ్వేతారణ్యమునకును సంబంధము గలదు. బ్రిటిషు మలబారులో 'ఎడకొళం' రైలుస్టేషనుకు మూడు మైళ్లదూరముననున్న 'తిరునావాయ్'యు ఈ శ్వేతారణ్యమును నొక్కటియే. కేరళులచే 'శిశు' లేక 'వాలయార్' అని పిలువబడిన నీలనది శ్వేతారణ్యమునకు ప్రక్కనున్నట్లు కవి కావ్యమున చెప్పియున్నాడు చూడుడు:

"శిశుసరితం వదన్తి సరితం తవపార్శ్వచరీమ్"

సుప్రసిద్ధ మీమాంసకుడగు పయ్యూరపట్టేరికుమారుడు వాసుదేవుడు చకోరసందేశమున నిట్లు చెప్పెను:

"ధామోదన్వచ్ఛిదిశి గతే యోజనానాం త్రయేతం,
నావాక్షేత్రం శ్రితనిలమపి శ్వేతపూర్వాటవీ సా."

స్థలమాహాత్మ్యమున శ్వేతారణ్యము లేక 'తిరునావాయ్' దక్షిణకైలాసమని చెప్పబడినది. ఈయాధార లేశములతో పాటు అతని బాలకృష్ణస్తోత్రమును పరిశీలింతము. అది (తన లీలాశుకద్వారమున) కృష్ణుడు స్వయము చెప్పినది. బాలగోపాలదేవుడు దానిని తన వేణువున గానముచేసెను. దానిమాధుర్యమును, చారిత్రక విశేషములను కనుగొందము.

"ఆదిత్యప్రజ్ఞ సంజ్ఞం యదాదిత్యాదధికం మహః;
నిర్జిత స్సదృష్ట్యైవ నిర్గలం యేన మన్మథః.

అర్జితై రస్త్రకుసుమై రారాదారాధయన్ యయౌ;
ఈశానదేవ ఇత్యాసీ దీశానో మునితేజసామ్.

ఆస్పదస్య హి యస్యాసీ దశేషగుణసంపదామ్;
అద్వితీయఇతిఖ్యాతి రాత్మబుద్ధ్యా న కేవలమ్.

తయో రనుగ్రహాపాంగ సంక్రాన్త జ్ఞానసాగరాః;
సాగరా ఇవ గంభీరా స్సన్తి ధన్యా స్సహస్రశః.

తయో రేవ కృపాపాత్రం కృష్ణలీలాశుకో మునిః;
యదాశ్రమాంగణే నిత్యం రమన్తే తన్త్రివిస్తరాః.

తిలకం కులపాలీనాం నీలీతి నిలయం శ్రియామ్;
యమలం జనయాంచక్రే యంచ కీర్తించ శాశ్వతీమ్.

యస్య దామోదరో నామ సవితా సవితృసన్నిభః;
అనృణస్యహి యస్యాస న్నధమర్ణా మరుద్గణాః.

యస్య తత్ప్రియ సర్వస్వం రాఘవేశానసంజ్ఞకమ్;
వినేయః సవిధేయానాం సుహృత్......

యస్య దక్షిణకైలాస లీలాపరిణతం మహః;
చర్చాచందనగంధేన సుగంధయతి మానసమ్.

కృష్ణలీలాశుకస్యాస్య కిశోర మధిదైవతమ్,
స్తుతిరత్న మిదం బ్రూతే వేణువాది ముఖేన్దునా."

ఈ శ్లోకములు చాలమనోహరములు. కవితాధోరణి రమణీయము. అదియుండె. అందలి చారిత్రకాంశము లెవ్వి? లీలాశుకుడు రాఘవేశునకు మిత్రుడు. ఆతనితండ్రి దామోదరుడు; తల్లి నీలి అతని శాశ్వతకీర్తియే తోడబుట్టువు. అతనిగురువు ఆదిత్యప్రజ్ఞుని శిష్యుడగు ఈశానదేవుడు..........................

ఈశానదేవునకును, ఆదిత్యప్రజ్ఞునకును పెక్కురు శిష్యులు జ్ఞానసాగరులు కలరు. వీరిరువురిగృహములు తంత్రవిద్యకు విహారభూములు. చివరకు దక్షిణకైలాసపతి యొక్క దివ్యతేజస్సు చందనలేప గంధము నాలీలాశుకుని హృదయమును వాసింపజేసినది. సన్న్యాసి తనపూర్వులను గూర్చి చింతించునా? చింతింపడు. ఆతనియందీ స్తోత్రమును కృష్ణుడే వేణువుతో గానముచేసెను.

ఒకవర్గమునకు జెందిన సన్న్యాసులపేరుల తుదను 'ప్రజ్ఞా' అను శబ్దము చేరియుండును. ఉదాహరణము: నృసింహప్రజ్ఞుడు. ఇతడు సురేశ్వరుని అరణ్యవార్తికమునకు రమ్యమైన వ్యాఖ్యానమును రచియించినాడు. ఇది 'ఆనందగిరి' కృతమునకన్న నెక్కుడుపయోగకర మయి

నది. ఇందలి ఈశానదేవుడు, ముద్రితమైన 'గురుదేవపద్ధతి' యను గొప్ప తంత్రగ్రంథమును రచియించిన ఈశానశివ గురువు నొక్కరే కాదగుదురు. 'రాఘవేశుడు' గొప్పద్వైతవేదాంతగ్రంథరచయిత యగు రాఘవేశుని కంటె భిన్నుడు కాదగును. మనరాఘవేశుడు భాగవతముపై నద్వైతవ్యాఖ్యానమును రచియించిన యాతడు కావచ్చును. ఈగ్రంథ మముద్రితము. ఇంక నెందేని లీలాశుకుడు తలిదండ్రులను గాని, గురువునుగాని పేర్కొనియున్నాడా? అవును. కృష్ణకర్ణామృతమునందలి తుదిశ్లోకమున పేర్కొనియున్నాడు. ఈశ్లోకము మలబారు లిఖితగ్రంథమున కలదు

"ఈశానదేవచరణాభరణేన నీలీ
దామోదరస్థిరయశస్స్తబకోద్గమేన;
లీలాశుకేన రచితం తవ, దేవ, కృష్ణ,
కర్ణామృతం వహతు కల్పశతాంతరేఽపి."

తెలుగు అచ్చుపుస్తకమున నీశ్లోకముయొక్క మొదటిపాద మిట్లున్నది:

"ఈశానదేవచరణాభరణేన నీవీ" అని మొదటి శతకము చివరనున్నది.

౧౪ వ శతాబ్దమునకు జెందిన ఆంధ్రదేశీయుడగు వ్యాఖ్యాత 'నీలీ' అను పదమును 'నీవీ' అని పొరపడినాడు. ఈపొరపాటుకు రెండుకారణములు. ౧. 'లీ' కి 'వీ'కి వ్రాతయందు మిక్కిలిగ పోలికయుండుట. ౨. ఈశానదేవ దామోదర శబ్దములు రెండును శివవిష్ణుపరములుగ తటాలన స్ఫురించుట. వాఙ్మయచరిత్రమును తడవబూనని వ్యాఖ్యాత నీ రెండువిషయములును కన్నులు గప్పివైచినవి. ఉదాహృతశ్లోకములను బట్టి లీలాశుకులు మలబారు నివాసియనియు, ఆతడు భారతదేశమంతట సంచారము గావించెననియు, ఆతనికి శ్రీకృష్ణుని యెడగల అత్యంతభక్తిచేత నాతని నెల్లరును ఆత్మీయునిగ జెప్పుచున్నారనియు తేలుచున్నది.

భోజదేవుని అష్టాధ్యాయి వ్యాఖ్యానము లీలాశుకుని క్రీ. ౧౦౬౧కి తరువాతివానిగ దెలుపుచున్నది. మాధవుడు ధాతువృత్తియందు 'పురుషకారము' నుండి యుద్ధరించిన గ్రంథభాగము లీలాశుకుని ఆతనికాలమున కంటె అనగా క్రీ. శ. ౧౩౫౦కంటె పూర్వపువానిగా తెలుపుచున్నది. పైనజెప్పినట్లు ఈశానదేవుడు ఈశానశివగురువే యగునేని సరియగునేని అతడు క్రీ.శ.౧౧౦౦ ప్రాంతములవాడు కాన, లీలాశుకులు అప్పటికి రెండు దశాబ్దములు తరువాతివాడుగా జెప్పవలెను. కాని, లీలాశుకుడు తన 'పురుషకారము'న క్షీరస్వామి, బోపదేవ, దుర్గ, భోజ, హేమచంద్ర, హరదత్త హరియోగుల గ్రంథములనుండి ప్రమాణములను గైకొనియున్నాడు.

క్షీరస్వామి పేర్కొని యుండుటచే దుర్గుడు లీలాశుకులకంటె పెద్దవాడు. హేముడు క్రీ. శ. ౧౧౫౦ ప్రాంతములవాడు; హరదత్తుడు క్రీ.శ. ౧౧౦౦ సంవత్సరములనాటి వాడుగ నున్నాడు ఆతని చరితము 'హరదత్తాచార్య చరిత'మను పేర తంజావూరు లైబ్రరిలో నున్నది. దానిని బరిశీలించినచో ఆతని కాలమునుగూర్చి ఇంకను చక్కగా దెలియగలదు.

'కవి కామధేను' గ్రంథకర్త అయినచో దేవుడు మహాదేవునికి తర్వాత క్రీ. శ. ౧౨౭౧ సం.న రాజ్యమునకు వచ్చిన సేవన రామచంద్రుని సభయందుండిన హేమాద్రికి సమకాలికుడు.

ఎట్లు చూచినను లీలాశుకునికాలము క్రీ. శ. ౧౨౫౦ కి పూర్వమును ౧౬౫౦కి పరమును కాజాలదు.

[భారతి]

పాఠశాలలయందలి శిక్షానియమములు— విద్యాబోధక భాష

నవంబరునెల 'ప్రోగ్రెస్ ఆఫ్ ఎడ్యుకేషన్' యందు ప్రకటింపబడిన, బొంబాయి రాజధాని మాధ్యమికోపాధ్యాయుల సభయందలి యమ్. ఆర్. జయకర్ గారి అధ్యక్షోపన్యాసము ఉదారమగు నభిప్రాయములతోడను భావయుతమగు సూచనలతోడను నిండియున్నది. ఉప

న్యాసమున వారు శిక్షా నియమముల గూర్చి యిట్లు వ్యాఖ్యానము చేయుచున్నారు:—

క్రమము, నియమము గూర్చి ముచ్చటించు నీ సమయమున యీ రెండు సుగుణములును నిరంకుశముగ నెల్లప్పుడు పాలింపవలసినవై పోవకుండునట్లు మీ కొక హెచ్చరిక వాక్యమును చెప్పవలసియున్నది. భారతదేశము వృద్ధిస్థితియందు, ముఖ్యవిషయము విద్య నెట్లు వ్యాపింప జేయుట యనునదియే. నా అభిప్రాయ మిది—భారతదేశమున విద్యాభిలాషులగు ననేకమందియు దీని నంగీకరింతురని నా నమ్మకము—వీలగునంత హెచ్చుగా విద్యావ్యాప్తి యగుటకు నియమముల విధానముల పేరుననైనను నేదియు నడ్డురా కూడదని. విద్య బహుళవ్యాప్తినొంది, విశ్వజనీనమైపోయిన పిదప (పొలములోని కలుపుమొక్కలను పెరికివేయునట్లు) సంస్కారమునకు సమయము రావచ్చును. కాని అంతవఱకును మనము నియమ—విధానములను గూర్చి యంత పటాటోపము చేయకూడదని చాలమంది గట్టిగా ననుకొనుచున్నారు. నిర్భాగ్యుడగు భారతీయ విద్యార్థి యెన్నికకు సాధారణముగ నున్నవానిలో—అధిక సంఖ్యాకులగు భారతీయవిద్యార్థులు బొత్తిగా నేవిద్యయు లేకుండుటకంటె లోపభూయిష్టమైన విద్యనైన నభ్యసించుట మంచిదే. విద్యతో సంబంధముగల భారతీయుడును ఆంగ్లేయుడును భేదదృష్టితో నీవిషయమును చూచుటకంటె నిట్టి విషయమున నిది తప్పని సరియగును. ఈ విషయమున పూర్వాశ్రయ మేమియు లేక అక్షరజ్ఞాన రాహిత్యము—అజ్ఞానము (మూఢత్వము)నను న్న దాని నుద్ధరించి పైకి తేవలసిన దేశముతో మనము వ్యవహరించుటలేదు. పూర్వకాలమున బాగుగా నిర్వహింపబడి బహుళవ్యాప్తినొందిన విద్యకు బ్రహ్మాండమగు సామర్థ్యమును కనుపరచియుండినవారితో మనము వర్తించుచున్నాము; కాని వారు నేటి పరిస్థితుల ననుసరించి మంచి ఫలితములొందుటకై తమ విధానములను మార్గములను మార్చుకొనవలసియున్నారు. నేడు భారతదేశము నెదుట నున్న యేకమాత్రసమస్య యిది — చవుకగా నందఱకును లభ్యించువిద్య; దీని యభివృద్ధికేదియు నడ్డురాకుండుటవసరమని యీ విద్యాశాఖవారు జ్ఞప్తి యుంచుకొందురుగాత.

జయకరుగారీ క్రింది వాక్యములను కూడ నుడివిరి. అవి సత్యములు, నిశ్చితములు:

జీర్ణకోశము—దానిశక్తి నటుంచి, మానవశరీరతత్త్వము ననుసరించి అది యిదివరకలవడి యుండని దానిని యరిగించుకొని పట్టించుకొనజాలదను న్యాయము సత్యమైనగి. ఇదియే నిజమైనప్పుడు ఒకవిదేశీయమగు భాషయందు మనవిద్యాపరీక్షలన్నియు నున్నవిధాన మంతయు మన భారతీయవిద్యార్థికి చదువును చాల యెక్కువ కష్టమొనర్చివేయును. దేశముయొక్క రాజకీయ పరిసరముల ననుసరించి దాని విద్యావిధానము భేదించుచుండు ననుట సర్వజనసమ్మతమైనది. నేను ఆకాంక్షించి మనవిచేయు నదెల్లనిదియే: ప్రజల అవసరములు, రాజకీయవిషయములందు కూడ, వీలగునంత త్వరలో తీరుటకనువగునట్లు మన విద్యావిధానములును ఆదర్శములును యేర్పడవలయును. మన (ప్రయత్న) ప్రయోగమునందు ముఖ్యతమ సారాంశము శీఘ్రత. దీనిని మరువకుందురుగాక. [జ. బ్ర.]

జపానుదేశపు రాజశాసనము

జపాను చక్రవర్తి నూతనముగ సింహాసన మధిష్ఠించునపుడు వెలువడిన రాజశాసనములో ఈక్రింది అంశములున్నవి:

"దేశములోపల, మా ప్రజలవిద్యావ్యాసంగమును, వారల నైతిక ఆర్థికములగు అభివృద్ధిని, తన్మూలమున పరస్పర సాహాయ్యము, సంతృప్తియు, యావజ్జాతి శక్తిశ్రేయస్సులును—వెలుపల, ఇతరజాతులన్నిటితోడ సౌహార్దమును, తన్మూలమున ప్రపంచశాంతి పరిపోషణమును, మానవశ్రేయోభివృద్ధియును నిర్వహింప యత్నించుట మాకు గల ముఖ్యోద్దేశము. కావున ప్రేమపాత్రులగు మా ప్రజలందరు ఏకమనస్సుతో అసూయలేక సంఘాపయోగమునకు పనిచేసి, మా యీ ఆశయములు నెరవేరు

టకును, అందువలన వంశపారంపర్యముగ వచ్చుచున్న ఉత్కృష్టసాంప్రదాయముల నధిక మొనర్చుటకును, మా పూర్వుల జీవాత్మలను సంతోష మనస్కతతోడ సంపర్కింపగల్గుటకును మాకెంతయు తోడ్పడుదురుగాత యని కోరుకొనుచున్నాము."

జపానుదేశీయుల కొనర్చుటకు వాగ్దత్తము లైనవానిలో ప్రథమస్థానము విద్య నభివృద్ధి కొనంగబడుట గమనింపదగినది. భారత దేశముపట్ల విదేశీయ (బ్రిటిషు) ప్రభుత్వవైఖరి దీని కెంత విరుద్ధము!

(మాడరన్ రివ్యూ)

అహమద్ జోగూ, నూతన అల్బేనియా రాజు

'లివింగ్ ఏజ్' పత్రికయొక్క జర్మను విలేఖరి యొకడు నూతన అల్బేనియారాజుయొక్క దుస్తుల విశేషములను, యితర విషయముల నిట్లు వ్రాయుచున్నాడు:

నిన్న నొక కిరీటములేనిరాజు, సంస్థానము లేని రాజ్యాధిపతి ప్రభునామము దాల్చెను. ఇట్లున్నను నేడతడు రాజత్వచిహ్నములగు సకల శృంగార వస్త్రాలంకారములను దాల్చి, పేరునను నిజమునను కూడ రాజై యున్నాడు.

జోగొల్లీ కుటుంబమునకు చెంది మాట్యాముండలమునకు వంశపారంపర్యముగు పెద్దయైన అహమన్ జోగూ గారు అల్బేనియా రిపబ్లిక్‌న కధ్యక్షుడై అల్బేనియా పార్లమెంటును, నానాజాతి సమితిని, కూడ లెక్కసేయని యపరిమితాధికారమును కలిగియున్నాడు.

సాధారణముగ అహమన్ జోగుగారు తన ముఖ్య సేనాని పదవియధికారమువలన తాను ధరింపనగు యోధ దుస్తులను దాల్చియుందురు. సన్మానపు విందులపుడును, తాను ప్రజలకు కనపడవలసిన ప్రత్యేక సమయములందు నతడు కవాతుదుస్తులు (కోటు పంట్లాములు) దాల్చును. మొన్నటి యిరోపా మహాసంగ్రామమునకు ముందు కొలది కాలము మాత్రమే అల్బేనియా రాజ్యమేలియుండిన విలియమ్ ఆఫ్ వీడ్ యొక్క వింతమాదిరి రాజదుస్తుల యనుకరణమిది. ఇది యనేక మార్పులనుపొంది తుదకిట్లు స్థిరపడినది. మొట్టమొదట అహమద్ జోగూగారొక తెల్లని మిలిటరీయంగీని, తెల్లపంట్లామును, తెల్లని(స్వారి చేయునపుడు ధరించు) జోళ్లను తొడుగుకొని మెచ్చుచూచిరి. త్వరలోనే వానినిమార్చి ఎఱ్ఱనిపంట్లామును, నల్లని జోళ్లను నారంభించిరి. పిమ్మట ఎఱ్ఱనిగుడ్డ అస్తరు



అహమన్ జోగుగారు

వేసిన నల్లని పైఅంగీని చేర్చెను. ఈ దుస్తు దాల్చినపు డతడు కొంతవర కొక సంగీత సుఖాంత నాటకమున నాయకునివలె (కొంత హాస్యపురీతిగా) కనపడినను, అతని కాదుస్తులు సరిగా నమరియున్నవనియు, స్త్రీలపై గొప్ప ప్రభావము కలిగియున్నవనియు నంగీకరింపక తప్పదు.

అతడు తన జీవితమునకు నెపోలియన్ బోనపార్టీని ఆదర్శముగ నుంచుకొన్నాడనుట నిస్సంశయము. అతడు తన వ్రాతబల్లపై నెల్లప్పుడు నెపోలియన్ జీవితచరిత్రము నుంచుకొని, అతిశ్రద్ధతోను ఆసక్తితోను చదువుచుండును. భవిష్యత్తు ముందు చెప్పబడినట్లు, అతని రాజపదవి నొందవలెనను కోరిక యిపుడు నెరవేరుచున్నది. అతడాజ్ఞలనిచ్చును, ఉద్యోగములనిచ్చును, ఉపకారములచే

యును—అప్పు డప్పుడు ఉరిశిక్షనుకూడ తీర్మానించుచుం డును—ప్రభుభక్తి కలిగి ధైర్యసాహసములు కల యుద్యోగీయవర్గము నిత డేర్పరచుకొనెను. వారు తమప్రభువును మించి బంగరు జరీకోటు పంట్లాములదాల్చి హోషుగా తిరుగుచుందురు.

కాని, యిన్నియున్నను కూడ, అతని పోషకుడును రక్షకుడునైన ముస్సోలినీ యొకమారు తలయూపి నంతనే అహమ్మద్ యొక్క ఆశాస్వప్నములన్నియు నెర వేరకముందే యతనిశక్తిప్రాభవమంతయు నడుగంటగలదు.

[జ. బ్ర.]

జనసామాన్యమునకు విద్య ఉత్తమరూపమైన సంఘసేవ

అక్టోబరునెల 'సోషల్ సర్వీస్ క్వార్టర్లీ' యందు శ్రీ మనేక్‌లాల్ హెచ్. వకీల్‌గారిట్లు వ్రాయుచున్నారు:

ఈవిషయమున పనిచేయగల యేకమాత్ర ఉపాయము జనసామాన్యమున కక్షరజ్ఞానమే. అందరు బీద స్త్రీపురుషులును చదువను వ్రాయను లెక్కింపను ఎఱిగిన యెడల వారికి శుభ్రత ఆరోగ్యమును గూర్చిన సూత్రములు తెలియగలవు. వారి కూలిడబ్బుల విలువ వారికి తెలియగలదు. వడ్డీవ్యాపారమునకు డబ్బు అప్పిచ్చువారివలన మోసపడుట తగ్గగలదు. సహకార పరపతి సంఘములు ప్రారంభదశ దాటినవెనుక బయటి సంఘసేవకు లక్కఱ లేకయే యభివృద్ధి నొందగలవు. వారు ప్రభుత్వమువారిని వయోవంతులకు వోటుహక్కు నిమ్మని కోరుదురు. తమ బిడ్డలకు ప్రాథమికవిద్య నిమ్మని కోరుదురు. వారు అక్రమమైన తీవ్రమైన పోరులు సలుపక తమ గృహములను మాత్రము సంరక్షించుకొందురు. వారి సాంఘికనీతిప్రమాణము ఉన్నతినొందును. గ్రుడ్డిపోట్లకి బదులు పరస్పర సహకారము ప్రేమ శ్రేయాభిలాష యేర్పడును. స్త్రీ పురుషునితో సమభాగిని యగును. ఆమె మాతగా చేయు సేవలు ప్రజలచే నింకను యెక్కువగా నామోదింపబడును. చదువు వచ్చిన స్త్రీ తనకు రావలసిన గౌరవాదులను హక్కుతో నాకాంక్షింపగలదు; మఱియు నీత్యుద్ధరణకై పాటుపడువారికంటె నెక్కువసంఖ్యగానున్న స్వార్థపరులగు అవినీతిపరులవలన నామె చెడగొట్టబడి వ్యభిచారములోనికి దిగుట కవకాశములు తగ్గును. [జ. బ్ర.]

మూర్తిమత్త్వము

నేటి తరముయొక్క ప్రజాసమూహ మానసిక తత్త్వమునెదిర్చి మించుటకు మనము మూర్తిమత్త్వము లేక వ్యక్తిత్వమును పెంపుచేసుకొనవలెను; లేక భద్రపరచుకొనవలయును.

నిరుటి సంవత్సరమంతయు వార్తాపత్రికలయందు 'మనదేశమున నెవ్వరైన మహాపురుషులున్నార?' 'నే డెవ్వరును పురుషోత్తములు లేరు!' 'మన కాలమున పృథక్వ్యక్త్వము తక్కువా?' యీమొదలగు శీర్షికలతో వ్యాసములు నిండుచుండెను. నేను అమెరికా కేగినపుడు పత్రికావిలేఖరులు నన్నిట్లడుగజొచ్చిరి 'స్త్రీయొక్క గొప్ప ఆస్తి యేది- సౌందర్యమా, ఆకర్షణశక్తి (వశీకరణశక్తి) యా, తెలివితేటలా?' 'మూర్తిమత్త్వము' అని నే నంటిని.

ముస్సోలినీగా రొకసారి నాతో కథాసరణిని ప్రసంగించుచు 'గుంపు గుంపు నేలజాలదు' అని చెప్పిరి. ఒకప్పుడు తాపీపనివానిగానుండిన, ఆయన, యిపుడొక క్రొత్త విశ్వసామ్రాజ్యమును గూర్చి యాలోచనలు సాగించుచు, వట్టి మూర్తిమత్త్వబలమువలననే యిటలీ నేలుచున్నారు. అఫ్గనిస్థానపు అమీరు అమానుల్లాగారు నేటివరకును చేయజాలకుండిన దానిని తాను జయప్రదముగ నెరవేర్పగలిగి పేర్వడసిన ముస్తాఫాకెమల్‌పాషాగారు మునుపొక సామాన్యసైనికుడు మాత్రమే. పృథక్త్వమే యతని విజయమునకు రహస్యము చైనాదేశ మింకను అల్లకల్లోలమున నుండుటకు కారణమేమి? ఉత్తమ వ్యక్తిత్వముగల నాయకుడు లేకుండుటయే. చియాంగ్



మూర్తిమత్త్వవిజయము : సామాన్యస్థితియందుండి క్రమముగ నభ్యున్నతికివచ్చి మహానాయకులై కీర్తిమంతులైయున్న ఆర్గురు వ్యక్తులు.

ఎడమప్రక్కనుండి కుడిప్రక్కకు:—రిజాఖాన్, కొస్సాక్‌జాతి సైనికుడైయుండి నేడు పెర్షియాకు ప్రధానమంత్రియయ్యెను; డాక్టర్ మాసారిక్, గుఱ్ఱపుబండివానికొడుకు—నేడు జెకోస్లొవేకియాను "సృష్టించిన" వాడు (అధ్యక్షుడు); మహాత్మా గాంధీ, రాజకీయాదులందు ప్రవేశించి క్రమముగ త్వరలో నున్నతికి వచ్చెను; జగ్లుల్ పాషా, బీదకుటుంబమున జన్మించిన యితడు ఈజిప్టునకు ప్రధాన మంత్రియైయుండెను. (ఇప్పుడు లేడు) బెనిటో ముస్సోలినీ, సాంఘికవాదియైయుండి పలుసార్లు ఖైదునపడియుండిన యితడు మొదట తాపీపనిచేయువాడు. నేడు ఇటలీకి సర్వాధిపతి-శాసకుడయ్యెను; ముస్తాఫా కెమాల్ పాషా, సైనికుడుగనుండిన యితడిప్పుడు టర్కీప్రభుత్వాధికారమునకు వచ్చెను.

కాయ్‌షేక్ గారివద్ద గొప్పలక్షణములనేకములున్నవికాని, కేథేయందు సామాన్యప్రజలందఱును-వశపరచుకొని వారి దృష్టియందతని మూర్తిమత్త్వము ప్రధానవ్యక్తికాలేదు. ఈజిప్టుదేశపు శాన్‌పాషాజగ్లూల్ గారు తన మూర్తిమత్త్వమువలననే అనాయికులను ఫెల్లాహీనుల హృదయములను హరించివేసెను. వారతని నెన్నడును భక్తితో గౌరవింపకుందురు.

నూర్గురు సిపాయిలను, నూర్గురు నాట్యకారులను నూర్గురు విద్యార్థులను పరీక్షించేయుడు—అందధికసంఖ్యాకు లొకవిధముగ విజయమును పొందవచ్చును. కాని అత్యల్పసంఖ్యవారు తక్కిన తమ సహపాఠులందఱిలోను ధ్రువతారలవలె ఉన్నతికి వచ్చి ప్రకాశింతురు. నిర్బంధవిద్య నేటి పనివానిని నిన్నటిపండితుని జ్ఞానశిఖరమున కెక్కించును. పండితులగు నొక జనసమూహముకూడ నింకొక జనసమూహము నేలజాలరు. ఐనను మనము తెలిసియే జనసమూహ మానసికతత్త్వము వంకకు తొందరతో పోవుచున్నాము. ప్రజాభిప్రాయమును బోధించు కొలది మంది చేతులలో వార్తాపత్రికలున్నవి. దూరశ్రవణము, వార్తాప్రసారమును, గుత్తదారుల స్వాధీనములోనున్నవి. నేడు వస్తువులన్నియు ఒకేసరి మొత్తమున తయారగుచున్నవి. అట్టివస్తులనే మనము తొల్చుచున్నాము; వాటివలననే ఫాషన్ (నవీనసౌందర్యరీతి) లేర్పడుచున్నవి. మనదగ్గతి చుట్టుపట్టులనుండు వస్తువులన్నియు నట్టివే; దానివలన మనసౌందర్యరుచుల కడ్డు కలుగును. వ్యక్తిత్వ పృథక్త్వ కృషులన (సంస్కారము) బలిగొనవచ్చి నేటి తరమువారు మన నాగరికత యెన్నడు నెరుగనంతటిబాగుగా దుస్తుల దాల్చుచున్నారు. మంచి యాహారమును గొనుచున్నారు. మేలైన గృహములలో నివసించుచున్నారు. అన్నివిధముల మునుపటికంటె సదుపాయముగ నున్నారు. మనకు భావిప్రపంచమున వచ్చురాజులు మూర్తిమంతులుగ ప్రకాశింతురు. ముటికిగంటలనుండి మొలిచియు, దివ్యసౌరభమును వెదజల్లు ప్రసూనములను, బీద గుడిసెలనుండి వచ్చియు రారాజులైనవారిని, మనమప్పుడే చూచియున్నాము. పెర్షియాషా(రాజు)ఐనరిజాఖాన్ మున్నెవ్వడు? గాంధీ, ముస్సోలినీ, కెమాల్‌పాషా, మాసారిక్, వీరెవరు? నెపోలియన్ మాత్రము మొదటనెట్టివాడు? మూర్తిమత్త్వ

మే జయించి ముందుకు రాగలదు. గెంఘిస్‌ఖాన్, టామర్‌లేన్, మహావీరుడగు అలెగ్జాండర్-ఈ విశ్వవిజయులు తమ ప్రజ్ఞాసామర్థ్యములను జనసామాన్య కొలతబద్దతో కొలిచి చూచుకొనియుండిరా? వారు తమ తోడిమానవులను నీచముగా చూడలేదు కాని ఆదేశముకొఱకు, ప్రేరణకొఱకు పైకిచూచిరి (దైవసహాయ్యముకొఱకు). మూర్తిమత్త్వము భద్రపరచుకొని పెంపుచేసుకొనుటయన త్యాగమునకు సంసిద్ధమైయుండవలెనన్నమాట. ఆమార్గము బంటరిబాట. సమూహములో (గుంపుతో) నొకడైయుండుటయే యింతకంటె సౌఖ్యప్రదము. నవీనప్రాచ్యఖండముల మహానాయకులప్రక్కన నేటి యూరపుఖండమున వ్యక్తిత్వముగల గొప్పవారు అరుదుగా నగపడుచున్నారు. క్రీస్తుమతమువలె, ప్రథమమున (ఆదిని) ప్రాచ్యదేశనుండియే జీవమువచ్చి, పాశ్చాత్యఖండమున జ్ఞానజ్యోతిని ప్రసారముచేసి, మాకు పలకాలములకు కీర్తిమంతులై యుండు మహాపురుషుల ప్రసాదించినది. యంత్రమానవుని (కీలుబొమ్మ) రత్త్వముగల మానవసంతతి సకలవిధ వస్తుయంత్రనిర్మాణ విధానముతెలుగ జాలినమాత్రము, ప్రేరణాత్మను విశ్వనాయకత్వమును కోల్పోయినయెడల నేమిప్రయోజనము? నేటికాలమున కత్యంతాశ్చర్యమైనవారు ధైర్యమును సాహసమును గల గొప్ప పృథక్త్వముతోడి మూర్తిమంతులు. [జ. బ్ర.]

(జనవరి ౫ వ తేదీ 'స్ఫియర్' నందు లేడీ డ్రమ్మండ్ హే గారు వ్రాసినదానినుండి)

చాంపానేర్ నగరద్వారము

'చాంపానేర్' అనునది బొంబాయి రాజధానిలోని 'పాంచ్‌మహాల్స్' మండలమునందలి 'కలోల్' తాలూకాలోనున్న ఒక జీర్ణనగరము. ఇది బరోడాకు ఉత్తరము ౨౫ మైళ్ల దూరమున పావాగఢ్ గుట్ట ఈశాన్యభాగము నానుకొని యున్నది. ఇది తొలుత రాజపుత్రరాజులది. ౧౪౮౩ సం. 'మహమ్మదు బెగర' అనునతడు వారిపై దాడివెడలి అచ్చట తొలుత నొక ముసల్మానుభవనమును గట్టమొదలుపెట్టెను. మరుసంవత్సరమాతడు రాజపుత్రులను తరిమివైచి దానిని తన వశముచేసికొని అభివృద్ధి గావించి తనరాజధానిని అహమదాబాదునుండి యచటకు మార్చుకొనెను. దాని కాతడు మహమదాబాదు చాంపానేర్ అను పేరు పెట్టెను. ఆ నగరము త్వరలో మంచి వర్తకస్థానమయ్యెను. పట్టుబట్టలు అక్కడ మిక్కుటముగ నేయుచుండిరి. కత్తుల పరిశ్రమ బాగా సాగుచుండెడిది. ఇందుకు కావలసిన ఇనుము మొదలయిన వస్తువులు ఆ చేరువనున్న గుట్టలలో లభించెడివి. దీని యీ భోగము కొలదికాలమునకే బోరగిలినది. ౧౫౩౫ వ సంవత్సరము హుమయూను చక్రవర్తి యీ నగరమును కొల్లగొట్టెను. సుల్తాను బహదూరుషా (దీని నేలుచుండినరాజు కాబోలు) చనిపోయిన తర్వాత రాజధాని అహమ్మదాబాదునకు మారిపోయెను. ౧౬ వ శతాబ్దప్రారంభకాలమునాటికి ఈనగరమునందలి భవనములు శిథిలములై నేల కొరగజొచ్చినవి. అడవి పెరిగి చుట్టు ముసురుకొనివచ్చినది. ప్రదేశము రోగభూయిష్ఠమైనది. ఇట్లు క్షీణించిన యీ నగరమున ౧౮౦౩ సంవత్సరమున ఆంగ్లేయుల చేతబడునాటికి ౫౧౦ మంది జనులు నివసించియుండిరి. అనారోగ్యభూయిష్ఠమగుటచే నెన్నిమార్లు ప్రయత్నించినను జను లచట నివసించుట కెక్కకపోయిరి. ఇపుడు అక్కడనుండువారు కొన్నిపదులకు మించియుండరు.

ఈ నగరముయొక్క శిథిలములనుగాంచిన దీని పూర్వపు వైభవము తెలియును. మహమ్మదు బేగర కట్టించిన కోట ముక్కాలు మైలుపొడవు, ౨౮౧ గజములు వెడల్పు గలిగియున్నది. దీనిచుట్టును పెద్దపెద్ద నాపరాళ్ళతో గట్టిన దిట్టమైన ప్రహరి కలదు. దీనిపై సమావకాశములయందు కట్టిన బురుజు లున్నవి. ముసల్మానుపద్ధతి ననుసరించి కట్టిన వసారాలు వీనికి అందమును గూర్చుచున్నవి. ఇది నగరహృదయమున గలదు. దీనికి పడమట, తూర్పు చాలదూరము సుందరోద్యానములు భవనములు నుండినట్లు వానిని చుట్టియుండిన ప్రహరిగోడయొక్క జాడలు ఇప్పటికిని కలవు. దీనినిచుట్టి ఉత్తమనిర్మాణకౌశల్యమునకు నిధానములగు సరస్సులు, భవనములు, మసీదులు నుండినవి. ఇప్పుడింకను ఐదుమసీదులు చెక్కుచెదరక ఉన్నవి. వానిలో నొకదానికి 'జామామస్జిదు' అని పేరు. పశ్చిమహిందూస్థానమున సుందర శిల్పకళావైభవమున నొప్పారు ముసల్మానుభవనములకు 'మస్జిదు' వీసమైనను తీసిపోదు. నగరమున ఆగ్నేయమున ఒక లోతయిన కృత్రిమసరస్సు కలదు. దానిచుట్టును రాతిమెట్లు కలవు. ఈ సంచికయందీనగరద్వారచిత్రమును గాంచనగును.

సాభిప్రాయ విశేషములు

కలకత్తా కాంగ్రెసు స్వరాజ్య సంరంభము నందు నూతనశకమును స్థాపించినది. కాంగ్రెసు వ్యవహారము లతిరయమున ప్రవర్ధమానంబగుచున్న ప్రజాశక్తిని ప్రత్యక్షము చేసినవి. నెహ్రూస్వాగతము, స్వచ్ఛంద సైనికదళములు, నానాసభలు, జనసమూహములు, నిర్భయోపన్యాసములు, వ్యగ్రోత్సాహము, ప్రవర్ధమానం బగుచున్న ప్రజాశక్తికి పరమ ప్రమాణములు. ప్రజానాయకుడైన పండితమోతీలాలు నెహ్రూగారికి 36 తెల్లగుఱ్ఱములు గల రథోత్సవరూపమున కలకత్తా యొసంగిన మహాస్వాగతము ప్రజాశక్తిని విశదము చేయుచున్నది. ప్రజలును, నాయకులును చక్రవర్తులకు దుర్లభమైన మహాస్వాగతమును మోతీలాలుగారి కొసంగిరి. కలకత్తా నలంకరించిన స్వాగతతోరణములు, కర్పూరహారతులు, విజయధ్వానములు, స్వాతంత్ర్య ప్రదర్శనమునకు నిదర్శనములు. కలకత్తా కాంగ్రెసును సందర్శించిన సంశయాత్ములకైనను ప్రజాహృదయమునందు ప్రవర్ధమానం బగుచున్న స్వాతంత్ర్యాభిలాష సువ్యక్తమైనది. ప్రజాశక్తి విజృంభణమును జూచుచుండియును గనుగొనజాలని ఫుల్లరులు, ఓడ్వాయరులు స్వప్రయోజనపరాయణత్వమును వెల్లడి చేయుచున్నారు. కాని సామ్రాజ్యక్షేమమును మానవకల్యాణమును వెల్లడిచేయుటలేదు. వర్తమాన స్వాతంత్ర్య యుగమునందు నిరంకుశత్వము దుస్తరమని నిరంకుశాధికారవర్గము గ్రహించుట వివేకము. స్వల్పసంఖ్యాకులైన నిరంకుశాధికారులు మహత్తరమైన ప్రజాసంకల్పమును చిరకాలము నిర్బంధింపజాలరు. రుష్యా సామ్రాజ్యచరిత్ర నిరంకుశవర్గమునకు జ్ఞానోదయమును గలుగ జేయవలసియున్నది. కాలమాసన్నమైనపుడు స్థిరమైనసంస్థలు నీటిబుగ్గలవలె మాయమగుచున్నవి. అమీరు అమానుల్లాగారి చరిత్రము రాజ్యపరివర్తన సందర్భములను విశదము చేయుచున్నది. కలకత్తాయందు దేశబంధు నగరమునందు ప్రదర్శింపబడిన స్వాతంత్ర్యోత్సాహములు భారతప్రబోధమును సువ్యక్తము చేయుచున్నవి. కాంగ్రెసునందు సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానమోడిపోయినను ప్రవర్ధమానం బగుచున్న ప్రజాభిప్రాయమును దెలుపుచున్నది.

* * * *

సంపూర్ణస్వాతంత్ర్యము:

అధినివేశ రాజ్యాంగవిధానము

నెహ్రూనివేదిక అనేకమైన యూహాపోహలకు గారణంబైన విధమును గతించిన నాలుగైదుమాసములందును వ్యాపించిన వాదప్రతివాదములు విశదము చేయుచున్నవి. ఈ యూహాపోహాలు కలకత్తాయందు మహాప్రస్థానావస్థను బొందినవి. కలకత్తాయందుగూడిన కన్వెన్షను సభయందు జిన్నా మహమ్మదాలి గారులుచేసిన ప్రసంగములు దేశావృతమైన సాంఘిక లక్ష్యమును విశదముచేయుచున్నవి. సుప్రసిద్ధనాయకులైన మహమ్మదల్లీగారు సిద్ధాంతములందు సంపూర్ణస్వాతంత్ర్యమును, అచరణమునందు

సాంఘికలాభములను బోధించుట విచిత్రము గ గనుపడుచున్నది. భారత స్వరాజ్యమునకు మూలాధారము జాతీయసంయోగము గాని జాతీయవియోగముగాదు. మహమ్మదీయులును, హిందువులును ప్రత్యేకసాంఘిక ప్రయోజనములకై పెనగులాడునపుడు దేశప్రయోజనములు సంకుచితములగుట సహజము. మహమ్మదీయ నాయకులందు అబ్దుల్ కలామ్ అజదు, సర్ ఆలీ ఇమాము, మహమ్మదాబాదు రాజాగారులు మొదలగువారుగాక సామాన్యముగ మహమ్మదీయ సంఘమంతయును ప్రత్యేకప్రయోజనములను గోరుచున్నది. నెహ్రూని వేదికకు సంయుక్త నియోజకవర్గము కీలకము. హిందువులు, సిక్కులు, క్రైస్తవులు, పార్సీలు ప్రత్యేక నియోజక వర్గమును నిరసించుచు సంయుక్తనియోజకవర్గము నంగీకరించుచున్నారు. మహమ్మదీయుల ప్రతిఘుటన మభివృద్ధిని బొందుచున్నది. మహమ్మదీయ ప్రతిఘుటనము హిందూప్రతిఘుటనమునకు దోహదంబునొసంగుచున్నది. నిరంకుశవర్గమునకును యూరపియనుసంఘములకును హిందూమహమ్మదీయవిభేదము లెప్పటివలనే యానందమును గలుగచేయుచున్నవి. కన్వెన్షను సభ నెహ్రూని వేదిక నంగీకరించినను మహమ్మదీయ భేదాభిప్రాయము దానిని నిర్వీర్యము చేసినది.

మహమ్మదీయసంఘము సాంఘికలక్ష్యమును విడిచి దేశలక్ష్యము నారాధించుటకు హిందువులైనను సకలవిధముల త్యాగము జూపుట పరమావసరమై యున్నది. భరతవర్షము కృశించుచున్న సమయమునందు సంపూర్ణ వినాశముకన్న నేసంఘమైనను చైతన్యము గలిగి శక్తిని గలిగియుండుట దేశమునకును, లోకమునకును శ్రేయోదాయకము.

అధినివేశరాజ్యాంగ విధానముపట్ల యువజనహృదయము విముఖత్వము జూపుట సహజముగనున్నది. యువజన హృదయము స్వాతంత్ర్యోత్సాహముతో వికసించుచుండును. యువజనహృదయమునకు నిర్బంధములు భయమును గలుగజేయజాలవు. దేశమోక్షమునకై ఆత్మార్పణము జేయుటకు యువజనులు సర్వకాలములందును సంసిద్ధముగ నుండగల విధమును ప్రపంచేతిహాసములు తెల్లముచేయుచున్నవి. జవాహర్ లాలు నెహ్రూగారు కాంగ్రెసువేదికయందు జేసిన ప్రసంగములు భారత హృదయాంతరాళము నుండి వెడలిన భావములుగ బరిగణింపబడదగి యున్నవి. యువకులైన జవాహర్ లాలు గారును,సుభాష్ చంద్రబోసు గారును శ్రీనివాసయ్యంగారితో జేసిన యొడంబడికను నిరాకరించుటయందు విచిత్రము లేదు. నిర్బంధకారకులను నిర్బంధితులు విశ్వసింపజాలరు. అధినివేశరాజ్యాంగ విధానమును యువజనులు నిరాకరించుట సహజము. అతివాదులందు జరుగుచున్న పరివర్తనము మితవాదులందను జరుగుచున్న విధమును కలకత్తాతీర్మానములు విశదము చేయుచున్నవి. మితవాదులు, మితవాదకాంగ్రెసు నాయకులు స్వతంత్రవాదులకు స్వాతంత్రవాదమును వ్యాపింపజేయుటకు సంపూర్ణాధికారమునొసంగుటయే స్వాతంత్రవాదవ్యాపనమును విశదము చేయుచున్నది. మితవాదులు నెహ్రూనివేదికను, కాంగ్రెసు తీర్మా

నమును బలపరచి స్వరాజ్యముపట్ల ప్రజలకు గల దృఢసంకల్పమును విశదము చేసిరి.

*　　*　　*　　*

గాంధీమహాత్ముడు

అధినివేశ రాజ్యాంగవిధాన తీర్మానమును గాంధీమహాత్ముడు ప్రతిపాదించుట విస్మయము నుగలుగజేసినది. కాని మహాత్మునిస్వభావము నెరిగినవారలకు విస్మయమున కవకాశము లేదు. గాంధీమహాత్మున కుదారాశయములందువలె కార్యసాధనమునందును నమ్మకము గలదు. మాటలతో చింతకాయలు రాలవని మహాత్ము డెరిగియున్నాడు. కాని నిరంకుశవర్గము చూపుచున్న తిరస్కారధిక్కారములు ప్రజలను కార్యపరతంత్రులను జేయుననెడి విశ్వాసము గాంధీమహాత్ముని విడువలేదు. మహాత్ముడు విదేశయాత్రను జేయుటకు జేసిన యేర్పాటులను విసర్జించి స్వదేశమునందు కార్యరంగమున పనిచేయుటకు సిద్ధముగనున్న విధమును వారి ప్రసంగములు విశదము చేయుచున్నవి. ప్రజలయందును, నాయకులయందును వారి విశ్వాసము సన్నగిలుచున్నవిధమును వారి ప్రసంగములు, వ్రాతలు విశదము చేయుచున్నవి. ఈ సంవత్సరాంతమునందు శాసనోల్లంఘన ప్రస్థానము సాధ్యమని మహాత్మునకువిశ్వాసము లేదు; కాని మహాత్ముని తీర్మానము విజయమును బడయుటకు శాసనోల్లంఘనప్రస్థానమునందును, మహాత్ముని నాయకత్వమునందును ప్రజలకుగల విశ్వాసమె మూలకారణముగ నున్నది. కాంగ్రెసునిర్ణయించినకార్యవిధానమునం దన్నిమతములవారికిని త్యాగముచేయుట కవకాశములు గలవు. ఖద్దరునకు, మద్యపాననిషేధమునకు పనిజేయవచ్చును. శ్రీమంతులు, సామాన్యులు కాంగ్రెసు నిర్ణయించిన రుసుమును చెల్లింపవచ్చును. ప్రజలు కార్యపరాయణులైనపుడు మహాత్ముడు నిస్సందేహముగ తిరిగ నాయకత్వము వహించుట నిశ్చయము. ప్రజలందరును కాంగ్రెసుసంఘములందును, స్వచ్ఛందసైనికసంఘములందును సభ్యులుగ జేరి గాంధీమహాత్ముని సంకల్పము సార్థకముచేయుట స్వరాజ్యసంపాదనమునకు పరమసాధనముగా నున్నది.

*　　*　　*　　*

సైమను సప్తక బహిష్కరణము

సైమను కమిషనును సకలపక్షములవారును బహిష్కరించుచున్న విధమును వారి పర్యటన వృత్తాంతము విశదము చేయుచున్నది. కలకత్తాయందు మోతీలాలు నెహ్రూగారి కొసంగిన స్వాగత మెంతయద్భుతముగ నెరవేరినదో సైమనుసప్తక బహిష్కారమును నెరవేరినది. పంజరములోని చిలుకలనువలె సైమనుసప్తకమును గొనిపోవుట బ్రిటిషుప్రభుత్వ దౌర్బల్యమునకు నిదర్శనము. బ్రిటిషు ప్రభుత్వమున కాసురబలమున్నను ధర్మబలము లేదని బహిష్కరణోద్యమము విశదముచేయుచున్నది. సైమనుసప్తకమును రహస్యముగా గొనిపోవుటయే బ్రిటిషుప్రభుత్వ దౌర్బల్యమును తెల్లము చేయుచున్నది. ఇర్విన్ప్రభువు బహిష్కరణ విజయమును పరోక్షముగా నంగీకరించినటులు వారి డిల్లీ ప్రసంగము విశదము చేయుచున్నది. ఇంతవరకును నాయకులు సైమనుకమిషనును బహిష్కరించినను పార్లమెంటు కమిటీయెదుటను భారతీయులు వారి నివేదికను స్ఫుటముచేయుట కవకాశములు

గలవని ఇర్విన్‌ప్రభువు తెలిపినభావము బహిష్కరణ విజయము నంగీకరించుచున్నది. భరతఖండమునందు సైమనుకమిషనును బహిష్కరించిన నాయకులు బ్రిటిషు ద్వీపములకేగి సాక్ష్యమునిచ్చుట యసంభవము. భారతీయ నాయకులు వారి యాత్మగౌరవము నెన్నికష్టములు సంప్రాప్తములైనను లక్ష్యముచేయక కాపాడుకొనుటకు భగవంతుడు సాహస ధైర్యముల నొసంగుగాత ! చెన్నపురి నాయకులును ప్రజలును సైమనుసప్తకమును హరతాళములతోను, నల్లజండాలలోను, నివర్తనఘోషములతోను సత్కరింతురుగాత యని కోరుచున్నాము.

*   *   *   *

ఆంధ్రవిశ్వ విద్యాలయము

చిరకాలము తపస్సుచేసి పడసిన ఆంధ్ర విశ్వవిద్యాలయమును సుబ్బరాయనుగారొకక్షణమున ధ్వంసము చేయుట విచిత్రముగనున్నది. ఆంధ్రుల దౌర్భాగ్యస్థితికి విశ్వవిద్యాలయ శాసన చరిత్రము నిదర్శనముగనున్నద. విశ్వవిద్యాలయస్థానము విశ్వవిద్యాలయము విశాఖపట్టణమునకు సంక్రమించినను ఆంధ్ర విశ్వవిద్యాలయమును ముక్కలుచేయుట కేవల మన్యాయముగ నున్నది. దత్తమండలములను, చిత్తూరును మద్రాసు విశ్వవిద్యాలయముతో సంధించుటయును, ఆంధ్ర విశ్వవిద్యాలయము నుండి విడదీయుటయును అనుచితముగ నున్నది. విశాఖపట్టణము నందలి విశ్వవిద్యాలయము విశాఖపట్టణ విశ్వవిద్యాలయ మగును గాని ఆంధ్రవిశ్వవిద్యాలయము కాజాలదు. ఆంధ్ర దేశములోని సగముభాగము చీలిపోయిన తరువాత ఆంధ్ర విశ్వవిద్యాలయనామము సార్థకము గాజాలదు. ఆంధ్రదేశములోని విద్యాలయములను విడదీయుటవలన ఆంధ్రత్వమునకును, వారి వైజ్ఞానిక సంయోగమునకును భంగము గలుగుచున్నది. ఈ లోపమును వెంటనే తీసివేయుట ఆంధ్రనామధారుల కందరకును పరమధర్మమైయున్నది. విభజించి పాలించుట విదేశీయుల ధర్మము. ఆ ధర్మమునే మన మంత్రులవలంబించుట మన దురదృష్టము. వెంటనే ఈ దుర్దశను తొలగించి ఆంధ్రత్వమును స్థిరతరము చేయుట కాంధ్రులు వారి శక్తి నుపయోగించి భగవదనుగ్రహమునకు పాత్రులగుదురు గాత !

Printed and Published by K. Nageswara Rao, at the Andhra Patrika Press, No.7, Thambu Chetty St., Madras



గ్రంథాలయోన్నతి ఎట్లు కాగలదు?

మొన్న కలకత్తాలో జరిగిన, అఖిలభారత గ్రంథాలయమహాసభ కాహ్వాన సంఘాధ్యక్షులైన శ్రీయుతులు రవీంద్రనాథ ఠాకూరుగారు తమ యుపన్యాసమున గ్రంథాలయముల యుపయోగము విరివిగ పెరుగుటకొరకు కొన్ని అమూల్యములగు సూచనలను కావించినారు. ఆసూచనలను, జనవరి (౧౯-౨౯) మాడర్న్ రివ్యూపత్రిక ఉద్ధరించినది. ఈక్రింద దాని అనువాదము గలదు.

ఉపన్యాస మిట్లు ప్రారంభమగుచున్నది:—

అత్యాశ మానవుని ముఖ్యాంతశ్శత్రువులలో నొక్కటి. మానవుడొకసారి, సేకరించి నిలువచేయుటకు మొదలిడుచో సంఖ్యను హెచ్చించుతలంపున కూడబెట్టుటకు గల ఉద్దేశమును విస్మరించును. అతడు ధనాగారమునకు ధనము ప్రోవుచేయుచున్నను, మతము నవలంబించుటకు మనుష్యుల జేర్చుచున్నను కూడదీయు నుత్సాహమున నే కొట్టుకొనిపోవును. అప్పటి గ్రుడ్డితొందరలో అతని ఆశయ మగునవధి అస్పష్టమైపోవును. సంఖ్యాబాహుళ్యముచేత విలువను కొలువరాదని అతని మనస్సు మరచిపోవచ్చును.

* * * * *

సేకరించుటయందు గల పై పేరాస గ్రంథాలయములకొఱకు గ్రంథములను సేకరించుటయందు వర్తించుచున్నది కాని వాని ఉపయోగ సౌకర్యములయందు కానరాకున్న దనుచున్నాడు.

ఎన్నో గ్రంథాలయముల కిప్పుడు ప్రోవుపెట్టు తృష్ణ పట్టుకొన్నది. వానిలో ముప్పాతికవంతు పుస్తకముల కుపయోగమే లేదు. గ్రంథబాహుళ్యమువలన, ఉపయోగార్థ ముద్దేశింపబడిన కొన్ని పుస్తకములును మూలబడుచున్నవి. మనవాడుకలో ధనవంతుని గొప్పవాడందుము. ఒక లక్షాధికారి ఏదేని సమావేశమునకు వచ్చెనేని అందరును ఒకరిని మించిఒక రాతని గౌరవింప జూతురు. ఆ గౌరవ మత డొసంగవలసిన దానిపైనగాక కేవల మతనికున్న దానిపైననే నిలుచును. చాలవర కీవిధమున గ్రంథాలయముల గొప్పదనము గ్రంథసంఖ్యవలన నిర్ణయింపబడుచున్నది. పుస్తకము లుపయోగించుటకు గల సౌలభ్యము లే గ్రంథాలయమునకు ప్రతిష్ఠగూర్పవలసియుండ, అట్టి సౌలభ్యములు గ్రంథాలయములచే పరిగణింపబడకున్నవి.

మన భాషయందలి పదజాలము రెండు తావుల కానవచ్చును. మొదటిది నిఘంటువు. రెండవది సారస్వతము. ఒక పెద్ద నిఘంటువునందు, వాడుకలోనివి కొన్నియే ఐనను, అన్నిపదములను సేకరించుట లాభకరమైనది. కాని సారస్వతమందలి పదసంఖ్య మిక్కిలి తక్కువ. ఆపదములకు ప్రాణ మున్నది. అందుచేత ఒక్కటియు మిగిలించుట కష్టము. అయినను నిఘంటువునకంటె సారస్వతమునకే ఎక్కువ విలువ యని ఒప్పుకొనక తీరదు.

ఈ పరమార్థమే గ్రంథాలయమునకు చెందును. అందు బహుగ్రంథ సముపార్జనార్థమయిన భాగము ఉపయోగము గలదియే కాని నిరంతరము అనేక విధ

ముల ఉపయోగము కొరకయిన రెండవభాగము ఆలయ మహత్త్వమును నిర్ణయించును. ఇది సామాన్య గ్రంథాలయాధికారి (Librarian) ఎక్కువపుస్తకములను మిక్కిలిగా ఉపయోగింప జేయు మాటను కూడ తలపెట్టడు. ఏలన సంఖ్యాబాహుళ్యమును ప్రదర్శించి లోకమును ఉక్కిరి బిక్కిరిచేయుట సులభము.

* * * *

తరువాత గ్రంథాలయములను మిగుల నుపయోగకరములుగ జేయుటకై మార్గములను గూర్చి:

గ్రంథాలయమునకు మహత్తమోపయోగము చేకూర్పవలసినయెడల అచటి గ్రంథముల విషయము లందరికిని స్పష్టముగా తెలుపుడు చేయవలెను. లేకున్న జనసామాన్యమున కవి అందుబాటు కావు. గ్రంథాలయ మప్పుడు ఎక్కువవసతి కలిగియు రాకపోకలకు సౌకర్యము లేని నగరమువలె నుండి పోవును. ఏదేని ముఖ్యాన్వేషణతో గ్రంథాలయమునకు వచ్చువారు తమ ఆవశ్యకత కొలది దారి చేసికొందురు. కాని గ్రంథాలయమే ఇందు తనకునుగల బాధ్యత గుర్తింపవలయును. గ్రంథములున్న యందులకు వాని నందరిచేతను చదివింపవలెను. అప్పుడే గ్రంథాలయమునకు సార్థకత. కేవలము జనులను పుస్తకములను చూచిపోవుటకు రానిచ్చుటమాత్రము చాలదు. దాని ఆహ్వానమెంతయు చురుకుగ నుండవలెను. "తన్నష్టం యన్న దీయతే" ఇవ్వబడనిది వ్యర్థమైనదన్న మాట.

గ్రంథాలయము తనపుస్తకములజాబితాను చూపి అందరిని అందుండి ఎంచుకొమ్మనుట పరిపాటి. కాని ఈగ్రంథానుక్రమణికలందు ఉపోద్ఘాతము, ఆహ్వానము, స్వాగతోత్సాహమును లేవు. తానిచ్చు విందుతో పాఠకుల నాహ్వానించుటకు ఏగ్రంథాలయ మెక్కువ ఉత్సహించునో అద్దియే ఆతిథ్యపరత్వము కలది. ఇట్టి ఆతిథ్యము మాత్రమే గ్రంథాలయమును పెద్దజేయునది కాని గ్రంథముల సంఖ్య కాదు. పాఠకులు గ్రంథాలయమును పుట్టింతురనుట పరిపూర్ణ సత్యముకాదు. గ్రంథాలయము కూడ పాఠకులను సృష్టించును.

గ్రంథాలయాధికారి కర్తవ్యములు

ఈపరమార్థము దృక్పథమందు నిల్చియున్నచో గ్రంథాలయాధికారి నెరవేర్పవలసిన విధి ఎంతగొప్పదియో ఎరిగికొనగలము. అతనిపని గ్రంథములను సేకరించి, విషయవిభాగముచేసి జాగ్రత్త పెట్టుటతో ముగియబోదు. అనగా అతని ముఖ్యధర్మము కేవలము పెంచుట తెంచుటలు కాదు. ఉన్నగ్రంథముల నన్నిటి నతడు సరిగ నర్థము చేసికొనియుండవలెను. గ్రంథాలయము మిగుల పెద్దదైనయెడల అట్లర్థ మొనర్చుకొనుట అతని కశక్యమగును. అందువలన నాడూహాయందు పెద్దగ్రంథాలయము ఉగ్రాణమువంటిది. చిన్నదిమాత్రమే భోజనశాలవలె దిన దినము ఆహారమును, ఆనందమును సమకూర్చునది.

* * * * *

చిన్నగ్రంథాలయము

చిన్నగ్రంథాలయము నాయుద్దేశమం దిట్టిది: ప్రతి విషయమునందును ముఖ్యగ్రంథములుమాత్ర ముండవలెను. ఆగ్రంథములు సంఖ్యారాధనకుగాక ఒక్కొక్కటియు ప్రత్యేకాధిక్యము కలదిగ నుండవలెను. అందు గ్రంథాలయాధికారి నిరుద్దేశపూర్వకముగు అర్చనాశక్తి కలిగి, గ్రంథాలయమును కేవలము నిండించుటయం దభిమానము లేక, వాస్తవముగ నవసరములగు పుస్తకములను విసర్జించు వివేచన కల్గియుండవలెను. చిన్నగ్రంథాలయమున అతిథుల ఆనందమునకు సరిగా సరిపోవగల సామగ్రి యుండవలెను. దాని అధికారికి గృహమేధి గుణము లుండవలయును; కాని ఉగ్రాణపు కావలివాని గుణము లుండకూడదు.

* * * * *

తనభావమును విస్పష్టముచేయుట కొకయుదాహరణము నిచ్చిరి:

ఒక ఉదాహరణగా స్వదేశవిదేశములందు ప్రకటింపబడు పత్రికలను తెప్పించు భాండాగారమును పరిశీలితము. అందలి నిర్వాహకవర్గములో నొక్కడు సరితప్పక ప్రతిపత్రికలో కుతూహలమిచ్చు విషయములను వ్రాసి

పెట్టి, అందరికిని కానవచ్చుచోట నుంచినచో ఆపత్రికల నచేసులు పఠించు నవకాశ మధికమగును కదా. అట్లుకాకున్న మూడుపాళ్లు పత్రికలు ముట్టుకొనబడక నానాట పెరుగుచు మూలల బడి మురిగిపోవుచున్నవి. నూతనముగ ప్రకటింపబడు గ్రంథముల సంగతియు నింతియే. గ్రంథాలయాధికారులును, వారిచేతిక్రిందివారును గ్రంథములందుగల విశేషము లెరింగికొనుటకు యత్నింపరు. కాని గ్రంథములు చేతికివచ్చిన వెంటనే అందలి సారస్వత సంపద అందరికిని తెలియవలసినదనుట విస్పష్టమే కదా.

తెలియవలసిన దెవరికి? ప్రతివిషయమునను కొందరు ముఖ్యపాఠకులకు. అట్టి పాఠకసంఘములు విధిగా ప్రతి గ్రంథాలయమునకును ఉండవలయును. అవియే గ్రంథాలయమునకు జీవము. గ్రంథాలయాధికారి సామర్థ్యము అనేక పాఠకసంఘముల నాకర్షించి పరిరక్షించుటయందును, పాఠకునికిని గ్రంథములకును మధ్యస్థుడై పరిచయము హెచ్చించుటయందును గలదు. అనగా అతనిమీద గ్రంథభారము, పాఠకభారమునుకూడ కలదు. ఈ రెండింటిని నిపుణముగ వహించుటయం దాతని విధి నిర్వహణము నిర్ణయింపబడును.

* * * * *

గ్రంథాలయాధికారి కర్తవ్యములను గూర్చి మఱికొన్ని సూచనలు:

పుస్తకములనుగూర్చి కూడ గ్రంథాలయాధికారి తాను సేకరించినవాని విషయమునసేకాక అప్పుడపుడు ఎన్నియో విషయములగూర్చి ప్రకటింపబడు గ్రంథములతోగూడ పరిచయము కలిగించుకొనుచుండవలెను. మాటకు మాశాంతి నికేతనపాఠశాలకొరకు పిల్లలకై ప్రచురింపబడు పుస్తకములలో వారికొగ కేర్పరుచుకొనజాలియుండుటకు వానినన్నిటిని చూచి యుంచుకొనుచుండును ప్రతి గ్రంథాలయమును ఇట్టి పనికి తోడ్పడవలయును. ఇది కుదురు టెట్లన: అప్పటివరకు అనేక విషయముల గూర్చి ప్రకటింపబడి పేరుగన్న గ్రంథముల పట్టికనుంచుకొనవలయును. ఇట్లొక గ్రంథాలయము యత్నించుచున్నట్లు తెలిసినచో గ్రంథప్రకాశకులును క్రొత్తగ్రంథముల అనుక్రమణికలు, ప్రాతగ్రంథముల విషయ వివరణలును నొసంగి తోడ్పడుదురని నా నిశ్చయము.

అఖిలభారత గ్రంథాలయ సమితి కొకసూచన:

తుదకు అఖిలభారత గ్రంథాలయ సమ్మేళనమునకు నాకావించు ప్రార్థన మిది. ఈ సమ్మేళనము వైజ్ఞానికసారస్వత చారిత్రక గ్రంథములలో ప్రఖ్యాతములగు వానికి జాబితాలు, మూడుమాసములకో, అర్ధసంవత్సరమునకో అథమము సంవత్సరమునకో ఒకమారు వినిర్మించి అన్నిచోట్లకును బంపునట్లు చూడవలెను. దేశమందంతటను గ్రంథాలయములను స్థాపించి, అభివృద్ధిపరచుట సమ్మేళనోద్దేశమగునేని సంగ్రహింపబడు పుస్తకముల మార్గదర్శికల నొసంగుటచేత ఉద్దేశము సఫలము కాగలదు. మరియు అప్పుడే గ్రంథసంపాదనయు గ్రంథరక్షణయు గాక గ్రంథాలయ ప్రధానకార్యమగు గ్రంథవిషయ పరిచయమునకును, విషయములతో కుతూహల మిచ్చువానినంతటను చురుకుగ తెలియజేయుటకును తోడ్పాటు లభింపగలదు.

ఆంధ్ర దేశ గ్రంథాలయములవారు రవీంద్రుని పై యమూల్యోపదేశములను మార్గదర్శకములుగ స్వీకరించి అచిరకాలమున ఆచరణములోనికి దెచ్చుకొందురుగాక.

కిష్కింధ, పంచవటి-స్థలనిర్ణయము

శ్రీ పెండ్యాల వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారి భారతచరిత్రమను గ్రంథమునందలి పటమునందు కిష్కింధ బళ్లారి ప్రాంతముగా గుర్తించియుండిరి. వీరు శ్రీ కొ. లక్ష్మణరావుపంతులుగారి హిందూ మహాయుగము అను గ్రంథమునందలి యభిప్రాయము ననుసరించి వ్రాసియుందురని తోచుచున్నది. ఇది పొరబాటని మనవిచేయుచున్నాడను. కిష్కింధ, పంచవటి— స్థలముల నిర్ణయము ముఖ్యముగా వాల్మీకిరామాయణము ననుసరించి చేయవలసియుండును. హిందూమహాయుగమను గ్రంథమునందు

శ్రీలక్ష్మణరావుపంతులుగారు అయోధ్యనుండి లంకవరకు గల శ్రీరామునిమార్గమును నిర్ణయించుచు పటముతో గూడ వ్రాసియున్నారు. వారు సుబ్రహ్మణ్యశాస్త్రిగారి వలెనే కిష్కింధ బళ్లారిప్రాంతమని నిర్ణయించినారు. ఇంతేకాక పంచవటి భద్రాచలప్రాంత మనికూడ వ్రాసినారు. వాల్మీకిరామాయణమునందు శ్రీరామునియొక్క ప్రయాణమును వివరించుపట్టులనుఆధారముగాగాని ఊహపై శ్రీరామునిమార్గమును నిర్ణయించుటలో కిష్కింధయు పంచవటియు పై విధముగా నిర్ణయించబడినవి. కాని ఆవాల్మీకిరామాయణమందే సుగ్రీవుడు సీతాన్వేషణము కొరకై వానరవీరులను నలుదిశలకు పంపుచు వారు వారరుగవలసిన మార్గములను వేరువేరుగా వివరించిన పట్టులను వారు గమనించినటులు కనుపించదు. తూర్పున కరుగువారికి గంగ,కౌశికి,యమున,సరయువు వీట్లను మార్గముగా చెప్పినాడు. దక్షిణమున కరుగువారికి వింధ్యము, నర్మద, గౌతమి, వరద,కృష్ణవేణి వీట్లను మార్గముగా చెప్పినాడు. పశ్చిమమునకరుగువారికి సురాష్ట్ర,బాహ్లీక,శూర, భీమ, సింధుసాగరసంగమ దేశములను చెప్పినాడు. ఉత్తరమున కరుగువారికి శూరసేన, పుళింద, ప్రస్తర, మద్రక, భరత, కురుమొదలగు దేశములను చెప్పినాడు. ఇందునుబట్టి నర్మదకు దక్షిణమున తపతీనది తగులనిచోట (దక్షిణమునకు జనువారలకు తపతీనదిని చెప్పనందున) నర్మదానదియొక్క ఉత్తరతీరమునందలి వింధ్యపర్వతముల నడుమ ప్రదేశమే కిష్కింధయని సులభముగా నిర్ణయింపవీలగుచున్నది. పంచవటి ప్రదేశము భద్రాచల ప్రాంతముకాక నాసికప్రాంతమని మహారాష్ట్రులయొక్కయు, ఆధునికవిమర్శకులలో కొందరియొక్కయు అభిప్రాయమనికూడ లక్ష్మణరావుపంతులుగారు వ్రాసియున్నారు. ఈవ్రాత ననుసరించి పంచవటి నాసికప్రాంతమైనయెడల పైకిష్కింధ నిర్ణయమునకు బాగుగా సరిపోవుచున్నది. ఇదియుగాక ఆంధ్రీకృత బ్రహ్మాండపురాణమున కిష్కింధవింధ్యపర్వతపాదమున నున్నదని విస్పష్టముగా వ్రాయబడియుండుట పైనిర్ణయములకు మిక్కిలి బలమొసగుచున్నది. పర్ణశాల భద్రాచల ప్రాంతముకాక నాసిక ప్రాంతమనికూడ నిర్ణయమగుచున్నది. కావున పైవిషయములను విమర్శించి పండితులు నిర్ణయించెదరుగాక. విక్రయదస్తావేజులో విక్రయస్థలమునకు నాల్గు హద్దులనువ్రాసి ఆస్తిని వివరించునటువలె వాల్మీకి రామాయణములో కిష్కింధకు విస్పష్టముగా హద్దులు చెప్పబడియుండుటవలన ఆవిషయము నిస్సందేహమని కూడ నిర్ణయింప వీలగుచున్నది.

[కొచ్చర్లకోట వెంకట్రామయ్య]

అమెరికా కుటుంబములు

కుటుంబ విషయములు అను శీర్షిక క్రింద న్యూయార్కు నందలి 'సర్వే గ్రాఫిక్'(Survey Graphic) అను పత్రికలో డాక్టర్ లూయిస్ అనువా రిట్లు వ్రాయుచున్నారు:

మన ప్రస్తుత నాగరికతకు కుటుంబమే పునాదిగనున్నది. ౧౯౨౦ సం. జనాభాయందు ౨౪,౩౫౧,౬౪౪ కుటుంబములు యునైటెడ్ స్టేట్సులో నుండెను. ౧౯౩౮ లో దాదాపు ౨౮౪ మిలియన్లు కుటుంబములు కలవు. సగటున నొకకుటుంబము నందలి జనసంఖ్య ౪.౩ అయియున్నది. కుటుంబపరిమాణము నానాటికి తగ్గిపోవుచున్నది. పూర్వమొకకుటుంబమునందు ఏడెనమండుగురు పిల్లలుండెడివారు. అట్టిది ౧౭౯౦ జనాభాలో కుటుంబజనసంఖ్య ౫.౬ అయినది. పెద్దకుటుంబములు దక్షిణదేశమునందును, మిగుల చిన్నకుటుంబములు పసిఫిక్ తీరమునందును కలవు. పట్టణవాస కుటుంబములకంటె పల్లెటూరి కుటుంబములే పెద్దవిగనున్నవి. ౧౯౨౦ లో కుటుంబసంఖ్య ౪.౫—౪.౨ వరకు దిగినది.

౧౯౩౫ లో యునైటెడ్ స్టేట్సునందు జనసంఖ్యలో ౧౦౦౦-కి ౧౦.౨ చొప్పున వివాహములు జరిగినవి. ఇతర దేశములతో సరిపోల్చిన యెడల మనవివాహములసంఖ్య చాలయెక్కువగనే కన్పించును. ౧౯౨౪ సంవత్సరమునందు ఇంగ్లండులోను, వేల్సులోను, వేయిం

టికి ౭.౭ చొప్పున వివాహములు జరిగినవి. జర్మనిలో ౭.౧ చొప్పున వివాహములు జరిగినవి. కాని యీరెండు దేశములలోను యుద్ధానంతరము వివాహము కాక యుండినకన్యల సంఖ్యాపరిమితిని బట్టి యింతవరకైనను హెచ్చినవనుట నిస్సందేహము. అమెరికాలో వివాహములకు అవకాశములు మెండుగనున్నవి. కుటుంబబలమును జన్మములసంఖ్యను బట్టి కూడ స్థిరపర్చవచ్చును. రిపబ్లికు పరిపాలన ప్రారంభమయిన తర్వాత జనసంఖ్య సంవత్సరమునకు నూటికి ౩౪ చొప్పున హెచ్చినది. ౧౮౯౦ లో వేయింటికి షుమారు ౮౦ హెచ్చు కన్పించెను. అదిమొదలు నానాటికి క్రమేణ క్షీణించుచునే యున్నది. ఇప్పుడు వేయింటికి ౨౧ మాత్రమే హెచ్చు కన్పించినది.

విడియాకులమూలమున కలిగిన భగ్నకుటుంబముల సంఖ్య నానాటికి హెచ్చినది. ౧౯౨౫ సం. లెఖ్ఖప్రకారము ఏడువివాహములో నొకటిచొప్పున కోర్టులో రద్దు కాబడినవి. పల్లెటూళ్ళలోకంటె పట్నములలోనే విడియాకులసంఖ్య హెచ్చుగనున్నది. డైవర్సుకోర్టులలో దాంపత్యవిభాగముల యొక్కయు విడియాకుల యొక్కయు కేసులసంఖ్యయే హెచ్చుగ కన్పించుచున్నది. ౧౮౮౯ సంవత్సరములో ౧౦౦౦ వివాహములలో ౬౦ వివాహములు రద్దగుచుండెను. ౧౯౨౫ సం. రంలో ౧౦౦౦-కి ౧౪౭ చొప్పున రద్దయినవి.

నాగరికదేశ మనిపించుకొనిన అమెరికాలోనే యిట్టిదుర్ఘంతములు జరుగుచుండ మిస్ మేయో భారతదేశమునకు వ్రేలు చూపినది. వీపుపైమచ్చ నెరుగకుండుట నైజమేకదా!

[దుర్గుమహంతి ఆదినారాయణ]

హారుంరశీదు-నౌశేరవాఁ

ఈరాన్ దేశపు చక్రవర్తి "నౌశేరవాఁ" అనునతఁడు విచారశీలత్వమునందును, న్యాయపరాయణత్వమునందును అతిప్రసిద్ధిని పొందిన మహానుభావుఁడు. ఆదేశపుజను లిప్పటికిని "నౌశేరవాఁ ఆదిల్" అని ఆయనను స్మరించుచుందురు. బాగ్దాదునందలి ప్రఖ్యాతుఁడయిన "ఖలీఫా" హారుంరశీ దనునతఁ డొకసారి తన పార్శ్వదులతోఁగూడి లోఁతయిన కొండగుహలో నెవ్వరికిని తెలియకుండ గుప్తమయియున్న నౌశేరవాఁతొలూకు సమాధిని చూడఁబోయినాఁ డని యీరాన్ దేశీయుల నమ్మకము. నౌశేరవాఁతొలూకు మృతశరీరము రకరకముల మసాలాలు చేర్చి సురక్షితముగా నుంపఁబడినది. హారుంరశీదు చూచునప్పటకి నౌశేరవాఁదేహ మెంతో విలువగల యొక సింహాసనముపైని ఉంపఁబడి కనుపడినది. అతని శరీరమునందలి యవయవము లన్నియు నెప్పటియట్లే యున్నవి. చెవులుమాత్రము తెల్లఁబడిపోయినవి. నౌశేరవాఁ చనిపోయిన మఱి రెండునందల సంవత్సరముల తరువాతను హారుంరశీదు సింహాసన మెక్కినాడు. ఒక పుస్తకములో అతఁడు తాను చేసిన ఆ యాత్రనుగుఱించిన సంగతు లీప్రకారముగా వ్రాసి యుంచఁబడినవి.

"కొండలమధ్యను గుహలో ఘోరాంధకారములో ఆ సమాధి యున్నది. దాని యెదుటను స్వర్ణసూత్రముతోఁ గూర్పఁబడిన దళసరివస్త్ర మొకటి వ్రేలాడుచున్నది. హారుంరశీ దాపరదాను తొలఁగించుటకు ప్రయత్నించిన వెంటనే, పురాతనము, జీర్ణము అగు నా పరదా క్రిందను పడి మట్టిలో కలిసిపోయినది. సమాధికి నాలుగువయిపుపులను ఉన్నగోడలపైని తాపించిన మణులకు పరిమితి లేదు. ఆరత్నముల కాంతులచేతనే అట్టిచిమ్మచీకటిలో నయితము, ఆ సమాధి యున్నచోటు స్పష్టముగా నగపడుచుండెను. ఫాదుషా తొలూకు మృతశరీరమే సింహాసనముమీఁద నుంపఁబడినదో, అదియు నవరత్నఖచితమయినదే. ఆమృతదేహము చూడఁగా జీవించియున్న మనుజుఁడే కూర్చున్నాఁడని తోఁప మొదలిడినది. నౌశేరవాఁ మరణించుట లేదు; జీవించియే యున్నాఁ"డని ఖలీఫాకు భ్రాంతికూడఁ గలిగినది. ఆయన వెంటనే సాదరముగ తలవంచి నౌశేరవాఁకు వందనము చేసినాడు.

ఫాదుషాతొలూకు మృతశరీరము మిక్కిలి అద్భుతములయిన ఉపాయములవలన సరిగా సజీవముగానే ఉన్నట్లు సురక్షితమై యున్నప్పటికిని దానిపయిని కప్పబడిన వస్త్రముమాత్రము బొత్తిగా జీర్ణించిపోయినది.

ఖలీఫా చేయివైచి ముట్టిన వస్త్రములన్నియు జాతీ పడిపోయి మంటిలోఁ గలిసిపోయినవి. ఆకారణముచేతను, ఆయన తన యొద్దనున్న బహుమూల్యమయిన శాలువచేతను ఖాదుషామృతశరీరముపైని కప్పుటయేకాక, నాలుగువయిపులను గొప్పవిలువగల క్రొత్త పరదాలను కట్టుట కాజ్ఞాపించి ఆసమాధిస్థానమంతయును కస్తూరి, కర్పూరము మొదలయిన సువాసనద్రవ్యములచేతను పరిమళించునట్లు చేయించినాఁడు కూడను.

రత్నఖచితమయిన—ఆసింహాసనముపైని కొంచెమేమో వ్రాయఁబడి యున్నట్లతని కగపడినది. ఆయన వెంటనే 'మోవిదాలు' అనువారిని పిలిపించి పహలవీభాషలో ఏమి వ్రాసియున్నదో చదివి వినిపించుఁడని యాజ్ఞాపించినాడు. క్రిందను వ్రాయఁబడిన నీతి—ఉపదేశ మందులో అంకితమయి యున్నది.

౧. ఈ సంసారము చిరస్థాయి కాదు. ఏమనుష్యుఁడైతే దీనిసంబంధములో చాల కొలఁదిగా ఆలోచించుచున్నాఁడో వాఁడే అందఱికంటెను గొప్ప బుద్ధిమంతుఁడు.

౨. సంసారముద్వారా నిహతుఁడగుటకు ముందుగానే దానిసుఖము ననుభవింపుము.

౩. ఎవరైతే నీకధీనులై యున్నారో వారిపైని, నీకంటెను ఉచ్ఛస్థితిలో నున్నవారివలన నీ వెట్టియాశ నుంచుకొనియెదవో అదేప్రకారముగా అనుగ్రహము కలిగి యుండుము.

౪. నీవు ప్రపంచము నంతను జయింపఁజాలినప్పటికిని ఎప్పుడో ఒకప్పుడు మృత్యువు, నిన్నుఁ దప్పక పరాజితుని చేసియేతీరు నని మాత్రము జ్ఞప్తియందుంచుకొనుము.

౫. నీ సుఖముచేతను, ఐశ్వర్యముచేతను ప్రతారితుఁడవు కాకుండునట్లు సావధానముగ నుండుము.

౬. నీ వేమి చేయుదువో దానికిమాత్రమే ప్రతిఫలమును పొందెదవు. అంత కధికముగఁగాని, అల్పముగఁగాని పొందఁజాలవు.

ఖలీఫా, నౌశేరవాఁ చక్రవర్తిచేతను మిక్కిలి యొప్పునైనదియును, పద్మరాగమణిచేతను నిర్మితమైనదియు నగు నొక ఉంగరమును చూచినాఁడు. దానిపై నీక్రింది విధమున వ్రాయఁబడియున్నది:—

౧. నిష్ఠురత్వమును చేయకుము. సత్కార్యములను చేయుట కభ్యసించుచుండుము. ఎప్పుడును తొందరపాటు పడకుము.

౨. ఒకవేళ నీవు నూఱు సంవత్సరములవఱకును బ్రదికియుండఁగల వనుకొనుము. అయినప్పటికిని మృత్యువునుమాత్రము మఱచిపోకుమా?

౩. బుద్ధిమంతుల సావాస మన్నింటి కంటెను హెచ్చువిలువగలది దని యాలోచించుకొనుము.

హారుంరశీదున కచ్చట నెన్నియో రత్నములు, ముత్తెములు మొదలయినవి యగపడినవి. వానిలో ననేకములయిన రత్నములు కూర్పఁబడినదియు, హెచ్చువిలువగలదియు నగు కిరీటము కూడ నున్నది. దానికైదు కోణము లున్నవి. ఆ యైదంచులమీఁదను ఈక్రిందియుపదేశవాక్యములు వ్రాయఁబడి యున్నవి:—

ఒక వైపున

౧. ఆత్మజ్ఞానము గలవారినిగూర్చి నాసమ్మానమును ప్రకటించుము.

౨. పరిణామ మాలోచించి కార్య మారంభింపుము. మొట్టమొదటను పాఱిపోవుటకు మార్గమును స్థిరపఱుచుకొని తరువాత నగ్రేసరుఁడ వగుము.

౩. ఎవ్వరిని వ్యర్థముగా సతాయింపకుము. అందఱిసుఖము విషయమునను, స్వాతంత్ర్యము విషయమునను దృష్టి యుంచుము.

౪. ఇతరులను బాధించు సామర్థ్యమును నీ యైశ్వర్యము తొలూకు అధికారముగా నాలోచింపకుము.

రెండవ వైపున

౧. ఏదియేని కార్యమును ప్రారంభించుటకు ముందుగా అందుల కుపయోగించు వ్యక్తితో పరామర్శిం